www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 29-6-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 74 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం; తిథి: అష్టమి మ. 2.20 తదుపరి నవమి; నక్షత్రం: ఉత్తరాభాద్ర ఉ. 8.49 తదుపరి రేవతి; వర్జ్యం: రా. 8.11-9.42; దుర్ముహూర్తం: ఉ. 5.47-7.31; అమృతఘడియలు: తె. 5.17 మొదలు; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 5.47; సూర్యాస్తమయం: 6.49 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

MEDICOVER HOSPITALS

MEDICOVER HOSPITALS

తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాలకు విస్తరిస్తూ, అత్యాధునిక వైద్యం అందిస్తున్న మల్టీ నేషనల్ హాస్పిటల్



MEDICOVER HOSPITALS

వరంగల్ లో తెలంగాణ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి వర్యులు,

శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారి

చేతుల మీదుగా ప్రారంభోత్సవం

తేది: 29 జూన్ 2024, సమయం: సా. 4గం॥లకు



విశిష్ట అతిథి



గౌ॥ శ్రీ దామోదర రాజనరసింహ గారు
తెలంగాణ రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ & టెక్నాలజీ శాఖామాత్యులు

గౌరవ అతిథులు



గౌ॥ శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు
తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & ప్రజా సంబంధాల శాఖామాత్యులు



గౌ॥ శ్రీమతి కొండా సురేఖ గారు
తెలంగాణ రాష్ట్ర పర్యావరణ, అటవీశాఖ, దేవాదాయ శాఖామాత్యులు



గౌ॥ శ్రీమతి దనసరి అనసూయ (సీతక్క) గారు
తెలంగాణ రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి & మహిళా -శిశు సంక్షేమ శాఖామాత్యులు



గౌ॥ శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు
తెలంగాణ రాష్ట్ర రోడ్లు & భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు



గౌ॥ శ్రీ వేం నరేందర్ రెడ్డి గారు
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యుల సలహా దారులు

గౌ॥ శ్రీమతి గుండు సుధా రాణి గారు
మేయరు - వరంగల్

గౌ॥ శ్రీమతి డా. కడియం కావ్య గారు
ఎం. పి - వరంగల్

గౌ॥ శ్రీ పోరిక బలరాం నాయక్ గారు
ఎం. పి - మహబూబాబాద్

గౌ॥ శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారు
ఎమ్మెల్యే - వరంగల్ వెస్ట్

గౌ॥ శ్రీ కడియం శ్రీహరి గారు
ఎమ్మెల్యే - స్టేషన్ ఘనపూర్

గౌ॥ శ్రీ దొంతి మాధవ రెడ్డి గారు
ఎమ్మెల్యే - నర్సంపేట్

గౌ॥ శ్రీ కె ఆర్ నాగరాజు గారు
ఎమ్మెల్యే - వర్ధన్నపేట్

గౌ॥ శ్రీ రేవూరి ప్రకాష్ రెడ్డి గారు
ఎమ్మెల్యే - పరకాల

గౌ॥ శ్రీ జాటోత్ రామ్ చందర్ నాయక్ గారు
ఎమ్మెల్యే - డోర్నకల్

గౌ॥ శ్రీమతి మామిడాల యశశ్విని గారు
ఎమ్మెల్యే - పాలకుర్తి

గౌ॥ శ్రీ గండ్ర సత్యనారాయణ రావు
ఎమ్మెల్యే - భూపాలపల్లి

గౌ॥ శ్రీ డా. మురళీ నాయక్ భూక్యా గారు
ఎమ్మెల్యే - మహబూబాబాద్

గౌ॥ శ్రీ పల్లా రాజేశ్వర్ రెడ్డి గారు
ఎమ్మెల్యే - జనగామ

గౌ॥ శ్రీ డా. బండ ప్రకాష్ గారు
డిప్యూటీ చైర్మన్ - తెలంగాణ రాష్ట్ర శాసన మండలి

గౌ॥ శ్రీ బస్వరాజు సారయ్య గారు
ఎమ్మెల్సీ

గౌ॥ శ్రీ తీన్మార్ మల్లన్న గారు
ఎమ్మెల్సీ - వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గం

ఆహ్వానించువారు

డా. జి అనిల్ కృష్ణ
చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ - మెడికవర్ హాస్పిటల్స్

డా. ఎ. శరత్ రెడ్డి
ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ - మెడికవర్ హాస్పిటల్స్

పి. హరి కృష్ణ
ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ - మెడికవర్ హాస్పిటల్స్

డా. ఎ. ఆర్. కృష్ణ ప్రసాద్
డైరెక్టర్ - మెడికవర్ హాస్పిటల్స్


మెడికవర్ వరంగల్ ప్రత్యేకతలు

- 40 మందికి పైగా ఎక్స్‌పర్ట్ డాక్టర్స్
- 300 బెడ్స్ 150 ఐసియు బెడ్స్
- 20 కి పైగా స్పెషాల్టీ వైద్యసేవలు
- 7 ఆపరేషన్ థియేటర్స్
- ప్రపంచస్థాయి క్యాత్ ల్యాబ్
- బెస్ట్ టెక్నాలజీ MRI & CT స్కాన్
- మరెన్నో ప్రత్యేకతలు

మెడికవర్ ఇండియా ప్రత్యేకతలు

- 23 హాస్పిటల్స్
- 16 నగరాలు
- 5000 బెడ్స్
- 1636+ ఐసియు బెడ్స్
- 135+ ఆపరేషన్ థియేటర్స్
- 23+ క్యాత్ ల్యాబ్
- 1 కోటి మందికి పైగా వైద్యం
- 1200+ డాక్టర్స్
- 13000+ ఎంప్లాయిస్

మెడికవర్ ఇండియా హాస్పిటల్స్ నెట్‌వర్క్: తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మహారాష్ట్ర | కర్ణాటక | మరియు యూరప్‌లోని 12 దేశాలలో వైద్యసేవలు



2 భారత్ తరపున డబుల్ సెంచరీ చేసిన రెండో మహిళా బ్యాటర్‌గా షఫాలీ. అంతకు ముందు 22 ఏళ్ల క్రితం ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో మిథాలీ రాజ్ (214) ఈ ఘనత సాధించింది.

1 షఫాలీ, మంధాన జోడించిన 292 పరుగులు మహిళల టెస్టు చరిత్రలో తొలి వికెట్‌కు ఇదే అత్యధిక భాగస్వామ్యం. ఈ క్రమంలో పాకిస్థాన్ ఓపెనర్లు సాజిదా షా, కిరణ్ బలూచాలు నమోదుచేసిన 241 రన్స్ రికార్డు బద్దలైంది. కాగా, ఆస్ట్రేలియా జంట రీలర్, అన్నెట్ (మూడో వికెట్‌కు 309 రన్స్) తర్వాత షఫాలీ, స్మృతి జోడీ చేసిన పరుగులు ఏ వికెట్‌కైనా రెండో అతిపెద్ద భాగస్వామ్యం.

షఫాలీ వర్మ (197 బంతుల్లో 23 ఫోర్లు, 8 సిక్సర్లతో 205)

స్మృతీ మంధాన (161 బంతుల్లో 27 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 149)

తొలిరోజు భారత్ 525/4

మనమ్మాయిల మరో చరిత్ర

- షఫాలీ.. ఫాస్టెస్ట్ డబుల్ • శతక్కొట్టిన మంధాన
- దక్షిణాఫ్రికాతో ఏకైక టెస్టులో రికార్డుల హోరు

చెన్నై: దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసి జోరుమీదున్న భారత మహిళలు ఏకైక టెస్టులోనూ దుమ్మురేపుతున్నారు. ఓపెనర్లు పరుగుల వరద పారించారు. రికార్డుల బూజు దులుపుతూ టెస్టు క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించారు. శుక్రవారం మొదలైన ఈ టెస్టు మ్యాచ్‌లో తొలిరోజే ఓపెనర్లు షఫాలీ వర్మ (197 బంతుల్లో 23 ఫోర్లు, 8 సిక్సర్లతో 205) డబుల్ సెంచరీతో గర్జించగా, స్మృతీ మంధాన (161 బంతుల్లో 27 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 149) శతకంతో కదం తొక్కింది. జెమీమా రోడ్రిగ్స్ (55) అర్ధ సెంచరీ సాధించింది. ఫలితంగా మొదటిరోజు ఆట ముగిసేసరికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లకు 525 పరుగుల భారీ స్కోరు నమోదుచేసింది. ఈ క్రమంలో పలు రికార్డులు వెల్లువెత్తాయి. టాస్ నెగ్గి బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టులో షఫాలీ, మంధాన సఫారీ బౌలర్లను ఆడుకున్నారు. ఇద్దరూ వన్డే తరహాలో రెచ్చిపోవడంతో పరుగులు కట్టడిచేసేందుకు బౌలర్లు ఆపసోపాలు పడ్డారు. లంచ్ విరామానికల్లా భారత్ వికెట్ నష్టపోకుండా 130 పరుగులు చేసింది. ఆ తర్వాత షఫాలీ, స్మృతి దూకుడు పెంచుతూ రికార్డు భాగస్వామ్యంతో విరుచుకుపడ్డారు. తొలి వికెట్‌కు రికార్డుస్థాయిలో 292 పరుగులు జోడించారు. 52వ ఓవర్లో టక్కర్ బౌలింగ్ మంధాన వెనుదిరగగా.. యువ ఓపెనర్ షఫాలీ మాత్రం బాదుడు ఆపలేదు. లేడీ సెహ్వాగ్ తరహాలో బౌలర్లపై శివాలెత్తుతూ సెంచరీ.. ఆ తర్వాత దాన్ని డబుల్ సెంచరీగా మలిచింది. ఈ క్రమంలో మహిళల టెస్టు చరిత్రలోనే అత్యంత వేగంగా.. అంటే 194 బంతుల్లోనే ద్విశతకాన్ని నమోదు చేసింది. టెస్టుల్లో తొలి డబుల్ సెంచరీ సాధించిన షఫాలీ.. చివరకు 205 పరుగుల వద్ద రనౌటైంది. అప్పటికి టీమిండియా స్కోరు 411/3. ఇక, తొలిడౌన్‌లో వచ్చిన శుభా సతీశ్ (15) నిరాశపరచగా.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (42 నాటౌట్)తో కలిసి రోడ్రిగ్స్ వేగంగా ఆడింది. రోడ్రిగ్స్ అవుటయ్యాక రిచా ఘోష్ (43 నాటౌట్)తో కలిసి హర్మన్ జట్టు స్కోరును 500 దాటించింది. వీళ్లిద్దరూ కలిసి ఐదో వికెట్‌కు 75 పరుగులు జోడించారు.



స్కోరుబోర్డు

1 మహిళల టెస్టు క్రికెట్‌లో అత్యంత వేగంగా డబుల్ సెంచరీ చేసిన తొలి బ్యాటర్‌గా షఫాలీ. 194 బంతుల్లోనే ద్విశతకం బాదిన షఫాలీ.. ఈ ఏడాది ఆరంభంలో దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో ఆస్ట్రేలియా బ్యాటర్ అనబెల్ సదర్లాండ్ 248 బంతుల్లో చేసిన డబుల్ సెంచరీ రికార్డును అధిగమించింది.

ఒక ఇన్నింగ్స్‌లో అత్యధిక (8) సిక్సర్లతో షఫాలీ ప్రపంచ రికార్డు.

ఓవరాల్‌గా (పురుషులు, మహిళల) టెస్టు చరిత్రలో ఒకరోజు అత్యధిక పరుగులు (525) చేసిన తొలి జట్టుగా భారత్. అంతకుముందు 2002లో బంగ్లాదేశ్‌తో టెస్టులో రెండోరోజు ఆటలో శ్రీలంక పురుషుల జట్టు చేసిన 509/9 స్కోరే అత్యుత్తమం. కాగా, మహిళల టెస్టు క్రికెట్‌లో 1935లో న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో ఇంగ్లండ్ జట్టు మొదటి రోజు 431/4 స్కోరు చేసింది.

భారత్ తొలి ఇన్నింగ్స్: షఫాలీ (రనౌట్) 205, స్మృతీ మంధాన (సి) డెర్క్‌సెన్ (బి) టకర్ 149, సతీశ్ శుభా (సి) జఫ్తా (బి) డీ క్లెర్క్ 15, జెమీమా (సి) డీ క్లెర్క్ (బి) టకర్ 55, హర్మన్‌ప్రీత్ (నాటౌట్) 42, రిచా ఘోష్ (నాటౌట్) 43; **ఎక్స్‌ట్రాలు: 16; మొత్తం: 98 ఓవర్లలో 525/4; వికెట్ల పతనం:** 1-292, 2-325, 3-411, 4-450; **బౌలింగ్:** మసబాట క్లాస్ 14-2-63-0, డెర్క్‌సెన్ 11-0-60-0, డీ క్లెర్క్ 10-1-62-1, సెఖుఖునె 10-0-55-0, నాన్‌కులులెకో మ్లాబా 24-1-113-0, టక్కర్ 26-1-141-2, సునె లూస్ 3-0-15-0.

జట్టులో స్టార్ ఆటగాళ్లకు కొదువలేదు.. ప్రపంచ ర్యాంకింగ్స్‌లోనూ మనోళ్లదే హవా.. కానీ ఓ వరల్డ్‌కప్‌ను ముద్దాడి ఎన్నేళ్లవుతుంది? ఒకటా.. రెండా.. పొట్టి ఫార్మాట్‌లో ప్రపంచకప్ గెలిచి 17 ఏళ్లయ్యింది.. ఇక భారత్ వన్డేల్లో విశ్వకప్ గెలిచి 13 ఏళ్లు. మధ్యలో ఈ రెండు టైటిల్స్‌ను గెలిచే చాన్స్ రెండుసార్లు వచ్చినా దురదృష్టం వెంటాడింది. కోట్లాదిమంది అభిమానులు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ప్రపంచకప్‌ను సగర్వంగా అందుకునేందుకు మరో సువర్ణావకాశం ముందుంది.. అందుకే ఈసారి ఎట్టి పరిస్థితిల్లోనూ టైటిల్ పట్టేయాలని రోహిత్ సేన పట్టుదలగా ఉంది.. అటు చోకర్స్‌గా ముద్రపడిన దక్షిణాఫ్రికా అంచనాలకు మించిన ఆటతీరుతో తొలి వరల్డ్ కప్ టైటిల్ కోసం సై అంటోంది.. మరి, అజేయంగా దూసుకొచ్చిన ఈ రెండు జట్లలో చాంపియన్‌గా నిలిచేది ఎవరన్నది మరికొన్ని గంటల్లో తేలనుంది.

ఈసారి వదలొద్దు!

టీ20 ప్రపంచకప్ ఫైనల్ నేడు



రాత్రి 8 గంటల నుంచి స్టార్‌స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లో..

సఫారీల సారథి మార్‌క్రమ్

జోరుమీదున్న భారత్

తొలి కప్పు వేటలో దక్షిణాఫ్రికా

బ్రిడ్జిటౌన్: టీ20 ప్రపంచకప్‌లో విశ్వ విజేతను తేల్చే అంతిమ సమరానికి వేళైంది. రెండో టైటిల్ కోసం టీమిండియా.. తొలి ట్రోఫీ కోసం దక్షిణాఫ్రికా శనివారం జరిగే ఫైనల్లో అమీతుమీ తేల్చుకోబోతున్నాయి. ఈ మెగా టోర్నీ చరిత్రలో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా రెండు జట్లు ఫైనల్‌కు చేరడం ఇదే తొలిసారి. ఈనేపథ్యంలో తుదిపోరుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. 2007 ఆరంభ టీ20 ప్రపంచకప్ గెలిచాక భారత జట్టు ఈ ఫార్మాట్‌లో మరోసారి విజేత కాలేకపోయింది. అలాగే 2011లో వన్డే వరల్డ్‌కప్ గెలిచి, గతేడాది అజేయంగా ఫైనల్‌కు చేరినా నిరాశే ఎదురైంది. అందుకే ఈ రెండు ఫార్మాట్లలో సుదీర్ఘ ఎదురుచూపులకు తెరదించాలన్న కసితో రోహిత్ సేన ఉంది. మరోవైపు ఏ ప్రపంచకప్‌లోనైనా సఫారీలు ఫైనల్‌కు చేరడం ఇదే తొలిసారి. ఐదుసార్లు వన్డే, రెండుసార్లు టీ20 వరల్డ్‌కప్‌ల్లో సెమీస్ వరకు చేరి వెనుదిరిగారు. అందుకే మార్‌క్రమ్ సేనకు కూడా ఈ పోరు అత్యంత కీలకంగా మారింది.

అన్ని విభాగాల్లోనూ అదుర్స్

వాస్తవానికి భారత జట్టుకు ఈ మెగా టోర్నీ నల్లేరు మీద నడకలా సాగుతోంది. గ్రూప్ దశలోనే కాదు.. సూపర్-8, సెమీస్‌లోనూ పాక్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లపై అసలు పోటీ అనేదే లేకుండా వరుసగా ఏడు విజయాలతో ఫైనల్‌కు చేరింది. కెనడాతో మ్యాచ్ వర్షంతో రద్దయ్యింది. ఈ మ్యాచ్‌ల్లో పిచ్‌ను పరిస్థితి బట్టి స్వల్ప స్కోర్లు నమోదైనా.. బౌలర్లు విజృంభించారు. పేసర్లు, స్పిన్నర్లు కలిసికట్టుగా కదం తొక్కుతూ గత వరల్డ్‌కప్‌ల్లో పరాభవాలకు ఆసీస్, ఇంగ్లండ్ జట్లపై బదులు తీర్చుకుంటూ భారత్ ముందుకెళ్లింది. కెప్టెన్ రోహిత్ తన సమర్థ నాయకత్వానికి తోడు బ్యాటింగ్‌లోనూ రఫ్ఫాడిస్తున్నాడు. ఇప్పటికే 248 పరుగులతో ఉన్న తను మరో 33 రన్స్ చేస్తే టోర్నీ టాపర్‌గా నిలుస్తాడు. ఇక సూర్యకుమార్ తన సహజశైలిని కొనసాగిస్తుండగా హార్దిక్ ఆల్‌రౌండ్‌షోతో ఆకట్టుకుంటున్నాడు. పంత్ ధనాధన్ ఆటతో సాగుతున్నాడు. బ్యాటింగ్ విభాగంలో ఓపెనర్‌గా కోహ్లీ, మిడిలార్డర్‌లో దూబే మాత్రమే బలహీనంగా కనిపిస్తున్నారు. ఐపీఎల్‌లో విరుచుకుపడిన ఈ ఇద్దరూ అనూహ్యంగా ఇక్కడ మాత్రం నిరాశపరుస్తున్నారు. అయినా తుది పోరులో విరాట్ తన మార్క్ ఆటను చూపుతాడని జట్టుతో పాటు ఫ్యాన్స్ ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. దూబేను ఆడిస్తారా? శాంసన్, జైస్వాల్‌లలో ఒకరికి చోటిస్తారా? అనేది వేచిచూడాల్సిందే. బౌలింగ్‌లో మాత్రం స్పిన్నర్లు కుల్దీప్, అక్షర్ అదరహో అనిపిస్తున్నారు. జడేజా పరుగులను నియంత్రిస్తుండగా.. పేసర్లు అర్ష్‌దీప్ 15 వికెట్లతో బుమ్రా 13 వికెట్లతో టాప్ ఫామ్‌తో చెలరేగుతున్నారు. తుది పోరులోనూ అన్ని విభాగాలు కదం తొక్కితే టైటిల్ పట్టేయడం ఖాయమే.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), విరాట్, పంత్, సూర్యకుమార్, శివమ్ దూబే, హార్దిక్ పాండ్యా, జడేజా, అక్షర్, కుల్దీప్, బుమ్రా, అర్ష్‌దీప్.
దక్షిణాఫ్రికా: డికాక్, హెన్‌డ్రిక్స్, మార్‌క్రమ్ (కెప్టెన్), క్లాసెన్, మిల్లర్, స్టబ్స్, జాన్సెన్, కేశవ్, రబాడ, నోకియా, షంసీ.

బౌలింగ్ పవర్‌తో..

సఫారీలు ఈస్థాయి ప్రదర్శనతో ఫైనల్‌దాకా వస్తారని నిజంగా ఎవరూ ఊహించలేదేమో. భారత్ మాదిరి కాకుండా ఈ జట్టుకు గ్రూప్, సూపర్-8లో క్లిష్ట పరిస్థితులు ఎదురయ్యాయి. అయినా గతంలో మాదిరి కాకుండా ఒత్తిడిని దరిజేరనీకుండా గట్టెక్కగలిగారు. నేపాల్‌లాంటి పసికూనపై ఒక్క పరుగుతో ఆఖరి బంతికి గెలిచారు. ఓవరాల్‌గా వీరి విజయాల్లో బౌలర్ల పాత్ర కీలకమని చెప్పవచ్చు. టోర్నీ టాప్-5 బ్యాటర్లలో ఒక్క సఫారీ బ్యాటర్ కూడా లేకపోవడం గమనార్హం. డికాక్ (204) ఫర్వాలేదనిపిస్తున్నాడు. కానీ మార్‌క్రమ్, క్లాసెన్, మిల్లర్, స్టబ్స్‌లలో ఒక్కరు నిలదొక్కుకున్నా భారత బౌలర్లకు కష్టాలు తప్పవు. మరోవైపు పేసర్లు నోకియా (13), రబాడ (12), స్పిన్నర్ షంసీ (11) ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెడుతున్నారు. అలాగే కీలక సెమీస్ పోరులో దూకుడు మీదున్న అఫ్ఘాన్‌ను కేవలం 56 పరుగులకే కట్టడి చేసిన విషయం తెలిసిందే. ఇక నేటి ఫైనల్లో స్టార్లతో కూడిన భారత బ్యాటింగ్ లైనప్‌ను వీరు ఎలా ఎదుర్కొంటారనే దానిపైనే సఫారీల విజయం ఆధారపడి ఉంటుంది.

వర్షం ఖాయమేనట..

కరీబియన్ దీవుల్లో ఇది వర్షాకాలం. కాబట్టి మ్యాచ్ రోజుతో పాటు రిజర్వ్ డే అయిన ఆదివారం కూడా వర్షం కురిసే అవకాశం ఉంది. శనివారం ఆకాశం దట్టమైన మేఘాలతో ఉండనుంది. అలాగే వర్షానికి 78 శాతం అవకాశం ఉంది. బలమైన గాలులకు ఆస్కారం. అయితే 190 నిమిషాల అదనపు సమయం ఉంది కాబట్టి మ్యాచ్‌కు ఇబ్బంది ఉండకపోవచ్చు. విజేతను తేల్చేందుకు పది ఓవర్ల మ్యాచ్ సరిపోతుంది. అదీ వీలుకాకపోతే రిజర్వ్‌డే ఉండనే ఉంది. ఒకవేళ రిజర్వ్‌డే రోజు కూడా మ్యాచ్ జరగకపోతే ఇరు జట్లు సంయుక్త విజేతలుగా నిలుస్తాయి.

1 ఐసీసీ టోర్నమెంట్ ఫైనల్లో భారత్, దక్షిణాఫ్రికా జట్లు తలపడడం ఇదే తొలిసారి.

యూఎస్ ఓపెన్ క్వార్టర్స్‌లో గాయత్రి జోడీ

ఫోర్ట్‌వర్త్ (అమెరికా): తెలుగమ్మాయి గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ జోడీ యూఎస్ ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరింది. శుక్రవారం జరిగిన డబుల్స్ ప్రీక్వార్టర్స్ పోరులో గాయత్రి ద్వయం 16-21, 21-11, 21-19తో హిస్సీ షాన్-హుంగ్ ఎన్ జు (చైనీస్ తైపీ)పై గెలిచింది. సింగిల్స్ రెండో రౌండ్‌లో 8వ సీడ్ ప్రియాన్షు రజావత్ 21-18, 21-16తో హువాంగ్ (చైనీస్ తైపీ)పై నెగ్గి, క్వార్టర్స్ చేరాడు. మాళవిక బన్సోడ్ 15-21, 21-19, 21-14తో తెరెజా స్వాబికోవా (చెక్ రిపబ్లిక్)పై నెగ్గింది.

ఆంధ్ర రిలే జట్టుకు స్వర్ణం

- స్ప్రింటర్ నిత్యకు కాంస్యం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ ఇంటర్ స్టేట్ సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 4×400 మహిళల రిలేలో ఆంధ్రప్రదేశ్ బృందం స్వర్ణ పతకం కొల్లగొట్టింది. శుక్రవారం హరియాణాలోని పంచకులలో జరిగిన ఈ పోటీల్లో ఆర్.స్వాతి, ఎం.శిరీష, కె.రజిత, ఎల్.మధుకావ్యతో కూడిన ఆంధ్ర జట్టు 3 నిమిషాల 41.84 సెకన్లలో రేసును ముగించింది. హైదరాబాద్ అమ్మాయి నిత్య 100 మీటర్ల స్ప్రింట్‌లో కాంస్యం సాధించింది. నిత్య 11.79 సెకన్లలో రేసును పూర్తి చేసి మూడోస్థానంలో నిలిచింది. స్నేహ (కర్ణాటక) స్వర్ణం, గిరిధరణి (తమిళనాడు) రజతం నెగ్గారు.

ఫైనల్లో స్వేచ్ఛగా ఆడండి


రోహిత్ సేనకు గంగూలీ సూచన

న్యూఢిల్లీ: టీ20 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌లో ఒత్తిడికి లోనుకాకుండా స్వేచ్ఛగా ఆడాలని రోహిత్ సేనకు మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ సూచించాడు. 'ఆరు నెలల క్రితం ఐపీఎల్‌లో రోహిత్ ముంబై జట్టుకు కెప్టెన్‌గా కూడా లేడు. కానీ నేడు భారత జట్టును ఓటమి లేకుండా ప్రపంచకప్ ఫైనల్‌కు చేర్చడం సంతోషంగా ఉంది. ఆటగాళ్లు స్వేచ్ఛగా ఆడితే ఫైనల్లోనూ విజయం ఖాయం' అని దాదా అన్నాడు.

నగాల్‌కు క్లిష్టమైన డ్రా

లండన్: ప్రతిష్ఠాత్మక వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్‌లో తొలిసారిగా ఆడబోతున్న భారత స్టార్ సుమిత్ నగాల్‌కు క్లిష్టమైన డ్రా ఎదురైంది. సోమవారం నుంచి జరిగే ఈ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో అతను తొలి రౌండ్‌లో ప్రపంచ 53వ ర్యాంకర్ మియోమిర్ కెక్మానోవిక్(సెర్బియా)తో తలపడనున్నాడు. ఒకవేళ మెరుగైన ఆటతీరుతో ముందుకుసాగినా మూడో రౌండ్‌లో వరల్డ్ నెంబర్ వన్ జానిక్ సిన్నర్ ఎదురుకానున్నాడు. ఇక డిఫెండింగ్ చాంప్ అల్కారజ్, టాప్‌సీడ్ సిన్నర్ ఒకే పార్శ్వంలో పోటీపడనున్నారు. దీంతో అంతా సవ్యంగా సాగితే ఈ ఇద్దరూ సెమీస్‌లో తలపడే చాన్సుంది. జొకోవిచ్ క్వాలిఫయర్ కోప్రివాతో టోర్నీ ఆరంభించనున్నాడు. పురుషుల డబుల్స్‌లో భారత్ నుంచి బోపన్న-ఎబ్డెన్ (ఆస్ట్రేలియా), శ్రీరామ్ బాలాజీ-జాన్సన్ (బ్రిటన్) తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

జావెలిన్ త్రోయర్ మనుపై వేటు



పంచకుల (హరియాణా): ఆసియా చాంపియన్‌షిప్ రజత పతక విజేత, పారిస్ ఒలింపిక్స్ రేసులో ఉన్న యువ జావెలిన్ త్రోయర్ డీపీ మనుపై నాడా (జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ) ప్రాథమికంగా వేటు వేసింది. గత ఏప్రిల్‌లో జరిగిన ఇండియన్ గ్రాండ్ ప్రీ సందర్భంగా మను నుంచి 'నాడా' రక్త నమూనాలను సేకరించింది. వాటిలో అనబోలిక్ ఉత్ప్రేరకం ఉండడంతో డోపింగ్ టెస్టులో మను పాజిటివ్‌గా తేలాడు. దీంతో అతడిపై ప్రాథమిక సస్పెన్షన్ విధిస్తున్నట్టు నాడా తెలిపింది. ప్రస్తుతం జరుగుతున్న జాతీయ అంతర్రాష్ట్ర చాంపియన్‌షిప్స్‌కు దూరంగా ఉండాలని జాతీయ అథ్లెటిక్స్ సమాఖ్య ఆదేశించింది.

ఈ మార్చి చివరినాటికి

ప్రభుత్వ అప్పు రూ.171.78 లక్షల కోట్లు

వెల్లడించిన కేంద్ర ఆర్థిక శాఖ



న్యూఢిల్లీ: ఈ ఏడాది మార్చి చివరి నాటికి కేంద్ర ప్రభుత్వం మొత్తం రుణాలు రూ.171.78 లక్షల కోట్లకు పెరిగాయి. 2023 డిసెంబరు చివరి నాటికి నమోదైన రూ.166.14 లక్షల కోట్లతో పోలిస్తే, మూడు నెలల్లో 3.4 శాతం పెరిగాయని కేంద్ర ఆర్థిక శాఖ శుక్రవారం వెల్లడించింది. మొత్తం స్థూల రుణాల్లో పబ్లిక్ డెట్ వాటా 90.2 శాతంగా నమోదైందని తెలిపింది. ఈసారి బడ్జెట్‌లో కేంద్రం ప్రకటించిన రుణ సమీకరణ ప్రణాళిక మార్కెట్ అంచనాల కన్నా మెరుగ్గా ఉండటం, ద్రవ్యలోటును జీడీపీలో 5.1 శాతానికి కట్టడి చేస్తామన్న లక్ష్యంతోపాటు క్యాపిటల్ మార్కెట్లోకి విదేశీ పెట్టుబడుల ప్రవాహం కొనసాగడం, ద్రవ్యోల్బణం అదుపులోకి రావడంతో ప్రభుత్వ బాండ్ల వడ్డీరేట్లు కాస్త తగ్గుముఖం పట్టాయని తన ప్రకటనలో పేర్కొంది. కాగా, అమెరికా బాండ్ల రేట్లు తీవ్ర ఊగిసలాటలకు లోనయ్యాయని.. ఫెడ్ రిజర్వ్ నిర్ణయాలు, ఆ దేశ ద్రవ్యోల్బణం, ఉద్యోగాల కల్పన గణాంకాలు అందుకు కారణమని నోట్‌లో ప్రస్తావించింది.

కీలక రంగాల వృద్ధి 6.3 శాతం

ఈ ఏడాది మే నెలకు దేశంలోని 8 కీలక మౌలిక రంగాలు 6.3 శాతం వృద్ధిని కనబర్చాయి. ఈ ఏప్రిల్‌లో నమోదైన 6.7 శాతం వృద్ధితో పోలిస్తే తగ్గినప్పటికీ, గత ఏడాది మే నెలలో నమోదైన 5.2 శాతం వృద్ధితో పోలిస్తే మెరుగైంది. బొగ్గు, ముడిచమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, స్టీల్, సిమెంట్, విద్యుత్ రంగాలను కీలక మౌలికాభివృద్ధి రంగాలుగా పరిగణిస్తారు. ఏప్రిల్‌తో పోలిస్తే తగ్గినప్పటికీ.. బొగ్గు, సహజ వాయువు, విద్యుత్ రంగాలు గతనెలలో మెరుగైన పనితీరు కనబర్చాయని ప్రభుత్వం వెల్లడించింది. ముడిచమురు, సిమెంట్, ఎరువుల రంగాలు మాత్రం డీలా పడ్డాయి. కాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి రెండు నెలలకు (ఏప్రిల్-మే) కీలక రంగాల ఉత్పత్తి వృద్ధి 6.5 శాతంగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి వృద్ధి 4.9 శాతంగా ఉంది.

బడ్జెట్ అంచనాల్లో 3 శాతానికి ద్రవ్యలోటు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొదటి రెండు నెలలు పూర్తయ్యే సరికి కేంద్ర ప్రభుత్వ ద్రవ్యలోటు బడ్జెట్ అంచనాలో కేవలం 3 శాతానికి పరిమితమైంది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ వ్యయాలపై ఆంక్షలు అమలు కావడం ఇందుకు ప్రధాన కారణం. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి లోటు బడ్జెట్ అంచనాలో 11.8 శాతంగా నమోదైంది. ప్రభుత్వ రాబడి, వ్యయాల మధ్య అంతరాన్ని ద్రవ్యలోటు అంటారు. మార్కెట్ నుంచి రుణాల సమీకరణ ద్వారా ప్రభుత్వం ఈ లోటును పూడ్చుతుంది. 2024-25లో ద్రవ్యలోటు రూ.16,85,494 కోట్లు లేదా జీడీపీలో 5.1 శాతంగా నమోదు కావచ్చని ఈ ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌లో కేంద్రం అంచనా వేసింది. కాగా, ఈ ఏప్రిల్, మే గడిచేసరికి ద్రవ్యలోటు రూ.50,615 కోట్లు లేదా బడ్జెట్ అంచనాలో 3 శాతంగా నమోదైంది.

చిన్న మొత్తాల పొదుపు రేట్లు యథాతథం

ఈ జూలై-సెప్టెంబరు త్రైమాసికానికి చిన్న మొత్తాల పొదుపు పథకాలపై చెల్లించే వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ శుక్రవారం ప్రకటించింది. అనగా, ప్రస్తుత రేట్లే మరో మూడు నెలలు కొనసాగనున్నాయి. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ప్రతి మూడు నెలలకోసారి చిన్న మొత్తాల పొదుపు రేట్లను సవరిస్తుంటుంది. ఈ రేట్లను యథాతథంగా కొనసాగించడం వరుసగా ఇది రెండో సారి. ప్రస్తుతం సుకన్య సమృద్ధి పథకంపై వడ్డీ రేటు 8.2 శాతంగా ఉండగా.. మూడేళ్ల టర్మ్ డిపాజిట్, పబ్లిక్ ప్రావిడెండ్ ఫండ్(పీపీఎఫ్)పై లభించే వార్షిక వడ్డీ ఆదాయ రేటు 7.1 శాతంగా ఉంది. పోస్టాఫీస్ సేవింగ్స్ డిపాజిట్ స్కీమ్‌లో 4 శాతం, కిసాన్ వికాస్ పత్రాలపై 7.5 శాతం వడ్డీ లభిస్తోంది. నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్(ఎన్ఎస్‌సీ)పై లభించే వడ్డీ రేటు 7.7 శాతంగా ఉంది.

ఎన్‌పీఎస్ ఖాతాదారులకు టీ+0 సెటిల్‌మెంట్

న్యూఢిల్లీ: ఎన్‌పీఎస్ పెట్టుబడులకు సంబంధించి పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. సెటిల్‌మెంట్ రోజు ఖాతాదారుల నుంచి ఉదయం 11 గంటల వరకు వచ్చిన పెట్టుబడి నిధులను ట్రస్టీ బ్యాంకులు ఇక అదే రోజు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉదయం 9.30 గంటల వరకు వచ్చిన నిధులను మాత్రమే ట్రస్టీ బ్యాంకులు, అదే రోజు పెట్టుబడి పెడుతున్నాయి. ఆ తర్వాత వచ్చిన నిధులను మరుసటి రోజు, ఖాతాదారుల చాయిస్‌కు అనుగుణంగా వివిధ పెట్టుబడి సాధనాల్లో మదుపు చేస్తున్నాయి. పీఎఫ్ఆర్‌డీఏ జూలై 1 నుంచి ఈ గడువును ఉదయం 11 గంటల వరకు పొడిగించింది.

కోరమాండల్ నుంచి 'పరంఫాస్ ప్లస్'

హైదరాబాద్ : ప్రముఖ ఎరువుల కంపెనీ కోరమాండల్ ఇంటర్నేషనల్ 'పరంఫాస్ ప్లస్' పేరుతో మరో సరికొత్త ఎరువుని మార్కెట్‌లో విడుల చేసింది. ఇప్పటికే ఉన్న 'పరంఎస్' బ్రాండ్ పోషక ఎరువుని మెగ్నీషియంతో సుసంపన్నం చేసి కంపెనీ ఈ ఎరువుని అభివృద్ధి చేసింది. పరంఫాస్ ప్లస్ ఎరువులో 16 శాతం నత్రజని, 20 శాతం ఫాస్పరస్, 13 శాతం సల్ఫర్‌తో పాటు అదనంగా 0.6 శాతం మెగ్నీషియం ఉంటుందని కంపెనీ తెలిపింది. ఈ ఎరువుని ఉద్యాన పంటలతో పాటు, అన్ని ఆహార ధాన్యాల పంటలపై ఉపయోగించ వచ్చని తెలిపింది.

కిరాణా సరుకుల డెలివరీ సేవల్లోకి ఓలా

న్యూఢిల్లీ: క్యాబ్ బుకింగ్ సేవల కంపెనీ ఓలా.. బ్లింకిట్, స్విగ్గీ, ఇన్‌స్టామార్ట్ వంటి క్విక్ కామర్స్ కంపెనీలకు సైతం పోటీ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ కంపెనీ త్వరలోనే కిరాణా సరుకుల డెలివరీ సేవల్లోకి ప్రవేశించనున్నట్లు తెలిసింది. ఇందుకోసం ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) ప్లాట్‌ఫామ్‌తో జట్టు కట్టనున్నట్లు సమాచారం. ఆన్‌లైన్ కిరాణా సరుకుల విభాగంలోకి ప్రవేశించేందుకు ఓలా చేస్తున్న మూడో ప్రయత్నమిది. గతంలో సంస్థ కిరాణా సరుకుల కేంద్రాలను ప్రారంభించింది. ఆ తర్వాత ఫుడ్ డెలివరీ యాప్‌ను లాంచ్ చేసింది. కానీ, ఆ రెండు ప్రయత్నాలూ విఫలమయ్యాయి.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
శనివారం | 29-6-2024
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

వైసీపీ అరాచకాల చిట్టా!

రాష్ట్రవ్యాప్తంగా సమాచార సేకరణ
తప్పుడు కేసులు, వేధింపులపై నివేదికలు
పైనుంచి కింది స్థాయి వరకూ
వైసీపీ నేతల అవినీతి, దోపిడీపై ఆరా
పోలీసుల వ్యవహారశైలిపైనా సమాచారం
చట్టప్రకారం చర్యలకు ప్రభుత్వం యోచన

12

వాసుదేవరెడ్డికి బిగుస్తున్న ఉచ్చు



మద్యం అక్రమాలు తవ్వుతున్న సీఐడీ
కుంభకోణంపై కీలక ఆధారాల సేకరణ
'బేవరేజెస్' కంప్యూటర్లపై ప్రత్యేక దృష్టి
నిపుణుల ద్వారా డిలీట్ వివరాల రికవరీ

ఏసీబీ డీజీగా అతుల్ సింగ్

సీఐడీ బాధ్యతలు అయ్యన్నార్‌కు
విశాఖ పోలీస్ బాస్‌గా శంకబ్రత
సీనియర్ ఐపీఎస్‌ల బదిలీలు 10

పింఛన్లు రెడీ

జులైలో ఒక్కో పెన్షనర్‌కు 7 వేలు
నిధులు సమీకరించే పనిలో సర్కార్
ఇప్పటికే 5 వేల కోట్లకు ఇండెంట్

బంగాళాఖాతంలో అల్పపీడనం

2
రెండు రోజులపాటు వర్షాలు

8 మంది వీసీల రాజీనామా

అందులో వివాదాస్పద
ఏయూ వీసీ ప్రసాదరెడ్డి 12
నేడు మరికొంతమంది చేసే చాన్స్
ఆంధ్రా వర్సిటీలో విద్యార్థి సంఘాల సంబరాలు

జాతికి జగన్ ద్రోహం

పోలవరాన్ని గోదావరిలో ముంచేశాడు: సీఎం

ఇది అహంకారంతో చేసిన దుస్సాహసం
ఒక వ్యక్తి చేసిన పాపానికి కేంద్రం నష్టపరిహారం చెల్లించాల్సి వస్తోంది
నిపుణులు ఏడాదిలో నివేదిక ఇవ్వాలి
దయాఫ్రం వాల్ నిర్మాణానికే రెండేళ్లు..
ఈసీఆర్‌ఎఫ్ డ్యాంకు మరో రెండేళ్లు
అంటే ప్రాజెక్టు పూర్తికి ఐదేళ్లు పట్టవచ్చు
జగన్ సీఎంకాగానే నిర్మాణాన్ని ఆపేశాడు
కేంద్రం వద్దన్నా కాంట్రాక్టరును మార్చాడు
మా హయాంలో రూ.11,762 కోట్ల ఖర్చు
ఈయన జమానాలో రూ.4,167 కోట్లే
డయాఫ్రం వాల్‌ను 436 కోట్లతో పూర్తిచేశాం
ఇప్పుడు మరమ్మతుకే రూ.447 కోట్లవుతుంది
సమాంతర వాల్‌కు మరో 990 కోట్లు కావాలి
అంచనా వ్యయం ఇంకో 33% పెరగొచ్చు: సీఎం
పోలవరంపై శ్వేతపత్రం విడుదల



శుక్రవారం పోలవరం ప్రాజెక్టుపై శ్వేతపత్రం విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్

అమరావతి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే పోలవరం ప్రాజెక్టును పరిశీలించినప్పుడు.. అక్కడి పరిస్థితిని చూస్తే కన్నీళ్లు వచ్చాయని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. దానిని జగన్ గోదావరిలో ముంచేశారని మండిపడ్డారు. అహంకారంతో ఆయన చేసిన దుస్సాహసానికి ఫలితమే పోలవరం ప్రాజెక్టు ప్రస్తుత దుస్థితిగా పేర్కొన్నారు. ఒక వ్యక్తి చేసిన పాపానికి కేంద్రం నష్టపరిహారం చెల్లించాల్సిన

మిగతా 11వ పేజీలో...

ఐదేళ్ల వినాశనమెంతో ప్రజలకు తెలియాలి

రాష్ట్రమెంత వెనక్కి వెళ్లిందో వారికి అర్థం కావాలి
అందుకే శ్వేతపత్రాల విడుదల
జనం తీర్పు చరిత్రాత్మకం
జగన్ రాజకీయాల్లో ఉండడానికే అర్హత లేని వ్యక్తి: బాబు


ఇదేమి 'కాల మహిమ'!

రేపు తనిఖీ చేసి.. ఈరోజే నివేదిక
ఐఏఎస్ వేణుగోపాల్ రెడ్డి ఘనత
ఎన్జీటీ కళ్లకు 'ఇసుక' గంతలు
సంయుక్త కమిటీ నివేదికను మార్చి 'అంతా ఓకే' అంటూ సొంత రిపోర్టు
ఫిబ్రవరి 14న తనిఖీ చేసినట్లు 13వ తేదీనే నివేదిక ఇచ్చిన ఐఏఎస్


వేణుగోపాల్ రెడ్డి

(అమరావతి - ఆంధ్రజ్యోతి)
ధ్వని వేగాన్ని మించి ప్రయాణించే సూపర్ సోనిక్ విమానాలున్నాయి! కానీ... కాలంకంటే వేగంగా, కాలాన్ని వెనక్కి నెట్టి మరీ పనిచేసే కలెక్టర్లు ఉన్నారంటే నమ్ముతారా? నమ్మి తీరాల్సిందే! జగన్ జమానాలో ఏదైనా సాధ్యమే! గుంటూరు జిల్లా కలెక్టర్ హోదాలో, జగన్‌కు వీరభక్తుడిగా పని చేసిన వేణుగోపాల్ రెడ్డి ఈ ఘనత సాధించారు. రేపటి రోజు 'చేసిన' తనిఖీ నివేదికను ఈ రోజే ఇచ్చేశారు. ఈ 'కాల మహిమ'

మిగతా 12వ పేజీలో...









పని చేయకుంటే పదవీ విరమణే

» ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులకు కేంద్రం హెచ్చరిక

న్యూఢిల్లీ, జూన్ 28: సక్రమంగా పనిచేయకుంటే ముందుగానే పదవీ విరమణ చేయాల్సి ఉంటుందని కేంద్ర ప్రభుత్వం అన్ని బ్యాంకులు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులను హెచ్చరించింది. ఈ విషయమై 2020లోనే ఉత్తర్వులు ఇచ్చినా వాటిని సక్రమంగా అమలు చేయడం లేదని ఆక్షేపణ తెలిపింది. ఆ ఉత్తర్వులను విధిగా పాటించాలని సిబ్బంది, శిక్షణ శాఖ శుక్రవారం మరోసారి ఆదేశాలు ఇచ్చింది. సక్రమంగా విధులు నిర్వర్తించకున్నా, విశ్వసనీయత లోపించినా, సమర్థతలేకున్నా గడువుకు ముందుగానే పదవీ విరమణ చేయించాలని తెలిపింది. అలాంటి వారిని తక్షణమే గుర్తించాలని సూచించింది. ఉద్యోగుల పనితీరుపై ప్రతి నెలా 15వ తేదీన నిర్దిష్ట ఫారంలో నివేదికలు పంపిస్తుండాలని ఆదేశించింది.

ఎన్‌టీఏలో సంస్కరణలకు సలహాలివ్వండి

» విద్యార్థులు, తల్లిదండ్రులకు కేంద్రం పిలుపు.. వెబ్‌సైట్ ఏర్పాటు

న్యూఢిల్లీ, జూన్ 28: నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, యూజీసీ-నెట్ రద్దు వంటి ఘటనల నేపథ్యంలో ఈ పరీక్షలు నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)లో సంస్కరణలకు కేంద్రం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్‌టీఏలో సంస్కరణలకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, పరీక్షలతో సంబంధమున్న ఇతర వర్గాలను కోరింది. పరీక్షల నిర్వహణ విధానం, భద్రత ప్రమాణాల పెంపు, ఎన్‌టీఏ సంస్థాగత కార్యకలాపాల్లో చేయాల్సిన మార్పులు, చేర్పులపై సూచనలు చేయాలని అడిగింది. మైజీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా జూలై 7లోగా తమ సిఫారసులు తెలియజేయాలని సూచించింది. ఎన్‌టీఏ నిర్వహించే పరీక్షల విధానంలో సంస్కరణల కోసం ఇస్రో మాజీ చీఫ్ ఆర్.రాధాకృష్ణన్ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం జూన్ 22న ఓ ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. కాగా, నీట్-యూజీ ప్రశ్నపత్రం లీకేజీ కేసులో ఝార్ఖండ్‌కు చెందిన ఇద్దరిని సీబీఐ అధికారులు శుక్రవారం అరెస్టు చేశారు.

డీమ్డ్ వర్సిటీలు ఆర్టీఐ పరిధిలోకి రావు

న్యూఢిల్లీ, జూన్ 28: డీమ్డ్ వర్సిటీలు సమాచార హక్కు చట్టం (ఆర్.టి.ఐ.) పరిధిలోకి రావని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. అవి ప్రజా అధికార సంస్థ (పబ్లిక్ అథారిటీ)లు కావని తెలిపింది. ఒకవేళ అవి ప్రభుత్వ పరిధిలో ఉన్నా, ప్రభుత్వం నిధులు ఇస్తున్నా అప్పుడు మాత్రం వాటికి ఆర్.టి.ఐ. వర్తిస్తుందని పేర్కొంది. డీమ్డ్ విశ్వవిద్యాలయమైన వినాయక్ విషన్ యూనివర్సిటీలో 2007-2011 మధ్య దూరవిద్య ద్వారా ఎమ్మెస్సీ చదివిన విద్యార్థుల వివరాలు ఇచ్చేలా ఆదేశించాలంటూ ఓ వ్యక్తి చేసిన వినతిని తిరస్కరిస్తూ హైకోర్టు ఈ విషయాన్ని స్పష్టం చేసింది. విద్యార్థుల పేర్లు, రోల్ నెంబర్లు, తల్లిదండ్రుల పేర్లు ఇతర సమాచారం అంతా కావాలని ఆయన కోరాడు. ఈ వివరాలు ఇచ్చేందుకు ప్రధాన సమాచార కమిషనర్ తిరస్కరించడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించాడు.

టీచర్లే కదా..అర్హత పరీక్షంటే భయమెందుకు?

న్యూఢిల్లీ, జూన్ 28: తమ రాష్ట్ర ప్రభుత్వం 2023లో ప్రవేశ పెట్టిన అర్హత పరీక్ష నుంచి మినహాయించాలని సుప్రీంకోర్టును ఆశ్రయించిన బిహార్ పంచాయతీ ఉపాధ్యాయులపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం చేసిన చట్టం సరైనదేనని ప్రకటించింది. ఉపాధ్యాయుడైన ఒక పోస్టుగ్రాడ్యుయేట్ కనీసం సెలవు చీటీ కూడా రాయలేరా...? దేశంలో విద్యా వ్యవస్థ స్థాయి ఇదేనా? అని ప్రశ్నించింది. ఈ అర్హత పరీక్షను రాయలేని పక్షంలో ఉపాధ్యాయులు రాజీనామా చేయాలని వ్యాఖ్యానించింది. ఈ అంశంలో పట్నా హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సమర్థిస్తూ... రాష్ట్ర ప్రభుత్వం చేసిన చట్టానికి వ్యతిరేకంగా దాఖలు చేసిన పిటిషన్లను జస్టిస్ బీవీ నాగరత్న డిస్మిస్ చేశారు.

అగ్రకులాల వారి చేతిలో 88.4% దేశ సంపద

» ప్రపంచ అసమానతల ల్యాబ్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ, జూన్ 28: దేశ సంపదలో దాదాపు 88.4% అగ్రకులాల చేతుల్లోనే కేంద్రీకృతమై ఉందని, ఇది భారత్‌లో వేళ్లూనుకుపోయిన తీవ్రమైన ఆర్థిక, సామాజిక అసమానతలను ఎత్తిచూపుతోందని ప్రపంచ అసమానతల ల్యాబ్ ఇటీవల "టువార్డ్స్ టాక్స్ జస్టిస్ అండ్ వెల్త్ రీడిస్ట్రిబ్యూషన్ ఇన్ ఇండియా" పేరిట విడుదల చేసిన నివేదిక పేర్కొంది. ఈ నివేదిక ప్రకారం.. ప్రస్తుతం దేశ సంపదలో 40%.. ఒక శాతం మంది సంపన్నుల వద్దే ఉండగా.. దేశ జనాభాలో అట్టడుగున్న ఉన్న 50 శాతం మంది మొత్తం సంపదలో 6.4% మాత్రమే కలిగి ఉన్నారు. 1980వ దశకం నుంచి భారత్‌లో ఆర్థిక అసమానతలు పెరుగుతూ వచ్చాయి. 2000 తర్వాత అది మరింత వేగం పుంజుకుంది. ముఖ్యంగా 2014-15 నుంచి 2022-23 మధ్యకాలంలో ఈ అసమానతలు విపరీతంగా పెరిగాయి.

భారత్‌లో ప్రమాదంలో మతస్వేచ్ఛ: అమెరికా

వాషింగ్టన్, జూన్ 28: భారత్‌లో మైనారిటీల నివాసాలను కూల్చివేస్తున్నారని, వారికి ప్రార్థనామందిరాలపై దాడులు జరుగుతున్నాయని అమెరికా విమర్శించింది. మత మార్పిడికి వ్యతిరేకంగా చట్టాలు చేస్తున్నారని, విద్వేష ప్రసంగాలు వినిపిస్తున్నాయని పేర్కొంది. అతి సన్నిహిత మిత్ర బంధం కలిగిన భారత్‌పై అమెరికా అసాధారణ రీతిలో ఘాటు వ్యాఖ్యలు చేయడం గమనార్హం. అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ మతస్వేచ్ఛపై వార్షిక నివేదికను విడుదల చేశారు. యూదులు, ముస్లిమ్‌లపై ప్రపంచ వ్యాప్తంగా మతదాడులు పెరిగాయని ఆయన తెలిపారు. గాజా యుద్ధం నేపథ్యంలో తీవ్ర యూదు వ్యతిరేకతను, ఇస్లామోఫోబియాను స్వయంగా అమెరికా చవిచూస్తోందని బ్లింకెన్ పేర్కొన్నారు.

మూడు రెట్లు పెరిగిన వడగాలుల తీవ్రత

» క్లైమేట్ సెంట్రల్ నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ, జూన్ 28: ఈ ఏడాది జూన్ 16-24 మధ్య తొమ్మిది రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా సాధారణం కంటే మూడు రెట్లు ఎక్కువగా వడగాలులు నమోదయ్యాయని, దశాబ్దాలుగా బొగ్గు, చమురు, సహజ వాయువును మండించడమే వాతావరణంలో ఈ అసాధారణ మార్పులకు కారణమని పేర్కొంది. అమెరికాకు చెందిన క్లైమేట్ సెంట్రల్ తన నివేదికలో వెల్లడించింది. కార్బన కాలుష్యం తగ్గనంత వరకు ఈ వైపరీత్యాలు తప్పవని వెల్లడించింది. ఈ వడగాలుల ప్రభావం ప్రపంచవ్యాప్తంగా 500 కోట్ల మందిపై, ఒక్క ఇండియాలోనే 60 కోట్ల మందిపై పడిందని తెలిపింది. ఇండియాలో దాదాపు 40 వేల మంది వడదెబ్బకు గురయ్యారని, 100కి పైగా మరణాలు సంభవించాయని అంచనా వేసింది.

బంగాళాఖాతంలో అల్పపీడనం

» దేశంలో అనేక ప్రాంతాలకు నైరుతి విస్తరణ

విశాఖపట్నం, అమరావతి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల సీజన్‌లో తొలి అల్పపీడనం బంగాళాఖాతంలో ఏర్పడింది. వాయువ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శుక్రవారం ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్‌కు ఆనుకుని వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఇది రానున్న రెండు రోజుల్లో వాయువ్య దిశగా పయనిస్తుందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో శుక్రవారం కోస్తాలో అక్కడక్కడా వర్షాలు కురిశాయి. దక్షిణ కోస్తాలో మాత్రం ఎండ తీవ్రత కొనసాగింది. నెల్లూరులో 38.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కాగా, రానున్న 24 గంటల్లో కోస్తాలో పలుచోట్ల, రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తర కోస్తాలో తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. కేరళ నుంచి మహారాష్ట్ర వరకూ విస్తరించిన ఉపరితల ద్రోణి, గుజరాత్ పరిసరాల్లో ఉన్న ఉపరితల ఆవర్తనం, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో నైరుతి రుతుపవనాలు పురోగమించాయి. శుక్రవారం దేశ రాజధాని ఢిల్లీ, జమ్ము కశ్మీర్‌తో పాటు అనేక ప్రాంతాలకు విస్తరించాయి. రానున్న రెండు, మూడు రోజుల్లో దేశంలోని మిగిలిన ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు.

మరో రెండు రోజులు వర్షాలు

ద్రోణి ప్రభావంతో శని, ఆదివారాల్లో కోస్తా, రాయలసీమలోని అనేక జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఉరుములు, మెరుపులతో పాటు అక్కడక్కడా పిడుగులు కూడా పడే అవకాశం ఉందని హెచ్చరించింది. పిడుగులు, వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

నీట్‌పై దద్దరిల్లిన పార్లమెంటు

సమగ్ర చర్చకు విపక్షాల డిమాండ్.. నిరాకరించిన అధికారపక్షం

» రాజ్యసభలో కళ్లు తిరిగి పడిపోయిన కాంగ్రెస్ మహిళా ఎంపీ పూలోదేవినేతమ్



లోక్‌సభలో మాట్లాడుతున్న రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్షల్లో అవకతవకలపై పార్లమెంటు ఉభయసభలు శుక్రవారం దద్దరిల్లాయి. నీట్‌పై సమగ్ర చర్చను చేపట్టాలన్న తమ డిమాండ్‌కు అధికారపక్షం అంగీకరించక పోవటంతో ప్రతిపక్ష ఎంపీలు నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై తొలుత చర్చిద్దామని, ఆ సందర్భంగా నీట్‌పైనా చర్చ జరపవచ్చన్న ప్రభుత్వ సూచనకు విపక్షాలు అంగీకరించలేదు. దీంతో ఉభయ సభల్లో ప్రతిష్టంభన నెలకొంది. ఫలితంగా పలుమార్లు వాయిదా పడ్డాయి. ఉదయం లోక్‌సభ సమావేశం కాగానే.. నీట్‌తోపాటు ఇతర పరీక్షల ప్రశ్నాపత్రాలు లీకైన ఘటనలపై చర్చను కోరుతూ కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఇతర కార్యకలాపాలను రద్దు చేసి పేపర్ లీకేజీలపై చర్చను చేపడదామని విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. దీనిపై స్పీకర్ ఓం బిర్లా స్పందిస్తూ.. ఇటీవల దివంగతులైన 13 మంది మాజీ ఎంపీలకు తొలుత నివాళి అర్పిద్దామన్నారు. నివాళి ముగియగానే విపక్ష ఎంపీలు మళ్లీ తమ డిమాండ్‌ను కొనసాగించారు. నీట్ చాలా ముఖ్యమైన అంశమని, దానిపై చర్చ అవసరమని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. అయితే, రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరపాలని ఇప్పటికే నిర్ణయించామని, ఆ చర్చలోనే అన్ని అంశాలనూ లేవనెత్తవచ్చని, తగిన సమయం ఇస్తానని స్పీకర్ చెప్పారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు ముందే మరో అంశంపై చర్చిద్దామని విపక్షం కోరటం గతంలో ఎన్నడూ జరగలేదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి రిజిజు అన్నారు. సభలో ప్రతిష్టంభన నేపథ్యంలో స్పీకర్ సభను సోమవారానికి వాయిదా వేశారు. రాజ్యసభలోనూ ఇటువంటి గందరగోళమే నెలకొంది. రాష్ట్రపతి ప్రసంగంపై చర్చను పక్కనపెట్టి, ముందుగా నీట్‌పై చర్చిద్దామని విపక్షాలు డిమాండ్ చేశాయి. విపక్ష నేత ఖర్గే వెల్‌లోకి రావటం తనను తీవ్రంగా బాధించిందని ధన్‌కడ్ పేర్కొన్నారు. కాగా, నిరసన సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ పూలోదేవినేతమ్ కళ్లు తిరిగి పడిపోయారు. ఆమెను ఢిల్లీలోని రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రికి తరలించి ఐసీయూలో చికిత్స అందించారు. ఎంపీ బీపీ తీవ్రంగా పెరిగిందని, దాదాపుగా పక్షవాతం వచ్చే స్థాయిలో ఉందని వైద్యులు తెలిపినట్లుగా ఇతర ఎంపీలు వెల్లడించారు. చికిత్స తర్వాత పూలోదేవి కోలుకున్నారు.

మానవత్వానికే మచ్చ: రేణుకాచౌదరి

సభలో ఒక ఎంపీ కళ్లుతిరిగి పడిపోయినప్పటికీ, ఏమాత్రం పట్టించుకోకుండా సభా కార్యకలాపాలను చైర్మన్ కొనసాగించటాన్ని విపక్ష ఎంపీలు తీవ్రంగా తప్పుబట్టారు. కాంగ్రెస్‌కే చెందిన రేణుకా చౌదరి మాట్లాడుతూ, 'ఒక మహిళా ఎంపీ కళ్లు తిరిగి పడిపోతే, ఆమెను సహచర ఎంపీలు ఆస్పత్రికి తీసుకెళ్తుంటే కూడా సభ కొనసాగుతూనే ఉంది. అంటే, ఎంపీల ప్రాణాలకు విలువే లేదా? ఇది మానవత్వానికే మచ్చ' అని దుయ్యబట్టారు. నీట్‌పై చర్చకు చైర్మన్ అంగీకరించకపోవటాన్ని నిరసిస్తూ విపక్ష ఎంపీలు సభ నుంచి వాకౌట్ చేశారు. బీజేడీ ఎంపీలు కూడా వారితో కలిసి వాకౌట్ చేయటం విశేషం. కాగా, లోక్‌సభలో నీట్‌పై చర్చను చేపట్టాలంటూ రాహుల్ గాంధీ మాట్లాడుతున్న సమయంలో ఆయన ముందున్న మైక్‌ను ఆపేశారని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ మేరకు ఎక్స్‌లో ఒక వీడియోను షేర్ చేసింది. దీంట్లో రాహుల్.. మైక్‌ను పునరుద్ధరించాలని స్పీకర్‌ను కోరటం కనిపించింది. కాగా, రాహుల్ విజ్ఞప్తికి స్పీకర్ స్పందిస్తూ.. తాను మైక్‌ను కట్ చేయలేదని, వాటిపై నియంత్రణ తన వద్ద ఉండదని చెప్పారు.

'నీట్' నుంచి మినహాయింపు ఇవ్వండి

తమిళనాడు అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం

చెన్నై, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ విద్యార్థులకు వైద్యవిద్యను దూరం చేసేలా ఉన్న 'నీట్' పరీక్ష నుంచి రాష్ట్రానికి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ తమిళనాడు అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించింది. అంతేగాక ఆ పరీక్షను రద్దు చేయాలని కూడా డిమాండ్ చేసింది. ఈ పరీక్ష నుంచి రాష్ట్రాన్ని మినహాయించాలని కోరుతూ గతంలో శాసనసభ ఆమోదించి, ప్రస్తుతం రాష్ట్రపతి పరిశీలనలో ఉన్న నీట్ వ్యతిరేక బిల్లుకు వెంటనే ఆమోదం తెలపాలని కూడా డిమాండ్ చేసింది. తద్వారా మునుపటి లాగే విద్యార్థులకు ప్లస్-2 పబ్లిక్ పరీక్షల్లో వచ్చే మార్కుల ఆధారంగా వైద్య కోర్సుల్లో ప్రవేశం కల్పించే పాతపద్ధతిని అమలు చేసేందుకు మార్గం సుగమం చేయాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ శుక్రవారం ప్రతిపాదించిన తీర్మానాన్ని అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది.

హేమంత్ సోరెన్‌కు బెయిల్



భర్త సోరెన్‌కు స్వాగతం పలుకుతున్న కల్పన

రాంచీ, జూన్ 28: భూ కుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై అరెస్టయి జైల్లో ఉన్న ఝార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్‌కు ఊరట లభించింది. ఈ కేసులో ఝార్ఖండ్ హైకోర్టు శుక్రవారం ఆయనకు బెయిలు మంజూరు చేసింది. భూ కుంభకోణంలో మనీలాండరింగ్ ఆరోపణలపై ఝార్ఖండ్ సీఎం, ఝార్ఖండ్ ముక్తి మోర్చా కార్యనిర్వాహక అధ్యక్షుడైన సోరెన్‌ను ఈ ఏడాది జనవరి 31న ఈడీ అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఆయన బిర్సా ముండా జైల్లో ఉన్నారు. ఈ కేసులో బెయిల్ కోసం సోరెన్ పలు న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఎన్నికల వేళ ప్రచార నిమిత్తం బెయిల్ ఇవ్వాలని సుప్రీంకోర్టును కోరినప్పటికీ ఉపశమనం లభించలేదు. బెయిలు పిటిషన్‌పై విచారణ జరిపిన ఝార్ఖండ్ హైకోర్టు ఈ నెల 13న తీర్పును రిజర్వ్ చేసింది. శుక్రవారం బెయిలు మంజూరు చేస్తూ జస్టిస్ రొంగొన్ ముఖోపాధ్యాయ తీర్పు ఇచ్చారు. రూ.50 వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించారు. "ప్రాథమిక ఆధారాల పరంగా ఆయన ఏ నేరానికీ పాల్పడలేదు. బెయిల్‌పై ఉన్నప్పుడు నేరం చేసే అవకాశాలు కూడా లేవని కోర్టు గుర్తించింది. అందుకే ఆయనకు బెయిల్ ఇస్తున్నాం" అని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ఈ తీర్పు అమలుపై 48 గంటల పాటు స్టే ఇవ్వాలని, తాము సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్న ఈడీ తరఫు న్యాయవాది అభ్యర్థనను న్యాయమూర్తి తిరస్కరించారు. దీంతో, బిర్సా ముండా జైలు నుంచి హేమంత్ సోరెన్ విడుదలయ్యారు. సోరెన్‌కు బెయిలు లభించడంపై హర్షం వ్యక్తం చేసిన ఝార్ఖండ్ సీఎం చంపయి సోరెన్ 'నిజం గెలిచింది' అన్నారు.

లోకం తీరు



తిరిగి పవార్ గూటికి అజిత్ వర్గం ఎమ్మెల్యేలు?

» 22 మంది జంప్‌నకు చాన్స్



ముంబై, జూన్ 28: మహారాష్ట్రలో శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్నవేళ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)లో భారీ సంక్షోభం నెలకొనే సంకేతాలు కనిపిస్తున్నాయి. అజిత్ పవార్ వర్గానికి చెందిన చాలా మంది ఎమ్మెల్యేలు శరద్ పవార్ శిబిరంలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని, ఇప్పటికే వారు ఎన్సీపీ (ఎస్పీ) తలుపులు తట్టారని తెలుస్తోంది. అయితే వారిలో ఎంత మందిని చేర్చుకోవాలన్న దానిపై శరద్ పవార్ ఇంకా నిర్ణయం తీసుకోలేదని సమాచారం. 22 మంది ఎన్సీపీ ఎమ్మెల్యేలు ఎన్సీపీ (ఎస్పీ)ని సంప్రదించారని ఎన్సీపీ (ఎస్పీ) ఎమ్మెల్యే రోహిత్ పవార్ చెప్పారు. వీరంతా శరద్ పవార్ శిబిరంలో చేరాలనుకుంటున్నారని, అయితే వారి విషయంలో ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆయన పేర్కొన్నారు. కాగా శరద్ పవార్ వారందరినీ పార్టీలో చేర్చుకునే అవకాశంలేదని, 10 నుంచి 12 మందికి మాత్రమే ఆహ్వానం పలకవచ్చని తెలుస్తోంది. అజిత్ పవార్ రాజకీయ ప్రాధాన్యాన్ని తగ్గించాలని బీజేపీ భావిస్తున్నట్టు ఉందని రోహిత్ తెలిపారు. ప్రతిపక్షం ఓట్లను చీల్చే వ్యూహంలో భాగంగా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్సీపీని వేరేగా పోటీ చేయించాలని బీజేపీ అనుకుంటూ ఉండవచ్చన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీలో 288 సీట్లు ఉన్నాయి. అయితే ఇందులో 20 సీట్లు మాత్రమే అజిత్ పవార్‌కు బీజేపీ ఇవ్వవచ్చని ఆయన చెప్పారు. మరోవైపు అజిత్ పవార్ వర్గానికి చెందిన ఏడుగురు ఎమ్మెల్యేలు ఎన్సీపీ ఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు జయంత్ పాటిల్‌ను కలిశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్సీపీ (ఎస్పీ) సాధించిన విజయం నేపథ్యంలో ఈ పార్టీ వైపు ఎన్సీపీ ఎమ్మెల్యేలు దృష్టిసారించారు. వీరిలో చాలా మంది అసెంబ్లీ ఎన్నికలకు ముందే తిరిగి రావాలనుకుంటున్నారని మరో నేత తెలిపారు

కంపెనీలోనూ సగం!

ఉద్యోగం మానేసి ఇంట్లో ఉండి పిల్లలను చూసుకోవాలని భార్యను అడిగిన ఓ భర్త

అతడి కంపెనీలో 50% వాటా కోరిన భార్య

ఆమె కోరిక మేరకు 49% వాటా ఇచ్చిన భర్త

న్యూయార్క్, జూన్ 28: మహిళల గురించి చెప్పాల్సి వస్తే.. 'ఆకాశంలో సగం' అని కవితాత్మకంగా చెప్తాంగానీ.. వాస్తవంగా అలాంటి పరిస్థితి కనిపించడం చాలా అరుదు! సంసారంలో ఏ కష్టం వచ్చినా భార్యే సర్దుకుపోవాలని చెప్పేవాళ్లే ఎక్కువ. కానీ, ఆ రోజులు మారుతున్నాయి. సర్దుకుపోవడానికి కూడా ఒక పద్ధతి ఉండాలని నిరూపించిందో మహిళ. తన పేరు వెల్లడించకుండా.. తనకు వచ్చిన సందేహం గురించి ప్రముఖ సామాజిక మాధ్యమం రెడిట్‌లో వెల్లడించిందామె. "మాకు పెళ్లయి ఆరేళ్లయింది. ఇద్దరు పిల్లలున్నారు. నేను మళ్లీ గర్భం దాల్చాను. దీంతో నా భర్త నన్ను ఉద్యోగం మానేసి ఇంట్లోనే ఉండి పిల్లలను చూసుకోవాలని కోరాడు. ఆ ప్రతిపాదనతో నేను కలత చెందాను. అతడి కంపెనీలో 50% వాటా నాకు ఇస్తే ఉద్యోగం మానేసి ఇంట్లో ఉండి పిల్లలను చూసుకోవడానికి సిద్ధమని చెప్పాను. ఎందుకంటే.. నేను ఉద్యోగం మానేసి ఎంత ఎక్కువ కాలం ఇంట్లో ఉంటే నాకు మళ్లీ మంచి ఉద్యోగం వచ్చే అవకాశాలు అంత తగ్గిపోతాయి. భవిష్యత్తులో ఎప్పుడైనా విడాకులు తీసుకుంటే నాకు అన్యాయం జరుగుతుంది. అందుకే 50% వాటా అడిగాను. నేను చేసింది తప్పా?" అని ఆమె రెడిట్‌లో పోస్టు చేసింది. ఆ పోస్టు ట్విటర్‌లో సైతం వైరల్ అయ్యింది. వేలాది మంది ఆమెకు మద్దతుగా నిలిచారు. ఆమె చేసింది తప్పు కాదని.. సరిగ్గా ఆలోచించిందని చెప్పారు. ఆ తర్వాత కొద్దిరోజులకు.. 'నా భార్యకు నా కంపెనీలో 49% వాటా ఇచ్చాను' అంటూ రెడిట్‌లోనే ఆమె పోస్టు కిందే ఆమె భర్త సమాధానం ఇవ్వడంతో.. సరైన నిర్ణయం తీసుకున్నావంటూ అందరూ అతణ్ని అభినందించారు.

ఢిల్లీ మునక!

» 24 గంటల్లో 22.81 సెంటీమీటర్ల వర్షం

» 88 ఏళ్ల తర్వాత ఇదే అత్యధికం

న్యూఢిల్లీ, జూన్ 28: మొన్నటిదాక నీటి కొరతతో అల్లాడిన ఢిల్లీ నేడు భారీ వర్షాలతో అతలాకుతలం అవుతోంది! రికార్డు స్థాయి వర్షపాతంతో దేశ రాజధాని ప్రాంతం మోకాలు లోతు నీటిలో మునిగింది..! ఇళ్లలోకి.. రోడ్లపైన వరద.. ఎక్కడికక్కడ భారీగా ట్రాఫిక్ జామ్‌లు.. విద్యుత్తు సరఫరా నిలిపివేతతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది! సఫ్దర్ జంగ్‌లో గురువారం ఉదయం 8.30 నుంచి 24 గంటల వ్యవధిలో 22.81 సెంటీమీటర్ల వర్షం కురిసింది. 1936 తర్వాత ఇదే అత్యధికం కావడం గమనార్హం. ఆ ఏడాది జూన్‌లో ఒక్క రోజులో 23.55 సెంటీమీటర్ల వర్షం కురిసింది. కాగా, గురువారం రాత్రి 3 గంటల్లోనే 14.85 సెంటీమీటర్ల వాన పడింది. జూన్ నెలలో ఢిల్లీ సగటు వర్షపాతం 8.60 సెంటీమీటర్లు మాత్రమే. తాజాగా దీనికి మూడు రెట్లు వాన ఒక్క రోజులోనే పడింది. నోయిడాలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. వాన ముంచెత్తడంతో స్థానికులు నడుము లోతు నీటిలో నడుస్తూ కనిపించారు. ఢిల్లీ ప్రభుత్వం అత్యవసర సమావేశం నిర్వహించి పరిస్థితిని సమీక్షించింది.

ఎయిర్‌పోర్ట్‌లో టెర్మినల్ కూలి ఒకరి మృతి

శుక్రవారం ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం టెర్మినల్-1 డిపార్చర్ ప్రాంతంలోని పైకప్పు కొంత భాగం కూలి.. కార్లపై పడింది. దీంతో ఒక వ్యక్తి మృతిచెందాడు. 8 మందికి గాయాలయ్యాయి. పౌర విమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు విమానాశ్రయానికి వచ్చి ప్రమాదం పరిస్థితిని స్వయంగా పర్యవేక్షించారు. కాగా, మురుగు కాల్వలు, నాలాల్లో చెత్త తరలించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని నిరసిస్తూ ఢిల్లీ బీజేపీ కౌన్సిలర్ రవీందర్ సింగ్ నేగి వరదలో బోటు వేసుకుని పలు ప్రాంతాల్లో పర్యటించారు. మథుర రోడ్‌లోని మంత్రి అతిశీ ఇంట్లోకి నీరు చేరిన ఫొటోలను బీజేపీ సోషల్ మీడియాలో షేర్ చేసింది. కిషన్‌గంజ్‌లోని కొడియా బ్రిడ్జి అండర్ పాస్ వద్ద ఓ బస్సు వరదలో చిక్కుకుంది. రెస్క్యూ సిబ్బంది వచ్చి లైఫ్ జాకెట్లు అందించి, తాడుతో ప్రయాణికులను రక్షించారు. ఢిల్లీతో పాటు శుక్రవారం జబల్పూర్ విమానాశ్రయంలోనూ కప్పు కూలింది. దీంతో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే తీవ్రంగా స్పందించారు.

ఎంపీ రాంగోపాల్ యాదవ్‌ను ఎత్తుకొచ్చిన సిబ్బంది

పార్లమెంటు సమావేశాల కోసం ఢిల్లీ వచ్చిన కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్, ఎస్పీ ఎంపీ రాంగోపాల్ యాదవ్‌లకు వర్షాలు భిన్న అనుభవాన్ని చూపాయి. వీరి నివాసాలను వరద ముంచెత్తింది. లోధి ఎస్టేట్‌లోని రాంగోపాల్ ఇంటిని నీరు చుట్టుముట్టింది. పార్లమెంటుకు వెళ్లాల్సి ఉండడంతో అతికష్టమ్మీద బయటకొచ్చారు. ప్యాంట్ మడిచి, బూట్లు చేతిలో పట్టుకున్న ఆయన్ని సిబ్బంది ఎత్తుకుని తీసుకొచ్చి కారులో కూర్చోబెట్టారు. రెండ్రోజుల క్రితమే ఫ్లోరింగ్ వేయించానని, అంతా పాడైందని రాంగోపాల్ తెలిపారు. నిద్ర లేచి చూసేసరికి గదులన్నీ నీటితో నిండిపోయాయని, ఫర్నీచర్‌తో పాటు నేలపై ఉన్న వస్తువులు తడిచిపోయాయని థరూర్ వాపోయారు. డ్రైనేజీలు మూసుకుపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందన్నారు.



పైకప్పు ఘటనపై వార్ రూం: కేంద్రం

ఢిల్లీ ఎయిరుపోర్టు ఘటనపై కేంద్ర విమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం సమీక్ష సమావేశం జరిగింది. అనంతరం పౌరవిమానయాన శాఖ అధ్వర్యంలోని భారత విమానశ్రయాల ప్రాధికార సంస్థ అన్ని విమానశ్రయాల నిర్మాణాలను క్షుణంగా తనిఖీ చేసి 2-5 రోజులలో నివేదిక అందించాలని ఆదేశాలు జారీ చేసింది. విమానాల రద్దుతో విమానయాన సంస్థలు రేట్లు పెంచకుండా, సేవలందించేందుకు 24 గంటలు అందుబాటులో ఉండే వార్ రూం ఏర్పాటు చేయాలని పౌరవిమానయాన శాఖ నిర్ణయించింది. ఎయిరుపోర్టు ప్రమాదంపై ప్రాథమిక దర్యాప్తునకు ఐఐటీ ఢిల్లీ ఇంజనీర్ల బృందాన్ని నియమించారు.

ఈ బైడెన్ మాకొద్దు!

'అధ్యక్ష' అభ్యర్థి మార్పునకు డెమోక్రాట్ల పట్టు

» ట్రంప్‌తో చర్చలో అధ్యక్షుడి తడబాటు

» 81 ఏళ్ల వయసులో ఆయనకు అభ్యర్థిత్వం ఎందుకని సొంత పార్టీలోనే ఆగ్రహం





వాషింగ్టన్, జూన్ 28: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో అధ్యక్షుడు జో బైడెన్ (81) అభ్యర్థిత్వం డోలాయమానంలో పడింది. మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్(78)తో గురువారం రాత్రి (భారత కాలమానం ప్రకారం శుక్రవారం) జరిగిన ప్రథమ చర్చలో.. పలు ప్రశ్నలకు జవాబులివ్వలేక తడబడిపోయారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం, వలసలు, ఎకానమీ తదితర అంశాలకు సంబంధించి తన డెమోక్రాటిక్ పార్టీ విధానాలు, నిర్ణయాలపై సమర్థంగా వాదన వినిపించలేకపోయారు. ట్రంప్ మాత్రం ఆత్మవిశ్వాసంతో జవాబులిచ్చారు. తన పాలసీలను విడమరచి చెప్పగలిగారు. దీంతో బైడెన్ రెండోసారి గెలవడం అనుమానంగా మారింది. దరిమిలా ఆయన్ను పోటీ నుంచి తప్పించేందుకు పాలక డెమోక్రాటిక్ పార్టీలో పెద్దఎత్తున మంతనాలు జరుగుతున్నాయి. అంతేకాదు.. ఆ పార్టీకి భారీ విరాళాలిచ్చిన దాతలు సైతం అభ్యర్థి మార్పును కోరుతుండడంతో సీనియర్ డెమోక్రాట్లకు ఏంచేయాలో పాలుపోవడం లేదు. వాస్తవానికి బైడెన్ రెండోసారి బరిలో నిలుస్తానని ప్రకటించినప్పుడే పార్టీలో వ్యతిరేకత వ్యక్తమైంది. బైడెన్‌కు జ్ఞాపక శక్తి మందగించింది. తరచూ వేదికపై తడబడుతుండడం, ఎవరో ఒకరి ఆసరా లేకుండా మాట్లాడలేకపోవడం తదితరాల నేపథ్యంలో వేరే అభ్యర్థిని ఎంచుకుందామని పలువురు సీనియర్లు అప్పట్లోనే పట్టుబట్టారు. 81 ఏళ్ల వయసులో ఆయన గౌరవప్రదంగా వైదొలగి.. సమర్థ నేతకు అవకాశమివ్వాలని వాదించారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల పోలింగ్ ఈ ఏడాది నవంబరు 5న జరుగనుంది. పోటీచేసే ప్రధాన పార్టీల అభ్యర్థులు పలువురు ప్రముఖులు, సీనియర్ జర్నలిస్టుల సమక్షంలో బహిరంగ చర్చలో పాల్గొనడం రివాజు. గతంలో మూడుసార్లు ఈ చర్చలు జరిగేవి. ఈసారి ట్రంప్, బైడెన్ రెండింటికే అంగీకరించారు.

అబద్ధాల ట్రంప్..

డిబేట్‌లో ట్రంప్ కూడా గొప్పగా మాట్లాడిందేమీ లేదని.. ఎప్పటిలాగే అబద్ధాలు చెప్పారని.. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. సత్యం తనవైపే ఉన్నప్పటికీ.. వయోభారం కారణంగా బైడెన్ తడబడ్డారని తెలిపారు. గత ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని, ఆ సమయంలో క్యాపిటల్ హిల్‌పై దాడిలో తన ప్రమేయం ఏమీ లేదని ట్రంప్ మొండిగా వాదించారు.

తనకు తానుగా తప్పుకొంటేనే..

శుక్రవారం నాటి చర్చ సీఎన్ఎన్ ఆధ్వర్యంలో జరుగగా.. త్వరలో జరిగే రెండో చర్చను 'ఏబీసీ న్యూస్' నిర్వహించనుంది. శుక్రవారం చర్చలో బైడెన్ వయోభారంతో గలగలా మాట్లాడలేకపోయారు. పోడియం వద్దకు వెళ్లేప్పుడే బలహీనంగా వణుకుతూ కనిపించారు. దీంతో, చర్చ మొదలైన కొద్ది నిమిషాలకే డెమోక్రాట్లలో ఆందోళన చెలరేగింది. అయితే డెమోక్రాట్లే తమ అభ్యర్థిని మార్చాలని డిమాండ్ చేస్తున్నా.. బైడెన్ తనంతట తాను వైదొలిగితే తప్ప ఈ సమయంలో అదంత తేలిక కాదని విశ్లేషకులు అంటున్నారు. ఇప్పటికే ప్రతి రాష్ట్రంలో పార్టీ అభ్యర్థిని ఎన్నుకునే ప్రతినిధుల ఎంపిక కోసం జరిగే ప్రైమరీ ఎన్నికలు పూర్తయిపోయాయి. డెమోక్రాటిక్ పార్టీ నిబంధనల ప్రకారం.. రేసు నుంచి తాను వైదొలుగుతున్నట్లు బైడెన్ స్వయంగా చెబితే తప్ప.. వీరంతా ఆయనకే మద్దతివ్వాల్సి ఉంటుంది. అయితే అధ్యక్షుడు అందుకు సుముఖంగా లేరు.

తిరుమల ఘాట్ రోడ్డులో ఏనుగుల కలకలం



తిరుమల ఘాట్‌లో రోడ్డు సమీపానికి వచ్చిన ఏనుగుల గుంపు

తిరుమల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులో శుక్రవారం సాయంత్రం ఏనుగుల గుంపు హల్‌చల్ చేసింది. రోడ్డుకు అతి సమీపానికి ఏనుగులు రావడం కలకలం సృష్టించింది. మార్గంలోని ఏడవ మైలు వద్ద సుమారు ఏడు ఏనుగుల గుంపు రోడ్డు సమీపానికి వచ్చింది. చెట్లను విరుస్తూ ఘీంకారాలతో హల్‌చల్ చేయడం గమనించిన యాత్రికులు బెంబేలెత్తిపోయారు. తమకు ఏమైనా హాని కలిగిస్తాయోమోననే భయంతో వాహనాలు ఆపేశారు. దీంతో సుమారు రెండు కిలోమీటర్ల మేరకు వాహనాలు ఆగిపోయాయి. టీటీడీ ఫారెస్ట్, విజిలెన్స్ విభాగాల అధికారులు, సిబ్బంది ఘటనా ప్రాంతానికి చేరుకుని ఏనుగుల గుంపు అడవిలోకి వెళ్లిపోయేలా శబ్దాలు చేశారు. 20 నిమిషాల తర్వాత ఏనుగులు అడవిలోకి వెళ్లిపోవడంతో వాహనదారులు ఊపిరిపీల్చుకున్నారు. ఏటా ఇదే సమయానికి ఏనుగుల గుంపు నీటిని వెతుక్కునే క్రమంలో రోడ్డు సమీపానికి వస్తుంటాయని అధికారులు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో నిఘా పెంచడంతో పాటు వాహనదారులను కూడా అప్రమత్తం చేస్తామన్నారు.

ఎట్టకేలకు చిక్కిన చిరుతపులి

మహిళను చంపిన చిరుతగా ప్రాథమిక అంచనా

తిరుపతి జూకు తరలించిన అటవీశాఖ అధికారులు



శిరివెళ్ల, జూన్ 28: నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిలో నల్లమల అటవీ ప్రాంతంలోని పచ్చర్ల చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన బోనుకు ఓ చిరుత పులి చిక్కింది. . కట్టెల కోసం అడవిలోకి వెళ్లిన పచ్చర్ల గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ షేక్ మెహరున్నీసాపై ఈ నెల 25న చిరుతపులి దాడిచేసి హతమార్చిన విషయం తెలిసిందే. చిరుత తరచూ గ్రామ పరిసరాల్లో సంచరిస్తుండడంతో దాన్ని పట్టుకునేందుకు అటవీ శాఖ అధికారులు పలు చోట్ల బోన్లు, ట్రాప్ కెమెరాలను అమర్చారు. ఎట్టకేలకు పచ్చర్ల చెక్‌పోస్టు సమీపంలో ఏర్పాటు చేసిన బోనులో శుక్రవారం తెల్లవారుజామున ఓ చిరుత పులి చిక్కింది. ప్రస్తుతం బోనులో చిక్కిన చిరుత పులి.. మహిళపై దాడి చేసిన చిరుతగా అటవీశాఖ అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఐదు నుంచి ఆరు సంవత్సరాల వయసు కలిగిన ఈ చిరుతను తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర జూలాజికల్ పార్క్‌కు తరలించినట్టు ఎఫ్ఆర్‌వో ఈశ్వరయ్య వెల్లడించారు.

▸ అమెరికాలో తుపాకీ కాల్పుల్లో మృతి చెందిన బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం యాజలికి చెందిన దాసరి గోపికృష్ణ మృతదేహం శుక్రవారం స్వగ్రామానికి చేరుకోగా, అంత్యక్రియలు నిర్వహించారు. అతని తల్లిదండ్రులు ధనలక్ష్మి, శ్రీనివాసరావు, భార్య ప్రవల్లికను ఎమ్మెల్యే నరేంద్రవర్మ ఓదార్చారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
సుమారు రూ.187.00 లక్షల విలువ గల ఎనిమిది పనులకు నిట్ నెం.05-12/TO/Tenders/2024-25, dated: 26.06.2024 ద్వారా టెండర్లు ఆహ్వానించటమైనది. పూర్తి వివరములు ఇ-ప్రొక్యూర్మెంట్ మార్కెట్ ప్లేస్ www.apeprocurement.gov.in లో చూడగలరు. టెండర్లు దాఖలు చేయుటకు చివరి తేది: 11.07.2024 వరకు.
సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, (ర.భ) విభాగము, బాపట్ల
DIPR R.O.No.13622/CL/ADVT/1/1/2021-22, తేది: 28.06.2024

VIJAYAWADA MUNICIPAL CORPORATION (VMC)
'E' Procurement Notice No.04/VMC/CDB/2024-25, Dt.28-06-2024
Roads, HDPE, Water supply, UGD lines, outfall drains, sewer pumping main(Total.21 works)-Est. Amount.415.03 Lakhs. All rights are reserved to the Commissioner to Cancel or Reject the tenders without assigning any reasons there of Further details and any corrigendum can be seen@www.tender.apeprocurement.gov.in
Sd/- FOR COMMISSIONER

ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్
సిడిఎస్ బిల్డింగ్, గవర్నమెంట్ హాస్పిటల్ ప్రిమిసెస్, ఎస్.ఆర్.పేట, ఏలూరు, ఏలూరు జిల్లా, ఫోన్ నం.9440075931, ఇ-మెయిల్: seapmsidceluru@gmail.com
టెండరు ప్రకటన నం. 02/APMSIDC/SE-ELR/PA/TA/2024-25, Dt.28.06.2024
తూర్పు గోదావరి జిల్లాలోని రిపేర్లు, పునరుద్ధరణ పనులు (6 పనులు) మరియు ఎన్‌టిఆర్ జిల్లాలోని ఎస్ఎమ్‌సి, విజయవాడ వద్ద రిపేర్లు మరియు పునరుద్ధరణ పనులు (2 పనులు), మొత్తం 8 పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫాంల ద్వారా ఇ-టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం ఇసివి రూ. 5,30,30,037/-, తదితర వివరాలకు http://www.tender.apeprocurement.gov.in వద్ద చూడగలరు, తదితర వివరాలకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, APMSIDC ఎన్‌టిఆర్ జిల్లా 8978680814 మరియు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, APMSIDC, కాకినాడ 9848615292 వారిని సంప్రదించగలరు.
సం./-సూపరింటెండింగ్ ఇంజనీర్, APMSIDC సర్కిల్, ఏలూరు
DIPR R.O. No. 3054 PP/CL/ADVT/1/1/2021-22, Dt: 28.06.2024

మదర్సాలో విద్యార్థిని అనుమానాస్పద మృతి

▸ **తమ కుమార్తెను చంపేశారని తల్లిదండ్రుల ఆరోపణ**

▸ **విజయవాడ ప్రభుత్వాస్పత్రి మార్చురీ వద్ద ఆందోళన**

▸ **ఫుడ్ పాయిజన్ జరిగిందంటున్న నిర్వాహకులు**

▸ **అధికారుల తనిఖీల్లో 100 కిలోల కుళ్లిన మాంసం గుర్తింపు**



కరిష్మా

విజయవాడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లో ఉన్న మదర్సాలో ఓ విద్యార్థిని అనుమానాస్పదంగా మృతి చెందింది. ఫుడ్ పాయిజన్ కావడం వల్లే ఆమె చనిపోయిందని నిర్వాహకులు చెబుతున్నారు. ఎంకే బేగ్ స్కూల్ వద్ద నిస్వాన్ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సయ్యద్ షాహిద్ పర్వేజ్ అనే వ్యక్తి జావియా హైదయాతుల్ వనాద్ మదర్సాను నిర్వహిస్తున్నాడు. ఖమ్మం, గుంటూరు, ఏలూరు, కృష్ణా జిల్లాలకు చెందిన 60 మంది విద్యార్థినులు ఇక్కడ ఉంటున్నారు. ఈ క్రమంలో గుడివాడకు చెందిన కరిష్మా(17) శుక్రవారం ఉదయం కళ్లు తిరిగి పడిపోయింది. ఆమెను వెంటనే విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. దీనిపై అధికారులు ఆరా తీయగా ఫుడ్ పాయిజన్ జరిగిందని నిర్వాహకుడు వెల్లడించాడు. గురువారం రాత్రి ఫుడ్ పాయిజన్ కావడంతో మొత్తం ఎనిమిది మంది వాంతులు చేసుకున్నారని, స్థానికంగా ఉన్న ఆర్ఎంపీ వైద్యుడ్ని తీసుకొచ్చి మందులు ఇప్పించామని నిర్వాహకులు చెబుతున్నారు. కరిష్మా చనిపోయిన తర్వాత ఏడుగురు విద్యార్థినులు ఆసుపత్రికి తీసుకొచ్చారు. వారితో జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ సుహాసిని, ఫుడ్ సేఫ్టీ అధికారి గౌస్ మాట్లాడారు. వారు మాత్రం తమకు ఎలాంటి వాంతులు కాలేదని చెప్పారు. ఈ నెల 26న వాంతులు అయినట్టు కొందరు తెలిపారు. వారిని ఆసుపత్రిలో చేర్పించి పరిశీలనలో ఉంచాలని డీఎంఅండ్‌హెచ్‌వో వైద్యులను ఆదేశించారు. ఫుడ్‌పాయిజన్ అని చెప్పడంతో మదర్సాలో అధికారులు తనిఖీలు చేసి.. ఫ్రిజ్‌లో 100 కిలోల కుళ్లిన మటన్, బీఫ్‌ను గుర్తించారు. ఐస్ గడ్డకట్టిన మాంసాన్ని బయటకు తీయగానే దుర్వాసన వచ్చింది. ఈ మాంసం గురించి ప్రశ్నించగా బక్రీద్ పండుగ సందర్భంగా దాతలు ఇచ్చారని నిర్వాహకులు వివరించారు. కరీష్మా మృతదేహానికి ప్రభుత్వాసుపత్రి మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించారు. సమాచారం తెలుసుకున్న వెంటనే గుడివాడ నుంచి ఆమె తల్లిదండ్రులు విజయవాడ ఆసుపత్రికి చేరుకుని తమ కుమార్తెను చంపేశారని ఆరోపించారు. ఆసుపత్రి మార్చురీ వద్ద ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న ఇతర విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చి తమ పిల్లలను మదర్సా నుంచి తీసుకెళ్లిపోయారు.

మార్కెట్ యార్డులకు పర్సన్ ఇన్‌చార్జిలు

అమరావతి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులకు గత ప్రభుత్వంలో నామినేట్ అయిన పాలకవర్గాల రాజీనామాలను ప్రభుత్వం ఆమోదించింది. ఆ పాలకవర్గాల స్థానంలో అధికారులను పర్సన్ ఇన్‌చార్జిలను నియమించాలని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌ను ఆదేశిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే వివిధ జిల్లాల్లో 21 యార్డుల పాలకవర్గాలు రాజీనామా చేయకపోవడంతో వారి పదవుల్ని నిలిపివేసింది. ఆ యార్డులకు కూడా పర్సన్ ఇన్‌చార్జిలను నియమించాలని మరో ఉత్తర్వులో ప్రభుత్వం స్పష్టం చేసింది.

వ్యాపార కేంద్రంగా తిరుమల శారదామఠం

ఆక్రమణలను కూల్చకపోతే ప్రాణత్యాగాలకైనా సిద్ధం

ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి



తిరుమలలో శారదా మఠం నిర్మిస్తున్న ఆరంతస్థుల భవనాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాసానంద తదితరులు

తిరుమల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని శారదామఠంలో ఆక్రమణలను కూల్చపోతే ప్రాణత్యాగాలకైనా సిద్ధమేనని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు, ఆనందాశ్రమ పీఠాధిపతి శ్రీనివాసానంద సరస్వతి హెచ్చరించారు. శ్రీనివాసానంద సరస్వతి ఆధ్వర్యంలో ఏపీ సాధు పరిషత్ స్వామిజీలు శుక్రవారం తిరుమలకు చేరుకుని శారదామఠంలోని నిర్మాణాలను పరిశీలించారు. ముందు, వెనుకభాగాలతో పాటు బేస్మెంట్‌ను కూడా తనిఖీ చేశారు. అనంతరం శ్రీనివాసానంద సరస్వతి మీడియాతో మాట్లాడారు. శారదా పీఠాధిపతినని చెప్పుకుంటూ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టానుసారం మఠంలో నిర్మాణాలు చేపట్టారన్నారు. మఠం వెనుకభాగంలోని 80 అడుగుల కాలవను పూడ్చి 20 అడుగులకు కుదించేశారన్నారు. ఐదు వేల చదరపు అడుగుల వరకు మాత్రమే నిర్మాణాలు ఉండాలనే నిబంధన ఉన్నప్పటికీ అదనంగా మరో రెండు వేల చదరపు అడుగులు ఆక్రమించి కట్టడాలు నిర్మించారని టీటీడీ అధికారులే చెప్పారన్నారు. ఇందుకోసం వందలాది చెట్లను కూడా కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు అంతస్తులే ఉండాలనే నిబంధన ఉన్నప్పటికీ శారదా మఠంలో ఆరు అంతస్తులు కట్టారని.. అనుకోకుండా ఏదైనా ప్రమాదం జరిగితే తప్పించుకునేందుకు వీలుగా సెట్‌బ్యాక్ కూడా లేకుండా నిర్మాణాలు చేపట్టారన్నారు. అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డితో ఉన్న అనుబంధాన్ని అడ్డుపెట్టుకుని ఇష్టానుసారం నిర్మాణాలు చేపట్టారని ఆరోపించారు. టీటీడీ చర్యలు చేపట్టకపోతే హిందూ సమాజంతో కలిసి తాము ముందుకొస్తామని హెచ్చరించారు. శారదామఠంలో ఒక్కరికైనా పిడికెడు అన్నం పెడుతున్నారా, ఏ పూజైనా చేస్తున్నారా అని ప్రశ్నించారు. తిరుమలలో యాగాలు, యజ్ఞాలు చేయమని మఠాలకు స్థలాలిస్తే గదుల ధరలు విపరీతంగా పెంచడంతో పాటు పెళ్లిళ్లు చేయిస్తూ వ్యాపార కేంద్రాలుగా మార్చేశారన్నారు. అధికారులు వచ్చేంత వరకు మౌనదీక్ష చేస్తామని స్వామిజీలు మఠం ముందు బైఠాయించారు. పోలీసులు, విజిలెన్స్ అధికారులు తప్ప ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారులు రాకపోవడంతో సుమారు రెండు గంటల పాటు మఠం ముందే కూర్చున్నారు. తర్వాత రెవెన్యూ అధికారులు వచ్చి మఠంలో జరిగిన అక్రమ కట్టడాలపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. వీలైనంత త్వరగా చర్యలు తీసుకోవాలని, లేకుంటే దేశంలో ఉన్న సాధువులందరినీ ఏకం చేసి నిరసన వ్యక్తం చేస్తామని స్వామిజీలు హెచ్చరించారు. ఈ సందర్భంగా జనసేన నాయకుడు కిరణ్‌రాయల్ వారి వద్దకు వచ్చి మద్దతు తెలిపారు.

విద్యార్థుల్లో.. విద్యార్థిగా..!

▸ **పాగోలు ఎన్టీఆర్ మోడల్ స్కూల్ సందర్శించిన భువనేశ్వరి**

▸ **వసతులపై ఆరా.. విద్యార్థినులతో కలిసి భోజనం**



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న నారా భువనేశ్వరి

చల్లపల్లి/భట్టిప్రోలు, జూన్ 28: ఎన్నికల సందర్భంగా సేవా కార్యక్రమాలకు కాస్త విరామం ఇచ్చిన సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి.. మరలా ఎన్టీఆర్ ట్రస్ట్ కార్యక్రమాలపై దృష్టిపెట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం పాగోలులోని ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌ను ఆమె సందర్శించారు. అక్కడ విద్యార్థులతో మాట్లాడారు. తరగతి, హాస్టల్ గదులను సందర్శించి అక్కడున్న వసతులను పరిశీలించారు. భోజనశాలలో పిల్లలతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. అనాధలు, తల్లిదండ్రులను పోగొట్టుకున్న టీడీపీ కార్యకర్తల పిల్లలకు ఇక్కడి స్కూల్‌లో చదువు చెబుతున్నామని తెలిపారు. ఇక్కడ చదివిన భవ్యసాయి అనే విద్యార్థిని ఇటీవల పదో తరగతి పరీక్షల ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించినట్టు చెప్పారు. కాగా.. బాపట్ల జిల్లా భట్టిప్రోలులోని హెరిటేజ్ పాల శీతలీకరణ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. హెరిటేజ్ సంస్థకు పాలు పోసే ప్రతి రైతు లబ్ధి పొందడమే లక్ష్యంగా సంస్థ పని చేస్తుందన్నారు.


దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayIndia ద.మ. రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును
ఇ-వేలం ప్రకటన నం.
BZA-02-2024-25 తేది:28.06.2024
PUB/0625
భారత రాష్ట్రపతి తరఫున, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ వారు డివిజన్‌పై పే అండ్ యుజ్ టాయిలెట్ల కాంట్రాక్టుల కొరకు ఐఆర్ఇపిఎస్ ఇ-వేలం లీజింగ్ మాడ్యూల్ : www.ireps.gov.in ద్వారా 18 సంవత్సరాలు పైబడిన భారత పౌరులు మరియు కంపెనీలు/ సంస్థల నుండి ఇ-వేలం కోరుచున్నారు. ఇ-వేలం షెడ్యూలు దిగువ వివరించబడింది.వేలంలో ఆఫరు చేయబడిన అసెట్స్ వివరాలను IREPS వెబ్‌సైట్‌లో చూడవచ్చును.

కాంట్రాక్టు రకం	వేలంలో ఆఫర్ చేయు లాట్ల సంఖ్య	వేలం షెడ్యూల్ తేదీ మరియు ప్రారంభ సమయం
పే అండ్ యుజ్ టాయిలెట్ల కాంట్రాక్టులు	11 పే అండ్ యుజ్ టాయిలెట్లు అనగా తెనాలి, గుడివాడ, కాకినాడ పోర్ట్, కాకినాడ టౌన్, నిడదవోలు, అన్నవరం,భీమవరం జంక్షన్, గోదావరి, మచిలీపట్నం, విజయవాడ నమ్మ-పిఎఫ్ నం.10 విజయవాడ తారాపేట్ రైల్వేస్టేషన్లు.	04.07.2024న 10.00గం.లకు
క్లోక్ రూమ్‌లు	2 క్లోక్ రూమ్‌లు అనగా విజయవాడ పిఎఫ్ నం. 6&7, గూడురు రైల్వేస్టేషన్లు	04.07.2024న 10.00గం.లకు
పార్కింగ్	పిఠాపురం,వేటపాలెం, నిడుబ్రోలు, మచిలీపట్నం, చీరాల మరియు వేదాయపాలెం రైల్వేస్టేషన్లు (6 స్టేషన్లు) వద్ద పార్కింగ్ స్టాండ్ కాంట్రాక్టులు.	05.07.2024న 11.00గం.లకు

1. ఇ-వేలాలలో పాల్గొనుటకు డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్ పొందుట బిడ్డరు బాధ్యత.
2. బిడ్డరు ఎస్‌బిఐలో కరెంట్ అకౌంట్‌ను కలిగి ఉండవలెను మరియు అది IREPS లో ఇ-వేలం లీజింగ్ మాడ్యూల్‌తో లింక్ చేయబడి ఉండవలెను.
3. ఇ-వేలంలో పాల్గొనుటకు వన్ టైమ్ ఆన్‌లైన్ సెల్ఫ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి. భారతీయ రైల్వేలో ఏదేని డివిజన్‌లో ఏ వేలంలోనైనా పాల్గొనుటకు ఎటువంటి భౌగోళిక పరిమితులు లేవు.
4. పైన తెలిపిన ఇ-వేలాల తేదీలలో టైమ్ స్లాట్లు IREPS అప్లికేషన్ (www.ireps.gov.in) లో ఇ-వేలం లీజింగ్ మాడ్యూల్‌లో లభిస్తాయి. దయచేసి దీనిని గమనించి తదనుగుణంగా వేలంలో పాల్గొనగలరు.

ఇ-వేలం సమయంలో IREPS పోర్టల్ తలెత్తే ఏదేని అంతరాయానికి రైల్వే అడ్మినిస్ట్రేషన్ బాధ్యత వహించదు. బిడ్డర్లు ఇ-వేలం విధానాన్ని అర్థం చేసుకొనుటకు IREPS అప్లికేషన్ (www.ireps.gov.in) లోని హోమ్‌పేజీలో లెఫ్ట్ నేవిగేషన్ బార్‌లోని లెర్నింగ్ సెంటర్ లింక్ ద్వారా యూజర్ మాన్యువల్‌ను చూడవలసిందిగా మరియు తదనుగుణంగా పాల్గొనవలసిందిగా కోరబడుతున్నారు.
A0793
సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, విజయవాడ





ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

తొలి చర్చ

అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో ఉన్న జోబైడెన్, డొనాల్డ్ ట్రంప్ మధ్య జరిగిన ప్రెసిడెన్షియల్ డిబేట్‌లో బైడెన్ వెనుకంజవేశారని, ట్రంప్ పైచేయి సాధించారని విశ్లేషణలు సాగుతున్నాయి. మంచి మాటకారితనంతోపాటు, తోచింది అనేయడం, అబద్ధాన్ని అతికినట్టు చెప్పడం ఇత్యాది నైపుణ్యాలు ట్రంప్‌కు ఉన్నాయి కనుక, ఆయన దాడిమాటలు సహజంగానే వినడానికి బాగుంటాయి. తనకు దక్కిన సమయాన్ని ట్రంప్ తెలివిగా వాడుకొని బైడెన్‌మీద ఎదురుదాడిచేశారని, ఈయనేమో ఆత్మరక్షణలో పడిపోయి, తడబాటుకు గురైనారని, కొన్ని అంశాల్లో పొంతనలేకుండా మాట్లాడారని అమెరికన్ మీడియా అంటోంది. మాట్లాడుతున్న విషయాన్ని మధ్యలో వదిలేసి పూర్తిభిన్నమైన అంశాన్ని ప్రస్తావించడం వంటివి సైతం జరిగాయట. బైడెన్ జలుబుతో బాధపడుతున్నారని, గొంతులో జీరకు కారణమదేనని చర్చ మధ్యలో ఆయన పక్షాన మీడియాకు ఇచ్చిన వివరణను కూడా ఎక్కువ మంది మెచ్చలేదు. దీనికితోడు బైడెన్ ఏదో అర్థంపర్థంలేకుండా మాట్లాడుతున్నట్టుగా మధ్యమధ్యలో ట్రంప్ వ్యంగ్యాస్త్రాలు సరేసరి. ట్రంప్ పచ్చి అబద్ధాలాడుతున్నా, అసత్య ఆరోపణలు చేసినా బైడెన్ సరిగ్గా తిప్పికొట్టలేకపోయారని ఆయన పార్టీవారు మథనపడిపోతున్నారు. అమెరికా చరిత్రలో బాగా ముందుకు జరిగిన ఈ చర్చనుంచి ఎంతో లబ్ధిపొందవచ్చునని ఆశించిన బైడెన్ బృందం ఈ తొలిదశలో తీవ్రంగ ఆశాభంగం చెందిందని వార్తలు వస్తున్నాయి. దీనిని అదునుగా చేసుకొని, ఇప్పటికైనా బైడెన్‌ను తప్పించాలనీ, ఆయనబదులు ఫలానావారిని నిలబెడితే మంచిదనీ డెమోక్రాట్లకు చాలామంది ఉచిత సలహాలు ఇస్తున్నారు.

నూరుశాతం నిజాలతో, నిజాయితీగా ఈ అధ్యక్ష చర్చ జరగదు కానీ, అత్యున్నత స్థానానికి పోటీపడుతున్న ఇద్దరిమధ్య విభిన్నమైన అంశాలపై విస్తృత చర్చ జరగడమనే సంప్రదాయం ప్రశంసనీయమైనది. మొన్నటి మన సార్వత్రిక ఎన్నికల సందర్భంలో నరేంద్రమోదీ, రాహుల్ గాంధీ మధ్య ఇటువంటి చర్చనే కొందరు ప్రముఖులు ప్రతిపాదించారు. భావోద్వేగాలు రాజేసే వ్యాఖ్యలతో, ఊకదంపుడు ఉపన్యాసాలతో ఎన్నికల ప్రచారం జరగడం కంటే, దేశాన్ని కుదిపేస్తున్న, జనజీవితాలను ప్రభావితం చేస్తున్న కీలకమైన అంశాలపై అధినాయకుల మధ్య చర్చ జరగడం వల్ల అధికప్రయోజనం ఉంటుంది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఈ ప్రెసిడెన్షియల్ డిబేట్ ప్రభావం కాదనలేనిది. ఈ చర్చలో బైడెన్, ట్రంప్ పరస్పరం తీవ్ర విమర్శలు చేసుకున్నారు, వ్యక్తిగత విమర్శలకూ దిగారు. కానీ, దేశ ఆర్థికవ్యవస్థ, విదేశాంగ విధానం, వలసలు, అబార్షన్, గాజాయుద్ధం, కరోనా కష్టకాలం, సామాజిక భద్రత ఇత్యాది అంశాలమీద వారి అభిప్రాయాలను వారినోటినుంచే ప్రజలు విన్నారు.

బైడెన్, ట్రంప్ మధ్య వయసులో తేడా మూడేళ్ళు మాత్రమే. కానీ, బైడెన్ అడపాదడపా తన హావభావాలతో, చర్యలూ చేష్టలతో తన వయసును తెలియబరుస్తూంటారు. ఈ చర్చలో కూడా ఆయన ఆరంభంలో పేలవమైన ప్రదర్శనతో వెనుకబడినా, ఆ తరువాత పుంజుకున్నారు. కానీ, వయసు కారణంగా బైడెన్‌ను మెచ్చనివారి సంఖ్య ట్రంప్‌తో పోల్చితే రెట్టింపు ఉందట. ఈ దశలో తనకు తానుగా తప్పుకోవడం తప్ప, బైడెన్‌ను తప్పించడం ఆయన పార్టీకి కూడా సాంకేతికంగా సాధ్యం కాదు. ఆగస్టులో చికాగోలో జరిగే డెమోక్రాటిక్ పార్టీ కన్వెన్షన్‌లో ఒకవేళ ఆయన ఈ పనికి సిద్ధపడినా, పార్టీ డెలిగేట్లనుంచి మరొకరు ఆ స్థాయిలో మద్దతు కూడగట్టుకోవడం అంత సులభం కాదు. ఉపాధ్యక్షపదవికి పోటీపడుతున్న కమలా హారిస్ పేరు గట్టిగా వినిపిస్తున్నది కానీ, చాలా కారణాలవల్ల పార్టీ డెలిగేట్లు ఆమెను ఆ స్థానానికి ఆమోదించరు. పార్టీలో బైడెన్‌కు గట్టిపోటీ ఇవ్వగలిగేవారు లేకనే ఆయన సులభంగా ఇంతవరకూ రాగలిగారు. ఇప్పుడు కూడా పార్టీ లోలోపల భయపడుతున్నదే తప్ప, బైడెన్ తప్పుకోవాలన్న మాట బయటకైతే లేదు. ఈ తొలిదశ చర్చలో ఒకవేళ భంగపడినా, ఎన్నికలకు సరిగ్గా రెండునెలలముందు సెప్టెంబరులో జరిగే మలిదశ చర్చలో బైడెన్ పైచేయి సాధించి అమెరికన్ల మనసులో నిలిచిపోవచ్చునన్న ఆలోచనతోనే అధికారపక్షం ఈ చర్చను ముందుకు జరిపిందని అంటారు. సెప్టెంబర్ చర్చలో బైడెన్ దే పైచేయి కావచ్చును కానీ, ఇంతలోగా ఆయనను మరింత అప్రదిష్టపాల్జేసే ప్రయత్నాలైతే విపక్షం నుంచి తప్పవు. ట్రంప్, బైడెన్‌లో ఎవరు గెలిచినా అమెరికా చరిత్రలో అత్యంత వృద్ధ అధ్యక్షుడిని ఎన్నుకున్న కీర్తి ఈ మారు అమెరికన్లకు దక్కడం ఖాయం.

మార్పు మిథ్య, మోదీయే సత్యం!

నరేంద్ర మోదీ మూడో ప్రభుత్వం ఈ నెల 9న పదవీ ప్రమాణ స్వీకారం చేసింది. అయితే దాని ఆరంభం అంత ఆనందకరంగా లేదు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన మద్దతు నిచ్చిన టీడీపీ, జేడీ(యు) నాయకులతో కలిసి వేదికపై మోదీ ఆసీనులయ్యారు. ఆ పార్టీలకు, ఇతర మిత్ర పక్షాలకు వివిధ మంత్రిత్వ శాఖలు కేటాయించారు స్పీకర్ ఎన్నికకు సంబంధించి కూడా మిత్రపక్షాలతో ఆయన సంప్రదింపులు జరపవలసివచ్చింది. ఇరవై రెండు సంవత్సరాల నుంచి ప్రభుత్వాధినేతగా కొనసాగుతున్న మోదీకి ఆ రెండూ కొత్త అనుభవాలు.

మోదీ కొత్త ప్రభుత్వం కొలువుదీరిన ఇరవై రోజులలోనే దానికి అనేక పరాజయాలు సంభవించాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలో అవకతవకలు బహిర్గతమయ్యాయి. ఆ అక్రమాలకు బాధితులు అయిన లక్షలాది విద్యార్థులు వీధుల్లోకి వచ్చి తీవ్ర నిరసనలు తెలిపారు. జల్పాయిగురిలో ఘోర రైలు ప్రమాదం సంభవించింది. జమ్మూ–కశ్మీర్‌లో ఉగ్రవాద దాడులు కొనసాగుతున్నాయి. టొమాటో, పొటాటో, ఉల్లిపాయల ధరలు మరింతగా పెరిగాయి. నిజానికి ఏటేటా వాటి ధరలు పెరుగుతూనే ఉన్నాయి. సెన్సెక్స్, నిఫ్టీ మున్నెన్నడూ లేని రికార్డు స్థాయికి పెరిగాయి అయితే డాలర్–రూపాయి మారకం ధర ఎన్నడూ లేని స్థాయికి పడిపోయింది. టోల్ ట్యాక్స్‌ను 15శాతం పెంచారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అధినేత మోహన్ భాగవత్ అధికార దురహంకారాన్ని ప్రదర్శించిన వారిని మందలించారు. మోదీ సర్కారుకు ఇది స్పష్టమైన అభిశంసనే. సంఘ్ అధినేత అధిక్షేపణతో బీజేపీ నాయకత్వం తత్తరపడింది. అనవసర చిక్కులు తెచ్చుకోకుండా జాగ్రత్తగా ఉండడం మంచిదని నిర్ణయించుకున్నది.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

18వ లోక్‌సభ మొదటి సమావేశాలలో స్పీకర్ ఎన్నిక, రాష్ట్రపతి ప్రసంగం మినహా చెప్పుకోదగిన కార్యకలాపాలు ఏవీ జరగలేదు. అయినా దైనందిన కార్యకలాపాలు సైతం వివాదాస్పదమయ్యాయి. సంప్రదాయం ప్రకారం అత్యధిక పర్యాయాలు ఎన్నికైన వ్యక్తి కొత్త లోక్‌సభకు ప్రోటెమ్ స్పీకర్‌గా వ్యవహరిస్తారు. కొత్త సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయిస్తారు. సువ్యవస్థిత సంప్రదాయం ప్రకారం ఈ గౌరవం నిస్సందేహంగా కె. సురేష్‌కు లభించాలి. కేరళకు చెందిన ఈ కాంగ్రెస్ ఎంపీ ఒక్కసారి మినహా ఎనిమిది పర్యాయాలు లోక్‌సభకు ఎన్నికయ్యారు. అయితే ప్రభుత్వం ఒడిషాకు చెందిన బీజేపీ ఎంపీ భర్తృహరి మెహతాబ్‌ను ప్రోటెమ్ స్పీకరగా నామినేట్ చేసింది. ఆయన ఇప్పటికి 7 సార్లు (ఆరుసార్లు బిజూ జనతాదళ్ తరపున, ఇటీవలి ఎన్నికలల్లో బీజేపీ పక్షాన) లోక్‌సభకు ఎన్నికయ్యారు.

ప్రోటెమ్ స్పీకర్ ఎంపిక వివాదరహితంగా జరిగి ఉండవల్సింది. అయినా అది అనవసరంగా వివాదాస్పదమయింది. కారణమేమిటి? సంభావ్య సమాధానాలు: లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో ప్రభుత్వాధినేత వ్యవహారశైలిలో ఎటువంటి మార్పుకు దారితీయబోవని స్పష్టం చేయాలని అధికార పక్షం ఆశించడమే కావచ్చు. గతంలో మాదిరిగానే ఇప్పుడూ వ్యవహరిస్తాను అన్నది మోదీ అంతరంగం. అది ప్రోటెమ్ స్పీకర్ ఎంపికలో ప్రతిబింబించింది.



ఎన్నికల ఫలితాలతో ఏమీ మారలేదన్నది భారతీయ జనతా పార్టీ సునిశ్చితాభిప్రాయంగా కనిపిస్తోంది. చివరకు ప్రజల మనస్థితిలో కూడా ఎటువంటి మార్పు లేదని అధికార పక్షం గట్టిగా భావిస్తోంది.
కొత్త కేబినెట్, రాష్ట్రపతి ప్రసంగం ప్రజలకు తీవ్ర ఆశాభంగం కలిగించాయి. మరి బడ్జెట్ 2024–25 విషయంలోనైనా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం మేలుకొంటుందా?

స్పీకర్ ఎన్నిక ఎలా ముగిసినప్పటికీ మిగతా సభా కార్యకలాపాలపై దాని ప్రభావం ఉండనవసరం లేదు. అయితే గౌరవనీయ సభాపతి 49 సంవత్సరాల క్రితం (అవును 49 సంవత్సరాల, 50 ఏళ్లు కాదు) క్రితం అత్యయిక స్థితిని విధించినందుకు కాంగ్రెస్‌ను తీవ్రంగా తప్పుపడుతూ ఒక తీర్మానాన్ని ప్రతిపాదించారు. సరే, ఇక ముందు పార్లమెంటు 'బోధించే' చరిత్ర పాఠాలు ఏమై ఉంటాయో ఊహించగలరా? బహుశా అవి : పాకిస్తాన్ 1947లో కశ్మీర్‌లో కొంత భాగాన్ని ఆక్రమించుకోవడాన్ని ఖండించడం; 1962లో సరిహద్దు యుద్ధానికి చైనాను గర్హించడం; 1971లో ఇండియాను బెదిరించేందుకు అమెరికా విమాన వాహక యుద్ధ నౌకను పంపించడాన్ని ఖండించడం మొదలైనవి. చెప్పవచ్చిందేమిటంటే ఎమర్జెన్సీ విషయమై కాంగ్రెస్‌ను విమర్శిస్తూ స్పీకర్ స్వయంగా ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టడం సమర్థించజాలని కవ్వింపు. విపక్షాలను రెచ్చగొట్టేందుకే అలా చేశారనేది స్పష్టం.

పార్లమెంటు ఉభయ సభల సంయుక్త సమావేశంలో రాష్ట్రపతి ప్రసంగం సభా సభ్యతలను పునరుద్ధరించేందుకు ఒక అవకాశం. అయితే ఈ అవకాశం వ్యర్థమయింది. లోక్‌సభలో మారిన పరిస్థితులను రాష్ట్రపతి ప్రసంగం గుర్తించి ఉండవలసింది. పాలక పక్షానికి మెజారిటీ కంటే 32 సీట్లు తక్కువగా లభించడం, ప్రధానమంత్రి ఒక సంకీర్ణ ప్రభుత్వ Primus inter Pares (సమానులలో ప్రథముడు) కావడం, పదేళ్ల అనంతరం లోక్‌సభలో ఒక అధికారిక ప్రతిపక్ష నాయకుడు ఉండడం మొదలైనవి స్పష్టమైన మార్పులు. అయితే రాష్ట్రపతి ప్రసంగం ఈ మార్పులు వేటినీ ఏ మాత్రం ప్రస్తావించకపోవడం ఎంతైనా ఆశాభంగం కలిగించింది.

సార్వత్రిక ఎన్నికలకు ముందు, ఎన్నికల ప్రచారంలోను బీజేపీ చేసిన వాదనలనే రాష్ట్రపతి ప్రసంగం ప్రస్తావించింది. ఆ వాదనలనే ఓటర్లు పూర్తిగా తిరస్కరించారు. కొత్త ప్రభుత్వం బీజేపీ ప్రభుత్వం కానే కాదు, అది ఒక సంకీర్ణ ప్రభుత్వం. ఈ వాస్తవాన్ని అంగీకరించేందుకు బీజేపీ నిరాకరిస్తోంది. ఈ వైఖరే రాష్ట్రపతి ప్రసంగంలో వ్యక్తమయింది. 'సంకీర్ణం' అనే పదం రాష్ట్రపతి ప్రసంగంలో ప్రస్తావనకు రానే లేదు. 'ఏకాభిప్రాయం', 'ద్రవ్యోల్బణం', 'పార్లమెంటరీ కమిటీ' మొదలైన పదాలు కూడా ఆ ప్రసంగంలో ప్రస్తావింపబడలేదు. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తరగతులు, వెనుకబడిన వర్గాలు అనే పదాల ప్రస్తావనలు ఉన్నాయి. అయితే మరి కొన్ని ఇతర ముఖ్య పదాలు ముఖ్యంగా 'మైనారిటీ వర్గాలు'ను 'సామాజిక, మత బృందాలు' అనే విశాల పదంలో కలిపివేశారు. మణిపూర్ విషాదం గురించి ఒక్క మాట కూడా లేదు 'అగ్నివీర్, 'ఉమ్మడి పౌర స్మృతి' గురించి కూడా ప్రస్తావనలు లేవు. ఇండియా ఇంకెంత మాత్రం ఒక విశ్వగురు కాదు, ఇక విశ్వబంధు' హోదాతో సంతృప్తిపడవలసిందే సుమా!

ఎన్నికల ఫలితాలతో ఏమీ మారలేదన్నది భారతీయ జనతా పార్టీ సునిశ్చితాభిప్రాయంగా కనిపిస్తోంది. చివరకు ప్రజల మనస్థితిలో కూడా ఎటువంటి మార్పు లేదని అధికారపక్షం గట్టిగా భావిస్తోంది. కనుకనే మోదీ 3.0లో కూడా అదే కేబినెట్, ఆ మంత్రులే. పాత కేబినెట్‌లోని కీలక మంత్రులు ఇప్పుడూ అవే శాఖలను నిర్వహిస్తున్నారు. పాత స్పీకరే కొత్త స్పీకర్. ప్రధానమంత్రి ముఖ్యకార్యదర్శి కూడా పాతకాపే. జాతీయ భద్రతా సలహాదారు ఇంటెలిజెన్స్ బ్యూరో ఛీఫ్ కూడా పాతవారే అటార్నీ జనరల్ మొదలైన కీలక ప్రభుత్వాధికారులు కూడా పాతవారే. అంతేనా? బీజేపీ తరఫున సామాజిక మాధ్యమాలలో పనిచేస్తున్నవారు కూడా పాతవారేనని తెలుస్తోంది. ఈ ఉద్యోగులు పాక్షిక అక్షరాస్యులు, అశ్లీల సాహిత్యంలో ప్రావీణ్యులు. ఏమీ మారలేదనడానికి ఇదే నిశ్చిత రుజువు.

వచ్చే నెలలో కొత్త బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. దేశ ప్రజలను అమిత ఆందోళనకు గురిచేస్తున్న సమస్యలు నిరుద్యోగిత, ద్రవ్యోల్బణం. సిఎస్‌డిఎస్ పోస్ట్ పోల్ సర్వే ప్రకారం ధరల పెరుగుదల/ ద్రవ్యోల్బణంను తగ్గించడంలోను, పెచ్చరిల్లుతున్న నిరుద్యోగితను అదుపు చేయడంలోను బీజేపీ ప్రభుత్వ పనితీరు సంతృప్తికరంగా లేదని భావిస్తున్నవారు వరుసగా 29 శాతం, 27 శాతం మంది ఉన్నారు. కొత్త కేబినెట్, రాష్ట్రపతి ప్రసంగం ప్రజలకు తీవ్ర ఆశాభంగం కలిగించాయి. మరి బడ్జెట్ 2024–25 విషయంలోనైనా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం మేలుకొంటుందా?

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

కుల నిర్మూలనకు లోహియా మార్గం

భారత్‌లో బ్రిటిష్ పాలన తుది దశాబ్దాలలో వలసవాద వ్యతిరేక రాజకీయాలలో సోషలిస్టులు, కమ్యూనిస్టులు ప్రభావదాయంగా ఉన్నారు. స్వతంత్ర భారతదేశ తొలి దశకాలలో పాలకపక్షమైన భారత జాతీయ కాంగ్రెస్‌కు ఆ రెండు రాజకీయ బృందాలే ముఖ్య సవాల్ దారులుగా ఉన్నాయి. తొలి తరాల సోషలిస్టులు, కమ్యూనిస్టులు ధైర్య సాహసాలు, ఉత్కృష్ట ఆదర్శవాదానికి ప్రతీకలుగా వెలుగొందారు. ప్రజా జీవితాన్ని పునీతం చేసే సుజనులకు ఉండే సద్గుణాలన్నీ వారిలో సమృద్ధంగా ఉండేవి. అయితే భారతీయ సమాజంలో అమానుష వివక్షకు ప్రాతిపదికగా ఉన్న కుల వ్యవస్థపై అవగాహనా లేమి సోషలిస్టులు, కమ్యూనిస్టులు ఇరువురికీ బాగా ఉండేది. ఇందుకు ఒకే ఒక్కరు మాత్రమే మినహాయింపు. ఆ విశిష్టుడే సోషలిస్ట్ చింతకుడు, రాజనీతిజ్ఞుడు డాక్టర్ రామ్‌మనోహర్ లోహియా (1910–67).



రాజకీయాలు, పాలనా వ్యవహారాల నిర్వహణలో ద్విజుల ఆధిపత్యం 1950లలో వలే నేడు సంపూర్ణంగా లేకపోవచ్చు కానీ సాంస్కృతిక, ఆర్థిక రంగాలలో ఆ సవర్ణులు, దేశ జనాభాలో తమ నిష్పత్తికి మించి ఎన్నో రెట్లు ఎక్కువగా ప్రభావాన్ని నెరపుతున్నారు. ఆ కారణంగా, కులంపై నాటి లోహియా ఆలోచనలు, భావాలు అసాధారణంగా మన కాలంలోనూ ప్రతిధ్వనిస్తున్నాయి.

కుల వ్యవస్థ తీరుతెన్నులు, ఆ సామాజిక దురాచారాన్ని నిర్మూలించాల్సిన ఆవశ్యకతపై లోహియా వ్యాసాలు, ప్రసంగాలు, లేఖలు అన్నీ 'ది క్యాస్ట్ సిస్టమ్' పేరిట గ్రంథ రూపం పొందాయి. 'ఆర్థిక సమానత్వం కోసం పోరాడితే చాలునని, ఆర్థిక సమత్వం పర్యవసానంగా కులం మొదలైన సామాజిక దౌష్ట్యాలు వాటికవే అంతరించి పోతాయని సోషలిస్టులు చిత్తశుద్ధితో విశ్వసిస్తున్నారని లోహియా పేర్కొన్నారు. అయితే 'ఆర్థిక అసమానత, కుల అసమానత అనేవి జంట దౌష్ట్యాలని, ఆ రెండిటినీ సంపూర్ణంగా నిర్మూలించాలన్న అవగాహన, జాగరూకత సోషలిస్టుల్లో పూర్తిగా కొరవడ్డాయని' లోహియా నిర్దుష్టంగా అభిప్రాయపడ్డారు.

'భారతీయుల జీవితాలలో కులంకు ఎనలేని ప్రాధాన్యమున్నది. కులాన్ని సూత్రప్రాయంగా వ్యతిరేకించేవారు సైతం తమ జీవితాలలో దానిని ఆచరిస్తున్నారని' లోహియా గర్హించారు. జీవితంలోని అనివార్య వాస్తవాలు అయిన జనన మరణాలు, వివాహం. పండుగలు, వ్రతాలు, ఇతర ఆచారాలు అన్నీ కుల చట్రం పరిధిలో మాత్రమే జరుగుతాయని లోహియా విశ్లేషించారు. ఒకే కులానికి చెందిన వ్యక్తులు ఈ నిర్దయాత్మక ఆచారాలను అనుష్ఠించడంలో పరస్పరం సహకరించుకుంటారని' ఆయన వ్యాఖ్యానించారు. ఆయన ఇంకా ఇలా అన్నారు :'కుల వ్యవస్థ మార్పును వ్యతిరేకిస్తుంది. ప్రతి ఒక్కరి జీవన వ్యవహారాలను తీర్చిదిద్దుతుంది. మార్పును వ్యతిరేకించే కుల వ్యవస్థే వర్తమాన భారతీయ సమాజంలోని సమస్త నీచత్వం, అమానుష అనాదరణ, అసత్యాలకు ఒక ప్రధాన ఆలంబనగా ఉన్నదని కూడ ఆయన వ్యాఖ్యానించారు. వివక్షే కులవ్యవస్థ మౌలిక లక్షణం. ఆర్థిక, రాజకీయ రంగాలలో అగ్రకులాల ఆధిపత్యానికి, వ్యవహారాలలో వాటి ప్రాబల్యానికి కులం ప్రధాన ఆధారంగా ఉన్నది. కింది కులాల వారిలో న్యూనతా భావాన్ని నెలకొల్పడం ద్వారా అగ్రవర్ణాలవారు తమ పెత్తనాన్ని కొనసాగించుకుంటున్నారని లోహియా విపులీకరించారు.

దళితులకు వ్యతిరేకంగా పాటిస్తున్న అమానుష వివక్షను లోహియా విస్మరించలేదు (ఆ నాటి భాషలో వారిని 'హరిజనులు'గా లోహియా పేర్కొన్నారు) ముఖ్యంగా సవర్ణులు లేదా ద్విజులు, శూద్రకులాల మధ్య వ్యత్యాసాలపై ఆయన ప్రధానంగా దృష్టి పెట్టారు. రాజకీయ, పరిపాలనా రంగాలలోను, వృత్తులు, వ్యాపారాలు, మేధో కార్యకలాపాలలో అగ్రకులస్తులే అగ్రగాములుగా ఉండడం, అధికార పదవులలో శూద్రకులాల వారికి పెద్దగా ప్రాతినిధ్యం లేకపోవడం గురించి ఆయన విపులంగా విశ్లేషించారు. 1958లో రాసిన ఒక వ్యాసంలో 'దేశ జనాభాలో సవర్ణులు ఐదో వంతు మంది మాత్రమే అయినప్పటికీ జాతి జీవనంలోని నాలుగు ప్రధాన రంగాలు– వ్యాపారం, సాయుధ బలగాలు, సివిల్ సర్వీసులు, రాజకీయ పార్టీలలో అగ్రకులస్తులు ఐదింట నాలుగు వంతులుగా ఉన్నారని' పేర్కొన్నారు. దేశం సర్వతోముఖంగా పురోగమించేందుకు ఈ సామాజిక అసమతౌల్యతలను సరిదిద్ది తీరాలని ఆయన స్పష్టం చేశారు. సమాజంలో అట్టడుగు స్థానంలో ఉన్న హరిజనులు, మహిళలు, శూద్రులు ముస్లింలు, ఆదివాసీలు నాయకత్వ స్థానాలకు ఎదిగేందుకు దోహదం చేసే పోరాటాలకు సోషలిస్టులు నాయకత్వం వహించాలని లోహియా సూచించారు.



■ రామచంద్ర గుహ

గతానుగతం

భిన్న కులాల మధ్య, వర్ణాల వారి మధ్య అంతర్ వివాహాలను ప్రోత్సహించాలని లోహియా విజ్ఞప్తి చేశారు. 'కుల నిర్మూలన సంఘం' నొకదాన్ని ఏర్పాటు చేయాలని లోహియా 1960లో కోరారు. ఆ సంఘానికి ఎనిమిది నిర్దిష్ట లక్ష్యాలతో కూడిన ఒక ప్రణాళికను కూడా ఆయన ప్రతిపాదించారు. వాటిలో రెండిటిని ప్రస్తావిస్తాను. మొదటిది కుల దురాచారాల నుంచి మతాన్ని ప్రక్షాళన చేయడం. ఇందుకు కులాంతర, వర్ణాంతర వివాహాలను ప్రోత్సహించాలి. ఈ అంతర్ వివాహాల ద్వారా అంతిమంగా కుల వ్యవస్థ మనుగడ కోల్పోతుందని వైజ్ఞానిక అధ్యయనాలు, సృజనాత్మక కళల ద్వారా ప్రచారం చేయాలి. రెండు– ప్రభుత్వ వ్యవస్థలు, రాజకీయ పార్టీలు, వ్యాపారాలు, సాయుధ బలగాలలో నాయకత్వ స్థానాలలో 60 శాతాన్ని వెనుకబడిన కులాల వారికి, అలాగే అణగారిన వర్గాలుగా ఉన్న మహిళలు, శూద్రులు, హరిజనులు, ఆదివాసీలకు, మతపరమైన మైనారిటీలలో కింది కులాల వారికి దక్కేలా చేయాలి. అయితే అత్యధిక సంఖ్యలో ఉన్న కింది కులాల వారి హక్కులను జనాభాపరంగా సంఖ్యాబలం ఉన్న ఏవో ఒకటి రెండు కింది కులాలవారే స్వాయత్తం చేసుకోవడానికి వీలు లేకుండా జాగ్రత్తవహించాల్సిన అవసరమున్నది.

1955–56లో డాక్టర్ లోహియా, డాక్టర్ అంబేడ్కర్ మధ్య, లోహియా, ఆయన సోషలిస్టు సహచరుల మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాల అధ్యాయం ఈ పుస్తకంలో చాలా ఆసక్తికరమైనది. 1957 సార్వత్రిక ఎన్నికలలో లోహియా, అంబేడ్కర్‌ల నాయకత్వాలలోని పార్టీలు కలిసి పోటీ చేసేందుకు గాను లోహియా, అంబేడ్కర్‌లను వారి అనుయాయులను సన్నిహితం చేసే ప్రయత్నాలు జరిగాయి. ఆ సందర్భంగా ఈ ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. అంబేడ్కర్‌కు లోహియా రాసిన లేఖతో ఇవి ప్రారంభమువుతాయి. 'మీరు కేవలం షెడ్యూల్డు కులాల వారికే కాకుండా, సమస్త భారత ప్రజలకూ నాయకుడుగా కావాలని నేను కోరుకుంటున్నానని' లోహియా తన లేఖలో పేర్కొన్నారు. అంబేడ్కర్ ఈ లేఖకు ప్రతిస్పందిస్తూ 1956 అక్టోబర్ 2న తనతో సమావేశమయ్యేందుకు న్యూఢిల్లీకి రావాలని లోహియాను ఆహ్వానించారు. అయితే లోహియా సంచార జీవితం, అంబేడ్కర్ అనారోగ్యం కారణంగా ఆ ఇరువురి మధ్య వ్యక్తిగత సమావేశం జరగనేలేదు. డిసెంబర్ 6, 1956న అంబేడ్కర్ చనిపోయారు. సోషలిస్టు పార్టీ సహచరుడు మధు లిమాయెకు రాసిన లేఖలో లోహియా ఇలా పేర్కొన్నారు: 'గాంధీజీతో పాటు అంబేడ్కర్‌ను భారత రాజకీయాలలో చాలా గొప్ప వ్యక్తిగా నేను భావిస్తున్నాను. డాక్టర్ అంబేడ్కర్ చిత్తశుద్ధి ఉన్న వ్యక్తి. ధైర్య సాహసాలు, స్వతంత్ర ఆలోచనాశక్తి ఉన్న ధీమంతుడు. విశాల ప్రపంచానికి ఆయనను సమున్నత భారత్‌కు ప్రతీకగా చూపవచ్చు. అయితే ఆయన కటువైన వ్యక్తి. ఇతరులతో ప్రమేయం లేకుండా వ్యవహరించే స్వతంత్రుడు. హరిజనేతరులకు నాయకుడు కావడానికి ఆయన తిరస్కరించారు. అంబేడ్కర్ స్వతంత్ర ఆలోచనా రీతిని అలవరచుకోవడం, హరిజనులకు మాత్రమే కాకుండా సమస్త భారతీయులకు నాయకత్వం వహించగల అంబేడ్కర్ గొప్పతనం నుంచి స్ఫూర్తి పొందడమే ఆయనకు సమర్పించగల నిజమైన నివాళి అవుతుందని లోహియా పేర్కొన్నారు.

కుల వ్యవస్థ గురించిన లోహియా నిశిత అవగాహన ఆయనను సమకాలీన సోషలిస్టులలో ఒక ప్రత్యేక వ్యక్తిగా నిలబెట్టింది. అలాగే ఆయన స్త్రీ వాద దృక్పథం కూడ ఆ విశిష్టతకు మరింత వన్నెనిస్తోంది. భారతీయుల వెనుకబాటుతనానికి, కష్టాలకు కుల, జెండర్ వివక్షలే కారణమని, ఈ రెండూ పరస్పర సంబంధమున్నవని ఆయన అన్నారు. ఒక స్త్రీ పాత్ర వంటగదికే పరిమితం కావాలన్న అభిప్రాయం ఒకటి విస్తృతంగా ఉన్నది. పురుషుల స్థానం శిశు సంరక్షణకు పరిమితం కావాలని సోషలిస్టులు ప్రతివాదన చేయాలని ఆయన సూచించారు. బిడ్డల పెంపకంలో భర్తలు, తండ్రులు స్త్రీలతో సమానంగా పాల్గొనాలని ఆరు దశాబ్దాల క్రితమే లోహియా ప్రతిపాదించడం ఆయన మానవతాపూర్వక దూరదృష్టికి నిదర్శనం.

1953లో రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ బెనారస్‌లో బ్రాహ్మణులకు పాదపూజ చేశారు. వారి కాళ్లను ఆయన స్వయంగా కడిగారు. దీనిపై లోహియా ప్రతిస్పందిస్తూ రాష్ట్రపతి భావ బానిసత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ఆ చర్యద్వారా రాష్ట్రపతిపట్ల నేనూ, నా లాంటి లక్షలాది భారతీయులు చూపే గౌరవ ప్రపత్తులను రాజేంద్రప్రసాద్ కోల్పోయారు. భారత సార్వభౌమాధినేత అయిన రాష్ట్రపతి స్వయంగా బ్రాహ్మణుల కాళ్లు కడిగిన మన సమాజంలో పూజారి, చర్మకారుడి మధ్య, ఉపాధ్యాయుడు, రజకుడి మధ్య సమస్థాయిలో స్వేచ్ఛా సంభాషణ సాధ్యమయ్యే అవకాశం లేదని లోహియా అభిప్రాయపడ్డారు. కుల మతాలకు అతీతంగా సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆయన కోరుకున్నారు. ఈ విషయంలో లోహియా భావాలు అంబేడ్కర్ ఆమోదాన్ని తప్పక పొందేవనడంలో సందేహం లేదు. కుల వ్యవస్థ తీరుతెన్నులు, హిందూ మతానికి కళంకంగా ఉన్న ఆ సామాజిక దురాచార నిర్మూలన గురించి ఈ కాలమ్‌లో ఉటంకించిన డాక్టర్ రామ్ మనోహర్ లోహియా వ్యాసాలు, లేఖలు, ప్రసంగాలు అన్నీ 1953–61 సంవత్సరాల మధ్య రాసినవి. రాజకీయాలు, పాలనా వ్యవహారాల నిర్వహణలో ద్విజుల ఆధిపత్యం 1950లలో వలే నేడు సంపూర్ణంగా లేకపోవచ్చు కానీ సాంస్కృతిక, ఆర్థిక రంగాలలో ఆ సవర్ణులు, దేశ జనాభాలో తమ నిష్పత్తికి మించి ఎన్నో రెట్లు ఎక్కువగా ప్రభావాన్ని నెరపుతున్నారు. ఆ కారణంగా, కులంపై నాటి లోహియా ఆలోచనలు, భావాలు అసాధారణంగా మన కాలంలోనూ ప్రతిధ్వనిస్తున్నాయి.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

కొత్త నేర చట్టాలతో న్యాయసంక్షోభం

నేరాలను నిరోధించడానికి ఉద్దేశించిన మూడు నేర న్యాయ చట్టాలను కేంద్ర ప్రభుత్వం జూలై ఒకటి నుంచి అమలు చేయడానికి ప్రయత్నాలు చేస్తోంది. వాటి అమలు వాయిదా వేయాలని న్యాయకోవిదులు పలు కారణాల వల్ల కోరుతున్నారు. తగినంత చర్చ లేకుండా, వాటి అమలు వల్ల సామాన్యులకు జరిగే తీవ్ర పరిణామాలు, ప్రజలలో ఇప్పటికే విశ్వాసాన్ని కోల్పోతున్న నేర న్యాయ వ్యవస్థ మీద పడే ఒత్తిడి, వాటి మీద అంచనాలు లేకుండా వాటిని అమలు చేయడం తీవ్రమైన సామాజిక పరిణామాలకు దారి తీస్తుంది.

ఈ కొత్త చట్టాలను న్యాయ శాఖ రూపొందించలేదు. వీటిని హోం శాఖ రూపొందించింది. పాలకపక్ష శాసనకర్తలు తలలూపారు. ప్రతిపక్షం మొత్తాన్ని సస్పెండ్ చేసి వాటిని ఆమోదించారు. పోనీ నేర న్యాయ వ్యవస్థలో ముఖ్య భాగమైన న్యాయవాదుల సంఘాలతో చర్చించారా, అదీ లేదు. ప్రజాస్వామ్య పాలనలో ఇలాంటి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే ముందు చర్చలు, సంభాషణ అనివార్యం అన్న విశ్వాసం పాలకపక్షానికి మొదట ఉంటే, ఆ తర్వాత ఎవరితో ఎంత చర్చించాలి అనే ప్రశ్న తలెత్తుతుంది. నోట్లరద్దు నిర్ణయానికి ముందు ఎంత చర్చ జరిగిందో, ఆ తర్వాత ఏం జరిగిందో మనం చూసాం.

జూలై 1 తర్వాత జరిగే నేరాలను నేర న్యాయ సంహిత కింద నమోదు చేసినా, భారతీయ న్యాయ సురక్షా సంహిత (కొత్త క్రిమినల్ ప్రొసీజర్ కోడ్)ను మాత్రం పాత నేరాల విచారణకు కూడా వాడవచ్చు. ఏ అంశాలు నేరాలుగా పరిగణిస్తామో, వాటిని ఏ పద్ధతిలో విచారిస్తామో కూడా అంతే ముఖ్యం. నేర విచారణా పద్ధతి శిక్షగా రూపాంతరం చెందిన సమాజంలో ఇది మరింత ప్రధానమైన అంశం. ప్రస్తుతం విచారణలో ఉన్న చాలా నేరాలు వచ్చే ఐదేళ్ల నుంచి ఇరవై ఏళ్ల వరకు కొనసాగవచ్చు. కొత్త లేక పాత విచారణా పద్ధతి ప్రకారం పోలీసులు విచారణ చేశారనే వివాదాలు కోర్టు కేసులు కక్షిదారుల సహనాన్ని, నిందితుల స్వేచ్ఛను అన్యాయంగా పరీక్షించవచ్చు. కేసులు ఒక కొలిక్కి వచ్చే కాలం ఇప్పటికంటే మరింత పెరుగుతుంది.

ప్రభుత్వ అధికారాల మీద ఇప్పటికే న్యాయ వ్యవస్థ విధించిన పరిమితులను అధిగమించి అధికారాలను చేజిక్కించుకొనే ప్రయత్నం కొత్త నేరచట్టాలలో కనిపిస్తుంది. దేశద్రోహం అనే నేరం వలసవాదానికి గుర్తు అని ప్రకటించి దాని అమలును సుప్రీంకోర్టు నిలిపివేసినా నేర న్యాయ సంహితలో సెక్షన్ 150 ద్వారా మరింత ప్రమాదకర రూపంలో అది పునఃప్రత్యక్షమైంది. ఈసారి దేశ ఐక్యత, సమగ్రత అనే అమూర్త రూపం తీసుకుంది. ఇది సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయాన్ని నిరాకరించడమే. ఈ పేరు మీద ఏమి జరుగుతుందో ఊహించుకోవడం కష్టం కాదు.



ప్రభుత్వం కొత్తగా తెచ్చిన చట్టాలు వలస పోకడలను అధిగమించాయనే ప్రభుత్వ వాదన రూపంలో, సారంలో చాలావరకు నిజం కాదు. ఈ చట్టాలు ప్రస్తుతం ఉన్న చట్టాలకు 95 శాతం నకలు. నేర శిక్షా సంహిత కొత్తగా 20 రకాల నేరాలను సృష్టించింది. వాటి సృష్టి అవసరమా కాదా అనే చర్చ జరగలేదు. 33 నేరాలకు జైలు శిక్షలను పెంచింది. 23 నేరాలకు కనిష్ట శిక్షను ఖరారు చేసింది. అంటే న్యాయ వ్యవస్థకు ఈ శిక్షల విషయంలో ఉండే విచక్షణాధికారాన్ని నేర శిక్షా సంహిత తొలగించింది. నేరాలకు సామాజిక ఆర్థిక మూలాలు ఉంటాయనే గుర్తింపు వల్ల న్యాయస్థానాలకు ఈ అధికారాలు ఇవ్వబడ్డాయి. ఈ చట్టం కొన్ని చిన్న నేరాలకు సమాజ సేవ లాంటి శిక్షలను ప్రతిపాదించినంత మాత్రాన, దానికి కఠిన స్వభావం మరుగున పడిపోదు. ఇదంతా పాలనలో కఠినమైన నిర్ణయాలు అవసరం అనే పాలకపక్ష వైఖరికి అనుగుణంగా ఉంది.

ప్రజలకు రాజ్యాంగంలోని 21వ అధికరణం జీవించే హక్కుకు, స్వేచ్ఛకు హామీ పడింది. వీటిని రక్షించడం నేర న్యాయవ్యవస్థ ముఖ్య కర్తవ్యం. అది రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా తయారైన చట్టాల ద్వారా జరగాలి. ఆచరణలో నేర న్యాయ చట్టాల అమలు రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ఉందా అనే కాపలాదారు పాత్రను న్యాయ వ్యవస్థ పోషించాలి. గత యాభై ఏళ్లుగా అమలులో ఉన్న చట్టాలు ప్రభుత్వాలు దుర్వినియోగం చేయకుండా న్యాయవ్యవస్థ సూత్ర రీత్యా కొంతవరకు అడ్డుకుంది. చట్టాలకు పరిధి పరిమితులను విధించి కొంత స్పష్టత ఇచ్చింది. కానీ ఈ కొత్త చట్టాలు ఉద్దేశపూర్వకంగా అస్పష్టంగా రూపొందించబడ్డాయనేది ముఖ్యమైన ఆరోపణ. ఈ చట్టాలలోని అస్పష్టత ప్రభుత్వ నిరంకుశ అధికారాన్ని బలోపేతం చేస్తుంది, ప్రజల హక్కులకు ప్రమాదకారిగా మారుతుంది అనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఆందోళన నిరాధారం కాదు.

పై అనుమానాలకు బలం చేకూర్చే విధంగా కొత్త చట్టాలు రూపొందించారు. ప్రభుత్వ అధికారాల మీద ఇప్పటికే న్యాయ వ్యవస్థ విధించిన పరిమితులను అధిగమించి అధికారాలను చేజిక్కించుకోవడానికి జరిగిన ప్రయత్నం వాటిలో కనిపిస్తుంది. ఉదాహరణకు దేశద్రోహం అనే నేరం వలసవాదానికి గుర్తు అని ప్రకటించి దాని అమలును సుప్రీంకోర్టు నిలిపివేసింది. కానీ నేర న్యాయ సంహితలో సెక్షన్ 150 ద్వారా మరింత ప్రమాదకర రూపంలో అది పునః ప్రత్యక్షమైంది. ఈసారి దేశ ఐక్యత, సమగ్రత అనే అమూర్త రూపం తీసుకుంది. ఇది సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయాన్ని నిరాకరించడమే. ఈ పేరు మీద ఏమి జరుగుతుందో ఊహించుకోవడం కష్టం కాదు.


మరొక సామాన్య విషయంలో నేర సురక్ష సంహిత చేసిన మార్పు చూద్దాం. ఒక బాధితురాలి నుంచి ఫిర్యాదు రాగానే మొదటి ప్రాథమిక నివేదిక తక్షణమే నమోదు చేయాలని లలితకుమారి వెర్సెస్ ఉత్తర్‌ప్రదేశ్ అనే తీర్పులో సుప్రీంకోర్టు నిర్దేశించింది. జరిగిన సంఘటనకు సంబంధించిన వాస్తవాలు కల్తీ లేకుండా, అతిశయోక్తులు లేకుండా నమోదు కావాలంటే ఎఫ్ఐఆర్ వెంటనే నమోదు కావాలనేది ఆ తీర్పు సారాంశం. వ్యాపార సంబంధమైన కొన్ని నేరాల విషయంలో మాత్రం ప్రాథమిక పరిశీలన (పరిశోధన, విచారణ కాదు) తర్వాత మాత్రమే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని నిర్దేశించింది. ఈ తీర్పును పోలీసులు అన్ని రకాల కేసులలో దుర్వినియోగం చేస్తున్నారనేది వాస్తవం. అరుదుగా తప్ప, పోలీసు స్టేషన్లలో రోజుల తరబడి పంచాయతీలు చేసి, ఉత్తర దక్షిణల మీద ఆధారపడి ఎఫ్ఐఆర్ నమోదు చేయడం సగటు పౌరుడి అనుభవం. ఈ కొత్త చట్టం ఈ దుర్వినియోగానికి చట్టబద్ధత కల్పించింది. ఏడు ఏళ్ల వరకు శిక్ష పడే నేరాలలో అన్నింటిలో ప్రిలిమినరీ ఎంక్వయిరీ తర్వాతే కేసులు నమోదు చెయ్యాలని ఇది నిర్దేశిస్తుంది. ఇది పోలీసులు అధికారాన్ని దుర్వినియోగం చేయడానికి అవకాశం కల్పించడం. అరెస్ట్ చేసే అధికారం, అరెస్ట్ చేయడానికి కారణాలు ఉండడం వేరువేరనే స్పృహలేని ప్రస్తుత పోలీస్ వ్యవస్థలో, అనుమానం మీద ఎవరినైనా అరెస్ట్ చేసే అధికారం ఈ చట్టాలు ఇచ్చాయని ఆందోళన వ్యక్తం చేశారు సుప్రీంకోర్టు న్యాయవాది ముకుల్ రస్తోగి.

ఊపా కేసులు పేరు మీద ఇప్పటివరకు ఎంతటి హక్కుల అణచివేత జరిగిందో అందరికీ తెలుసు. కనీసం ఊపా చట్టంలో ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఎవరి మీద, కేసులు నమోదు చేయడానికి లేదు అనే రక్షణ ఉంది. ఇది కఠినమైన చట్టం కాబట్టి, హోమ్ సెక్రటరీ లాంటి ఉన్నతాధికారులు, వివేచన ఉపయోగించి అనుమతి ఇస్తారు అని ప్రభుత్వం చట్టం చేసినప్పుడు ఇచ్చిన సమర్థన. ఆచరణలో అదంతా నిజం కాదని చాలా కేసులు రుజువు చేశాయి. ఆచరణలో అది ఒక సాంకేతిక అనుమతిగా దిగజారి (నిర్దోషిగా నిరూపితమైన ఒక నిందితుడిని ఇదే వాదనతో మరో రెండేళ్లు జైలుకు పంపింది మన సర్వోన్నత న్యాయస్థానం) పదేళ్ల పాటు చాలా మందిని జైళ్లలో నిర్బంధిస్తే, న్యాయస్థానాలు నింపాదిగా నిర్దోషులుగా ప్రకటించడం ఆనవాయితీ అయింది. విచారణ క్రమమే నిందితులకు ప్రమాదకరంగా మార్చిన వైనం చూసాం. ఊపా చట్టంలో ఉన్న ఆ మాత్రం రక్షణ పౌరులకు దేనికి అనుకున్న ప్రభుత్వం దానిలోని చాలా సెక్షన్లను నేర న్యాయ సంహితలో చేర్చింది. ఇది చాలా ప్రమాదకరం అని ఇందిరా జై సింగ్ లాంటి న్యాయ నిపుణులు అంటున్నారు. ఊపా చట్టం పరిణామాలు రోజువారీ జీవితంలో అందరూ ఎదుర్కొనే పరిస్థితి రావచ్చనేది ఆందోళన.

ఈ కొత్త చట్టాలను ప్రజాస్వామిక న్యాయవాదులు సర్వోన్నత న్యాయస్థానంలో ఖచ్చితంగా సవాలు చేస్తారు. తన న్యాయస్థానంలో ఈ చట్టాలు సవాలుకు రావచ్చు అనే స్పృహ లేకుండా వాటికి స్వాగతం పలికిన ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి నుంచి మనం ఏమి ఆశించలేకపోవచ్చు. న్యాయవ్యవస్థలో చట్టబద్ధ పాలన పట్ల, రాజ్యాంగ స్ఫూర్తి పట్ల విశ్వాసం ఉన్నవారు ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే ఈ చట్టాలు రద్దు చేయబడవచ్చు. కానీ జీవితంలో కనీసం సామాన్యులకు ప్రాథమ్యాల పట్ల ఉన్న స్పృహ, విచక్షణ కూడా లేనట్లు నటిస్తున్న సర్వోన్నత న్యాయస్థానం ఒక ఐదేళ్ల తర్వాత సాకల్యంగా ఈ చట్టాలు రాజ్యాంగ విరుద్ధం అని ప్రకటించవచ్చు. అప్పటికి ఎంతమంది ప్రజలు మూల్యం చెల్లించుకున్నారు అనే అంచనా లేకపోవచ్చు. ఎలక్టోరల్ బాండ్స్ విషయంలో తీర్పు 2020లో వచ్చి వుంటే నేటి రాజకీయ పరిస్థితి ఇంకోలా ఉండేది కదా?

ఈ చట్టాలు సృష్టించబోయే సమస్యలను అంచనా వేయడం అసాధ్యమేమీ కాదు. దేశంలో ఏడాదికి సుమారు 60 లక్షల మంది నిందితులను పోలీసులు నిర్బంధిస్తారు. అందులో పది లక్షల మందికి న్యాయస్థానాలు శిక్షలు విధిస్తే, పదిలక్షల మందిని నిర్దోషులుగా విడుదల చేస్తున్నాయి. వీళ్లలో చాలామంది నెల నుండి మూడు నెలలు జైలులో మగ్గిన తర్వాతే నిర్దోషులుగా బయటపడతారు. ఏడాదిలోపు నిర్ణయించబడేవి చిన్న చితక కేసులు మాత్రమే. మిగిలిన 40 లక్షల కేసులలో నిందితులు ఏడాది నుంచి 20 ఏళ్ల వరకు, తమ ఆర్థిక, సామాజిక స్తోమత బట్టి కోర్టుల చుట్టూ తిరుగుతుంటారు. ఇదంతా ఒక్క ఏడాదిలో. సకాలంలో బాధితులకు న్యాయాన్ని అందించే నేర న్యాయ వ్యవస్థను సృష్టించడానికి ప్రభుత్వాలు ప్రయత్నాలు చేయకపోవడంతో సమస్య ఇంత తీవ్రంగా మారింది. యుద్ధకాలంలో లాభాలు పెరిగినట్టు, కోవిడ్ సంక్షోభం తర్వాత బిలియనీర్లు పుట్టుకొచ్చినట్టు, అస్తవ్యస్తమైన న్యాయ వ్యవస్థలో కొందరికి మంచి ప్రయోజనాలు కలగవచ్చు. ఈ మొత్తం వ్యవహారం పట్ల అసహనంతో ఉండే సామాన్య ప్రజానీకం 'తక్షణ న్యాయం' పేరుతో న్యాయబద్ధ పద్ధతులకు అతీతంగా నిందితులను శిక్షించాలని కోరుకుంటారు. ఈ నేపథ్యంలో కొత్త నేర చట్టాలు అమలు చేయడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను దానికున్న మద్దతును అర్థం చేసుకోవాలి. ఈ న్యాయ సంక్షోభాన్ని ఎదుర్కోడానికి రాజ్యాంగం మీద విశ్వాసం ఉన్నవారందరూ నడుం బిగించాలి.

■ మురళి కర్ణం
హ్యూమన్ రైట్స్ ప్రొఫెసర్, నల్సార్ యూనివర్సిటీ





ఘటనాస్థలిలో తండ్రిని పట్టుకుని విలపిస్తున్న దర్శిని

ఓ మనిషీ.. నువ్వెక్కడ?

కిరాణా వ్యాపారి హత్యోదంతంలో మంటగలిసిన మానవత్వం

- నడిరోడ్డుపై ఓ యువకుడు నరుకుతున్నా పట్టని జనం
- చోద్యం చూస్తూ కొందరు.. వీడియోలు తీస్తూ మరికొందరు
- హతుడు అరుస్తున్నా.. కుమార్తె కన్నీరవుతున్నా కలగని కనికరం
- సోషల్ మీడియాలో వీడియోలు వైరల్
- మంటగలిసిన మానవత్వానికి నిదర్శనంగా ఘటన



హతుడు శ్రీరామచంద్రప్రసాద్



నిందితుడు మణికంఠ

గురువారం రాత్రి సుమారు 9 గంటలు.. ఓ యువకుడు ఓ పెద్దమనిషిని అడ్డుకుని పదునైన కత్తితో తలపై నరికాడు.. అంతటితో ఆగకుండా నరుకుతూనే ఉన్నాడు.. ఆ పెద్దమనిషి హాహాకారాలు చేస్తున్నా.. ఆయన కుమార్తె పదేపదే హంతకుడిని పట్టుకుని బతిమాలుతున్నా కనికరం కలగలేదు.. ఊపిరి ఆగే వరకూ నరుకుతూనే ఉన్నాడు.. ఈ ఘటన ఎక్కడో అడవిలో జరగలేదు. నిత్యం సందడిగా కనిపించే నగరంలోని బృందావన్ కాలనీలో జరిగినా, నడిరోడ్డుపై ఓ ఉన్మాది విచక్షణ కోల్పోయినా చుట్టూ జనం చూస్తూనే ఉన్నారు కానీ, ఒక్కరు కూడా ఆపేందుకు ప్రయత్నించలేదు. ఆ పెద్దాయన అరుస్తున్నా.. ఆ ఆడపడుచు కన్నీరవుతున్నా చుట్టూ పదిమంది చోద్యం చూశారే తప్ప.. అయ్యో పాపమని ఒక్కరు ముందుకు కదల్లేదు. పైగా హత్యోదంతాన్ని సెల్‌ఫోన్లలో బంధించడంలో నిమగ్నమయ్యారు. మంట కలిసిపోతున్న మానవత్వానికి.. మాయమవుతున్న మంచితనానికి.. ఈ హత్యా ఘటన నిదర్శనంగా నిలిచింది.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : బృందావన్ కాలనీలో గురువారం రాత్రి జరిగిన కిరాణా వ్యాపారి కంకిపాటి శ్రీరామచంద్రప్రసాద్ హత్య వీడియోలను పరిశీలించిన మానవతావాదులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఉన్మాది మణికంఠ పదేపదే కత్తితో శ్రీరామచంద్రప్రసాద్‌ను నరుకుతున్నా, కాపాడే అవకాశం ఉన్నా చుట్టుపక్కల ఉన్నవారెవరూ ముందుకు రాలేదు. ఈ కాలనీలో ఉన్నవారంతా ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు, వ్యాపారులు. ధనికవర్గాలే ఇక్కడ నివాసముంటాయి. వీరంతా శ్రీరామచంద్రప్రసాద్ నుంచి కిరాణా తీసుకుంటారు. చాలామందితో ఆయనకు పరిచయం ఉంది. ఆయన అందరినీ ఆప్యాయంగా పలకరిస్తారు కూడా. మణికంఠ కత్తితో దాడిచేసే సమయంలో చుట్టుపక్కల పదిమంది వరకు ఉన్నారు. అంతకుముందే మణికంఠ కత్తితో ఆ ప్రాంతంలో తిరిగాడు. ఆయుధంతో ఒక యువకుడు ఇక్కడెందుకు కూర్చున్నాడని ఒక్కరికీ సందేహం కలగలేదు. పోలీసులకూ సమాచారం ఇవ్వలేదు. కొంతమంది హత్యను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించుకుంటూ కూర్చుని మానవత్వమనేదే లేకుండా ప్రవర్తించారు.

- మిగతా 6లో





• బడిలో భువనేశ్వరి

ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి శుక్రవారం చల్లపల్లి మండలం పాగోలులోని ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పిల్లలతో సందడిగా గడిపారు. పిల్లలను ఆప్యాయంగా పలకరించి, తరగతి, హాస్టల్ గదులు, వసతి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. భోజనశాలను పరిశీలించి పిల్లలతో కలిసి భోజనం చేశారు.

విద్య, వైద్యరంగాల్లో ఎన్టీఆర్ ట్రస్ట్ సేవలు

• మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి

6లో..

మదర్సాలో మిస్టరీ..!



కరిష్మా (ఫైల్)

అజిత్‌సింగ్‌నగర్‌లోని మదర్సాలో విద్యార్థిని మృతి వెనుక అసలు కారణమేంటి? నిజంగానే ఇక్కడ ఫుడ్ పాయిజన్ అయ్యిందా? జరిగిన ఘటన ఒకటైతే, మదర్సా నిర్వాహకులు ఫుడ్ పాయిజన్ అంశాన్ని తెరపైకి తెచ్చారా? ఫుడ్ పాయిజన్ అయిన మిగతా విద్యార్థినులను ఆసుపత్రిలో చేర్పించకుండా ఎందుకు తీసుకెళ్లిపోయారు? ఈ మదర్సాలో ఉంటున్న గుడివాడకు చెందిన కరిష్మా మృతి వెనుక ఇలాంటి ఎన్నో అనుమానాలు కలుగుతున్నాయి. నిర్వాహకులే ఏదో చేశారని కరిష్మా తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

సింగ్‌నగర్ మదర్సాలో విద్యార్థిని మృతిపై అనుమానాలు

- విద్యార్థినులకు ఫుడ్ పాయిజన్ అంటున్న నిర్వాహకులు
- ఆసుపత్రిలో చేర్పించకుండా హడావిడిగా వెనక్కి..
- ఫుడ్ పాయిజన్ కాదని తేల్చేసిన అధికారులు
- మదర్సాలోని ఫ్రిజ్‌లో 100 కేజీల కుళ్లిన మాంసం
- నిర్వాహకులే ఏదో చేశారంటున్న మృతురాలి బంధువులు
- పోస్టుమార్టం నివేదికలో బయటపడనున్న నిజాలు



ప్రభుత్వాసుపత్రి వద్ద విలపిస్తున్న కరిష్మా తల్లి

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : నిస్వాన్ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సయ్యద్ షాహిద్ పర్వీజ్ అనే వ్యక్తి అజిత్‌సింగ్‌నగర్‌లో మదర్సాను నిర్వహిస్తున్నాడు. ఇక్కడ మొత్తం 60 మంది విద్యార్థినులు ఉండగా, ఎనిమిది మందికి ఫుడ్ పాయిజన్ అయిందని నిర్వాహకులు చెబుతున్నారు. వారిలో కరిష్మాను శుక్రవారం ఉదయం నగరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించేసరికి ప్రాణాలు కోల్పోయింది.

నిర్వాహకుల మాటొకటి.. అధికారుల మాటొకటి

ఎనిమిది మంది బాలికలకు గురువారం రాత్రి ఫుడ్ పాయిజన్ అయిందని నిర్వాహకులు చెబుతున్నారు. కానీ, మదర్సాను పరిశీలించి, ఆసుపత్రిలో బాలికలను పరామర్శించిన అధికారులు మాత్రం అటువంటి దాఖలాలు లేవంటున్నారు. ఎనిమిది మందికి ఫుడ్ పాయిజన్ అయితే, మిగిలిన ఏడుగురిని నిర్వాహకులు ఆసుపత్రిలో చేర్పించలేదు. పరిశీలనలో ఉంచాలని అధికారులు చెప్పినా ప్రభుత్వాసుపత్రిలో ఓపీ చీటీ తీసుకోకుండా తీసుకెళ్లిపోవడం అనుమానాలకు తావిస్తోంది. బాలికలకు వాంతులయ్యాయని నిర్వాహకులు చెబుతున్నారు. అధికారులు ఆరా తీస్తే.. ఈనెల 26న మాత్రమే వాంతులయ్యాయని తేలింది.

కుళ్లిన మాంసం ఎందుకు ఉంచినట్టు?

ఏకంగా 100 కిలోల బీఫ్, మటన్ మాంసం మదర్సాలోని ఫ్రిజ్‌లో కనిపించింది. ఈ మాంసమంతా కుళ్లిపోయి దుర్వాసన వస్తోంది. ఫ్రిజ్ తలుపు తీయగా, ఇది బయటపడింది. ఫుడ్ పాయిజన్ జరిగిందని సమాచారం రావడంతో ఫుడ్‌సేఫ్టీ అధికారి గౌస్.. మదర్సాను తనిఖీ చేశారు. ఫ్రిజ్‌లో ఉన్న మాంసం రాక్ ఐస్‌గా మారిపోయిందని అధికారులు చెప్పారు. గునపంతో దీన్ని పగలకొట్టాల్సి వచ్చిందన్నారు. ఈ మాంసం బక్రీద్ సందర్భంగా విరాళంగా ఇచ్చినట్టు నిర్వాహకులు అధికారులకు వివరించారు. అసలు కుళ్లిపోయిన మాంసాన్ని ఫ్రిజ్‌లో ఎందుకు భద్రపరిచారన్న దానికి మాత్రం సమాధానం చెప్పలేదు. ఈ మాంసం నమూనాలను ప్రయోగశాలకు పంపారు. కాగా, ఘటన జరిగిన మదర్సాను సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా పరిశీలించారు.

నా బిడ్డను ఏదో చేశారు

మస్తాన్ బీ, కరిష్మా తల్లి

'కరిష్మాను ఏడాది క్రితం మదర్సాలో చేర్పించాను. రంజాన్ పండుగకు ఇంటికొచ్చింది. పండుగ అయ్యాక తిరిగి మదర్సాలో అప్పగించాం. కరిష్మాను చూద్దామని కొద్దిరోజుల క్రితం వచ్చాను. ఇంటి నుంచి తీసుకొచ్చి ఇంకా నెల పూర్తికాలేదని చూపించలేదు. ఆమెకు ఇద్దామని కొత్త దుస్తులు కుట్టించాం. మా కుమార్తెకు ఇప్పటి వరకు ఎప్పుడూ జ్వరం కూడా రాలేదు. పూర్తి ఆరోగ్యంగా ఉంటుంది. ఉదయం ఫోన్‌చేసి కరిష్మాకు ఆరోగ్యం బాగోలేదని చెప్పారు. మేము వచ్చేసరికి చనిపోయింది. మదర్సాలో ఏదో జరిగింది. అసలు అక్కడ ఏం జరిగిందో తెలియాలి.'

ఇక కార్..గో

జూలై 1 నుంచి విజయవాడ ఎయిర్‌పోర్టులో కార్గో సేవలు



- కాంట్రాక్టు దక్కించుకున్న ఒమేగా ఎంటర్‌ప్రైజెస్
- రైతులు, వర్తక, వ్యాపార, పారిశ్రామిక వర్గాలకు వరం
- విమానయాన సంస్థలు, విమానాశ్రయానికి ఆదాయం
- పాత టెర్మినల్ భవనాన్ని విస్తరించాల్సిన అవసరం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కొద్దిరోజుల్లో విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి కార్గో సేవలు ప్రారంభంకానున్నాయి. కార్గో సేవలందించే టెండర్లు ఖరారయ్యాయి. ఒమేగా ఎంటర్‌ప్రైజెస్ సంస్థ ఈ కాంట్రాక్టును దక్కించుకుంది. డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ), ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) అనుమతులు కూడా పొందింది. దీంతో జూలై 1 నుంచి కార్గో సేవలు ప్రారంభం కానున్నాయి.

కరోనా తర్వాత ఇన్నాళ్లకు..

2017 మధ్య కాలంలో విజయవాడ విమానాశ్రయంలో కార్గో సేవలు ప్రారంభమయ్యాయి. అప్పట్లో శ్రీప లాజిస్టిక్స్ అనే సంస్థ టెండర్లను దక్కించుకుంది. 2020-కరోనా సమయంలో ఈ సేవలు నిలిచిపోయాయి. కేవలం ఇన్‌కమింగ్ తప్ప, అవుట్‌గోయింగ్‌కు అవకాశం లేకుండాపోయింది. కరోనా పరిస్థితులు చక్కబడినా అవసరమైన అనుమతులను శ్రీప లాజిస్టిక్స్ సాధించలేదు. దీంతో కార్గో సేవలు ఆగిపోయాయి. ఇన్నాళ్లకు మళ్లీ కార్గో సేవలు మొదలవుతున్నాయి. రైతులు, వర్తకులు, వ్యాపార వర్గాల నుంచి పదేపదే ప్రతిపాదనలు వస్తుండటంతో ఎయిర్‌పోర్టు అధికారులు ఏఏఐ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విజయవాడ విమానాశ్రయం నుంచి ప్రస్తుతం 24 విమానాలు నడుస్తున్నాయి. వీటిలో దాదాపు 50 టన్నుల వరకు సరుకు రవాణా చేసే వీలుంటుంది. స్థానికంగా ఉన్న రైతులు, వ్యాపారులు, వర్తకులకు ఇది ఎంతో ప్రయోజనం. తక్కువ ఖర్చుతో దేశీయంగా సరుకు రవాణా చేసుకునే వెసులుబాటు కలుగుతుంది. ఇప్పటి వరకు రోడ్డు, రైలు మార్గాలపై ఆధారపడిన వారికి ఇది శుభపరిణామమే. మన ప్రాంతంలో ఎక్కువగా కూరగాయలు, ఆహారశుద్ధి ఉత్పత్తులు, చేపలు, రొయ్యల ఎగుమతులు, దిగుమతులు ఎక్కువ. ఈ కార్గో సేవల ద్వారా విమానయాన సంస్థలకు, విమానాశ్రయానికి అదనపు ఆదాయం కూడా సమకూరుతుంది.

కార్గో టెర్మినల్‌ను విస్తరించాలి

ప్రస్తుతం ఉన్న కార్గో టెర్మినల్ ఎప్పుడో పాత అవసరాల కోసం నిర్మించింది. ఈ టెర్మినల్ ప్రస్తుత అవసరాలకు సరిపోదు. విస్తరించాల్సిన అవసరం ఉంది. లేదంటే శాశ్వత ప్రాతిపదికన భవన నిర్మాణం చేపట్టాలి. ఇటీవల కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఇక్కడకు వచ్చిన సందర్భంలో విజయవాడ ఎయిర్‌పోర్టు అభివృద్ధికి భరోసానిచ్చారు. కార్గో టెర్మినల్ విస్తరణ అవసరాన్ని విమానాశ్రయ డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంత్‌రెడ్డి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి కూడా సానుకూలంగా స్పందించడంతో టెర్మినల్ భవన విస్తరణకు మార్గం ఏర్పడింది.

1 నుంచి కార్గో సేవలు

జూలై 1 నుంచి కార్గో సేవలు ప్రారంభించటం ఆనందంగా ఉంది. విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి కార్గోకు ఎంతో డిమాండ్ ఉంది. వ్యాపార వర్గాల నుంచి అనేక విజ్ఞాపనలు వచ్చాయి. దీనిని ఏఏఐ దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పటికి అవకాశం వచ్చింది. మన రాష్ట్రానికి చెందినవారే కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కావటం శుభపరిణామం. కార్గో టెర్మినల్ అంశాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లాం..

- ఎం.లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎయిర్‌పోర్టు డైరెక్టర్

వైసీపీతో అంటకాగి...





వీసీ జ్ఞానమణి

కృష్ణా యూనివర్శిటీ వీసీ అడ్డగోలు పాలన

- ఎంబీఏ నాలుగో సెమిస్టర్ ఫలితాలు ఇవ్వకపోవడంపై గవర్నర్‌కు విద్యార్థుల ఫిర్యాదు
- అనర్హులకు పదవుల్లో ప్రాధాన్యత
- ప్రొఫెసర్లు రెండు వర్గాలుగా చీలినా పట్టించుకోని వైనం
- వర్శిటీలో గాడి తప్పిన పాలన
- విమర్శలతో వీసీ జ్ఞానమణి రాజీనామా

గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు చెప్పినట్టు తలాడించిన అధికారులకు ముచ్చెమటలు పడుతున్నాయి. అక్రమాలకు సహకరించిన అధికారులకు కష్టాలు తప్పడం లేదు. విద్యావంతులను తయారు చేసే యూనివర్శిటీకీ ఈ దుస్థితి తప్పలేదు. కృష్ణా యూనివర్శిటీలో పాలనను గాడి తప్పించి.. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడి, వైసీపీ నేతలు చెప్పినవారిని అందలం ఎక్కించడంలో కీలకపాత్ర పోషించిన వీసీ జ్ఞానమణి చివరికి బాధ్యతల నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. విమర్శలపాలై వీసీ బాధ్యతలకు శుక్రవారం ఆయన రాజీనామా చేయడం వర్శిటీలో హాట్‌టాపిక్‌గా మారింది.

అనర్హులను అందలమెక్కించి..

యూనివర్శిటీలోని రీసెర్చ్ విభాగంలో జరిగిన అక్రమాలు, యూనివర్శిటీ పరిధిలోని కళాశాలలకు అఫిలియేషన్ ఇచ్చేందుకు పరిశీలకుడిగా అర్హతలేని అధ్యాపకుడికి బాధ్యతలు అప్పగించారనే అంశంపైనా ఆయనపై విమర్శలున్నాయి. పీహెచ్‌డీల ప్రదానంలో చోటుచేసుకున్న జాప్యం, అక్రమాలను నివారించడంలోనూ ఆయన పట్టించుకోకపోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. వైసీపీ ప్రభుత్వం హయాంలో ఆ పార్టీ పెద్దల సూచనలతో కొందరు ప్రొఫెసర్లను వారి బాధ్యతల నుంచి తప్పించి, అర్హతలేని వారికి వివిధ విభాగాల్లో బాధ్యతలను అప్పగించడంపైనా వర్శిటీలో పెద్ద చర్చ నడిచింది.

మచిలీపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా యూనివర్శిటీ వీసీగా గతేడాది జూలై13వ తేదీన జ్ఞానమణి బాధ్యతలు చేపట్టారు. ఏడాది గడవకముందే ఆయన వీసీ పదవి నుంచి తప్పుకున్నారు. ఏడాదికాలంగా వైసీపీ నాయకులు చెప్పినట్టుగానే నడుచుకుని యూనివర్శిటీలో పరిపాలనాపరమైన అంశాల్లో ఆయన నిర్ణయాలు తీసుకున్నారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు.

గవర్నర్‌కు విద్యార్థుల ఫిర్యాదు

క్యాంపస్ కళాశాలలో ఎంబీఏ నాలుగో సెమిస్టర్ ఫలితాలు వెల్లడించకపోవడం, యూనివర్శిటీ పరిధిలోని మిగిలిన కళాశాలల్లో ఎంబీఏ ఫలితాలను వెల్లడించడంతో ఈ అంశం వివాదాస్పదమైంది. ఎంబీఏ నాలుగో సెమిస్టర్ రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకునే గడువు ఈనెల 18, 19 తేదీలతో పూర్తయినా క్యాంపస్ కళాశాలలో ఎంబీఏ ఫలితాలను మాత్రం వెల్లడించలేదు. దీంతో క్యాంపస్ కళాశాలలో ఎంబీఏ విద్యార్థులు గవర్నర్ కార్యాలయానికి ఫిర్యాదు చేశారు.

రెండు వర్గాలుగా ప్రొఫెసర్లు

నూజివీడు పీజీ సెంటరులో పనిచేస్తున్న ఒక ప్రొఫెసర్ యూనివర్శిటీలోజరుగుతున్న అక్రమాలపై విచారణ చేయాలని కృష్ణా యూనివర్శిటీ ప్రాంగణంలో గత నెలలో శాంతియుతంగా రిలేదీక్ష చేపట్టారు. దానిని భగ్నం చేసి సదరు ప్రొఫెసర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి మూడు గంటల పాటు అక్కడ ఉండేలా చేయడంతో యూనివర్శిటీలో పనిచేసే అధ్యాపకులు రెండు వర్గాలుగా విడిపోయారు. ఒకవర్గానికి వీసీ అనుకూలంగా ఉండి పరిపాలనా వ్యవహారాల్లో గజిబిజి వాతావరణం సృష్టించారు. యూనివర్శిటీలో భవనాల నిర్మాణం సక్రమంగా చేయకుండానే బిల్లులు చెల్లించడం, వాటి అంచనాలను పెంచడం, లేదా తగ్గించడంతో యూనివర్శిటీ పరిపాలనా లోపాలతోనూ వీసీ ఇటీవల వార్తల్లో నిలిచారు. ఈ నేపథ్యంలో వీసీ వ్యవహారశైలిపై గవర్నర్ కార్యాలయానికి, ఉన్నత విద్యాశాఖమండలికి పలు ఫిర్యాదులు వెళ్లాయి. వీటన్నిటి నేపథ్యంలో ఇమడలేక వీసీ తన పదవికి రాజీనామా చేశారని అధ్యాపకులు చెప్పుకుంటున్నారు.

నూతన వీసీ ఎవరో

కృష్ణా యూనివర్శిటీ వీసీ జ్ఞానమణి రాజీనామా చేయడంతో నూతన వీసీగా ఎవరిని నియమిస్తారనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. యూనివర్శిటీలో పనిచేసే సీనియర్ అధ్యాపకుడిని ఇన్‌చార్జి వీసీగా నియమించి, నాలుగైదు నెలల్లో నూతన వీసీని నియమిస్తారనే ప్రచారం జరుగుతోంది.

ఉదయం 11.30-మధ్యాహ్నం1.30 మధ్య దుర్గమ్మ దర్శనానికి రావొద్దు

వీఐపీలు, వృద్ధులు, దివ్యాంగులు, అన్ని శాఖల అధికారులకు ఈవో కేఎస్ రామారావు విజ్ఞప్తి

6లో..



ఉ.11.30 నుంచి మ.1.30 సమయంలో
దుర్గమ్మ దర్శనాలకు రావొద్దు

- వీఐపీలు, వృద్ధులు, దివ్యాంగులు, అన్ని శాఖల అధికారులకు ఈవో కేఎస్ రామారావు విజ్ఞప్తి..

వన్‌టౌన్, జూన్ 28 : దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో అమ్మవారికి ప్రతి రోజు ఉదయం 11.45 నుంచి మధ్యాహ్నం 12.15 మధ్య మహా నైవేద్య కార్యక్రమం జరుగుతున్నందున దర్శనాలు నిలిపివేస్తున్నామని ఈవో కేఎస్ రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో పాటుగా దేవస్థానంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని శుక్ర, శని, ఆదివారాలతో పాటు ఇతర రోజుల్లో కూడా భక్తుల రద్దీ పెరుగుతున్నందున భక్తులకు మెరుగైన సేవలందించేందుకు వీఐపీలు, వృద్ధులు, దివ్యాంగులు, అన్ని శాఖల అధికారులు ఉదయం 11.30 మధ్యాహ్నం 1.30 గంటల లోపు కాకుండా ఇతర సమయాలలో దర్శనానికి రావాలని విజ్ఞప్తి చేశారు. శుక్ర, శని, ఆదివారాలలో ఇతర ప్రత్యేక రోజులలో రద్దీ వీపరితంగా ఉండటం వలన కొండపైకి వాహనాల రాకపోకలను రద్దు చేసామని పున్నమిఘాట్, సీతమ్మవారి పాదాల వద్ద పార్కింగ్‌లో వాహనాలను నిలుపుకుని దేవస్థానం బస్సులలో కొండపైకి చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ధర్మపథం వేదికపై..

దుర్గగుడిలోని ధర్మపథం వేదికపై శుక్రవారం స్వేచ్ఛ నృత్య తరంగిణి గోవర్ధనరావు ఆధ్వర్యంలో కూచిపూడి నాట్యప్రదర్శన హృద్యంగా నిర్వహించారు. పలు కీర్తనలకు కళాకారులు తమ అభినయ కౌశలంతో ఆకట్టుకున్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి



వన్‌టౌన్, జూన్ 28 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో కనకదుర్గమ్మ దర్శనార్థం శుక్రవారం రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ విచ్చేశారు. ఆయనకు ఈవో కేఎస్ రామారావు, అధికారులు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వేదపండితులు ఆయనకు వేదాశీర్వచనం చేశారు. ఈవో ఆయనకు అమ్మవారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.



జార్ఖండ్, తెలంగాణ రాష్ట్రాల గవర్నర్‌కు స్వాగతం చెబుతున్న కలెక్టర్ సృజన

జార్ఖండ్, తెలంగాణ రాష్ట్రాల గవర్నర్‌కు ఘనస్వాగతం

గన్నవరం/వన్‌టౌన్, జూన్ 28: జార్ఖండ్, తెలంగాణ రాష్ట్రాల గవర్నర్ రాధాకృష్ణన్‌కు గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. హైదరాబాద్ నుంచి శుక్రవారం ఆయన ఇక్కడికి విచ్చేశారు. తెలంగాణా గుంటూరు ఆర్డీవో శ్రీకర్, పలువురు ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన ఉండవల్లి సీఎం చంద్రబాబు నివాసానికి తరలివెళ్లారు. ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు విచ్చేసిన రాధాకృష్ణన్‌కు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. శుక్రవారం నగరంలో రాధాకృష్ణన్ పర్యటించారు.



గోపికృష్ణ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు, నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

స్వగ్రామానికి గోపికృష్ణ మృతదేహం



- కన్నీటి పర్యంతమైన భార్య, తల్లిదండ్రులు
- యాజలి గ్రామంలో అలుముకున్న విషాదం
- పాడి మోసిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ
- గోపికృష్ణ భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

కర్లపాలెం, జూన్ 28 : అమెరికాలో తుపాకీ కాల్పుల్లో మృతి చెందిన బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం యాజలికి చెందిన దాసరి గోపికృష్ణ మృతదేహం శుక్రవారం వేకువజామున చేరుకుంది. తల్లిదండ్రులు, భార్య బంధువులు వారం రోజులపాటు మృతదేహం కోసం క్షణం ఒక యుగంగా నిరీక్షించారు. మృతదేహం ఇంటికి చేరుకునే సరికి తల్లిదండ్రులు, భార్య బంధువుల రోదనలతో ఆ ప్రాంతంలో విషాదం అలుముకుంది. మృతదేహం వచ్చిన సమాచారంతో గ్రామస్థులు పెద్దసంఖ్యలో గోపికృష్ణ ఇంటికి చేరుకున్నారు. గోపికృష్ణ తల్లిదండ్రులు ధనలక్ష్మీ, శ్రీనివాసరావు, భార్య ప్రవల్లికలను ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఓదార్చే ప్రయత్నం చేశారు. మృతదేహనికి నరేంద్రవర్మ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, తహసీల్దార్ నిర్మలానందబాబా పాడి మోశారు. అమెరికా నుంచి స్వగ్రామానికి మృతదేహం చేరుకోవడానికి అవసరమైన ఏర్పాట్లను ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఎమ్మెల్యే మాట్లాడి ప్రత్యేకంగా పర్యవేక్షించారు. కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. గోపికృష్ణ భార్యకు ప్రభుత్వం తరపున ఉద్యోగం ఇప్పిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రెవెన్యూశాఖా మంత్రి రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్‌లు ప్రకటించారని నరేంద్రవర్మ తెలిపారు.

విద్య, వైద్యరంగాల్లో ఎన్టీఆర్ ట్రస్ట్ సేవలు

- పాగోలు మోడల్ స్కూల్ విద్యార్థుల ఉత్తమ ఫలితాలు
- కుప్పంలో మహిళలకు స్వయం ఉపాధి కోసం టైలరింగ్‌లో శిక్షణ
- మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి



విద్యార్థినులతో మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

చల్లపల్లి, జూన్ 28 : ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా విద్య, వైద్యం, స్వయం ఉపాధి రంగాల్లో సేవలు అందిస్తున్నట్టు ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి తెలిపారు. చల్లపల్లి మండలం పాగోలులోని ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌ను శుక్రవారం భువనేశ్వరి సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లలను పలకరించి, తరగతి, హాస్టల్ గదులు, వసతి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. భోజనశాలను పరిశీలించి పిల్లలతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, 1997లో చంద్రబాబునాయుడు ఎన్టీఆర్ ట్రస్ట్‌ను ప్రారంభించారని తెలిపారు. ప్రతి రక్తపు బొట్టు ఆపదలోని జీవితంలో వెలుగులు నింపుతుందనే ఆలోచనతో బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటు చేయటం జరిగిందనీ, ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గండిపేటలో ట్రస్ట్ హైస్కూల్, మహిళా కళాశాల, చల్లపల్లిలో హైస్కూల్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గండిపేటలో విద్యాసంస్థ నిర్వహణలో వచ్చే లాభాలను చల్లపల్లి విద్యాసంస్థ నిర్వహణకు వినియోగిస్తామన్నారు. అనాధ పిల్లలు, తల్లిదండ్రులు పోగొట్టుకున్న పిల్లలకు ఇక్కడ చదువుచెప్పటం జరుగుతుందని తెలిపారు. పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో భవఘ్నసాయి రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించినట్టు తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామనీ, ఇక్కడ సేవలందించే వలంటీర్లు ఉండటం సంతోషకరమన్నారు. సంజీవిని క్లినిక్‌ను సాలూరులో ప్రారంభించామని, మెడికల్ సర్వీస్ అందుబాటులో లేని ఏజెన్సీ ప్రాంతాల్లో నిర్వహించదలచినట్టు తెలిపారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో క్లినిక్‌లు ప్రారంభించినట్టు చెప్పారు. మొబైల్ బస్ ద్వారా వైద్యసౌకర్యాలు అందించనున్నట్టు వివరించారు. మహిళల స్వయం ఉపాధికి కుప్పంలో మూడు నెలల టైలరింగ్ శిక్షణ ప్రారంభించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మదుసూదనరావు, హైస్కూల్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి

- డయేరియా మృతులకు రూ.10లక్షల పరిహారం చెల్లించాలి
- గ్రామీణ ప్రాంతాలకు కృష్ణా జలాలు అందించండి
- సీపీఎం నేత సీహెచ్ బాబురావు డిమాండ్



ఆరోగ్యకేంద్రంలో డయేరియా బాధితులను పరామర్శిస్తున్న సీహెచ్ బాబురావు తదితరులు

జగ్గయ్యపేట, జూన్ 28 : రాష్ట్రంలో పలు జిల్లాల్లో డయేరియా ప్రబలుతుండటంపై రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబురావు డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం జగ్గయ్యపేటలో డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేట సామాజిక ఆరోగ్యకేంద్రంలో విలేకర్లతో మాట్లాడుతూ, జగ్గయ్యపేట ప్రాంతంలో ఆరుగురు డయేరియాతో మృతి చెందితే అధికారులు సంఖ్య తగ్గించి ప్రభావాన్ని తగ్గించి చూపే ప్రయత్నం చేయటం తగదన్నారు. ప్రభుత్వం డయేరియా మృతులకు కనీసం రూ.10లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కనీసం ప్రజలకు సురక్షిత మంచినీటిని అందించే పరిస్థితిలో గ్రామ పంచాయతీలు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. షేర్‌మహ్మద్ పేటతో పాటు పలు గ్రామాలకు కృష్ణాజలాలను అందించాలని కోరారు. ఏఐబీ ద్వారా పురపాలకసంఘాల్లో పైపులైన్ల విస్తరణ, మార్పిడికి మంజూరు చేసిన నిధులలో గత ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకపోవటంతో పనులు జరగలేదని, ప్రస్తుత ప్రభుత్వం శ్రద్ధ చూపి తిరిగి పనులు చేపట్టాలని కోరారు. జగ్గయ్యపేటలో పైపులైన్ మార్పిడి పనులకు రూ.5కోట్లు ఇవ్వాలని, పంచాయతీలకు రూ.5లక్షలు ఇవ్వాలని, ఆసుపత్రుల్లో సౌకర్యాలు పెంచాలని, మందులు ఎప్పుడు ఉండేలా చూడాలని, సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఆయనతో పాటు సీపీఐ నేతలు సుబ్బరావమ్మ, జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ, ఎస్‌సీహెచ్ శ్రీనివాస్, నాగమణి, హనుమంతురావు, కోటకృష్ణ, రాము, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ పేరు పునరుద్ధరించడం సంతోషకరం : యార్లగడ్డ

విశాఖపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలోని ఆరోగ్య విశ్వవిద్యాలయానికి ఎన్.టి.ఆర్ పేరును పునరుద్ధరించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్‌లకు పద్మవిభూషణ్ డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఏయూలోని హిందీ భవన్‌లో శుక్రవారం ఉదయం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సత్యకుమార్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఈ మేరకు తాను మెసేజ్ పెట్టినట్టు లక్ష్మీప్రసాద్ వెల్లడించారు. హెల్త్ యూనివర్సిటీకి ఎన్‌టీఆర్ పేరు తొలగించడాన్ని నిరసిస్తూ అధికార భాష సంఘం ఛైర్మన్, హిందీ భాషా సంఘం ఛైర్మన్ పదవులకు తాను రాజీనామా చేశానని, కేబినెట్ హోదాతోపాటు మూడు లక్షల వేతనాన్ని వదులుకున్నానన్నారు. మళ్లీ, ఎన్‌టీఆర్ పేరును పునరుద్ధరించినందుకు ఆనందంగా ఉందన్నారు. రాజకీయాల్లో హత్యలు ఉండవని, ఆత్మహత్యలు మాత్రమే ఉంటాయని వైసీపీ ఓటమిపై మీడియా అడిగిన ప్రశ్నకు నర్మగర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. ఎన్‌టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కోరడాన్ని తాను స్వాగతిస్తున్నానన్నారు.

హిందీ భాష అభివృద్ధికి కృషి

అంతర్జాతీయ స్థాయిలో హిందీ భాషకు గుర్తింపు వచ్చేలా కృషి చేస్తున్నామని లక్ష్మీప్రసాద్ పేర్కొన్నారు. అందుకు ప్రధాని నరేంద్ర మోదీ కృషిచేస్తున్నారన్నారు. భవిష్యత్తులో చట్టాలన్నీ హిందీలో వస్తాయన్నారు. హిందీని ఐక్యరాజ్య సమితి కూడా అధికార భాషగా గుర్తించాలన్నారు. ఈ మేరకు తాము కృషిచేస్తున్నట్టు ఆయన వెల్లడించారు.

ఎమర్జెన్సీ, చీకటి రోజులకు కారణమైన కాంగ్రెస్‌కు
రాజ్యాంగంపై మాట్లాడే హక్కు లేదు

- మంత్రి సత్యకుమార్



సదస్సులో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

మొగల్రాజపురం, జూన్ 28 : ఎమర్జెన్సీ చీకటి రోజులకు కారణమైన కాంగ్రెస్ రాజ్యాంగం గురించి మాట్లాడటం దారుణమని రాష్ట ఆరోగ్య శాఖ మంత్రి, బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పీబీ సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో 'నాటి ఎమర్జెన్సీ సమయంలో జరిగిన యదార్థ సంఘటనలు'పై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎమర్జెన్సీలో సంఘ్ పరివార్‌కు చెందిన లక్షమందిని జైల్లో పెట్టిన కాంగ్రెస్‌కు నేడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. జాతీయ స్థాయిలో అనాడు ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ఆర్‌ఎస్‌ఎస్ పత్రిక ఆర్గనైజర్, ఈనాడు ఎమర్జన్సీకి వ్యతిరేకంగా పోరాడి ప్రజాస్వామ్య విలువలను కాపాడే ప్రయత్నం చేశాయన్నారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాటం చేసిన ఆంజనేయులు, టీవీ సత్యనారాయణ, సత్యమూర్తి వంటి వారు మనముందు ఉన్నారని చెప్పారు. కొన్ని రాజకీయ పార్టీలు అధికారంలోకి రాగానే కేంద్రంలో నరేంద్రమోదీ రాజ్యాంగాన్ని మార్చుతారని ప్రచారం చేశారని దుయ్యబట్టారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాపాడేదే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అని చెప్పారు. కాంగ్రెస్ మోచేతి నీళ్లు తాగే కొందరు కమ్యూనిస్టులు కాలం చెల్లిన సిద్ధాంతాలను పట్టుకుని వేలాడుతున్నారని విమర్శించారు. మన రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాలు అప్రకటిత ఎమర్జెన్సీ సాగిందని చెప్పారు. ప్రభుత్వ నిధులు మళ్లింపు నుంచి ప్రశ్నించిన వారిని జైళ్లలో పెట్టడం వరకు ఎమరెన్సీని తలపించగా.. పాలనను గాలికి వదిలేశారని, గాడి తప్పిన రాష్ట్రాన్ని, పాలనను గాడిలో పెట్టే బాధ్యతను ప్రజలు చంద్రబాబుకు అప్పగించారని చెప్పారు. సమయం ఇస్తే చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌కు గత వైభవం తెస్తారని చెప్పారు. కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమి కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు కోనేరు దుర్గాప్రసాద్, అడ్డూరి శ్రీరాం, తదితరులు ప్రసంగించారు. కార్యక్రమానికి బీజేపీ సీనియర్‌నేత కిలారు దిలీప్ వ్యాఖ్యతగా వ్యవహరించారు.

ఓ మనిషీ.. నువ్వెక్కడ

(5వ పేజీ తరువాయి)

కక్షకట్టి.. కత్తితో నరికి..

శ్రీరామచంద్రప్రసాద్‌కు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె దర్శిని బీటెక్ రెండో సంవత్సరం చదువుతోంది. మణికంఠ ప్రేమ వ్యవహారం తెలిశాక శ్రీరామచంద్రప్రసాద్ తన కుమార్తెను కట్టడి చేశాడు. తనతో కిరాణా షాపునకు తీసుకొచ్చి తన వద్ద పెట్టుకుంటున్నాడు. ఇక దర్శినితో ప్రేమ విషయం ఇంట్లో తెలిశాక మణికంఠకు తల్లితో గొడవలు మొదలయ్యాయి. దీంతో ఆమె గురువారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కానీ, ఆమె వంటలు చేయడానికి వెళ్లిందని తెలుస్తోంది. తన తల్లి బయటకు వెళ్లిపోవడానికి కారణం శ్రీరామచంద్రప్రసాదేనని భావించిన మణికంఠ కక్ష పెంచుకున్నాడు.

పశ్చాత్తాపం తెలియని ఉన్మాది

హత్య జరిగిన కొన్ని గంటల్లోనే నిందితుడు మణికంఠను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. పోలీసులు విచారిస్తున్న సమయంలో మణికంఠ ఘరానాగా సమాధానం చెప్పినట్టు సమాచారం. చాలా పెద్ద తప్పు చేశావని ఓ ఎస్‌ఐ అతడిపై ఆగ్రహం వ్యక్తం చేయగా, తాను చేసింది తప్పయితే, ఆయన (దర్శిని తండ్రి) చేసింది తప్పు కాదా అని ఎదురు ప్రశ్నించినట్టు తెలిసింది.

చాలాసార్లు బెదిరించాడు : దర్శిని

'ఇంటర్ సెకండియర్ నుంచి మణికంఠతో పరిచయం ఉంది. విషయం తెలిసి మా డాడీ మణికంఠ వాళ్ల ఇంటికి వెళ్లారు. అప్పటి నుంచి మణికంఠ మమ్మల్ని బెదిరిస్తున్నాడు. నా జోలికి రావద్దని డాడీ చెప్పారు. తప్పు మాదేనని వాళ్ల అమ్మ ఒప్పుకొంది. తర్వాత నుంచి మా డాడీని కొడతానని గొడవ చేసేవాడు. ఇదే విషయాన్ని ఇంట్లో చెప్పాను. ఫిబ్రవరిలో మణికంఠ ఇంటికి డాడీ వెళ్లారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తామంటే వాళ్లమ్మ వద్దని వారించింది. కెరియర్ పాడైపోతుందని ప్రాధేయపడింది. అందుకే మేము పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. ఫిబ్రవరి తర్వాత నుంచి మణికంఠతో ఎలాంటి కాంటాక్ట్ లేదు. అతడు మాకు కనిపించలేదు. గురువారం రాత్రి డాడీ, నేను షాపు మూసేసి ఇంటికి బయలుదేరాం. కొంత దూరం రాగానే, బైక్‌పై వచ్చి ఢీ కొట్టాడు. డాడీ, నేను కింద పడిపోయాం. బైక్ స్టాండ్ వేసి వచ్చి డాడీని కత్తితో నరికాడు. నేను స్కూటర్ వెనుక వైపు కూర్చున్నాను కాబట్టి కింద పడిన వెంటనే పైకి లేచాను. డాడీ పైకి లేవలేకపోయారు. మణికంఠను ఆపుతుంటే నన్ను కొట్టబోయాడు. మా డాడీని విచక్షణారహితంగా నరికాడు.' అని దర్శిని కన్నీటిపర్యంతమైంది.

జవాబుదారీగా పనిచేయండి

- అధికారులతో కలెక్టర్ బాలాజీ సమీక్ష
- అవరోధాలు అధిగమించాలని ఆదేశం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బాలాజీ

అవనిగడ్డ, జూన్ 28 : అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో జవాబుదారీగా వ్యవహరించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ జిల్లా అధికారులకు సూచించారు. అవనిగడ్డలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి సమీక్షా సమావేశంలో కలెక్టర్ వివిధ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, తీరప్రాంత మండలాలైన కోడూరు, నాగాయలంక ప్రాంతాల్లో నీరు అందించి అక్కడి రైతులు పంట పండించుకునేలా వెసులుబాటు కల్పించాలని సూచించగా, కలెక్టర్ స్పందించి అందుకు ఎదురయ్యే అవరోధాలను తొలగించి ఆ ప్రాంతాలకు సక్రమంగా నీరు అందించేలా చూడాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. నాగాయలంక మండల పరిధిలోని ఎదురుమొండి దీవుల్లో ప్రధాన సమస్యగా ఉన్న నాచుగుంట - ఎదురుమొండి రహదారి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, త్వరలోనే అటవీశాఖాధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి అటవీ శాఖ అనుమతుల విషయంలో జరుగుతున్న ఇబ్బందులు తొలగిస్తామని తెలిపారు. కాంట్రాక్టర్లపై ఒత్తిడి తీసుకొచ్చి రహదారి పనులను వెంటనే పూర్తి చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. జూలై నెలలో వన మహోత్సవం నిర్వహించి కరకట్టల వెంబడి పెద్ద ఎత్తున మొక్కలు నాటి ప్రతీ మొక్క పెరిగి పెద్దయ్యేలా సంరక్షించే ఏర్పాట్లు కూడా చేయాలని కలెక్టర్ డ్వామా, పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన చట్టాలను ఖచ్చితంగా అమలు చేయాలని బుద్ధప్రసాద్ అధికారులకు సూచించారు. జేసీ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు, ఆర్డీవో శ్రీదేవి, గణేష్, తెహెరా సుల్తానా, డీఎంఅండ్ హెచ్‌వో గీతాబాయి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భద్రాచలం రోడ్-విజయవాడ రైలు తాత్కాలికంగా రద్దు

రైల్వేస్టేషన్, జూన్ 28 : సికింద్రాబాద్ డివిజన్‌లో ట్రాఫిక్ నిర్వహణ కారణంగా 0278, 07979 నెంబరు భద్రాచలం రోడ్-విజయవాడ రైళ్లను జూలై 1 నుంచి 31వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్టు విజయవాడ డివిజన్ పీఆర్‌వో నుస్రత్ ఎం మండ్రూప్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మన్మాడ్-దౌండ్ సెక్షన్‌లోని పూణే డివిజన్‌లో కుంటాంబ-కంచాన్‌గావ్ మార్గంలో షిరిడీ సాయినగర్ ఎక్స్‌ప్రెస్‌ను పునరుద్ధరిస్తున్నట్టు విజయవాడ డివిజన్ అధికారులు తెలిపారు. గతంలో ఈ నెల 29, 30వ తేదీలలో షిరిడీ సాయినగర్ ఎక్స్‌ప్రెస్ రైలును రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. అయితే 17206 కాకినాడపోర్టు-షిరిడీ సాయినగర్ ఎక్స్‌ప్రెస్‌ను శనివారం డెస్టినేషన్ వరకు నడుపుతున్నట్టు తెలిపారు. 17205 షిరిడీ సాయినగర్-కాకినాడ పోర్టు ఎక్స్‌ప్రెస్ యథావిధిగా షెడ్యూల్ ప్రకారం నడుస్తుందని ప్రకటించారు.

ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మెషీన్ ఫెసిలిటేటర్లకు జీతాలు ఉండవు

రైల్వేస్టేషన్, జూన్ 28 : ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మెషీన్ (ఏటీవీఎం)ల ఫెసిలిటేటర్లకు ఎటువంటి జీతభత్యాలు, ఉద్యోగ ప్రయోజనాలు ఉండవని విజయవాడ రైల్వే డివిజన్ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇది శాశ్వత, తాత్కాలిక ఉద్యోగం కూడా కాదని స్పష్టం చేశారు. ఈ మేరకు పీఆర్‌వో ఒక ప్రకటన చేస్తూ ఈ నెల 10వ తేదీన ఏటీవీఎంలలో ఫెసిలిటేటర్లను ఏర్పాటు చేయడం కోసం నోటిఫికేషన్ జారీ చేసినట్టు తెలిపారు. ప్రయాణికులకు సులభమార్గంలో ఏటీవీఎంల ద్వారా టికెట్ల జారీ కోసం ఈ సౌకర్యం ఏర్పాటు చేయబడిందని, వీటిని నిర్వహించే వారికి ఎటువంటి వేతనాలు, ఉద్యోగ ప్రయోజనాలు కానీ ఉండవని తెలిపారు. అయితే కొంతమంది తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నట్టుగా తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. నిబంధనల ప్రకారం ఏటీవీఎం ఫెసిలిటేటర్లకు టికెట్లు విక్రయించగా వచ్చిన డబ్బుపై బోనస్‌ను మాత్రమే తీసుకోవడానికి అర్హత ఉంటుందని, ఎటువంటి ప్రకటనలను నమ్మవద్దని తెలిపారు. దీనిపై ఎవరికైనా సందేహాలున్నట్టయితే సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కార్యాలయంలో సంప్రదించాలని చెప్పారు. ఏటీవీఎం ఫెసిలిటేటర్లకు సంబంధించిన దరఖాస్తులను వెబ్‌సైట్‌లో నుంచి పొందవచ్చునని తెలిపారు.



అంతిమయాత్రలో పాల్గొన్న నేతలు

టీడీపీ మహిళానేతకు అంతిమ వీడ్కోలు

- భారీగా హాజరైన అభిమానులు, నేతలు

ఉంగుటూరు, జూన్ 28 : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన తెలుగుదేశంపార్టీ మండల మహిళా అధ్యక్షురాలు మండవ రమ్యకృష్ణ(33)అంత్యక్రియలు బంధుమిత్రులు, పార్టీనాయకులు, కార్యకర్తలు, మహిళానేతల అశ్రునయనాల మధ్య పెదఅవుటపల్లిలోని శ్మశానవాటికలో శుక్రవారం పూర్తయ్యాయి. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన సందర్భంగా మొక్కు తీర్చుకునేందుకు షిర్డీ వెళ్లి సాయినాథుని దర్శించుకుని తిరిగి వస్తున్న క్రమంలో మహారాష్ట్రలోని కేజ్ టౌన్ వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె మృతిచెందిన విషయం తెలిసిందే. రమ్యకృష్ణ భౌతికకాయాన్ని శుక్రవారం ఉదయం 5.30గంటలకు పెదఅవుటపల్లిలోని ఆమె స్వగృహానికి తీసుకువచ్చారు. పలువురు ప్రముఖులు, పార్టీ ముఖ్యనేతలు, నాయకులు, ప్రజాప్రతినిధులు రమ్యకృష్ణ పార్థివదేహాన్ని సందర్శించి, పూలమాలలువేసి నివాళులర్పించారు.

టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ రమ్యకృష్ణ భౌతికకాయంపై పార్టీ జెండాను వుంచి జోహార్లు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాధారణ కుటుంబం నుంచి వచ్చిన రమ్యకృష్ణ వైసీపీ విధ్వసంకర పాలనపై ఎదురొడ్డి పోరాడిన ధీశాలి అన్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ తెలుగు మహిళలకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఆమె మరణం నియోజకవర్గ తెలుగుదేశంపార్టీకి తీరని లోటన్నారు. ఆమె కుటుంబానికి పార్టీ అండగా వుంటుందని కొనకళ్ల హామీ ఇచ్చారు.

తిరుపతి పర్యటనలో వున్న గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఫోన్‌లో రమ్యకృష్ణ భర్త శ్రీకాంత్‌ను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కృష్ణామిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావు, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు సతీష్, నియోజకవర్గ జనసేనపార్టీ కన్వీనర్ చలమలశెట్టి రమేష్, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండలస్థాయి నాయకులు చిరుమామిళ్ల సూర్యం, బచ్చుల సుబ్రహ్మణ్యం(బోసు), దొంతు చిన్నా, ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, ఆరుమళ్ల వెంకట కృష్ణారెడ్డి, ఆళ్ల హనోక్, దయాల రాజేశ్వరరావు, జాస్తి వెంకటేశ్వరరావు, బోడపాటి రవికుమార్, కోనేరు సందీప్, పొదిలి దుర్గారావు, గుండపనేని ఉమావరప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు, కొండేటి వెంకటేశ్వరరావు, గూడవల్లి నరసింహారావు, కొండేటి కొండలరావు, కలపాల కిరణ్, మూల్పూరి సాయికళ్యాణి, మండవ లక్ష్మి, తలశిల స్వర్ణలత, అంతిమయాత్రలో కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అధికసంఖ్యలో పాల్గొని తుది వీడ్కోలు పలికారు.

మంత్రి రవీంద్ర ప్రజాదర్బార్ నేడు

మచిలీపట్నం టౌన్, జూన్ 28 : కొల్లు రవీంద్ర ప్రజలకిచ్చిన వాగ్దానం మేరకు శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు బృందావన్ టాకీసు పక్కన మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కార్యాలయం వద్ద ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు టీడీపీ సీనియర్ నేత గొర్రెపాటి గోపీచంద్ తెలిపారు. ప్రజలు తమ డివిజన్లు, గ్రామాలలోని తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, రేషన్‌కార్డులు, పించన్ల పంపిణీ వంటి సామాజిక సమస్యలతో పాటు వ్యక్తిగత సమస్యలను రాత పూర్వకంగా ప్రజాదర్బార్‌లో మంత్రి రవీంద్రకు ఇవ్వాలన్నారు.

అసభ్య ప్రవర్తన కేసులో ఐదేళ్ల జైలు

మచిలీపట్నం టౌన్, జూన్ 28 : మైలవరం మండలం వెల్వడం గ్రామానికి చెందిన బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన పత్తిపాటి రాజాకు మచిలీపట్నం పోక్సో కోర్టు శుక్రవారం ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చింది. 2015 నవంబరులో బాలిక స్నానం చేస్తుండగా బాత్‌రూమ్‌లోకి వెళ్లి రాజా బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దీనిపై పోలీసులు కేసు నమోదుచేశారు. పోక్సో జడ్జి గాజుల వెంకటేశ్వర్లు శుక్రవారం తన తీర్పులో ఐదేళ్ల జైలు శిక్ష, రూ.4వేల జరిమానా విధించారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.వి. మహేష్‌కుమార్ ఆరుగురుని విచారించి వాదనలు వినిపించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.25

నూరుబాషా సంఘం జెండా ఆవిష్కరణ



విద్యాధరపురం, జూన్ 28 : భవానీపురం బ్యాంక్ సెంటర్లో ఆధునీకరించిన నూరుబాషా సంఘం జెండాను శుక్రవారం పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్ మీరా ఆవిష్కరించారు. ఇందుకుగాను కేశినేని శివనాథ్ మూడు లక్షల రూపాయల విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో 40 డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పొనుగుపాటి చిన్న సుబ్బయ్య నూరు బాషా సంఘం కమిటీ సభ్యులు ఈ సందర్భంగా అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. షేక్‌గాలిబ్ ఫైజాన్, పకీర్ కమల్, షేక్ సుభాని పాల్గొన్నారు.

Capital CINEMAS 4K
TRENDSET MALL, BENZ CIRCLE
Book Online Tickets : Paytm TICKETNEW
NOW SHOWING



MAHARAJA (U/A) (TEL) 1:10 PM,4:00 PM
KALKI 2898 AD (U/A) (3D) (TEL)
7:30 AM,7:45 AM,8:15 AM,11:00 AM,11:20 AM
11:50 AM,2:30 PM,2:55 PM,3:25 PM,6:00 PM
6:30 PM,7:00 PM,9:30 PM,10:05 PM,10:35 PM
KALKI 2898 AD (U/A) (2D) (TEL)
8:00 AM,8:10 AM,8:30 AM,9:40 AM,,11:30 AM
11:55 AM,12:05 PM,3:00 PM,3:40 PM,6:35 PM
6:50 PM,7:15 PM,10:00 PM,10:40 PM,10:50 PM
*NOTE: Timings are subject to change without any prior notice.

ఉద్యోగులు ప్రజలతో మమేకం కావాలి

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



14వ డివిజన్ సచివాలయం ఉద్యోగులతో మాట్లాడుతున్న గద్దె రామ్మోహన్

పటమట, జూన్ 28 : ప్రభుత్వ సేవలను పొందటానికి వార్డు సచివాలయానికి వచ్చే ప్రజలతో ఉద్యోగులు స్నేహపూర్వకంగా మమేకం అయి సేవలను అందించాలని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పిలుపునిచ్చారు. పటమట 14వ డివిజన్ అంబేద్కర్ నగర్‌లోని 14వ డివిజన్ 283 వార్డు సచివాలయాన్ని రామ్మోహన్ స్వయంగా పరిశీలించారు. అక్కడికి వచ్చిన ప్రజలు, స్థానికంగా ఉన్న ఉద్యోగులతో మాట్లాడారు. ప్రజలు ఏ పని కోసం వచ్చారో తెలుసుకుని వారి పని త్వరగా చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ప్రభుత్వ సేవలను సాధ్యమైనంత త్వరితగతిన చేయడానికి ప్రతీ ఉద్యోగి ప్రయత్నించాలని సూచించారు. జూలై ఒకటో తేదీ పింఛన్‌దారుల ఇళ్లకు స్వయంగా ఉద్యోగులు వెళ్లి ఆయా మొత్తాలను అందచేయాలని, అర్హులకు దరఖాస్తు చేసుకోవాలని వారికి సూచించాలన్నారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు మంజూరులో ఏ విధమైన జాప్యం ఉండరాదని, ఉద్యోగులు ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదని గద్దె హెచ్చరించారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, నర్రా కిషోర్, పోతంశెట్టి నాగేశ్వరరావు, యడ్లపల్లి శివనాగరాజు, రాధారపు యల్లబాబు, చెరుకూరి సాంబయ్య, ఆర్. రాఘవప్రసాద్, సాంబశివకృష్ణ, సచివాలయ అడ్మిన్ జగదీష్, వర ప్రసాద్, వీఆర్వో శారదలు పాల్గొన్నారు.

3వ డివిజన్‌లో గద్దె పర్యటన


గుణదల: తూర్పు పరిధి 3వ డివిజన్ కనకదుర్గానగర్ కాలనీలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ శుక్రవారం పర్యటించారు. డివిజన్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సమస్యలపై అక్కడి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. డివిజన్లో తన దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. డివిజన్లో పంట కాల్వ వెడల్పు తగ్గించి రోడ్డు వెడల్పు పెంచితే వాహనాల రాకపోకలకు బాగుంటుందని స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. సానుకూలంగా స్పందించిన ఆయన సదరు విషయమై అధికారులతో మాట్లాడతానని చెప్పారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, జి.నారాయణరావు, గద్దె రమేష్, నాళం రత్నప్రసాద్, జి.మోహనరావు, ఎం.కృష్ణప్రసాద్, సీతారామయ్య, వి.కృష్ణప్రసాద్, డి.సుబ్బారావు, వి.రమేష్, పలువురు కాలనీ వాసులు పాల్గొన్నారు.



SWAPNA CINEMA release

పీవీని నేటితరం ఆదర్శంగా తీసుకోవాలి

నేడే చూడండి
అప్సర
సినిమా



రోజూ 4 ఆటలు :
11-00AM, 02-30PM,
6-10PM, 9-40PM
www.justickets.in
www.bookmyshow.com



నివాళులర్పిస్తున్న బొండా ఉమామహేశ్వరరావు ,టీడీపీ నాయకులు

సత్యనారాయణపురం, జూన్ 28: బహుముఖ ప్రజ్ఞాశాలి, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు అవిశ్రాంతంగా కృషి చేశారని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. 33వ డివిజన్ ఇన్‌చార్జి గార్లపాటి విజయకుమార్ ఆధ్వర్యంలో భారతరత్న మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి వేడుకలు సత్యనారాయణపురం గిరీ విధిలోని ఆయన విగ్రహం వద్ద శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి తరం పీవీని ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేమూరి ఆనందసూర్య, బడేటి ధర్మారావు, డివిజన్ అధ్యక్షుడు ఎస్. కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు కలర్స్ రామకృష్ణ, పొట్లూరి కృష్ణప్రసాద్, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు పి.వి. నరసింహారావు అని 33 వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణీ మూర్తి అన్నారు. సత్యనారాయణపురం గిరివీధిలోని కార్పొరేటర్ శర్వాణీమూర్తి కార్యాలయంలో పీవీ నరసింహారావు జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

విజయవంతంగా ప్రదర్శింపబడుచున్నది
at NAVRANG A/c



(IN TELUGU-3D)
DAILY 4 SHOWS
11-00 AM, 2-45 PM
6-15 PM, 10-00 PM
Advance Booking Open Online
"Book My Show"
Balcony Rs. 206/-, 1st Class
Rs. 175/-, 2nd Class Rs. 150/-
& for 3d Glass Rs. 20/- Extra

రామ్‌ప్రసాద్ కుటుంబానికి అండగా ఉంటాం

● దూండీ రాకేష్

భవానీపురం, జూన్ 28 : హత్యకు గురైన విద్యాధరపురం చెరువు సెంటర్‌కు చెందిన వ్యాపారి కంకిపాటి శ్రీరామ్‌ప్రసాద్ కుటుంబానికి అండగా ఉంటామని టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు దూండీ రాకేష్ హామీ ఇచ్చారు. ఈ మేరకు చెరువు సెంటర్‌లో రామ్‌ప్రసాద్ భౌతికకాయాన్ని శుక్రవారం సందర్శించిన ఆయన నివాళి అర్పించారు. రామ్‌ప్రసాద్ పెద్దకుమార్తెకు ఉద్యోగం, చిన్న కుమార్తె చదువుకు ఆర్థిక సాయాన్ని టీడీపీ వాణిజ్య విభాగం చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. హంతకుడికి కఠిన శిక్ష పడేలా టీడీపీ ప్రభుత్వం చూసుకుంటుందని దూండీ రాకేష్ తెలిపారు. రామ్‌ప్రసాద్ మృతదేహాన్ని స్థానిక ఆర్యవైశ్య ప్రముఖుడు కోట గురునాథ్, జనసేన విజయవాడ ప్రచార కో-ఆర్డినేటర్ తిరుపతి సురేష్ సందర్శించి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

వ్యాపార విశ్లేషణతో విస్తృత అవకాశాలు

● ఆచార్యులు డాక్టర్ తురగా నాగేంద్రకుమార్



ప్రసంగిస్తున్న డాక్టర్ తురగా నాగేంద్రకుమార్

వన్‌టౌన్, జూన్ 28: విద్యార్థులకు వ్యాపార విశ్లేషణా రంగంలో విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని విజ్ఞాన్స్ ఫౌండేషన్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆచార్యులు డాక్టర్ తురగా నాగేంద్రకుమార్ అన్నారు. వన్‌టౌన్‌లోని కేబీఎన్ కాలేజీలో శుక్రవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ది ఫ్యూచర్ ఆఫ్ బిజినెస్ అనలిటిక్స్- ట్రెండ్స్ అండ్ ఎమెర్జింగ్ టెక్నాలజీస్ అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన తురగా నాగేంద్రకుమార్ మాట్లాడుతూ వ్యాపార అభివృద్ధి, విస్తరణ, భవిష్యత్ ప్రణాళిక ఇలా అనేక అంశాలపై విశ్లేషణ చేసి చక్కని సమాచారాన్ని అందించడమే వ్యాపార విశ్లేషణ లక్ష్యమన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ. నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు తమ తమ రంగాల్లో నూతనంగా వస్తున్న ఆవిష్కరణలను తెలుసుకోవాలన్నారు. విభాగాధిపతి హేమంత్‌కుమార్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదు

వన్‌టౌన్, జూన్ 28: ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని ఏ స్థాయి వ్యక్తులైన శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు చేపట్టాల్సిందేనని పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రామచంద్రప్రసాద్‌ను హత్య చేసిన శివమణికంఠపై చట్టపరమైన కఠిన చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు ఆయన సూచించారు. బాధిత రామచంద్రప్రసాద్ కుటుంబానికి అండగా నిలుస్తామని కుటుంబసభ్యులకు సుజనా చౌదరి భరోసా ఇచ్చారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాకు అభినందనలు



పల్లాను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

మధురానగర్, జూన్ 28: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా శుక్రవారం ప్రమాణ స్వీకారం చేసిన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌యాదవ్‌కు 29, 6వ డివిజన్ల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. తాడేపల్లిలో ఉన్న టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సెంట్రల్ నియోజకవర్గం 29వ డివిజన్ యూనిట్ ఇన్‌చార్జి అంగిరేకుల రాంబాబు యాదవ్, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు మనిముక్కు శ్రీనివాస్‌యాదవ్, కొండలరావు, కనపర్తి సాయియాదవ్, 6వ డివిజన్ అధ్యక్షుడే పడాల గంగాధర్ యాదవ్, నాయకులు భారీగా తరలి వెళ్లారు. శ్రీనివాస్‌యాదవ్‌కు పూలబొకే, మేకపిల్ల ఇచ్చి సత్కరించారు.

గన్నెప్రసాద్ అభినందనలు

వన్‌టౌన్: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన పల్లా శ్రీనివాస్‌ను మంగళగిరి లోని పార్టీ జాతీయ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గన్నె ప్రసాద్ ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



ప్రసంగిస్తున్న కిలారు దిలీప్

బలిదాన్ దివస్‌పై విద్యార్థులకు అవగాహన

లబ్బీపేట, జూన్ 28: లబ్బీపేటలోని రైట్ కంప్యూటర్స్ కార్యాలయంలో శుక్రవారం శ్యాంప్రసాద్ ముఖర్జీ 67వ వర్ధంతిని పురస్కరించుకుని బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ ఆధ్వర్యంలో బలిదాన్ దివస్ పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల క్లస్టర్ ఇన్‌చార్జ్ కిలారు దిలీప్ మాట్లాడుతూ ముఖర్జీ అంతిమ శ్వాస వరకు దేశ అభ్యున్నతి కోసమే పరితపించిన త్యాగశీలి అని అన్నారు. ఈ సందర్భంగా ముఖర్జీకి నివాళులు అర్పించారు.

దుర్గగుడిలో అన్నవితరణకు విరాళం

వన్‌టౌన్, జూన్ 28: దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో నిర్వహించే అన్నవితరణకు శుక్రవారం కృష్ణలంక పాలవర్తివారి వీధికి చెందిన తిమ్మన రమేష్‌బాబు లక్ష రూపా యల విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం దాతకు వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అధికారులు దాతకు అమ్మవారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.





39వ డివిజన్‌లో కల్వర్టు నాడు- నేడు

పశ్చిమ ఎమ్మెల్యే తక్షణ స్పందన

వన్‌టౌన్, జూన్ 28: పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి స్థానిక సమస్యలపై తక్షణం స్పందిస్తున్నారు. 39వ డివిజన్‌లోని పార్థసారథి వీధిలో కల్వర్టుకు మరమ్మతులు చేయాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయన వెంటనే స్పందించి కార్పొరేషన్ అధికారులకు ఫోన్ చేసి కల్వర్టును బాగు చేయాలని సూచించారు. కార్పొరేషన్ అధికారులు హుటాహుటిన కల్వర్టును బాగు చేయించారు.

ముమ్మరంగా పూడికతీత పనులు

భవానీపురం: 41వ డివిజన్ దర్గా ప్రాంతంలో ముమ్మరంగా పూడిక తీత పనులు జరుగుతున్నాయి. దర్గా ప్రాంతంలో డ్రెయినేజీ దుర్వాసనతో అల్లాడుతున్నామని ప్రజలు ఎమ్మెల్యే సుజనా కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కార్యాలయం నుంచి వచ్చిన సమాచారంతో శుక్రవారం పశ్చిమ జోనల్ కమిషనర్ రమ్య కీర్తన స్పందించారు. దీంతో యూజీడీ లైన్లలో మురుగునీటిని యంత్రాలతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామకోటేశ్వరరావు తొలగింపు చేశారు. హైదరాబాద్ రోడ్డులో కొద్ది రోజుల నుంచి పూడికలు తీస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



పాయకాపురం, జూన్ 28 : స్థానిక న్యూ రాజీవ్‌నగర్‌లోని మాస్టర్ మైండ్స్ స్కూల్‌లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్య నిపుణులు 1500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. స్కూల్ చైర్మన్ పెంట్యాల అనిల్‌కుమార్, వైద్యులు సైరా భాను, బషీర్ అహ్మద్, పాల్గొన్నారు.

జాదుయి పిటారాపై అవగాహన సదస్సు

మొగల్రాజపురం, జూన్ 28: సీబీఎస్ఈ ఆధ్వర్యంలో మొగల్రాజపురం వీపీ సిద్ధార్థ వెబ్‌నార్ హాలులో బాలవాటికా జాదుయి పితారా అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి సీబీఎస్ఈ రీజనల్ అధికారి శేఖర్ చంద్ర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మక శక్తిని పెంచడానికి జాదుయి పితారా ఉపయోగపడుతుందన్నారు. జాదుయి పితారా అంటే ఇంద్రజాలంలోని ట్రిక్స్‌ను, బొమ్మలను ఉపయోగించి పాఠ్యాంశాలను పిల్లలకు అర్థం అయ్యేలా చెప్పడం అని చెప్పారు. దీనికి సంబంధించిన డోమైన్స్ గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్స్‌గా అట్లూరి సుధారాణి, షెల్లీ భారతి వ్యవహరించగా వీపీ సిద్ధార్థ పబ్లిక స్కూల్ ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య, ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి, ఉపాధ్యాయులు, నగరంలోని పలు పాఠశాల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లు పంపిణీ

సత్యనారాయణపురం, జూన్ 28: సత్యనారాయణపురం ఏకేటీపీఎం పాఠశాలలో శుక్రవారం ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు చేతుల మీదుగా విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లు షూస్, స్టేషనరీ అందిచారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ప్రకాష్, గార్లపాటి విజయకుమార్, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చిట్టినగర్: బలివాడ రామారావు పట్నాయక్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం సర్కిల్-1 కార్యాలయం ఎదురుగా ఉన్న పుచ్చలపల్లి లీలా సుందరయ్య నగరపాలక సంస్థ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు బలివాడ శివకుమార్ పట్నాయక్, టీడీపీ నాయకులు రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలేరమ్మ గుడి వద్ద పైపులైన్ లీకేజీకి మరమ్మతులు

● రోడ్డు దెబ్బతిన్న ప్రాంతంలో రబ్బీస్ వేసిన అధికారులు

భవానీపురం, జూన్ 28 : 43వ డివిజన్ పోలేరమ్మగుడి వద్ద దెబ్బతిన్న పైప్‌లైన్ లీకేజీ నివారణకు, ధ్వంసమైన రోడ్డు ప్రాంతంలో రబ్బీస్ వేసి కార్పొరేషన్ అధికారులు తాత్కాలిక ఉపశమనం కల్పించారు. ఈ నెల 27న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా ?' అన్న శీర్షికన ప్రచురితమైన కథనానికి వాటర్ వర్క్స్ ఏఈ అహ్మద్, ఇంజనీరింగ్ విభాగం ఏఈ రవీంద్రలు స్పందించారు. వాటర్ వర్క్స్ సిబ్బంది పైప్‌లైన్ లీకేజీ ప్రాంతంలో తవ్వి అక్కడ జాయింట్‌లు వేసి లీకేజీని నివారించారు. ఏఈ అహ్మద్ మాట్లాడుతూ ఈ పైప్‌లైన్ గొల్లపూడి పంచాయతీకి చెందినదని, సమస్య తీవ్రం కాకుండా లీకేజీని అరికట్టామన్నారు. రోడ్డుపై ప్రమాదాల జరగకుండా గోతుల్లో రబ్బీస్ వేసి చదును చేసినట్లు ఏఈ రవీంద్ర తెలిపారు. త్వరలో పూర్తిస్థాయిలో అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తామన్నారు.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

FLATS FOR SALE

» విజయవాడ, సింగ్‌నగర్, ఆంధ్రప్రభ కాలనీ 1st Line, అంజన నిలయం నందు 3BHK 1700 Sft., అన్ని సౌకర్యాలతో (కప్‌బోర్డ్స్ + A/C లు, + కార్ పార్కింగ్) అమ్మకం. సెల్ : 92479 55977
AJB-194769

» విజయవాడ, LEPL వెనుక సాయిబాబాగుడి ప్రక్కన మెయిన్‌రోడ్డు దగ్గరలో "సాయి హోమ్స్" నందు 3BHK డీలక్స్ లగ్జరీ Fully Furnished Flats For Sale. Ready to Occupy. సెల్. 76740 73536
AJB -194513

» విజయవాడ, బందర్ రోడ్, గంగూరులో 1237, 1270 చ.అ.ల 2BHK ఫ్లాట్స్ మరియు 1803, 1805 చ.అ.ల 3BHK ఫ్లాట్స్ అమ్మకమునకు కలవు. ఫుల్ ఫినిష్డ్. బ్యాంక్ లోన్ సౌకర్యం కలదు. AP RERA NO. P06180044432. సంప్ర. 97016 89312
AJG - 90

PLOTS FOR SALE

» VJA, మంగళగిరి, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ. బందరు రోడ్డు, గన్నవరం, నున్న నూజివీడు రోడ్డులో కంచికచర్ల దగ్గర ఇళ్ళ మధ్యలో ఇళ్ళ ప్లాట్స్ చ.గ. 1,900/- నుండి 18,500/- సంప్ర : 73373 11924
AJB-30

» విజయవాడ, బందరు రోడ్డుకు సమీపంలో కంకిపాడు దగ్గర CRDA Layout Open Plots అందుబాటు ధరలలో కలవు. బ్యాంక్ లోన్ సౌకర్యం. సెల్ : 83418 15371
AJB - 194723

» విజయవాడ, బందరు రోడ్డు దగ్గరలో గోసాలలో CRDA Approved Open Plots అందుబాటు ధరలలో కలవు. సంప్రదించండి. సెల్ : 92477 70999
AJB - 086048

BUSINESS

» నెలకు లక్ష రూపాయలు. ఆపైన 1 సం॥కు 25 లక్షలు, ఆపైన సంపాదించవలసిన అవసరం ఉన్నాదా. అయితే ఈ నెంబరుకు కాల్ చేయండి. 9949796940. అడ్రస్ : విజయా శాండిల్ ఉడ్ ఫాం లాండ్స్, కామారు
AJB-194708

TO - LET

» Poranki - Nidamanuru Road : Fully Furnished 3 BHK (1760 S.ft.) Flats for Rent in Dolfin Towers. 3 Baths, AC'S, 2 Car Parking : 98851 15728
AJB - 3679

రియల్ ఎస్టేట్

» రాజధాని అమరావతి ఏరియాలో CRDA Approved వెంచర్స్ నందు ఓపెన్ ప్లాట్స్ కావలసిన వారు సంప్రదించండి : Cell No: 8309367895.
AJG-191468

WANTED

» తాడేపల్లిలో Just Bake Bakary నందు పనిచేయుటకు యువకులు కావలెను. సంప్రదించండి. సెల్ నెం. : 99889 49999
AJB - 208

ఇల్లు అమ్మకము

» రాజధాని అమరావతి తాడికొండలో 175 గజాల్లో 4 అంతస్తుల బిల్డింగ్ మూడు 2BHKs, పెంట్ హౌస్, లిఫ్ట్, కార్ పార్కింగ్ సౌకర్యంతో అమ్మకానికి కలదు. సంప్ర॥ 7989666680.
AJG-191149

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
GST 5%
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
రూ.290/-
కలర్ 30% EXTRA
1 టౌన్ : 99854 09285, పటమట, పెనమలూరు : 99854 11858,
ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777
మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733,
గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240

CAUTION NOTICE
TO WHOM SO EVER IT MAY CONCERN

It is hereby notified that Arbitration Case is instituted by our Client against (i) M/s. VERTEX HOMES PVT. LTD., Rep. by its Managing Director, Sri V.V.R. Varma, (ii) M/s. VERTEX NIRMAN LLP., Rep. by its Managing Partner, Sri V.V.R. Varma, and (iii) M/s. VERTEX SIRI DEVELOPERS LLP., Rep. by its Managing Partner Sri C.G. Murali Mohan for refusing share of monetary consideration on account of his services as a Business Partner, which is pending for consideration.

In the meantime, our client came to know from the reliable sources that the above three (3) companies are transferring/alienating the properties involved in the Arbitration Dispute either in the name of Sri V.V.R.Varma and his son Sri V.Praveen Varma & Sri C.G.Murali Mohan and his son Sri Chakka Kambhagiri Venkata Vivek and also to the third parties. **The following are the properties involved in the Arbitration Dispute:**

Schedule of Property – A (1) , Vijayawada – Vertex Siris Signa (B.P.No. 1073/3026/B/VMC/PAT/2017 Dt. 12-01-2018)

All the Thirteen Flats (13) in the name of Vertex Siri Developers in Block A: 704, Block B: G6, Block C: G3, G8, G11, 101, 103, 105, 107, 111, 201, 208 and 308 situated in R.S.No.208/3, 208/7, 208/8 and 208/9 situated at Patamata, Vijayawada, Krishna District, A.P.

Schedule of Property – A (2 & 3) Namburu – Vertex Capital County (L.P.No. 18/2017/GNT)

All the Eight Houses in Plot Nos. 280, 292 to 296, 312, 315 out of which 312 and 315 booked and cancelled in D.No.139,/4A1(p), 175/B(p), 178, 179/A, 179B/A(p), 179B/B, 180/1(p), 2(p), 181(p), 237/C3(p), 441/1(P), 442/A,B, 443A/1(p)/A, B,C,D,E,F (p), 443 B/G(p), H,I,J (p), K,L and 444/2(p) Namburu Village, Pedakakani Mandal, Guntur District, A.P.

Schedule of Property - A (4) Kaza – Vertex Capital Vista – 1,2,3,4A, 4B &4C

All the Plots in Vertex Capital Vista -1 (L.P.No.01/2016/MGL-GNT D.No. 185(p) Ac.13-55 Cents in Plot No.84, 97 All the Plots in Vertex Capital Vista -2 (L.P.No. (L.P.No.02/2016/MGL-GNT D.No. 182(p) Ac.5-513 Cents in Plot No.27A, 38./All the Plots in Vertex Capital Vista -3 (L.P.No.02/2017/MGL-GNT D.No. 182(p) Ac.3.96 Cents in Plot No.9./All the Plots in Vertex Capital Vista -4 A & B (L.P.NO.01/2018/MGL) D.Nos. 182(p) and 186 (p) Ac.6-24 Cents in Plot No.B-1, B-2, B-18 /situated at Kaza Village, Mangalagiri Mandal, Guntu District, A.P.
All the Plots in Vertex Capital Vista -4 C (L.P.No. 02/2019/MGL) D.Nos.186 (p), 187/A(p), 187/B(p), with extent of Ac.7-07 Cents in Plot No., 1 to 9, 17 to 20, 36, 37, 53, 54, 56 to 59, 61 to 63, 67, 70 to 72, 74, 76, 77, situated at Kaza Village, Mangalagiri Mandal, Guntur District, A.P.

All the plots in the above ventures s thirty Nine (39) plots .

Schedule of Property – A (5)Kantheru – Vertex Capital Vista- West (vide L.P.No.53/2017/GNT)

All the Thirty Eight (38) Plot Nos. 1, 28, 29, 43 to 45, 50 to 55, 57 to 59, 74, 77, 84, 90, 107 to 109, 123, 124, 126, 131 to 133, 152, 167, 174, 179 to 181, 193, 248 and 249 situated in an extent of Ac.22.63 Cents in D.Nos. 60(P), 61(P), 62/2A(P), 65/A(P), 67/A, B, 68/A, 70/B and 71(P) situated at Kantheru Village & Gram Panchayat, Tadikonda, Guntu District, A.P.

Schedule of Property – A (6),Tempalli – Vertex Gardenia, L.P.No.62/2015/VJA & L.P.No. 119/2015/VJA

All the Seventy One (71) Plot Nos. 2, 5 to 12, 19 to 21, 35 to 38, 42, 43, 48 to 52, 60 to 72, 78 to 82, 89, 92 to 98, 115, 116, 126 to 133, 135, 136, 149 to 165 situated in an extent of Ac.12.10 Cents (L.P.No. 62/2015/VJA) in R.S.Nos. 101/7 (p), 159/3(p), 216/3A, 3B, 4 and 217/3, 4, 5, 6 and 60(P), 61(P), 62/2A(P), 65/A(P), 67/A, B, 68/A, 70/B and 71(P) and and Ac.1-67 Cents (L.P.No.119/2015/VJA) R.S.Nos. 101/2 (p), 1(p) 6(p) , 7(p), 103/4A situated at Tempalli Village, Gannavaram Mandal, Krishna District, A.P.

Schedule of Property – A (7)Kalaparru – Vertex Green Reserve (T.L.P.No. 17/2015(R)

All the One Hundred and Ten (110) Plot Nos. 2 to 7, 9, 11 to 15, 17, 19 to 24, 27 to 30, 35, 38, 44, 47, 52 to 55, 58, 64, 65, 68, 69, 72, 74 to 86, 127 to 129, 132 to 137, 144, 147, 151 to 153, 156, 157, 159 to 168, 170, 176 to 178, 180 to 207 situated in an extent of Ac.17.71 Cents (T.L.P.No. 17/2015(R)) in R.S.Nos. 116/1.2.3.4.5.6, 117/8, 126/3, 4, 5, 127/1,2,3,4,5, 6, 128/1,2, 3,4, 130/1,2,3,4,5,6, situated at Kalaparru Village, Peddapadu Mandal, West Godavari District, A.P.

Persons who are offered for purchase of these Flats/Plots/villas in the above Schedule of Properties are cautioned about the pendency of dispute between the above parties and any such purchase shall be at their own risk.

Hyderabad
Dt.28-06-2024

S.CHAKRAPANI, M.K.VISWANATHA NAIDU, M.SRIDHAR & DEEPAK CHOWDARY
ADVOCATES **CKR ASSOCIATES**
Flat No.101, Krishnaveni Pride Apts., Plot No. 204, Kamalapuri Colony,
Yousufguda, Hyderabad – 73. cgr@ckrassociates.in Cell No. 9441219659

జియో బాటలో ఎయిర్‌టెల్, వొడాఫోన్

మొబైల్ చార్జీలను 10-21% పెంచిన ఎయిర్‌టెల్.. 11-24 శాతం పెంచబోతున్న వొడాఫోన్ ఐడియా

» రెండున్నరేళ్ల తర్వాత ఇదే తొలిసారి..

న్యూఢిల్లీ: ప్రైవేట్ టెలికాం సంస్థలైన భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా (వీఐ) సైతం చార్జీలు పెంచేశాయి. ప్రీ-పెయిడ్, పోస్ట్-పెయిడ్ ప్లాన్ల రుసుమును 10 శాతం నుంచి 21 శాతం వరకు పెంచుతున్నట్లు ఎయిర్‌టెల్ శుక్రవారం ప్రకటించింది. కొత్త టారిఫ్‌లు జూలై 3 నుంచి అమలులోకి వస్తాయని కంపెనీ స్పష్టం చేసింది. కాగా, జూలై 4 నుంచి అమలులోకి వచ్చేలా మొబైల్ చార్జీలను 11-24 శాతం వరకు పెంచబోతున్నట్లు వీఐ వెల్లడించింది. స్పెక్ట్రమ్ వేలం ముగిసిన మరుసటి రోజే అతి పెద్ద టెలికాం కంపెనీ రిలయన్స్ జియో చార్జీలను 12-27 శాతం పెంచుతున్నట్లు ప్రకటించగా.. ఆ తర్వాత రోజే ఎయిర్‌టెల్, వీఐ కూడా చార్జీల పెంపును ప్రకటించడం గమనార్హం. టెలికాం సంస్థలు మొబైల్ చార్జీలను గణనీయంగా పెంచడం రెండున్నరేళ్ల తర్వాత ఇదే మొదటిసారి. 5జీ స్పెక్ట్రమ్ కొనుగోలు, నెట్‌వర్క్ విస్తరణ కోసం భారీగా పెట్టుబడులు పెట్టిన టెల్కోలు ఇక ఆదాయం పెంచుకోవడంపై దృష్టిసారించాయి. ఈ మార్చి చివరి నాటికి రిలయన్స్ జియో కస్టమర్లు 48.18 కోట్లకు చేరుకోగా, ఎయిర్‌టెల్ 40.6 కోట్లు, వీఐ 12.26 కోట్ల కస్టమర్లను కలిగి ఉన్నాయి. ఈ మార్చితో ముగిసిన త్రైమాసికంలో జియోకు ఒక్కో వినియోగదారు నుంచి లభించిన సగటు ఆదాయం (ఆర్పూ) రూ.181.7గా నమోదైంది. ఎయిర్‌టెల్ ఆర్పూ రూ.209గా, వీఐ ఆర్పూ రూ.146గా నమోదైంది.

మొబైల్ కస్టమర్లపై రూ. 47,500కోట్ల అదనపు భారం

చార్జీల పెంపుతో ఈ ఆర్థిక సంవత్సరంలో ఎయిర్‌టెల్, జియోతోపాటు వొడాఫోన్ ఐడియాకు రూ.40,000 కోట్ల మేర అదనపు ఆదాయం సమకూరనుందని కోటక్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ అంచనా. కాగా, పన్నులతో కలిపి మొబైల్ కస్టమర్లపై రూ.47,500 కోట్ల మేర అదనపు భారం పడనుందని తన నోట్‌లో పేర్కొంది.

ఎయిర్‌టెల్ ప్రీపెయిడ్ ప్లాన్ల టారిఫ్ సవరణలు

ప్లాన్	వాలిడిటీ (రోజులు)	ప్రయోజనాలు	పాత చార్జీ (రూ.)	కొత్త చార్జీ (రూ.)
అన్‌లిమిటెడ్	28	2జీబీ డేటా, అపరిమిత కాలింగ్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు	179	199
	84	6జీబీ డేటా, అపరిమిత కాలింగ్ రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు	455	509
వాయిస్ ప్లాన్	365	24జీబీ డేటా, అపరిమిత కాలింగ్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు	1,799	1,999
	28	రోజుకు జీబీ డేటా, అపరిమిత కాలింగ్ రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు	265	299
	28	రోజుకు 1.5 జీబీ డేటా, అపరిమిత కాలింగ్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు	299	349
	28	రోజుకు 2.5జీబీ, అపరిమిత కాలింగ్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు	359	409
	28	రోజుకు 3జీబీ డేటా, అపరిమిత కాలింగ్ రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు	399	449
డేటా యాడ్ ఆన్స్	1	ఒక జీబీ	19	22
	1	2 జీబీ	29	33
	ప్లాన్ వాలిడిటీ	4 జీబీ	65	77

రిలయన్స్ మార్కెట్ క్యాప్ రూ.21లక్షల కోట్లు



ముంబై: ఈక్విటీ మార్కెట్ శుక్రవారం స్వల్ప నష్టాల్లో ముగిసినా రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు మాత్రం లాభాలు నమోదు చేశాయి. బీఎస్ఈలో ఈ కంపెనీ షేర్లు 2.31 శాతం లాభంతో రూ.3,131.85 వద్ద క్లోజయ్యాయి. మొబైల్ టారిఫ్‌లు 12 నుంచి 27 శాతం వరకు పెంచుతున్నట్టు ఆర్ఐఎల్ అనుబంధ సంస్థ జియో ఇన్ఫోకామ్ ప్రకటించడం ఇందుకు ప్రధానంగా దోహదం చేసింది. దీంతో రిలయన్స్ షేర్ల మార్కెట్ క్యాప్ రూ.21.19 లక్షల కోట్లకు చేరింది. ఇప్పటి వరకు మరే భారతీయ లిస్టెడ్ కంపెనీ ఈ బెంచ్ మార్క్ సాధించలేదు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు సెన్సెక్స్ పది శాతం పెరిగితే, ఆర్ఐఎల్ షేర్లు మాత్రం 20 శాతం పెరిగాయి.

రికార్డుల ర్యాలీకి బ్రేక్

ముంబై: సెన్సెక్స్, నిఫ్టీ రికార్డుల ర్యాలీకి శుక్రవారం బ్రేక్ పడింది. ఉదయం లాభాలతో ప్రారంభమై ఇంట్రా డేలో మరో సరికొత్త రికార్డు సృష్టించిన సూచీలు చివరికి నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 210.45 పాయింట్ల నష్టంతో 79,032.73 వద్ద, నిఫ్టీ 33.90 పాయింట్ల నష్టంతో 24,010.60 వద్ద క్లోజయ్యాయి. ప్రధాన అంతర్జాతీయ మార్కెట్లు లాభాల్లోనే ఉన్నా బ్యాంకింగ్, ఫైనాన్షియల్, టెలికాం, టెక్ కంపెనీల షేర్లలో లాభాల స్వీకరణ సూచీలను కిందికి లాగాయి. ఈ ఏడాది జూన్ నెల దేశీయ స్టాక్ మార్కెట్‌కు బాగానే కలిసొచ్చింది. ఈ నెల్లో సెన్సెక్స్ 7.14 శాతం లాభంతో ముగిసింది. దీంతో బీఎస్ఈలో నమోదైన కంపెనీల షేర్ల మార్కెట్ క్యాప్ రికార్డు స్థాయిలో రూ.439.24 లక్షల కోట్లకు చేరింది.

వ్రజ్ ఐరన్ ఐపీఓ సూపర్ హిట్

వజ్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ ఐపీఓ సూపర్ హిట్టయింది. కంపెనీ 61.38 లక్షల షేర్లు జారీ చేయగా, మదుపరుల నుంచి 73.07 కోట్ల బిడ్లు వచ్చాయి. రిటైల్ ఇన్వెస్టర్ల వాటా 54.93 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది.

సిమ్ రీప్లేస్‌మెంట్ తర్వాత ఎంఎన్‌పీకి 7 రోజులు

న్యూఢిల్లీ: సిమ్ స్వాప్ లేదా రీప్లేస్‌మెంట్ తర్వాత మొబైల్ నంబరు పోర్టబిలిటీకి అర్హత పొందేందుకు వేచి చూడాల్సిన సమయం 10 రోజుల నుంచి 7 రోజులకు తగ్గనుంది. జూలై 1 నుంచి ఇది అమలులోకి రానుంది. టెలికాం నియంత్రణ మండలి ట్రాయ్ ఈ మార్చి 14న జారీ చేసిన టెలికమ్యూనికేషన్ మొబైల్ నంబరు పోర్టబిలిటీ (9వ సవరణ) నిబంధనలు ఈ జూలై నుంచి అమలులోకి రానున్నాయి.

డాక్టర్ రెడ్డీస్ నుంచి మరో కేన్సర్ ఔషధం

హైదరాబాద్: డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ 'వొమాబ్' పేరుతో మహిళల వక్షోజ కేన్సర్ ఔషధాన్ని మార్కెట్‌లో విడుదల చేయనుంది. జైడస్ లైఫ్ సైన్సెస్ అభివృద్ధి చేసిన పెర్టుజుమాబ్ అనే ఈ బయోసిమిలర్ ఔషధాన్ని రెండు కంపెనీలు భారత్‌లో వేరు వేరు పేర్లతో మార్కెట్ చేస్తాయి. దీనికి సంబంధించి రెండు కంపెనీల మధ్య లైసెన్సింగ్ ఒప్పందం కుదిరింది. జైడస్ 'సిగ్రిమా' పేరుతో, డాక్టర్ రెడ్డీస్ 'వొమాబ్' పేరుతో ఈ ఔషధాన్ని మార్కెట్ చేస్తాయి.

1:5 నిష్పత్తిలో కిమ్స్ షేర్ల విభజన

హైదరాబాద్: స్థానిక కృష్ణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లిమిటెడ్ (కిమ్స్) బోర్డు రూ.10 ముఖ విలువ ఉన్న షేర్లను రూ.2 ముఖ విలువ ఉండే ఐదు షేర్లుగా విభజించేందుకు ఆమోదం తెలిపింది. శుక్రవారం జరిగిన సమావేశంలో డైరెక్టర్ల బోర్డు ఈ మేరకు తీర్మానాన్ని ఆమోదించినట్టు కిమ్స్ రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. ఈ షేర్ల విభజనకు రికార్డు తేదీని సరైన సమయంలో వాటాదారులకు తెలియజేస్తామని పేర్కొంది.

అరబిందో చేతికి బ్రిటిష్ కంపెనీ

హైదరాబాద్: అరబిందో ఫార్మా బ్రిటన్ కేంద్రంగా పనిచేసే ఏస్ లేబరేటరీస్ లిమిటెడ్‌ను కొనుగోలు చేసింది. నెదర్లాండ్‌లోని అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ ఎజైల్ ఫార్మా బీవీ ద్వారా ఈ కొనుగోలు జరిపింది. ఇందుకోసం రూ.17.91 కోట్లు చెల్లించినట్టు రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. ఏస్ లేబరేటరీస్ వివిధ ఫార్మా ఉత్పత్తులకు అవసరమైన క్వాలిటీ కంట్రోల్ టెస్టింగ్, అనలిటికల్ డెవలప్‌మెంట్ సేవలు అందిస్తోంది. యూరోపియన్ దేశాల్లో ఎజైల్ ఫార్మా సొంత అవసరాల కోసం ఈ కొనుగోలు జరిపినట్టు అరబిందో ఫార్మా తెలిపింది.

రూ.10 లక్షల వరకు బేసిక్ డీమ్యాట్ ఖాతానే

న్యూఢిల్లీ: బేసిక్ సర్వీస్ డీమ్యాట్ ఖాతాలో (బీఎస్‌డీఏ) ఉండే షేర్లు, రుణ పత్రాల విలువ పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతూ సెబీ నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది సెప్టెంబరు 1 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుంది. దీంతో చిన్న మదుపరులు మరింత చురుగ్గా స్టాక్ మార్కెట్‌లో పాల్గొంటారని భావిస్తున్నారు. కొద్ది మొత్తాల్లో స్టాక్ మార్కెట్ పెట్టుబడులున్న చిన్న మదుపరులపై డీమ్యాట్ చార్జీల భారం తగ్గించేందుకు రూ.2 లక్షల పరిమితితో సెబీ 2012లో బీఎస్‌డీఏని ప్రవేశ పెట్టింది. ఇపుడు దీన్ని రూ.10 లక్షలకు పెంచడంతో చిన్న మదుపరులకు మరింత సౌలభ్యం కానుంది.

ఎంఎఫ్ పథకాలకూ ఆర్ఏఆర్ నిబంధన !

మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) పథకాల రాబడుల పనితీరుకీ రిస్క్ అడ్జెస్టెడ్ రిటర్న్ (ఆర్ఏఆర్) నిబంధన అమలు చేయాలని సెబీ భావిస్తోంది. ఇందుకు సంబంధించి ఒక ప్రతిపాదన చేసింది. ఆర్ఏఆర్ అమలు చేస్తే ఎంఎఫ్ పథకాల ఫండ్ మేనేజర్లు, ఆయా పథకాలకు సంబంధించిన నష్ట భయాల పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంటుంది. దీనివల్ల మదుపరులు ఆయా పథకాల్లో పెట్టుబడులకు సంబంధించి సరైన నిర్ణయాలు తీసుకోగలుగుతారని సెబీ భావిస్తోంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,160 ▲	66,150 ▲	94,200 ▼
ముంబై	71,840 ▲	65,800 ▲	88,000 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

29వ తేదీ

హైదరాబాద్	515	విజయవాడ	525
వరంగల్	517	గోదావరి	520
చిత్తూరు	573	విశాఖపట్నం	530
		దజను గుడ్లు రూ. 72	



ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	110	విజయవాడ	123
వరంగల్	110	గుంటూరు	123
కరీంనగర్	110	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	130
కర్నూలు	110	నెల్లూరు	130
విశాఖపట్నం	129	అనంతపురం	123
గోదావరి	123		



నవ్య | చిత్రజ్యోతి

కలలో కూడా హాని తలపెట్టడు

● అభిమాని హత్యకేసులో అరెస్టయిన హీరో దర్శన్‌కు నాగశౌర్య మద్దతు



'దర్శన్ గురించి నాకు బాగా తెలుసు, ఆయన ఎంతో మందిని ఆదుకున్నాడు. వీలైతే సాయం చేస్తాడే తప్ప కలలో కూడా ఇతరులకు హాని తలపెట్టడు. త్వరలోనే ఆయన నిర్దోషిగా బయటకొస్తాడు' అని టాలీవుడ్ హీరో నాగశౌర్య అన్నారు. రేణుకాస్వామి అనే అభిమానిని క్రూరంగా హత్య చేసిన కేసులో అరెస్టయిన కన్నడ హీరో దర్శనకు నాగశౌర్య మద్దతుగా నిలిచాడు.

'ఎన్నో కుటుంబాలు దర్శన్ మీద ఆధారపడి బతుకుతున్నాయి. నిజాలు నిగ్గుతేలేవరకూ ఆయన కుటుంబానికి కాస్త గౌరవం ఇవ్వండి. ముందే విమర్శలకు దిగడం సరికాదు' అని శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా నెటిజన్లకు హితవు పలికారు. 'న్యాయవ్యవస్థ పైన నాకు నమ్మకం ఉంది. త్వరలోనే వాస్తవాలు బయటకు వస్తాయి. నిజమైన దోషులకు శిక్ష పడుతుంది. దర్శన్ అన్న నిర్దోషిగా బయటకు వస్తాడు. ఈ గడ్డు పరిస్థితుల్లో వారి కుటుంబాన్ని కించపరచడం, బాధపెట్టడం చేయవద్దు' అని తన పోస్ట్‌లో నాగశౌర్య పేర్కొన్నారు. దర్శన్‌తో దిగిన ఫొటోను ఆయన షేర్ చేశారు.

దర్శన్ తన భార్య, పిల్లలను వదిలి హీరోయిన్ పవిత్రగౌడతో కొన్నాళ్లుగా సహజీవనం చేస్తూ, కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారనే కారణంతో రేణుకాస్వామి అనే అభిమాని పవిత్రగౌడకు సోషల్ మీడియాలో అసభ్యకరమైన మెసేజ్‌లు పంపాడు. ఆ కోపంతో రేణుకా స్వామిని దర్శన్ తన అభిమానులతో కిడ్నాప్ చేయించి, హత్య చేశారని పోలీసులు చెబుతున్నారు. దర్శన్, పవిత్రగౌడను కఠినంగా శిక్షించి, రేణుకాస్వామికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కర్ణాటక వ్యాప్తంగా ప్రజలు స్వచ్ఛందంగా ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. మరోవైపు సోషల్ మీడియాలో నెటిజన్లు దర్శన్‌ను బండబూతులు తిడుతూ ట్రోల్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నాగశౌర్య దర్శన్‌కు మద్దతు తెలుపుతూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టడం చర్చనీయాంశం అయింది.

తమన్నా యాక్షన్



తమన్నా భాటియా, హెబ్బా పటేల్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న చిత్రం 'ఓదెల 2'. అశోక్ తేజ దర్శకత్వంలో డి. మధు నిర్మిస్తున్నారు. దర్శకుడు సంపత్‌నంది క్రియేట్ చేసిన 'ఓదెల రైల్వే స్టేషన్' చిత్రానికి ఇది సీక్వెల్. భారీ బడ్జెట్‌తో, బహు భాషా చిత్రంగా మేకర్స్ రూపొందిస్తున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో తాజా షెడ్యూల్‌ను చిత్రబృందం ప్రారంభించింది. కీలకమైన యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. టాప్ క్లాస్ యాక్షన్ డైరెక్టర్స్ పోరాట ఘట్టాలను అద్భుతంగా రూపొందిస్తున్నారనీ, తమన్నా యాక్షన్ పార్ట్ కోసం ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నారని మేకర్స్ తెలిపారు. వశిష్ట ఎన్ సింహ, నాగమహేశ్, గగన్ విహారి కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి అజనీష్ లోకనాథ్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: సౌందర్ రాజన్ ఎస్.



'కల్కి'లో కృష్ణుడు ఇతనే!



అమితాబ్, కమల్‌హాసన్, ప్రభాస్, దీపికా పదుకొనే వంటి అగ్ర నటీనటులు నటించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రం గురువారం విడుదలై సూపర్ హిట్ టాక్ సొంతం చేసుకుంది. కురుక్షేత్ర యుద్ధం నేపథ్యంలో సాగే సన్నివేశాల్లో శ్రీకృష్ణుని పాత్ర పోషించిన నటుడి ముఖాన్ని చూపించకపోవడంతో అతనెవరా.. అనే చర్చ మొదలైంది. ఆ పాత్ర పోషించిన నటుడి నడక తీరు చూసి హీరో నాని అన్నారు కొందరు. కాదు కాదు అర్జున్‌దాస్ అన్నారు మరికొందరు. ఈ చర్చకు తెర దించుతూ ఆ సినిమాలో కృష్ణ పాత్ర పోషించింది నేనే అంటూ సోషల్ మీడియా వేదికగా స్వయంగా వెల్లడించారు తమిళ నటుడు కృష్ణకుమార్ బాలసుబ్రహ్మణ్యన్. 'ఒక అద్భుత చిత్రంలో అటువంటి ప్రత్యేక పాత్ర పోషించే అవకాశం రావడం నిజంగా అదృష్టం' అని ఆయన పేర్కొన్నారు. కృష్ణకుమార్ కొత్త నటుడేమీ కాదు, 2010లోనే ఆయన చిత్ర రంగ ప్రవేశం చేశారు. 'కదలగై' తమిళ చిత్రంలో నటించిన ఆయన ఆ తర్వాత రంగస్థల ప్రవేశం చేసి పలు నాటకాల్లో నటించారు. పదేళ్ల తర్వాత మళ్లీ తమిళ చిత్రరంగ ప్రవేశం చేశారు. సూర్య నటించిన అనువాద చిత్రం 'ఆకాశం నీ హద్దు'లో కీలక పాత్ర పోషించారు. ధనుష్ 'మారన్' సినిమాలో అతనికి ఫ్రెండ్‌గా నటించారు. 'కల్కి' కృష్ణకుమార్‌కు ఐదో చిత్రం కావడం గమనార్హం.


రికార్డులు కోసం సినిమాలు తీయం

- నిర్మాత స్వప్న దత్



ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రం బాక్సాఫీసు దగ్గర భారీ వసూళ్లను రాబడుతోంది. తొలి రోజే ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ. 200 కోట్ల వసూళ్లకు చేరువైంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా సృష్టించబోయే రికార్డులపై అందరి దృష్టి పడింది. ఏఏ రికార్డులు బద్దలవుతాయనే చర్చ అటు పరిశ్రమలో, ఇటు ప్రేక్షకుల్లో జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో 'కల్కి' నిర్మాతల్లో ఒకరైన స్వప్నదత్ సోషల్ మీడియాలో స్పందించారు. 'మా సినిమా అధిగమించిన రికార్డుల గురించి చాలా మంది అడుగుతున్నారు. ఇది హాస్యాస్పదం. రికార్డులు సృష్టించేవారు ఎప్పుడూ రికార్డుల కోసమే సినిమాలు తీయరు. సినిమా, ప్రేక్షకుల పైన ప్రేమతోనే మేం సినిమాలు తీస్తాం. 'కల్కి' చిత్రాన్ని కూడా ఇదే విధంగా రూపొందించాం' అన్నారు.

కొంచెం కొంచెం...



చిమటా రమేశ్‌బాబు హీరోగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'నేను-కీర్తన'. ఈ చిత్రం నుంచి 'కొంచెం కొంచెం గుడుగుడు గుంజం' అంటూ సాగే ప్రత్యేక గీతాన్ని నటుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు మురళీమోహన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "నేను-కీర్తన' ట్రైలర్, సాంగ్స్ బావున్నాయి. నేను విడుదల చేసిన ఐటమ్ సాంగ్ థియేటర్స్‌లో విజిల్ వేయిస్తుంది. ఈ చిత్రం ఘన విజయం సాధించాలి' అని ఆకాంక్షించారు. ఈ చిత్రంలో రిషిత, మేఘన ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. చిమటా లక్ష్మీకుమారి నిర్మాత. త్వరలో 'నేను-కీర్తన' విడుదల తేదీని ప్రకటిస్తామని రమేశ్‌బాబు చెప్పారు. కులుమనాలిలో చిత్రీకరించిన పాటలతో పాటు ఆరు రోప్ ఫైట్స్ ఈ సినిమాకు ప్రత్యేకాకర్షణ అని నిర్మాత చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎల్ రాజా, ఛాయాగ్రహణం: కె. రమణ, ఎడిటింగ్, వినయ్‌రెడ్డి.

గ్యాంగ్ వార్ సరికొత్తగా



చంద్రశేఖర్ రాథోడ్ హీరోగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'గ్యాంగ్‌స్టర్'. కాశ్వీ కాంచన్ హీరోయిన్. ఆగస్టులో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాలను ప్రారంభించింది. శుక్రవారం 'గ్యాంగ్‌స్టర్' టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రాథోడ్ మాట్లాడుతూ 'నిర్మాత దిల్ రాజు, రచయిత విజయేంద్రప్రసాద్ మా చిత్రం టీజర్‌ను చూసి మెచ్చుకున్నారు. గ్యాంగ్ వార్‌ను మా సినిమాలో సరికొత్త రూపంలో చూపించబోతున్నాం' అన్నారు.

మీడియాకే తెలియాలి



నటి హేమ శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. బెంగళూరు రేవ్‌పార్టీ వ్యవహారంలో అరెస్టయిన ఆమె బెయిల్‌పై బయటకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం సాయంత్రం కాలినడకన తిరుమలకు చేరుకున్న హేమ శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. నేను చిన్నప్పటి నుంచి శ్రీవారి దర్శనానికి వస్తున్నాను, తిరుమల నాకు పుట్టినిల్లు అన్నారు. రేవ్ పార్టీ కేసు గురించి మీడియా ప్రశ్నించగా 'మీకే తెలియాలి. మీరే వేస్తున్నారు కదా న్యూస్. మీ ద్వారానే నేనూ తెలుసుకుంటున్నా' అని బదులిచ్చారు.

తిరుమల, (ఆంధ్రజ్యోతి)

'దీక్ష' షూటింగ్ పూర్తి



కిరణ్‌కుమార్, అలేఖ్యా రెడ్డి జంటగా నటించిన 'దీక్ష' చిత్రం షూటింగ్ పూర్తయింది. ప్రతాని రామకృష్ణ గౌడ్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి పినిశెట్టి అశోక్‌కుమార్, మదాడి కృష్ణారెడ్డి నిర్మిస్తున్నారు. సినిమా ప్రోగ్రెస్ గురించి దర్శకుడు మాట్లాడుతూ 'పట్టుదల, దీక్ష ఉంటే ఏదైనా సాధించగలం.. అనే పాయింట్‌తో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. ఇందులో హీరో కిరణ్ చేసిన ఫైట్స్, ఆయన వేసిన భీముడు, అంజనేయుడి గెటప్స్ ప్రేక్షకుల్ని అలరిస్తాయి. నలుగురు హీరోయిన్లను ఈ సినిమాతో పరిచయం చేస్తున్నాం. త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తాం' అని చెప్పారు. 'ఇంతకుముందు నేను తెలుగులో పది, తమిళంలో రెండు చిత్రాల్లో హీరోగా నటించాను. ఈ సినిమా నాకు మంచి పేరు తెస్తుందని ఆశిస్తున్నా' అన్నారు కిరణ్.

నటి హీనాఖాన్‌కు కేన్సర్



ప్రముఖ బాలీవుడ్ బుల్లితెర నటి హీనాఖాన్ రొమ్ము కేన్సర్‌తో బాధపడుతున్నారు. శుక్రవారం ఈ విషయాన్ని ఆమె సోషల్ మీడియా ద్వారా తెలిపారు. 'ప్రస్తుతం స్టేజ్ 3 కేన్సర్‌తో పోరాడుతున్నాను. చికిత్స తీసుకుంటున్నాను. కేన్సర్‌ను జయించి మళ్లీ మామూలు మనిషిగా మీ ముందుకు వస్తాననే నమ్మకం ఉంది. ఈ ఆపత్కాలంలో నాకు అండగా నిలుస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అని తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో పేర్కొన్నారు. బుల్లి తెర సీరియల్ 'ఏ రిస్తా క్యా కెహలాతా హై'లో అక్షర పాత్రతో ఆమె ప్రేక్షకులకు చేరువయ్యారు. 'బిగ్‌బాస్, ఖత్రోన్ కే ఖిలాడి' వంటి రియాలిటీ షోల్లో హీనాఖాన్ పాల్గొన్నారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/93JKRlr లో చదవండి.

భాగేకం నింబుజం తోయం షడ్భాగః
శర్కరోదకం!
లవంగ మరితోన్మిశ్రం పానకం
పానకోత్తమం!

క్షేమ కుతూహలం

ఆయుర్వేద పద్ధతిలో నిమ్మ షర్బత్

షర్బత్ అంటే నీళ్లు, పంచదార కలిపిన తియ్యని పానీయం అని అర్థం. ఆ షర్బత్‌లో నిమ్మ రసం కలిపితే కమ్మని నిమ్మ పండు షర్బత్ అవుతుంది. 'షర్బత్' సంస్కృత పదమని, అందరికీ ఇష్టమైనదనే అర్థంలో 'సర్వేత్' అనే పదం 'షర్బత్'గా ఉత్తరాది నుంచి వచ్చిందని, అరబ్బీ, పర్షియన్ భాషల్లోకి ఇక్కడి నుంచే వెళ్లిందనీ చెప్తారు. ఇక నిమ్మ షర్బత్ గురించి చర్చించాల్సింది చాలా ఉంది.

నిమ్మ రసం ఆహార ద్రవ్యం. పులుపు కోసం ఆహార పదార్థాల్లో కలుపుతాం. ఇది ఔషధ ద్రవ్యం కూడా. నిమ్మ రసంతో మర్దించి అనేక ఆయుర్వేద ఔషధాలు తయారు చేస్తారు. లోహాలతో, ఖనిజాలతో తయారయ్యే రసౌషధాల తయారీలో శుద్ధి కోసం కూడా వాడతారు. కఠినమైన లోహాలనే శుద్ధి చేస్తుందంటే... మన కడుపుని ఇంకెంత శుద్ధి చేస్తుందో అర్థం చేసుకోవచ్చు. జీర్ణకోశ వ్యాధుల్లో దీని ప్రభావం ఎక్కువ. పుల్లని ఔషధం. నిమ్మ పండు తినటానికి, నిమ్మ రసం తాగటానికి ఏమాత్రం సంకోచించనక్కర్లేదు.

నిమ్మ రసాన్ని వేడి చేస్తే మంచి గుణాలు హరిస్తాయి. వేడి నీళ్లలో నిమ్మరసం కలిపితే దాని గుణాలు పెరుగుతాయి.

నిమ్మని కాయగూరల జాబితాలో చేర్చాలా? ఫల వర్గాల జాబితాలో చేర్చాలా? లేక ఔషధ వర్గాల్లోనా? అనే మీమాంస మొదటి నుంచీ ఉంది. ఆయుర్వేద సంహితాకారుల్లో కూడా చరకుడు దీన్ని పుల్లని రుచి కలిగిన కూరగాయల్లో చేరిస్తే, సుశ్రుతుడు, వాగ్భటుడు ఫల వర్గంలో చేర్చారు.

స్థూలకాయం తగ్గుతుందని పొద్దున్నే వేడి నీటిలో నిమ్మ రసం కలిపి తాగే అలవాటు చాలామందికి ఉంది. ఇందులో తేనె లేదా పంచదార, కొంచెం సోడా ఉప్పు, ఉప్పు కలిపి తాగితే దప్పిక తీరటమే కాదు వడదెబ్బ కొట్టకుండా కాపాడుతుంది.

నిమ్మ రసానికి ఇనుమును స్వీకరించే గుణం ఉంది. రక్తహీనత ఉన్నవారికి గొప్ప ఔషధం ఇది. జిడ్డు తొలగిస్తుంది. చర్మానికి వర్ఛస్సిచ్చి, ప్రకాశవంతం చేస్తుంది. మానసిక ఒత్తిడిని, బీపీని అదుపు చేస్తుంది. సి-విటమిన్ కోసం ఆధారపడదగిన ఫలం నిమ్మ. దీన్ని కాచడం గానీ, ఉడికించటం గానీ చెయ్యకూడదు. అలా చేస్తే... సి-విటమిన్ ఎగిరిపోతుంది. క్షేమశర్మ తన 'క్షేమ కుతూహలం' గ్రంథంలో నిమ్మకాయ షర్బత్ తయారు చేసే విధానాన్ని ఇలా వివరించాడు...

ఒక భాగం నిమ్మ రసానికి ఆరు భాగాలు పంచదార జత చేయాలి. అందులో లవంగాలు, మిరియాల పొడి తగినంత చేర్చి, బాగా కలపాలి. ఈ మిశ్రమానికి ఎంత కావాలో అంత చల్లని నీటిని కలుపుకుంటే అదే నిమ్మ షర్బత్.

నీళ్లు కలపటానికి కొలత ఏమీ లేదు. తీపి, పులుపులను చూసుకుంటూ కలపాలి. ఇదే నిమ్మపండు పానకం. ఇంగ్లీషువాళ్లు దీన్ని 'లెమనేడ్' అంటారు.



ఇది మౌలికంగా పుల్లని ద్రవ్యం అయినప్పటికీ, చింతపండులా వేడి చెయ్యదు. చింతపండు ఆహార ద్రవ్యాన్ని కష్టంగా అరిగేలా మారుస్తుంది. కానీ నిమ్మ రసం కలిపితే తేలికగా అరిగేలా చేస్తుంది. వేగంగా శరీరం అంతా వ్యాపించేలా చేస్తుంది. నోటిని, గొంతును శుద్ధి చేస్తుంది. జీర్ణశక్తిని పెంచుతుంది. దప్పిక తీరుస్తుంది. వాంతి, వికారాలను ఆపుతుంది. కడుపులో నొప్పిని హరిస్తుంది. వాత వ్యాధులున్నవారు సాధ్యమైనంతగా పులుపు వాడకాన్ని తగ్గించాలి. చింతపండుకి బదులుగా నిమ్మరసాన్ని పరిమితంగా వాడుకుంటే కీళ్ల నొప్పులు చాలావరకూ తగ్గుతాయి. కఫాన్ని తగ్గించే గుణం కూడా ఉంది కనుక దగ్గు, జలుబులు వచ్చినప్పుడు ఒక కప్పు వేడి నీళ్లలో నిమ్మ రసం కలిపి తాగటం ఉత్తమం.

నిమ్మకాయ లేదా నిమ్మపండు ఏదైనా ఒకటే! పండినా పులుపులో మార్పేమీ ఉండదు.

నింబాఫలభవం పానమత్యమ్లం వాతనాశనమ్!

హృద్యం రుచికరం భవ్యం సర్వాహారస్య పాచకమ్!

క్షేమశర్మ దీన్ని 'సర్వాహార పాచకం' అన్నాడు. కష్టంగా అరిగే నూనె పదార్థాలు, పులావు, బిర్యానీలు తిన్నప్పుడు దీన్ని తాగితే తేలికగా అరిగేలా చేస్తుందని దీని భావం. ఆయిల్ ఫుడ్స్ ఎక్కువగా తినేవారు... నిమ్మ రసం షర్బత్ తాగితే జిడ్డు త్వరగా వదిలి, పేగులు దెబ్బతినకుండా ఉంటాయి. నిమ్మ షర్బత్‌ని పులపుల్లగా ఉండేలా తాగితేనే మంచిది. అతిగా నీళ్ల కలపనవసరం లేదు. ఇది గుండెకు మేలు చేస్తుంది. రుచిని పెంచుతుంది. ఎసిడిటీ సమస్యతో బాధపడేవారు, అల్సర్లున్నవారు తప్ప అందరూ తీసుకోదగిన పానీయం. విపరీతంగా జలుబు, పడిశ భారం, పొడి దగ్గు, గొంతు బొంగురు పోవటం లాంటి సమస్యల్ని ఇది చక్కగా నివారిస్తుంది. లవంగం, మిరియాలపొడి కలపటాన్ని మరిచిపోకండి! ఇవి రెండూ కేవలం రుచివర్ధకాలు మాత్రమే కాదు కఫహరాలు కూడా! వాతాన్నీ హరిస్తాయి. అనుకున్నంత వేడి చేయవు. అన్నం తిన్న తరువాత దీన్ని తాగితే ఎసిడిటీ పెరక్కుండా ఉంటుంది.

• గంగరాజు అరుణాదేవి

నవ్య 'స్మార్ట్ పేజీ'లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/QEOgU9Hలో చదవండి.

వంటిల్లు

రొయ్యలతో చేసే వంటకాలు రుచికరమే కాదు... ఆరోగ్యకరం కూడా. ఇందులో విటమిన్లు, ప్రొటీన్లు పుష్కలంగా ఉంటాయి. రొయ్యల బిర్యానీ, గోంగూర రొయ్యల కూర, క్రిస్పీ గోల్డెన్ ఫ్రై ప్రాన్స్ రెసిపీలు మీ కోసం...

రుచికరమైన రొయ్యల వంటలు!



రొయ్యల బిర్యానీ

కావాల్సిన పదార్థాలు: బాస్మతి బియ్యం- 2 కప్పులు, రొయ్యలు- అర కేజీ, ఉల్లిపాయలు- 4 (పొడవుగా ముక్కలు కట్ చేసుకోవాలి), వేయించిన ధనియాలు- 2 టేబుల్ స్పూన్లు, జీలకర్ర- 1 టీస్పూన్, మిరియాలు- ముప్పావు టీస్పూన్, ఇలాచి- 8, లవంగాలు- 8, దాల్చిన చెక్క- 2 (వేలంత పొడవు ఉండేంత), ఉప్పు- రుచికి తగినంత, పసుపు- కొద్దిగా, కారం- రెండు టేబుల్ స్పూన్లు, అల్లం వెల్లుల్లి పేస్ట్- రెండు టేబుల్ స్పూన్లు, పుదీనా- రెండు టేబుల్ స్పూన్లు, కొత్తిమీర- రెండు టేబుల్ స్పూన్లు, నిమ్మరసం- ముప్పావు టీస్పూన్, పెరుగు- అరకప్పు, పచ్చిమిర్చి- 3, బిర్యానీ ఆకు- 1, సాజీరా- ముప్పావు టీస్పూన్, నెయ్యి- టేబుల్ స్పూన్,

తయారీ విధానం: బిర్యానీ చేయటానికి ముందు బాస్మతి బియ్యాన్ని శుభ్రంగా కడిగి నలభై నిముషాల పాటు మంచి నీళ్లలో నానబెట్టుకోవాలి. ఉల్లిపాయలను డీప్‌ఫ్రై చేసుకుని పక్కన ఉంచుకోవాలి. ఆ తర్వాత చిన్న జార్‌లో ధనియాలు, నాలుగు ఇలాచి, జీలకర్ర, నాలుగు లవంగాలు, మిరియాలు, ఒక దాల్చిన చెక్క వేసి మిక్సీ పట్టాలి. ఈ మసాలా పొడర్‌ను పక్కన ఉంచుకోవాలి.

పసుపు కొద్దిగా, తగినంత ఉప్పు, కారం పొడి వేసి రొయ్యలకు పట్టేట్లు కలపాలి. ఆ తర్వాత తయారు చేసుకున్న మసాలా పొడర్, డీప్ ఫ్రై చేసిన సగం ఉల్లిపాయ ముక్కలను వేశాక.. అల్లం వెల్లుల్లి పేస్ట్ వేయాలి. పచ్చిమిర్చి తర్వాత పుదీనా, కొత్తిమీర కొద్ది కొద్దిగా వేయాలి. ఆ తర్వాత నిమ్మరసం వేశాక.. పెరుగు వేయాలి. ఈ మిశ్రమాన్నంతా బాగా కలిపాక.. గంటపాటు మారినేట్ చేసుకోవాలి.

గిన్నెలో సగానికి నీళ్ల తీసుకుని కొద్దిగా వేడయ్యాక.. బిర్యానీ ఆకు, ఇలాచి, లవంగాలు, సాజీరా వేసి.. తగినంత ఉప్పు, నెయ్యి వేసి మీడియం ఫ్లేమ్‌లో పది నిముషాల పాటు కుక్ చేయాలి. ఆ ఉడికే నీళ్లలో నానబెట్టుకున్న బాస్మతి బియ్యం మాత్రమే వేయాలి. మూత ఉంచి గరిటెతో 80 శాతం వరకూ బియ్యాన్ని ఉడికించుకోవాలి. ఈ లోపు మరో పెద్ద కడాయిలో కొద్దిగా నూనె వేసి మారినేట్ చేసుకున్న రొయ్యల మిశ్రమాన్ని వేయాలి. ఆ బౌల్‌లో కొద్దిగా నీళ్లు పోసి తిప్పిన తర్వాత ఆ నీళ్లను రొయ్యల మిశ్రమం మీద వేయాలి. పుదీనా, కొత్తిమీర చల్లుకున్న తర్వాత మిగిలిన డీప్‌ఫ్రై చేసిన ఉల్లిపాయలు వేయాలి. ఈ లోపు ఉడికిన బియ్యంలోని నీళ్లను వార్చిన తర్వాత ఆ బియ్యాన్ని రొయ్యల మిశ్రమం మీద వేయాలి. ఈ బియ్యం మీద కొద్దిగా నెయ్యి అన్ని వైపులా చల్లిన తర్వాత.. స్టవ్ ఆన్ చేయాలి. పెద్ద కడాయి మీద మూత ఉంచి.. మూత చివర గోధుమపిండితో క్లోజ్ చేయాలి. హైఫ్లేమ్‌లో పది నిముషాల పాటు ఉడికించుకోవాలి. ఆ తర్వాత స్టవ్‌మీద పెనం ఉంచి దాని మీద కడాయిని ఉంచాలి. దీని వల్ల రొయ్యలు మాడిపోవు. ఐదు నిముషాల పాటు ఉడికించుకోవాలి. స్టవ్ కట్టేశాక.. చివరగా పదిహేను నిముషాల పాటు మూత తీయకుండా అలానే ఉంచాలి. రొయ్యల బిర్యానీ రెడీ.



గోంగూర రొయ్యల కూర



కావాల్సిన పదార్థాలు: పొట్టు తీసిన రొయ్యలు- కేజీ, కారం- రెండు స్పూన్లు, ఉప్పు రుచికి తగినంత, పసుపు- టీస్పూన్, నూనె- రెండున్నర టేబుల్ స్పూన్స్, మీడియం సైజ్ ఉల్లిపాయలు- 3 (సన్నగా తరగాలి), పచ్చిమిర్చి- 5 (నిలువుగా కోయాలి), అల్లం, వెల్లుల్లి పేస్ట్- టేబుల్ స్పూన్, టమోటాలు-2 (సన్నగా తరగాలి), గోంగూర పేస్ట్- టేబుల్ స్పూన్,

తయారీ విధానం: మొదట రొయ్యలను శుభ్రం చేసి ఒక బౌల్‌లో తీసుకోవాలి. ఇందులో ఒక స్పూన్ కారం, కొద్దిగా ఉప్పు, చిటికెడు పసుపు వేసి రొయ్యలకు పట్టేట్లు బాగా కలపాలి. ఆ తర్వాత ప్యాన్‌లో ఒక స్పూన్ నూనె తీసుకుని కాస్త వేడయ్యాక.. రొయ్యలు వేసి కలపాలి. ప్యాన్‌పై మూత ఉంచి.. మీడియం ఫ్లేమ్‌లో ఉడికించుకోవాలి. రొయ్యల్లోని నీరు బయటకు వస్తుంది. ఆ నీరు పోయేంత వరకు గరిటెతో కదుపుతూ ఉడికించుకోవాలి. ఆ తర్వాత వీటిని ప్లేట్‌లో వేసి పక్కన ఉంచుకోవాలి.

మరో ప్యాన్‌లో రెండు టేబుల్ స్పూన్ల నూనె వేసి కాస్త వేడయ్యాక.. తరిగిన ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి, ఉప్పు, కొద్దిగా పసుపు వేసి మీడియం ఫ్లేమ్‌లోనే కలపాలి. మూత ఉంచి.. నాలుగు నిముషాల పాటు కుక్ చేయాలి. ఉల్లిపాయల రంగు మారిన తర్వాత అల్లం వెల్లులి పేస్ట్ వేసి ఆ పచ్చివాసన పోయేంత వరకూ గరిటెతో కదపాక.. టమోటా ముక్కలతో పాటు గ్రైండ్ చేసిన గోంగూర పేస్ట్ వేసి కలపాలి. ప్యాన్‌పై మూత ఉంచి ఐదు నిముషాల పాటు కుక్ చేశాక.. గరిటెతో కదిపిన తర్వాత స్పూన్ కారం, తగినంత ఉప్పు, గరం మసాలా వేసి కలపాలి. గ్రేవీకి అవసరమైన నీళ్ల కొన్ని తీసుకుని గరిటెతో కలపాలి. ప్యాన్‌మీద మూత ఉంచి ఐదు నిముషాల పాటు ఉడికించుకోవాలి. కొద్దిగా నీళ్ల చూసుకుని వేసుకున్న తర్వాత.. గరిటెతో కదపాలి. చివరగా పక్కన ఉంచిన రొయ్యలను ఇందులో వేయాలి. గరిటెతో కదిపాక ఉప్పు, కారం సరిచూసుకున్న తర్వాత ప్యాన్‌పై మూత ఉంచి ఐదు నిముషాల పాటు కుక్ చేయాలి. చివరగా గరిటెతో రెండు నిముషాలు కదిపిన తర్వాత అన్నంలోకి వేడివేడిగా వడ్డించుకుని తినటమే తరువాయి.

క్రిస్పీ గోల్డెన్ ఫ్రై ప్రాన్స్

కావాల్సిన పదార్థాలు

పొట్టు తీసేసిన పెద్ద రొయ్యలు- అరకేజీ, పెప్పర్ పొడి- అర టీస్పూన్, ఉప్పు- రుచికి తగినంత, మైదా- కప్పు, కోడిగుడ్లు- రెండు, సన్నటి బ్రెడ్ ముక్కల పొడి- కప్పు,

తయారీ విధానం

బౌల్‌లో రొయ్యలు వేసి పెప్పర్ పొడి, ఉప్పు వేసి కలపాలి. నలభై నిముషాల పాటు ఫ్రిజ్‌లో ఉంచాలి. చతురస్రాకారం బాక్సులో మైదా వేశాక కొద్దిగా పెప్పర్ పొడి, చిటికెడు ఉప్పు వేసి కలపాలి. మరో బాక్సులో రెండు కోడిగుడ్ల సొనను వేసి మ్యాష్ చేయాలి. మరో బాక్సులో బ్రెడ్ ముక్కలను వేసుకోవాలి. ఇపుడు మైదాలో రొయ్యలను వేసి బాగా కలపాలి. పిండి అంటుకుంటుంది.

ఈ రొయ్యలను ఒక్కోదాన్ని కోడిగుడ్ల సొనలో ముంచి చివరగా బ్రెడ్ ముక్కల్లో వేసి ముక్కలు అతుక్కునేట్లు రొయ్యలను కదపాలి.

ఈ రొయ్యలను అన్నింటిని ఒక ప్లేట్‌లో ఉంచుకోవాలి. చివరగా డీప్ ఫ్రైకి తగినంత నూనె తీసుకుని వేడయ్యాక ఈ రొయ్యలను గోల్డెన్ బ్రౌన్ రంగు వచ్చేంత వరకూ కాల్చుకోవాలి. క్రిస్పీగా భలే రుచిగా ఉంటాయివి.

చిన్న వయసులోనే కంటిచూపును కోల్పోయినా... కలలు కనడం ఆపలేదు. ఆ కలలు నెరవేర్చుకోవడానికి ఎన్ని అవరోధాలు ఎదురైనా వెరువలేదు. ఐఐటి-హెచ్‌లో అడ్మిషన్ సాధించిన మొదటి అంధురాలిగా చరిత్రకెక్కిన పద్దెనిమిదేళ్ల రుహిన్ భట్టసాలి యువతకు స్ఫూర్తిదాతగా నిలుస్తున్నారు.

చూపులేకున్నా.. గురి తప్పలేదు

ట్రిపుల్ ఐటీ విజేత





రుహిన్ భట్టసాలి బాల్యం పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతాలో గడిచింది. ఆటపాటలతో ఆనందంగా సాగిపోతున్న ఆమెకు జీవితంలో ఊహించని కుదుపు. రుహిన్‌కు కంటి సమస్యలు ఏర్పడడంతో... వైద్యుల సూచన మేరకు శస్త్రచికిత్స చేయించాల్సి వచ్చింది. ఆ ఆపరేషన్ వికటించడంతో... ఆమె దృష్టిని పూర్తిగా కోల్పోయింది. "అప్పుడు మా అమ్మాయి ఎనిమిదో తరగతి చదువుతోంది. ఆమెకు చూపు ఇక రాదని తెలియడంతో... మా ప్రపంచం ఒక్కసారిగా తల్లకిందులైపోయింది. ఈ పోటీ ప్రపంచంలో ఆమె ఎలా నెగ్గుకురాగలదా? అని ఆవేదన చెందని రోజంటూ లేదు" అని గుర్తు చేసుకున్నారు రుహిన్ తల్లి మంజూషా చౌధురి. మెరుగైన చికిత్స కోసం ఆమె కుటుంబం కోల్‌కతా నుంచి హైదరాబాద్‌కు మారింది. ఒక బహుళ జాతి కంపెనీలో టెక్నికల్ రైటర్‌గా పని చేస్తున్న మంజూష... తన కుమార్తెను ఆమె ఆకాంక్షల మేరకు చదివించాలని నిర్ణయించుకున్నారు. నేర్చుకొనే నైపుణ్యం రుహిన్‌కు చాలా ఎక్కువ. దీన్ని ఆమె తల్లితండ్రులు రాహుల్ భట్టసాలి, మంజూష ఉపాధ్యాయులు గుర్తించారు. ఆమెకు అండగా నిలిచి, ఆమె చదువుకు అనువైన వాతావరణాన్ని కల్పించారు. "అయినప్పటికీ నేను చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. సిబిఎస్‌సి పాఠ్య ప్రణాళిక కఠినంగా ఉంటుంది. విస్తృతంగా చదవాలి, అవగాహన పెంచుకోవాలి, తార్కికంగా విశ్లేషించుకోవాలి. దృష్టి లోపం ఉన్న వారికి ఇవన్నీ చాలా కష్టం" అంటున్న రుహిన్ అంకితభావంతో, తన సామర్థ్యాల మీద అచంచలమైన నమ్మకంతో ఆ అవరోధాలన్నీ దాటింది. ప్లస్2లో 98.2 శాతంతో ఉత్తీర్ణత సాధించింది. "నాకు చిన్నప్పటినుంచీ ఆస్ట్రోఫిజిసిస్ట్ కావాలని ఉండేది. కానీ సైన్స్, ఇంజనీరింగ్ టెక్నాలజీ, గణితాల్లో పరిశోధనకు అవకాశం తక్కువ. కాబట్టి ఇంజనీరింగ్‌ను ఎంచుకున్నాను" అని చెబుతోంది రూహిన్. "ఎగ్జామ్స్‌కు సన్నద్ధం కావడం రుహిన్‌కు ఒక సవాలే అయింది. మంచి టీచర్లున్న కోచింగ్ సెంటర్లలో ఆమెను చేర్చుకోరని మాకు తెలుసు. అందుకే ఆన్‌లైన్ కోచింగ్‌ను ఎంచుకున్నాం. ఆమెకు అది ఎంతో సాయపడింది" అంటారు మంజూష.

సాంకేతికత ఆసరాతో...

సాంకేతికతపై రుహిన్‌కు ఉన్న ఆసక్తి కూడా ఆమె పురోగతికి చాలా సాయపడింది. "నేనెప్పుడూ

"ఎగ్జామ్స్‌కు సన్నద్ధం కావడం రుహిన్‌కు ఒక సవాలే అయింది. మంచి టీచర్లున్న కోచింగ్ సెంటర్లలో ఆమెను చేర్చుకోరని మాకు తెలుసు. అందుకే ఆన్‌లైన్ కోచింగ్‌ను ఎంచుకున్నాం. ఆమెకు అది ఎంతో సాయపడింది" అంటారు మంజూష.

బ్రెయిలీలో చదవడం, రాయడం నేర్చుకోలేదు. అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతికతనే ఉపయోగించుకోవాలనుకున్నాను. నా చదువుకు అవసరమైన సాధనాలన్నిటినీ ఆ ప్రకారంగానే సిద్ధం చేసుకున్నాను. యాప్స్ ఎల్లప్పుడూ ఉపయుక్తంగానే ఉండేవి.. కానీ గత రెండు మూడేళ్ళుగా చాలా వేగవంతమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ఇప్పుడు, నా కన్నులా వ్యవహరించే యాప్ ఒకటుంది. అది ఏ చిత్రం గురించైనా, దృశ్యం గురించైనా స్పష్టంగా వివరించగలదు అని చెబుతోంది రుహిన్. అందుబాటులో ఉన్న అని వనరులను ఉపయోగించుకుంటూ... ఆమె పెద్ద పోరాటమే చేసింది. ఇటీవల జరిగిన ఐఐటి ఎగ్జామ్స్‌లో... 'పర్సన్ విత్ డిజేబిలిటీ' (పిడబ్ల్యూడీ) కేటగిరీలో... ఆలిండియా ర్యాంక్ 48ను సాధించింది. హైదరాబాద్ ఐఐటిలో... కంప్యూటర్ సైన్స్- అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులో అడ్మిషన్ సంపాదించింది. ఐఐటిహెచ్‌లో అడ్మిషన్ సాధించిన తొలి అంధురాలు ఆమే కావడం విశేషం. తోటివారికి సాయం చెయ్యాలన్న తపన కూడా రుహిన్‌కు ఎక్కువే. ఆంధ్రప్రదేశ్‌లోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న ఇద్దరు అమ్మాయిలకు చదువులో సాయపడుతోంది. వాళ్ళకు లెక్కలు, సైన్స్ చెబుతోంది.. "వారితో మాట్లాడే సమయంలో నెట్‌వర్క్ సమస్యలు ఎదురవుతూ ఉంటాయి. తరచూ కాల్ కట్ అవుతూ ఉంటుంది. అయినప్పటికీ... రోజూ కొన్ని గంటలు వాళ్ళకోసం కేటాయిస్తున్నాను. ఇది ఎంతో సంతృప్తిని ఇస్తోంది" అంటున్న రుహిన్ ప్రయాణం... యువతకు స్ఫూర్తిదాయకం.

మేకప్

డ్రస్‌కు తగినట్టు... అదిరేట్టు

మేకప్ సందర్భానుసారంగా ఉండాలి. వేసుకున్న దుస్తులకు మ్యాచ్ అయ్యేలా ఉండాలి. అందుకోసం ఎలాంటి మేకప్ మెలకువలు పాటించాలో తెలుసుకుందాం!

మోడర్న్ వేర్

గౌన్స్, షార్ట్స్ లాంటి మోడర్న్ వేర్ ధరించినప్పుడు, వేసుకున్న దుస్తులకు తగ్గట్టుగా బోల్డ్ లుక్ మేకప్ ఎంచుకోవాలి. ముదురు రంగు లిప్‌స్టిక్, ఐషాడోలతో పాటు, బ్లష్ కూడా స్పష్టంగా కనిపించేలా వేసుకోవాలి. స్మోకీ ఐస్ లుక్ నలుపు రంగు మోడర్న్ వేర్‌కు చక్కగా సూటవుతుంది. ఫాల్స్ ఐల్యాషెస్ వాడుకునేవాళ్లు, రెండు కోట్స్ మస్కారా అప్లై చేయాలి.

డిజైనర్ చీరల్లో...

డిజైనర్ వేర్‌లో తళుకులకే ఎక్కువగా ప్రాధాన్యం ఉంటుంది. కాబట్టి మెరుపులీనే మేకప్ టిప్స్ అనుసరించాలి. గ్లిట్టర్ లిప్‌స్టిక్, మస్కారాలు ఎంచుకోవచ్చు. నుదురు, ముక్కు, గొంతు దగ్గర హైలైటర్ తప్పనిసరిగా అప్లై చేయాలి. లిప్‌గ్లాస్ కూడా వాడుకోవచ్చు. సిల్వర్ లేదా గోల్డ్ హ్యూ ఉన్న బ్లష్, లిప్‌స్టిక్‌లు కూడా డిజైనర్ వేర్‌కు చక్కగా సూటవుతాయి.

సంప్రదాయ దుస్తుల్లో...

పట్టు చీరల్లో మెరిసిపోవాలనుకుంటే, మ్యాట్ లిప్‌స్టిక్ ఎంచుకోవాలి. చీర పవిట ఏ కాంట్రాస్ట్ కలర్‌లో ఉంటే, ఆ రంగు లిప్‌స్టిక్, ఐష్యాడోలను ఎంచుకోవాలి. అయితే కొట్టొచ్చేలా అవసరానికి మించి మేకప్ వేసుకోకుండా, వీలైనంత తక్కువ మేకప్ వాడుకోవాలి. కళ్ల దిగువన, పెదవుల చుట్టూరా ముడతలు పడే వీల్లేకుండా పల్చని మేకప్ వేసుకోవాలి.



గుమ్మడి గింజలు తింటే...



గుమ్మడి గింజలలో మన శరీరానికి మేలు చేసే పోషకాలు ఎన్నో ఉన్నాయి.

నిద్రలేమికి: మనలో ఎంతో మంది ప్రస్తుత కాలంలో ప్రశాంతమైన నిద్ర పట్టక ఇబ్బంది పడుతుంటారు. గుమ్మడి గింజలలో ఉండే ట్రిప్టోఫాన్ అనే అమినో యాసిడ్ మంచి నిద్రను కలగజేస్తుంది.

రోగ నిరోధకశక్తికి: గుమ్మడి గింజలలో ఉండే జింక్ మన రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది.

గుండె ఆరోగ్యానికి: ఈ గింజలలోని పొటాషియం, మెగ్నీషియం చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. తద్వారా గుండె ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుంది.

ఈ గింజల్లోని ఆరోగ్యకరమైన కొవ్వు, ఐరన్, కాపర్‌లు శరీరానికి మేలు చేస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిలను అదుపు చేస్తాయి. వీటిలోని యాంటీ ఆక్సిడెంట్లు ఒత్తిడిని తగ్గిస్తాయి.

కీళ్లకు: గుమ్మడి గింజలలోని పోషకాలు, విటమిన్లు ఎముకలు, కీళ్ల ఆరోగ్యానికి మేలు చేస్తాయి. పీచు పదార్థము జీర్ణ వ్యవస్థ పని తీరును మెరుగు పరుస్తుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది.

ఏసీబీ డీజీగా అతుల్ సింగ్

» రాష్ట్రంలో సీనియర్ ఐపీఎస్‌ల బదిలీలు

అమరావతి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారులను బదిలీ చేసింది. సీఐడీ అధిపతిగా విశాఖపట్నం పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్‌ను నియమించింది. అవినీతి నిరోధక శాఖ డీజీగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఏపీఎస్పీ బెటాలియన్ చీఫ్ అతుల్ సింగ్‌ను ఏసీబీకి పరిమితం చేసింది. శాంతి భద్రతల ఏడీజీగా ఉన్న శంఖబ్రత బాగ్చీని విశాఖపట్నం పోలీస్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర డీజీపీగా నియమితులైన హరీశ్ కుమార్ గుప్తాను తప్పించి ఆయన స్థానంలో సీనియర్ ఐపీఎస్ అధికారి ఆర్టీసీ ఎండీ.. ద్వారకా తిరుమలరావుకు ఇటీవలే పోస్టింగ్ ఇచ్చారు. ఏడీజీ ర్యాంకులో ఉన్న ముగ్గురు అధికారులకు శుక్రవారం పోస్టింగ్స్ ఇచ్చిన ప్రభుత్వం ఐజీ, డీఐజీ, ఎస్పీల బదిలీలపై కసరత్తు చేస్తోంది. విశాఖపట్నం, కర్నూలు, అనంతపురం రేంజ్ డీఐజీలతోపాటు రవాణా శాఖ కమిషనర్, డ్రగ్స్ కంట్రోల్ డీజీ, ఏసీబీ డైరెక్టర్ లాంటి పోస్టుల భర్తీ శనివారం పూర్తి అయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఆదివారం నాటికి పలు జిల్లాల ఎస్పీల బదిలీ, పోస్టింగ్స్ ఉంటాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

నలుగురు ఐఏఎస్‌ల పదవీ విరమణ

» పోస్టింగ్ ఇచ్చిన మర్నాడే మాజీ సీఎస్ జవహర్, పూనం రిటైర్

అమరావతి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నలుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులు శుక్రవారం పదవీ విరమణ చేశారు. మాజీ సీఎస్ కేఎస్ జవహర్ రెడ్డితో పాటు పూనం మాలకొండయ్య, కె.వెంకటరమణారెడ్డి, హెచ్.అరుణ్‌కుమార్ రిటైరయ్యారు. ఈ నెల 30వ తేదీతో వారికి 60 ఏళ్లు పూర్తవుతాయి. 29, 30 తేదీలు శని, ఆదివారాలు సెలవు రోజులు కావడంతో రెండ్రోజుల ముందే వారు పదవీ విరమణ చేశారు. సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా పదవీ విరమణ నేపథ్యంలో జవహర్ రెడ్డి, పూనంకు ప్రభుత్వం గురువారం పోస్టింగ్‌లు ఇచ్చింది. ఈడబ్ల్యూఎస్ వెల్ఫేర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పోస్టింగ్ తీసుకున్న జవహర్‌రెడ్డి రిటైర్ కావడంతో ఇన్‌చార్జిగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంతరాముకు అదనపు బాధ్యతలు అప్పగించారు. జీఏడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న పూనం మాలకొండయ్య స్థానంలో పోలా భాస్కర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. సివిల్ సప్లయ్స్ కమిషనర్‌గా ఉన్న హెచ్.అరుణ్‌కుమార్‌ను ప్రభుత్వం రిలీవ్ చేసింది. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు.

పీఏసీఎస్‌లకు అధికారిక పర్సన్ ఇన్‌చార్జిలు

అమరావతి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘా(పీఏసీఎస్)లకు అధికారిక పర్సన్ ఇన్‌చార్జిలను నియమించాలని ప్రభుత్వం సహకారశాఖను ఆదేశించింది. అధికారిక పర్సన్ ఇన్ చార్జిలను నియమించే అధికారం జిల్లా సహకార శాఖ అధికారులకు అప్పగిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

మత్స్యకార సమాఖ్య పర్సన్ ఇన్‌చార్జిగా కమిషనర్

ఏపీ మత్స్యకార సహకార సంఘాల సమాఖ్య అధికారిక పర్సన్ ఇన్‌చార్జిగా మత్స్యశాఖ కమిషనర్‌ను ప్రభుత్వం నియమించింది. మత్స్యకార సమాఖ్యకు ప్రత్యక్ష ఎన్నికలు జరిగే వరకు లేదా ఈ ఏడాది డిసెంబరు 2వరకు పర్సన్ ఇన్‌చార్జిగా కమిషనర్ వ్యవహరించనున్నారు.

ఆక్వా అథారిటీ వైస్ చైర్మన్ రాజీనామా ఆమోదం

ఏపీ స్టేట్ ఆక్వాకల్చర్ అథారిటీ కో వైస్ చైర్మన్ పదవికి వడ్డి రఘురామ్ రాజీనామా చేశారు. దానిని ఆమోదిస్తూ గెజిట్ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు నెల జీతం: ఈసీ

అమరావతి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2024 సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వహించిన అధికారులు, ఉద్యోగులకు ఒక నెల జీతాన్ని గౌరవ వేతనంగా ఇవ్వాలని ఈసీ ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్ కుమార్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు. ఒక నెల స్థూల జీతానికి(గ్రాస్ శాలరీ) సమానంగా గౌరవ వేతనం చెల్లించాలని ఆదేశాలు ఇచ్చారు.

కోట్లు కుమ్మేశారు!

» టీచర్ల బదిలీల్లో మరిన్ని అక్రమాలు

» బొత్స, అధికారులు, సంఘాల నేతలు వాటాలు వేసుకుని మరీ దోపిడీ

» మొత్తం వసూళ్లు రూ.వంద కోట్ల పైనే

బదిలీలు జరిగినప్పుడు ముడుపులు చేతులు మారడం చూస్తాం. కానీ, అసలు లేని బదిలీలను మధ్యలో సృష్టించి మరీ కోట్లు కుమ్మేయడం ఎక్కడైనా చూశారా?. కానీ, జగన్ ఏలుబడిలో ఏదైనా సాధ్యమేనని అప్పటి మంత్రి బొత్స సత్యనారాయణ నిరూపించారు. సాధారణ టీచర్లకు బదిలీల ఎరచూపి రూ.లక్షల్లో లంచాలు పిండుకుని రూ.కోట్లు కుమ్మేశారు!!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ జమానాలో వ్యవస్థలను భ్రష్టు పట్టించారు. చివరకు బదిలీల ప్రక్రియను కూడా అభాసుపాల్జేశారు. అప్పటి ముఖ్యమంత్రి కార్యాలయం కేంద్రంగా ఉపాధ్యాయుల బదిలీ అక్రమాలకు నాంది పలికితే అప్పటి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ దానిని పతాక స్థాయికి తీసుకెళ్లారు. పాఠశాల విద్యాశాఖ అధికారులు, కొన్ని ఉపాధ్యాయ సంఘాల నేతలు కూడా వీలైనంత మేర దోచేశారు. మొత్తంగా రూ.100 కోట్లకు పైగా టీచర్ల బదిలీల కుంభకోణం జరిగినట్టు తెలుస్తోంది. అంతకుముందు ప్రభుత్వాల్లోనూ అడపాదడపా సిఫారసులతో బదిలీలు చేసినా అవి చాలా పరిమిత సంఖ్యలో ఉండేవి. కానీ, జగన్ జమానాలో ఏకంగా 2,400 మంది టీచర్లను అక్రమంగా బదిలీ చేసినట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. మొత్తంగా ఏడాది కాలం వ్యవధిలో ఒకసారి 1,000 మందిని, మరోసారి 1,400 మందిని వైసీపీ ప్రభుత్వం అక్రమంగా బదిలీ చేసింది. అయితే మొన్నటివరకూ ఈ సంఖ్య 1,200 మాత్రమేనని అధికారులు ప్రచారం చేశారు. కానీ 2,400 మంది టీచర్లను దొడ్డిదారిలో బదిలీ చేసిన విషయం ప్రభుత్వం మారాక వెలుగు చూసింది. ఒక్కో బదిలీకి రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేశారని సమాచారం.

జగన్ ఆఫీస్ నుంచి మొదలు

అప్పటి సీఎం జగన్ కార్యాలయం(సీఎంవో) నుంచే బదిలీల తతంగం ప్రారంభమైనట్టు తెలిసింది. బదిలీల పేరిట తొలుత 350 మంది టీచర్లను అడ్డదారిలో కోరుకున్న స్థానానికి పంపించేందుకు పాఠశాల విద్యాశాఖ ప్రయత్నించింది. ఇది బయటికి రావడంతో వాటిని ఆపేశారు. ఆ తర్వాత 2022 చివర్లో మొదలు పెట్టి తరచూ జాబితాలు తయారుచేశారు. మొదట ఈ బదిలీలను అడ్డుకుంటున్నట్లు అప్పటి మంత్రి బొత్స కార్యాలయం ప్రచారం చేసింది. ఆ తర్వాత బదిలీలు చేసిపెట్టండి అంటూ ఆ జాబితాలో ఉన్న టీచర్లు ఆయన్నే ఆశ్రయించారు. ఇక అప్పటి నుంచీ అడ్డూ అదుపూ లేకుండా లంచాలు తీసుకుని ఇష్టానుసారం బదిలీలు చేశారు. 350 మందితో మొదలైన జాబితా 2400కు చేరింది. ఎన్నికల ముందు ఎంత వస్తే అంత అన్నట్టుగా అడిగిన వారందరికీ బదిలీ ఆర్డర్లు ఇచ్చేశారు. మొదట బదిలీ అయిన టీచర్లు కొత్త స్థానాల్లో చేరారు. కానీ, ఎన్నికలకు ముందు బదిలీ అయిన టీచర్లు ఆర్డర్లు పొందినప్పటికీ రిలీవ్ కాలేదు. ఇప్పుడు వారిని రిలీవ్ చేయొద్దని పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. బొత్స కార్యాలయంలో పనిచేసిన కమలాకర్ అనే వ్యక్తి ద్వారా ఈ అక్రమ బదిలీల వ్యవహారం సాగినట్టు తెలిసింది. ఎవరైనా సరే ఆయన్ను కలిసి ముడుపులు సమర్పించిన తర్వాతే బదిలీ ఆర్డర్లు బయటికొచ్చాయి. ఈ క్రమంలో పాఠశాల విద్య కమిషనరేట్, సచివాలయంలోని విద్యాశాఖ అధికారులు జోక్యం చేసుకున్నారు. వేల సంఖ్యలో చేపట్టిన బదిలీల్లో తమ వాటా అంటూ దాదాపు 30కి పైగా బదిలీలు వారు చేసి జేబులు నింపుకొన్నారు. మరోవైపు ఉపాధ్యాయ సంఘాల నేతలు సైతం ఈ వ్యవహారంలో తలదూర్చి బదిలీలు చేయించుకుని, ముడుపులు వసూలు దండుకున్నట్టు సమాచారం.

ప్రవీణ్ సహకారం... సురేశ్ మౌనం

టీచర్ల బదిలీల అక్రమాలకు అప్పటి పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ పూర్తి సహకారం అందించారు. మంత్రి చెప్పారనే కారణంతో ఈ బదిలీలు చేయించి స్వామి భక్తి చాటుకున్నారు. అక్రమాలను అడ్డుకోవాల్సిన ఆయనే సచివాలయంలో అధికారులను కూర్చోబెట్టి మరీ ఆర్డర్లు ఇప్పించారు. ఇక పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్ కళ్ల ముందే అక్రమాలు జరుగుతున్నా తనకేం పట్టదన్నట్టు మౌనంగా ఉండిపోయారు. బదిలీ ఆర్డర్ పొంది రిలీవ్ కాని టీచర్ల పరిస్థితి దయనీయంగా మారింది. అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నేతల మాటలు విని అడిగినంత ముడుపులు సమర్పించుకున్నారు. తీరా బదిలీ ఆదేశాలు పొందినా కొత్త స్థానానికి వెళ్లేలోగా ప్రభుత్వం మారడంతో ఆ బదిలీలు మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో అటు డబ్బులు పోయి, ఇటు బదిలీ అవ్వక ఎటూ కాకుండా మిగిలిపోయారు.

ఇకపై రాజకీయ జోక్యం ఉండదు!

గత ప్రభుత్వంలో జరిగిన అక్రమ బదిలీల వ్యవహారం పెను వివాదానికి దారితీయడంతో ఇకపై జరిగే బదిలీల్లో రాజకీయ జోక్యం అనే మాట వినిపించకూడదని తాజాగా జరిగిన విద్యాశాఖ సమీక్షలో మంత్రి నారా లోకేశ్ స్పష్టంచేశారు. పూర్తి పారదర్శకంగా బదిలీలు చేపట్టాలని ఆదేశించారు. అయితే గతంలో జరిగిన అక్రమాలపై విచారణ చేయించాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. మొత్తం అక్రమాలను వెలికి తీసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కొందరు కోరుతున్నారు. కఠిన చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో అక్రమాల జోలికి పోవాలంటే భయం ఏర్పడుతుందని, లేదంటే అధికారులు, సంఘాల నేతలు కూడా బదిలీలంటే కాసుల వర్షం అన్నట్టుగా భావిస్తూ జేబులు నింపుకొంటున్నారని ఉపాధ్యాయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

పింఛన్లు రెడీ

» జూలైలో ఒక్కో పెన్షనర్‌కు రూ.7 వేలు

» నిధులు సమీకరించే పనిలో సర్కార్

» ఇప్పటికే రూ.5 వేల కోట్లకు ఇండెంట్

» ప్రతినెలా 1వ తేదీనే పింఛన్లు: మంత్రి డోలా

అమరావతి (ఆంధ్రజ్యోతి), పొన్నలూరు (కొండపి), జూన్ 28: పేదలకు ఇచ్చిన హామీ నెరవేర్చేందుకు టీడీపీ కూటమి సర్కార్ ప్రయత్నాలు ప్రారంభించింది. పలు పథకాలకు సంబంధించి వాస్తవ పరిస్థితులను అధికారులతో సమీక్షిస్తూనే... మరోవైపు వచ్చే నెల 1న ఇవ్వాల్సిన పెన్షన్లు, ఉద్యోగుల జీతాల కోసం నిధుల సమీకరణకు చర్యలు తీసుకుంటోంది. సామాజిక పెన్షన్ల కోసం గతంలో కంటే ఎక్కువ మొత్తంలో నిధులు సమీకరించుకోవాల్సి ఉంది. నెలకు రూ.1000 అదనంగా ఇవ్వడంతో పాటు ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన బకాయి రూ.3 వేలు కలిపి మొత్తం రూ.7 వేల చొప్పున చెల్లించాలి. ఇప్పటికే ఆర్‌బీఐ వద్దకు అప్పునకు వెళ్లిన సర్కార్ రూ.5 వేల కోట్లకు ఇండెంట్ పెట్టింది. మంగళవారం వేలం ద్వారా ఈ నిధులు వస్తాయి. సామాజిక పెన్షన్లతో పాటు ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు కూడా ఒకటో తేదీన చెల్లించి ఉద్యోగుల్లో సైతం భద్రతా భావం పెంచాలని ప్రభుత్వం యోచిస్తోంది. కాగా పింఛన్లను ప్రతినెలా 1వ తేదీనే లబ్ధిదారులందరికీ ఇళ్ల వద్దనే ఇచ్చి చూపిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ, సచివాలయాల శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. ప్రకాశం జిల్లా పొన్నలూరులో శుక్రవారం టీడీపీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ నాయకులు కూడా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాలుపంచుకుని లబ్ధిదారులకు 1వ తేదీనే అందేలా చూడాలని కోరారు. ఎస్సీలకు ఉపాధి కల్పన కోసం త్వరలో పెద్దఎత్తున సబ్సిడీ రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పొలాలున్న ఎస్సీ రైతులకు ఫార్మింగ్ మెకనైజేషన్ ద్వారా వివిధ యంత్ర పరికరాలు సబ్సిడీపై అందజేస్తామన్నారు.

ఏపీకి రండి.. పెట్టుబడులు పెట్టండి..!

» ఖాఠ్మండులో జాస్తి వీరాంజనేయులు ప్రదర్శనలు



ఖాఠ్మండులో ప్రదర్శన నిర్వహిస్తున్న జాస్తి వీరాంజనేయులు

విజయవాడ, జూన్ 28: 'ఆంధ్రప్రదేశ్‌కు విచ్చేసి కాబోయే ప్రపంచస్థాయి నగరం అమరావతిని సందర్శించండి. ఇక్కడ పెట్టుబడులు పెట్టండి' అంటూ అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు, అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ జాస్తి వీరాంజనేయులు.. నేపాల్ వేదికగా పెట్టుబడిదారులకు పిలుపునిచ్చారు. నేపాల్ రాజధాని ఖాఠ్మండులో పర్యటించిన ఆయన అమరావతిలో పెట్టుబడులకు ముందుకురావాలని కోరుతూ ఫెక్సీలు ప్రదర్శించారు. యూనెస్కో గుర్తించిన పశుపతినాథ్ దేవాలయం, గుహేశ్వర పార్వతీమాత దేవాలయం, బౌద్ధ స్థూపం, స్వయంభు, బౌద్ధ నీలకంఠ వంటి ప్రఖ్యాత ప్రదేశాలలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమరావతిని ప్రపంచంలోనే మేటి నగరంగా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు విస్తృత ప్రణాళికలు రచిస్తున్నారన్నారు.

బందరు వైసీపీ కార్యాలయానికి నోటీసు

» 2 ఎకరాల్లో ప్యాలెస్ తరహా నిర్మాణం

» అనుమతుల్లేకుండా అడ్డగోలుగా నిర్మాణం

» ప్రభుత్వం మారగానే ఉత్తుత్తి దరఖాస్తు

» అప్పటికే 90 శాతం భవన నిర్మాణం పూర్తి

» పేర్నినాని పేరిట నోటీసులు జారీ


మచిలీపట్నంలో నిర్మించిన వైసీపీ కార్యాలయ భవనం

మచిలీపట్నం టౌన్, జూన్ 28 : కృష్ణాజిల్లా మచిలీపట్నంలో అనుమతులు లేకుండా నిర్మించిన వైసీపీ కార్యాలయ భవనానికి మునిసిపల్ అధికారులు నోటీసులు జారీచేశారు. జగన్ ఐదే ళ్ల పాలనలో ప్యాలెస్‌ల తరహాగా కట్టిన వైసీపీ కార్యాలయాల్లో ఇదీ ఒకటి. కొత్త ప్రభుత్వం వచ్చేనాటికి దాదాపుగా నిర్మాణం పూర్తయింది. దీనిని కోట్లాది రూపాయల విలువగల రెండెకరాల భూమిలో నిర్మించారు. అధికారం అండతో అప్పట్లో నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండా కార్యాలయ భవనం నిర్మించారు. అక్రమమని తెలిసినా అధికారులు ఆనాడు ఏమీ చేయలేకపోయారు. నిబంధనల ప్రకారం, 1000 చదరపు గజాల విస్తీర్ణం దాటిన నిర్మాణాలకు 'ముడా' (మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) అనుమతులు తీసుకోవాలి. అయినా.. అడ్డగోలుగా నిర్మించేశారు. ఎన్నికల ఫలితాలు వెలువడి...టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాకే ఆ పార్టీ నేతలు దరఖాస్తు చేశారు. అప్పటికి 90 శాతం నిర్మాణం పూర్తయిపోయింది. అయితే, వైసీపీ నేతలు ఇచ్చిన దరఖాస్తులో అవకతవకలు ఉన్నట్టు 'ముడా' అధికారులు గుర్తించారు. దాంతో నోటీసులు జారీ చేయాలని నిర్ణయించారు. మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, మాజీ మంత్రి, కృష్ణా జిల్లా వైసీపీ అధ్యక్షుడు పేర్ని నానికి నోటీసులు జారీ చేసేందుకు వెళ్లారు. నాని కార్యాలయం వద్ద లేకపోవడంతో అక్కడ ఉన్న సిబ్బందికి గురువారం సాయంత్రం నోటీసులు అందజేశారు. "మచిలీపట్నం వైసీపీ కార్యాలయ భవనం 1000 చదరపు గజాలకు మించి ఉంది. అందువల్ల 'ముడా' అధికారుల అనుమతి తప్పనిసరి. దీంతో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడికి నోటీసులు జారీ చేశాం. వారిచ్చే సమాధానాన్ని అనుసరించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం" అని మచిలీపట్నం కమిషనర్ బాపిరాజు తెలిపారు.

ఇక పీఏసీఎస్‌లు

బహుళ ప్రయోజన సంఘాలు

● పూర్తిగా కంప్యూటరీకరణ, కామన్ సర్వీస్ పోర్టల్ ద్వారా 300 రకాల సేవలు అందుబాటులోకి..

● రాష్ట్రవ్యాప్తంగా 1858 సంఘాల సిబ్బందికి శిక్షణ

● కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ నోడల్ అధికారి

డాక్టర్ ఎస్ఎల్ఎన్‌టీ శ్రీనివాస్ వెల్లడి

వన్‌టౌన్, జూన్ 28: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను పూర్తిగా కంప్యూటరీకరించి బహుళ ప్రయోజన సహకార సంఘాలుగా మారుస్తున్నామని, అందులో భాగంగా కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ, రాష్ట్ర శాఖ పర్యవేక్షణలో ఉమ్మడి 13 జిల్లాలోని 1858 సహకార సంఘాల సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామని కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ నోడల్ అధికారి డాక్టర్ ఎస్ఎల్ఎన్‌టీ శ్రీనివాస్ తెలిపారు. వన్‌టౌన్‌లోని కేబీఎన్ కళాశాలలో శుక్రవారం ఈనెల 28, 29 తేదీల్లో ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని సంఘాల సిబ్బందికి శిక్షణను ఆయన ప్రారంభించారు.

జూలై 1, 4 తేదీల్లో కృష్ణా జిల్లాకు చెందిన పీఏసీఎస్‌ల సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కామన్ సర్వీస్ పోర్టల్ ద్వారా 300 రకాల సేవలను అందిస్తారని, దీంతో సహకార సంఘాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయని ఆయన తెలి పారు. ఈ కార్యక్రమంలో 58 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యనిర్వహణాధికారులు, జిల్లా సహకార అధికారి డాక్టర్ డి.శ్రీని వాస రెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ రత్నగిరి, డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన తెలంగాణ గవర్నర్

● కనకదుర్గమ్మ సేవలో సీపీ రాధాకృష్ణన్


తెలంగాణ గవర్నర్ రాధాకృష్ణన్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు, ఆలయ అర్చకులు

అమరావతి(ఆంధ్రజ్యోతి), విజయవాడ, జూన్ 28: తెలంగాణ రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్ శుక్రవారం ఉద యం ఇక్కడ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. తొలిగా ఆయన కనకదుర్గమ్మ ఆలయాన్ని సందర్శించారు. ఆయనకు ఈవో కేఎస్ రామారావు, అధికారులు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. ఈవో, గవర్నర్‌కు అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు. అనంతరం ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వచ్చారు. ఆయనకు చంద్రబాబు, ఆయన తనయుడు, మంత్రి లోకేశ్ స్వాగతం పలికి నివాసంలోకి తీసుకువెళ్లారు. చంద్రబాబు ఆయనకు జ్ఞాపిక బహూకరించగా... లోకేశ్ మంగళగిరి చేనేత శాలువాను కప్పి సత్కరించారు. రెండు గంటలపాటు చంద్రబాబు నివాసంలో ఉన్నారు. అనంతరం హైదరాబాద్ తిరిగి వెళ్లిపోయారు. అసెంబ్లీ ఎన్నికల ముందు చంద్రబాబు ఒకటికి రెండుసార్లు తెలంగాణ గవర్నర్‌ను కలిశారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించాక ఆయన ఆహ్వానంపై గవర్నర్ వచ్చారని, ఇది మర్యాదపూర్వక భేటీ అని టీడీపీ వర్గాలు తెలిపాయి.

కాపుల అండతో అధికారంలోకి వచ్చాం

● వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

● ఆ సామాజికవర్గాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిన జగన్ ప్రభుత్వం: ఎమ్మెల్యే బొండా ఉమా


బొండా ఉమాను సత్కరిస్తున్న రాయల్స్ క్లబ్ అసోసియేషన్ సభ్యులు

మొగల్రాజపురం, జూన్ 28: "రాష్ట్రంలో అన్ని కులాలతో పాటు కాపులంతా అండగా నిలవడంతోనే టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చింది. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కాపుల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉంది. టీడీపీ హయాంలో కాపు కార్పొరేషన్ ద్వారా కాపు విద్యార్థుల విదేశీ విద్య కోసం రూ.11లక్షలు అందించాం. జగన్ వచ్చాక అది ఉందో లేదో తెలియని పరిస్థితి. కాపులను జగన్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది" అని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. అమ్మ కల్యాణ మండపంలో రాయల్ క్లబ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బొండా ఉమాకు శుక్రవారం సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమా మాట్లాడారు. అనేక సేవా కార్యక్రమాల ద్వారా కాపుల అభ్యున్నతికి, పాటుపడుతున్న రాయల్స్ క్లబ్‌కు తన వంతు సహకారం అందిస్తానని, క్లబ్ కేంద్ర కార్యాలయ నిర్మాణానికి సహకరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. పేదరికంతో కాపులు విద్యకు దూరం కాకుడదనే రాయల్స్ క్లబ్ ద్వారా సేవలు అందిస్తున్నామని క్లబ్ జాతీయ అధ్యక్షుడు సుంకర కృష్ణ తెలిపారు. క్లబ్ ట్రస్టు చైర్మన్ పేటేటి పుల్లయ్య, క్లబ్ జాతీయ మాజీ అధ్యక్షుడు మిరియాల వెంకటేశ్వరరావు, ప్రోగ్రాం కమిటీ చైర్మన్ రామిశెట్టి కొండలరావు, వై.శివరామకృష్ణయ్య, కోశాధికారి గునుకుల పుల్లయ్య, యర్రంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మంగళగిరిలోని జాతీయ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను అభినందిస్తున్న వర్ల రామయ్య

పల్లా శ్రీనివాస్‌కు వర్ల రామయ్య అభినందన

వన్‌టౌన్, జూన్ 28: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన పల్లా శ్రీనివాస్‌ను టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అభినందించారు. మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించాక పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు.

రేపు చెస్ రాష్ట్రస్థాయి ఎంపికలు

విజయవాడ స్పోర్ట్స్, జూన్ 28: నగరంలోని స్పార్క్ చెస్ అకాడమీ, స్ప్రింగ్‌బోర్డు ప్లేస్కూల్ ఆధ్వర్యంలో రెండో అంతర్జాతీయ చెస్ ఫిడే రేటింగ్ టోర్నీకి ఈనెల 30న కరెన్సీనగర్‌లో స్ప్రింగ్‌బోర్డు స్కూల్‌లో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకుడు తాళ్ల నరేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 7, 9, 11, 13, 15 ఓపెన్ విభాగాల్లో పోటీలుంటాయని, ఎంపిక పోటీల్లో సత్తా చాటిన వారిని అంతర్జాతీయ టోర్నీలోకి ఉచితంగా ప్రవేశం కల్పిస్తామని పేర్కొన్నారు. ఓపెన్ విభాగంలో టాప్-10 క్రీడాకారులకు, అండర్ -7, 9, 11, 13, 15 విభాగాల్లో మొదటి స్థానంలో నిలిచిన బాల, బాలికలకు ఎంట్రీ ఫీజులో వందశాతం రాయితీ కల్పిస్తామని, వివరాలకు 94935 01506 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

మస్క్యులర్ డిస్ట్రోఫీ బాధిత పిల్లల సంతోషమే లక్ష్యం: ఏఆర్‌డీవో


మస్క్యులర్ డిస్ట్రోఫీ బాధిత పిల్లల ఆత్మీయ సమావేశంలో ఏఆర్‌డీవో నిర్వాహకులు

విద్యాధరపురం, జూన్ 28: కండరాల క్షీణత(మస్క్యులర్ డిస్ట్రోఫీ)తో బాధపడుతున్న పిల్లల్లో ధైర్యం కలిగించి వారిలో సంతోషాలను నింపడమే లక్ష్యంగా అమరావతి రేర్ డిసీజెస్ ఆర్గనైజేషన్(ఏఆర్‌డీవో) పని చేస్తోందని సంస్థ అధ్యక్షురాలు సుంకర శోభారాణి అన్నారు. ఏఆర్‌డీఓ ఆధ్వర్యంలో శుక్రవారం పున్నమి ఘాట్, హరిత పార్కులో కండరాల క్షీణతతో బాధ పడుతున్న పిల్లల కోసం బ్రైట్ బిగినింగ్స్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాంను నిర్వహిం చారు. కండరాల క్షీణతతో బాధపడుతున్న పిల్లలను సంతోషపరిచేందుకు ప్రత్యేక వార్షిక సమావేశాలను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. మస్క్యు లర్ డిస్ట్రోఫీతో బాధ పడుతున్న పిల్లలు నేర్చుకునేందుకు, ఎదిగేందుకు, బాల్యపు ఆనందాలను అనుభవించడానికి అవకాశం కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. బయోఫోర్ ఇండియా ఫార్మాస్యూటికల్ సీఈవో డాక్టర్ జగదీష్ బాబు ఆరుగురికి ఎలక్ట్రికల్ బ్యాటరీ వీల్‌చైర్లను అందించారు. ఏఆర్‌డీవో కార్యక్రమాలను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళతామని జనసేన నాయకుడు అమ్మిశెట్టి వాసు అన్నారు. బయో ఫోర్ ఇండియా ఉపాధ్యక్షుడు దొడ్డ శ్రీనివాసరావు, ఐకాన్ పబ్లిక్ స్కూల్ డైరక్టర్లు యడ్ల పార్థసారథి, రాజేంద్ర, మిమిక్రీ ఆర్టిస్ట్ గోపి, మెజీషియన్ క్రాంతికార్, మాన వత సంస్థ అధ్యక్షుడు ఇమ్మనేని కృష్ణ ప్రసాద్, స్నేహస్ఫూర్తి ట్రస్ట్ సభ్యురాలు భారతీదేవి, ఏఆర్‌డీఓ టీమ్ పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేసి ప్రజా మన్ననలు పొందాలి

● ఉద్యోగులతో పట్టణ, గ్రామీణ ప్రణాళిక శాఖ రాష్ట్ర సంచాలకురాలు విద్యుల్లత


పదవీ విరమణ చేసిన కార్యాలయ ఉద్యోగులను సత్కరిస్తున్న విద్యుల్లత, తదితరులు

చిట్టినగర్, జూన్ 28: ఉద్యోగులు నిబద్ధతతో పని చేసి ప్రజల మన్ననలు పొందాలని పట్టణ, గ్రామీణ ప్రణాళిక శాఖ రాష్ట్ర సంచాలకురాలు విద్యుల్లత అన్నారు. మంగళగిరి పట్టణ ప్రణాళిక శాఖ కార్యాలయంలో పని చేసి పదవీ విరమణ చేసిన అచ్చమ్మ, మాల్యాద్రి, చంద్రశేఖర్ దాస్‌లకు వీడ్కోలు సభను శుక్రవారం నిర్వహించి, వారిని ఆమె ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు సంచాలకులు శ్రీనివాస్, సునీత, ప్రభాకర్‌రావు, సంయుక్త సంచాలకులు రాంబాబు, అసోసియేషన్ సభ్యులు వెంకటకృష్ణ, మోహన్‌బాబు, వెంకటేశ్వరరావు, రాజ్యలక్ష్మి, జగదీష్, కృష్ణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెల్లంకి శ్రీనివాసరావు

విజయవాడ ప్రధాన కేంద్రంగా టీఎఫ్‌డీఐఈఎఫ్

ధర్నాచౌక్, జూన్ 28: తెలుగు ఫిలిం అండ్ డిజిటల్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్(టీఎఫ్‌డీఐఈఎఫ్) కార్యకలాపాలను విజయవాడ ప్రధాన కేంద్రంగా నిర్వహిస్తామని ఫెడరేషన్ నాయకులు తెలిపారు. తెలుగు ఫిలిం అండ్ డిజిటల్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్, 24 అనుబంధ సంఘాల ఉభయ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ వెల్లంకి శ్రీనివాసరావు నేతృ త్వంలో ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వల్లభనేని అనిల్ కుమార్, పీఎస్ఎన్ దొర గాంధీనగర్‌లో కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలుగు ఫిలిం ఛాంబర్ ప్రధాన కార్యదర్శి దామోదర ప్రసాద్ మాట్లాడారు. ఏపీలో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధి తోడ్పాటునందిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారని తెలిపారు. రెండేళ్ల క్రితమే నగరంలోని కార్యాలయాన్ని ప్రారంభించినా గత ప్రభుత్వం సినీ పరిశ్రమకు తగిన సహకారం అందించకపోవడంతో కార్యాలయ కార్యకలపాలు సజావుగా సాగలేదన్నారు. విజయవాడ ప్రధాన కేంద్రంగా విశాఖపట్టణం, రాజమండ్రి, తిరుపతి కార్యాలయాల కార్యకలాపాలను కొనసాగిస్తామని ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు. రాష్ట్రంలోని 24 అనుబంధ కళాకారులు, ప్రతినిధులు నగరంలోని ప్రధాన కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

మంత్రి సత్యకుమార్‌కు ఇంపికాప్స్ అభినందన


మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డాక్టర్ భానుప్రకాష్

ధర్నాచౌక్, జూన్ 28: వైద్య, ఆరోగ్యశాఖ రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ది ఇండియన్ మెడికల్ ప్రాక్టిషనర్స్ కో-ఆపరేటివ్ ఫార్మసీ అండ్ స్టోర్స్(ఇంపికాప్స్) డైరెక్టర్ డాక్టర్ వేముల భానుప్రకాష్, బీజేపీ నెల్లూరు జిల్లా డాక్టర్స్ సెల్ కన్వీనర్ డాక్టర్ మహేంద్రకుమార్ యాదవ్ సచివాలయంలోని మంత్రి ఛాంబర్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ స్టేట్ మెడికల్ కౌన్సిల్ ఫర్ ఇండియన్ సిస్టం ఆఫ్ మెడిసిన్ ఏర్పాటు, ఆయుష్ వైద్యులకు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్టు ఏర్పాటుకు ముసాయిదా బిల్లులు మంత్రివర్గ సమావేశంలో ప్రవేశపెట్టేలా చూడాలని మంత్రిని కోరారు. విలేజ్ క్లినిక్‌లలో ఆయుర్వేద గ్రాడ్యుయేట్స్‌ను తీసుకోవాలని కోరారు. ఆయుష్ వైద్యు ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారని డాక్టర్ భానుప్రకాష్ తెలిపారు.

సబ్సిడీపై నేపియర్ గడ్డి విత్తనాలు

● పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి: కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు


కాకులపాడులో పాడిరైతులతో మాట్లాడుతున్న చలసాని ఆంజనేయులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 28: కృష్ణామిల్క్ యూనియన్ ద్వారా సూపర్ నేపియర్ పచ్చగడ్డి విత్తనాలను సబ్సిడీపై పాడిరైతులకు అందజేస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. కాకులపాడు పాలసొసైటీ ఆవరణలో శుక్రవారం పాడిరైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. సబ్సిడీపై పచ్చగడ్డి విత్తనాలు, దాణా అందించడంతో పాటు మేలు జాతి పశువుల కొనుగోలుకు యూనియన్ సహకారం అందిస్తోందనన్నారు. ప్రస్తుతం పచ్చగడ్డి దొరకడం లేదని రైతులు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలోని కొన్ని పొలాలు, మాన్యం లీజుకు తీసుకుని, పశుగ్రాసాన్ని పెంచుకోవాలని రైతులకు చలసాని సూచించారు.

వద్దన్నా వినకుండా!

- కీలక దశలో కాంట్రాక్టు సంస్థ మార్పు
- పోలవరంపై శ్వేతపత్రంలో కీలక వివరాలు

పోలవరం ప్రాజెక్టు పూర్తి వివరాలు, ప్రస్తుత పరిస్థితిని వివరిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు 20 పేజీల శ్వేత పత్రం విడుదల చేశారు. అంతకుముందు తమ ప్రభుత్వ హయాంలో జరిగిన పురోగతిని.. 2019లో జగన్ అధికారంలోకి రాగానే జరిగిన విధ్వంసాన్నీ అందులో వివరించారు. "2014-19 మధ్యకాలంలో ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు 31సార్లు పోలవరం ప్రాజెక్టును ప్రత్యక్షంగా సందర్శించారు. మొత్తం 104 సమీక్షలు నిర్వహించారు. అప్పట్లో 24 గంటల్లో పోలవరం ప్రాజెక్టులో 32,215 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు పూర్తి చేసి గిన్నిస్ రికార్డు సృష్టించారు. 414 రోజుల్లో డయాఫ్రమ్ వాల్ నిర్మాణం పూర్తయింది" అని వివరించారు. 2019-24 మధ్య పోలవరానికి తీవ్ర నష్టం జరిగింది. 2019 జూన్‌లో ప్రాజెక్టు పనులు ఆపివేశారు.

- పోలవరం ప్రాజెక్టు అథారిటీ, కేంద్ర జలవనరుల శాఖ సూచనలను విస్మరించారు. ప్రాజెక్టు నిర్మాణం కీలక దశలో ఉన్నప్పుడు.. ఎలాంటి కారణాలు లేకున్నా కాంట్రాక్టు సంస్థను మార్చారు. ఈ ఆలోచనను విరమించుకోండని పోలవరం ప్రాజెక్టు అథారిటీ జగన్ ప్రభుత్వానికి స్పష్టంగా సూచించింది.
- "ఒకే ప్రాజెక్టులోని పనులను రెండు సంస్థలు చేపట్టినప్పుడు... భవిష్యత్తులో ఏవైనా లోపాలు తలెత్తితే, ఎవరిని బాధ్యులుగా చేయాలో కూడా తెలియదు. అందువల్ల కాంట్రాక్టు సంస్థను మార్చవద్దని సవినయంగా సూచిస్తున్నాం" అని పీపీఏ చేసిన అభ్యర్థనను కూడా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు.
- కొత్త కాంట్రాక్టు సంస్థ అవసరమైన సిబ్బంది, యంత్రాల సమీకరణలో జాప్యం చేసింది.
- అప్‌స్ట్రీమ్ కాఫర్ డ్యామ్‌లో ఏర్పడిన రెండు ఖాళీలను పూడ్చకుండా నిర్లక్ష్యం చేశారు. 2019 మే నుంచి 2021 నవంబరు వరకు దీనిని పట్టించుకోలేదు. రెండు సీజన్లలో గోదావరికి భారీ వరద రావడం... కాఫర్ డ్యామ్ గ్యాప్‌ల నుంచి తీవ్ర ఒత్తిడితో గోదావరి ప్రవహించడంతో డయాఫ్రమ్ వాల్‌కు నష్టం వాటిల్లింది.
- నీతి ఆయోగ్ సూచన మేరకు ఐఐటీ హైదరాబాద్ నిపుణులు పోలవరంపై అధ్యయనం చేశారు. 'కాంట్రాక్టు సంస్థను మార్చడం, తగిన ప్రణాళిక లేకపోవడం, సమన్వయ లోపం, తరచూ డిజైన్లలో మార్పులు, పర్యవేక్షణ సంస్థ ఆదేశాలు, సూచనలు పట్టించుకోకపోవడం... ఇలాంటి అనేక కారణాల వల్ల ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యం జరుగుతోందని తేల్చారు.

గడ్కరీతో ఎంపీ కృష్ణ ప్రసాద్ భేటీ

న్యూఢిల్లీ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో బాపట్ల ఎంపీ కృష్ణ ప్రసాద్ భేటీ అయ్యారు. శుక్రవారం ఢిల్లీలో ఆయనతో సమావేశం తర్వాత ఏపీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. 'పొన్నూరు-బాపట్ల రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా అభివృద్ధి చేయాలని కోరాను. రేపల్లె నుంచి ఒంగోలు వెళ్లే జాతీయ రహదారికి ఇది కలుస్తుంది. ఈ రోడ్‌ను అప్‌గ్రేడ్ చేస్తే బాపట్ల, చీరాల బీచ్‌లు పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి అవుతాయి. అంతర్జాతీయ పెట్టుబడులు వస్తాయి. చీరాలలో మెగా టెక్స్ టైల్స్ పార్కు కూడా రాబోతోంది. ఇవన్నీ జరగాలంటే జాతీయ రహదారి అనుసంధానం చాలా అవసరం' అని మంత్రికి వివరించినట్లు తెలిపారు. దీనికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని ఎంపీ కృష్ణ ప్రసాద్ చెప్పారు.

జాతికి జగన్ ద్రోహం



పోలవరంపై శ్వేతపత్రం విడుదల కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితి ఎదురైందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. జగన్ మూర్ఖత్వం వల్లే డయాఫ్రం వాల్ దెబ్బతిందన్నారు. శుక్రవారమిక్కడ వెలగపూడి సచివాలయంలో పోలవరం ప్రాజెక్టుపై ఆయన శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. కళ్లలో నీళ్లు ఉబుకుతుండగా ఆపుకొంటూ ఈ సందర్భంగా మాట్లాడారు. 2014లో రాష్ట్ర విభజన వల్ల రాష్ట్రానికి జరిగిన నష్టం కంటే జగన్ గత ఐదేళ్లలో చేసిన నష్టమే ఎక్కువన్నారు. రాష్ట్రాన్ని నష్టం చేసే హక్కు ఎవరికీ లేదని చంద్రబాబు అన్నారు. రాష్ట్రానికి అమరావతి, పోలవరం రెండు కళ్లలాంటివన్నారు. పోలవరం వాస్తవ స్థితిగతులను ప్రజలకు చెప్పేందుకే శ్వేతపత్రం విడుదల చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టు ధ్వంసం జాతికి జరిగిన విద్రోహంగా అభివర్ణించారు. 2014-19 మధ్య పోలవరానికి తమ ప్రభుత్వం రూ.11,762 కోట్లు ఖర్చు చేసిందని.. జగన్ రూ.4,167 కోట్లు మాత్రమే పెట్టారని చెప్పారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తూనే అవగాహన లేకుండా నిర్మాణాన్ని జగన్ ఆపేశారని, దానివల్ల కలిగిన నష్టమే పోలవరం విధ్వంసమని చెప్పారు. పనులు శరవేగంగా జరుగుతున్న సమయంలో కేంద్రం వద్దన్నా కాంట్రాక్టు సంస్థను మార్చారని.. సమర్థులైన అధికారులను బదిలీ చేశారని ఆక్షేపించారు. 2009లోనూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కాంట్రాక్టరును మార్చారని.. దానివల్ల 2013లో కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి ట్రాన్స్‌ట్రాయ్ సంస్థను తీసుకొచ్చేదాకా పనులు సాగలేదన్నారు. '2019లో జగన్ కూడా కాంట్రాక్టరును మార్చారు. మార్చవద్దని సీఎస్‌కు పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) లేఖ రాసింది. నీతి ఆయోగ్ బృందం నియమించిన ఐఐటీ హైదరాబాద్ కూడా జగన్ తప్పిదం వల్లే డయాఫ్రం వాల్ దెబ్బతిందని స్పష్టం చేసింది. ప్రాజెక్టు మరమ్మతులపై సూచనలు చేయడానికి అమెరికా, కెనడా దేశాలకు చెందిన అంతర్జాతీయ నిపుణులను కేంద్రం రప్పిస్తోంది. వారు ఏడాదిలో నివేదిక ఇవ్వాల్సి ఉంది. ఆ తర్వాత కాఫర్ డ్యాంలో సీపేజీని నివారించాక.. డయాఫ్రం వాల్ నిర్మాణం కోసం రెండు సీజన్లు (రెండేళ్లు) పడుతుంది. ఈసీఆర్ఎఫ్ డ్యాం కట్టడానికి మరో రెండేళ్లు పడుతుంది. అంతా సజావుగా సాగితే మొత్తంగా ప్రాజెక్టు పూర్తవడానికి ఐదేళ్లు పట్టవచ్చు' అని వివరించారు. కాంట్రాక్టు సంస్థను మార్చకపోతే 2020నాటికే పూర్తయ్యేదని స్పష్టం చేశారు. ప్రాంతాలూ కూలాలు, మతాలకు అతీతంగా జగన్‌ను అందరూ నిలదీయాలని పిలుపిచ్చారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

డయాఫ్రం వాల్ ఇప్పుడు కట్టాలంటే..

డయాఫ్రం వాల్‌ను మా హయాంలో రూ.436 కోట్లతో నిర్మించాం. ఇప్పుడు దెబ్బతిన్న ఆ వాల్‌కు మరమ్మతు చేసేందుకే రూ.447 కోట్లవుతుందని అంచనా. కొత్త సమాంతర వాల్ నిర్మాణానికి మరో రూ.990 కోట్లు అవుతుంది. పోలవరానికి జగన్ చేసిన విధ్వంసంతో ప్రాజెక్టు భౌగోళిక పరిస్థితులే మారిపోయాయి. ఆయన అసమర్థత కారణంగా గైడ్ బండ్ కుంగిపోయింది. రూ.80 కోట్లతో నిర్మించిన ఈ గైడ్‌బండ్ నిరుపయోగంగా మారింది. మా హయాంలో ప్రాజెక్టు 72 శాతం పూర్తయితే.. జగన్ హయాంలో కేవలం 3.84 శాతం పనులే జరిగాయి.

వాస్తవాలు దాచి ప్రకటనలు..

వాస్తవాలు దాచిపెట్టి పోలవరం పూర్తి చేస్తామని జగన్ అసెంబ్లీలో పలు సార్లు ప్రకటనలు చేశారు. ప్రాజెక్టు గరిష్ఠ స్థాయిలో 45.72 మీటర్ల కాంటూరులో 194 టీఎంసీల నీటి నిల్వ చేయాల్సిందే. కానీ జగన్ అకస్మాత్తుగా 41.15 మీటర్ల కాంటూరును తెరపైకి తెచ్చారు. ఇది ఆచరణయోగ్యం కాదు. గోదావరి జలాలను సద్వినియోగం చేసుకుంటే రాష్ట్రం సస్యశ్యామలం అవుతుంది. రాయలసీమకు కూడా నీరందించవచ్చు. ముంపునకు గురయ్యే ఏడు మండలాలను 2014లో నేను సీఎంగా ప్రమాణ స్వీకారం చేయక ముందే రాష్ట్రంలో విలీనం చేయించాను. నాడు ఆ మండలాలవారంతా సమ్మతించారు. ఇప్పుడు జగన్ నిర్వాకంతో తెలంగాణకు వెళ్లిపోతామంటూ ఆందోళన చేసే పరిస్థితి తలెత్తింది.

నిర్వాసితులకు మోసం..

ప్రాజెక్టుకు కేంద్రం ఇచ్చిన రూ.3,385 కోట్లనూ జగన్ దారి మళ్లించారు. ఓట్ల కోసం నిర్వాసితులనూ మోసం చేశారు. వారికి ఇస్తానన్న ఎకరాకు రూ.15 లక్షలు, అదనంగా చెల్లిస్తానన్న రూ.5 లక్షలు కూడా చెల్లించలేదు. నిర్వాసితుల సమస్యలను చూస్తే కన్నీళ్లు వస్తున్నాయి. వీటిన్నిటినీ పరిష్కరించాల్సిన బాధ్యత నాపై ఉంది. జగన్ చేసిన పాపాల కారణంగా ఒడిసా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు పోలవరంపై కేసులు వేశాయి. స్టాప్ వర్క్ ఆర్డర్‌కు రెండేళ్లకోసారి సడలింపులు తీసుకోవలసి వస్తోంది. నేను కట్టానన్న అక్కసుతోనే పట్టిసీమను పక్కన పెట్టేశారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతలను వాడుకోవలసి ఉంది. కేంద్రం నుంచి వీలైనన్ని ఎక్కువ నిధులు తెచ్చుకోవలసి ఉంది. 2019లో మేం వదిలివెళ్లే నాటికి రూ.1,771 కోట్ల విలువైన హెడ్‌వర్క్స్ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే అవగాహన లేకుండా జగన్ పనులు నిలిపేశారు. కేంద్రం వద్దంటున్నా రివర్స్ టెండర్‌కు వెళ్లారు. రూ.1,548.13 కోట్లకు కొత్త కాంట్రాక్టు సంస్థకు అప్పగించారు. పాతకాంట్రాక్టు సంస్థ చేసిన పనులకు జవాబుదారీతనం లేకుండా వదిలేశారు. కొత్త సంస్థ ఏడాది వరకూ నిర్మాణ ప్రాంతానికే వెళ్లలేదు. ఆ సంస్థను బాధ్యులను చేయాలంటే.. తాము బాధ్యతలు తీసుకునేలోపే డయాఫ్రం వాల్ దెబ్బతిన్నట్లు చెబుతోంది. వీటిన్నిటినీ క్షుణ్ణంగా అధ్యయనం చేయాల్సి ఉంది.

- నదుల అనుసంధానానికి పోలవరం గుండెలాంటిది. అలాంటి ప్రాజెక్టుకు జగన్ శాపంలా మారారు. ఈ ప్రాజెక్టు విషయంలో క్షమించరాని నేరం చేశారు.
- పోలవరం నిర్మాణం నా జీవితంలో ఒక మధురఘట్టం. అందుకే రాష్ట్ర ప్రజలకు బస్సులు పెట్టి చూపించాం. నా మనవడు దేవాన్ష్ కూడా ప్రాజెక్టు గ్యాలరీలో సగం దూరం నడిచాడు.
- నేను ఐదేళ్లపాటు పడిన శ్రమను జగన్ బూడిదలో పోసిన పన్నీరు చేశాడు. పోలవరం నిర్మాణంలో జాప్యం కారణంగా రైతులకు రూ.45,000 కోట్ల మేర పంట నష్టం వాటిల్లింది. సవరించిన రూ.55,548 కోట్ల అంచనా వ్యయం మరో 33 శాతం పెరిగే అవకాశం ఉంది.
- పోలవరం ప్రధాన దోషి జగన్‌ను ప్రజలు ఇంటికి పంపేశారు. రివర్స్ టెండర్ పిలిచిన అధికారి ఆదిత్యనాథ్‌దాస్ తెలంగాణకు వెళ్లిపోయాడు. మరో అధికారిని కూడా పంపేశాం.

\- సీఎం చంద్రబాబు

ఒక వ్యక్తి ఇంత నష్టం చేయడం దుర్మార్గం

పోలవరాన్ని శిథిలం చేయడం ద్వారా ఒక వ్యక్తి రాష్ట్రానికి ఇంత నష్టం చేయడం దుర్మార్గమని సీఎం అన్నారు. రివర్స్ టెండర్ విధానంలో రూ.600 కోట్లకు పైగా ఆదా చేశామన్న జగన్.. ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసి రూ.25 వేల కోట్ల మేర నష్టాన్ని తీసుకొచ్చారని.. పాపమెవరు చేశారో బాధ్యత కూడా వారే వహించాలని విలేకరి అన్నప్పుడు.. నిజమని చంద్రబాబు అంగీకరించారు. ప్రాజెక్టు డిజైన్లపై నిర్ణయం తీసుకునేందుకు జలసంఘం ఇంజనీర్లు కూడా భయపడ్డారని.. ఒక దుర్మార్గుడు తీసుకున్న చర్యకు బలైపోతామేమోనన్న భయం వారిలో ఏర్పడిందని వ్యాఖ్యానించారు. '2020లో డయాఫ్రం వాల్ దెబ్బతింటే.. 2024 దాకా బుకాయిస్తూ వచ్చారు. పోలవరం మరమ్మతుల కోసం రూ.15,511.13 కోట్లను కేంద్రం నుంచి నిధులు రాబట్టేందుకు తప్పకుండా ప్రయత్నం చేస్తాం. 2017-18 అంచనా వ్యయం మేరకు రూ.55,548.87 కోట్ల అంచనా ఇప్పుడు ఇంకో 33 శాతం పెరిగే వీలుంది. ప్రస్తుతానికి దెబ్బతిన్న కట్టడాల మరమ్మతులపై దృష్టి సారించాం. కేంద్రం సహకారంతో ముందుకు తీసుకెళ్తాం' అని తెలిపారు. ప్రతి సోమవారం పోలవరంపై సమీక్ష సుదీర్ఘంగా చేస్తుంటే ప్రాజెక్టు అధికారులు ఇబ్బంది పడుతున్నారని విలేకరులు ప్రస్తావించగా.. సమీక్ష సమయాన్ని తగ్గిస్తానని చంద్రబాబు బదులిచ్చారు. వర్చువల్‌గా నిర్వహిస్తామని కూడా తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణంపై మేధావులు, నిపుణుల సలహాలూ తీసుకుంటామన్నారు. వెబ్‌సైట్లలో పత్రాలన్నీ అందుబాటులో ఉంచుతామని చెప్పారు.

ఐదేళ్ల వినాశనమెంతో ప్రజలకు తెలియాలి

- రాష్ట్రమెంత వెనక్కి వెళ్లిందో వారికి అర్థం కావాలి
- అందుకే శ్వేతపత్రాల విడుదల.. జనం తీర్పు చరిత్రాత్మకం: బాబు



అమరావతి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో గత ఐదేళ్లలో జరిగిన విధ్వంసం, వినాశనం ఎంతో ప్రజలకు తెలియాలని సీఎం చంద్రబాబు అన్నారు. వీటి వల్ల రాష్ట్రం ఎంత వెనక్కి వెళ్లిందో కూడా వారికి అర్థం కావాలని, బాగా చర్చ జరగాలని వ్యాఖ్యానించారు. అందుకే ముఖ్యమైన అంశాలపై శ్వేతపత్రాలు విడుదల చేయాలని నిర్ణయించామన్నారు. శుక్రవారం సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఇటీవలి ఎన్నికల్లో ప్రజలు చరిత్రాత్మకమైన తీర్పు ఇచ్చారు. వైసీపీ దుష్పరిపాలనను భరించి భరించి విసుగెత్తి ఇచ్చిన తీర్పు ఇది. అందరినీ భయపెట్టి మీడియా కూడా భయపడే పరిస్థితి కల్పించారు. కోర్టులను కూడా తమ అదుపులోకి తెచ్చుకోవాలని.. సామాజిక మాధ్యమాల్లో న్యాయమూర్తుల వ్యక్తిత్వాన్ని కించపరిచే పోస్టులు పెట్టించారు. దీనిపై కోర్టు స్వయంగా సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాల్సి వచ్చింది. ఈ దుర్మార్గాలపై మేం ప్రతిపక్షంలో ఉండగా మాకున్న వనరులకు లోబడి మేం పోరాడాం. కొన్ని విషయాలు వెలుగులోకి తెచ్చాం. అధికారంలోకి వచ్చిన తర్వాత మరికొంత సమాచారం సమీకరించి వాటికి కలిపి ప్రజల ముందు పెడుతున్నాం. ఇటీవలి ఎన్నికల్లో జనం గెలిచారు. ఇక రాష్ట్రం నిలవాలి.. ఎలా కోలుకోవాలి.. ఎలా ముందుకెళ్లాలన్నది ఇప్పుడు ముఖ్యం. దీనికి అందరి సలహాలు తీసుకుంటున్నాం. దీనిలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలి. అందుకే శ్వేతపత్రాల ద్వారా సమాచారం అందుబాటులోకి తెస్తున్నాం' అని వివరించారు. త్వరలో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ పెడుతోందని, రాష్ట్రానికి కావలసిన పథకాలు, నిధుల అవసరాలను దాని దృష్టికి తీసుకెళ్లి బడ్జెట్‌లో సాయం పొందే ప్రయత్నం చేస్తున్నాం. మూడు వారాల్లో మొత్తం ఏడు శ్వేతపత్రాలు విడుదల చేయాలనుకుంటున్నాం. తర్వాత రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తాం' అని తెలిపారు. పని చేయకపోయినా అబద్ధాలు పదేపదే చెప్పి నమ్మించడంలో వైసీపీ నేతలు దిట్టలని విమర్శించారు. అందుకే శ్వేతపత్రాలకు సంబంధించిన అన్ని వివరాలు ప్రజలకు నేరుగా అందుబాటులో ఉండేలా వెబ్‌సైట్లలో పెడుతున్నామని చెప్పారు. 'పోలవరం నిర్మాణానికి సంబంధించిన అన్ని విషయాలు ఇరిగేషన్ వెబ్‌సైట్‌లో పెడుతున్నాం. ఎవరైనా చూసుకోవచ్చు. ఎక్కడ ఏ చర్చ జరిగినా ప్రజలే సమాధానం చెప్పేలా ఉండాలి. మేం మా ఐదేళ్ల హయాంలో సాగునీటి ప్రాజెక్టులకు రూ.60 వేల కోట్లు ఖర్చు చేశాం. గత ఐదేళ్లలో ప్రాజెక్టుల నిర్వహణకు కూడా కనీస మొత్తం ఇచ్చిన దిక్కు లేదు' అని ధ్వజమెత్తారు. జగన్ రాజకీయాల్లో ఉండడానికే అర్హత లేని వ్యక్తని, అర్హత లేని వాళ్లకు అధికారం ఇస్తే ఏం జరుగుతుందో పోలవరంలో అదే జరిగిందని వ్యాఖ్యానించారు. ఈ విషయం ప్రజలకు అర్థమై 11 సీట్లు మాత్రమే ఇచ్చారని అన్నారు. ఆయన చేసిన ఘోరాలు రాష్ట్రానికి శాపంగా మారాయని, దీని దుష్ఫలితాన్ని రాష్ట్రం పదేళ్లు భరించాలో, 30 ఏళ్లు భరించాలో కాలమే చెప్పాలన్నారు. సీఎంగా ఉన్న సమయంలో జగన్‌కు 936 మంది పోలీసులతో భద్రత కల్పించడంపై చంద్రబాబు విస్మయం వ్యక్తం చేశారు. అన్ని వందల మంది అవసరమా అని ప్రశ్నించారు. ఇప్పుడు తాను వెళ్తున్నా పరదాలు కడుతున్నారని, ఇదేమిటని అడిగితే అలవాటు పడిపోయామని పోలీసు శాఖ నుంచి సమాధానం వస్తోందని బాబు చమత్కరించారు. తాను వెళ్తుంటే ట్రాఫిక్ ఎక్కువ ఆపొద్దని చెబుతున్నానని, ఎంత సేపు ఆపుతున్నారో సమాచారం తెప్పించుకుంటున్నానని కూడా చెప్పారు. ఆడంబరాలు వద్దని, సింపుల్‌గా ఉండి సేవకుల మాదిరిగా ప్రజల్లో మన్నన పొందాలని మంత్రులకు చెబుతున్నానని వివరించారు.

వలంటీర్లు ఇచ్చిన డేటాతో కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వలేం..!

- వారు చేసిన సర్వేకు ప్రామాణికత లేదు.. వీఆర్‌వోల ఆందోళన

విజయవాడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన కులగణన ఆధారంగా కుల ధ్రువీకరణ పత్రాల జారీ చేపట్టాలంటూ సీసీఎల్ఏ తాజాగా ఇచ్చిన ఆదేశాలపై వీఆర్‌వోలు భగ్గుమంటున్నారు. రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు టార్గెట్లు నిర్ణయించడంపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ విషయాన్ని రెవెన్యూ మంత్రి, సీసీఎల్ఏ దృష్టికి తీసుకు వెళ్లాలని ఏపీ వీఆర్‌వోల సంఘం రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్ల ద్వారా కుల గణన చేయించారు. అయితే ఇది సమగ్రంగా జరగలేదు. ఈ క్రమంలో ఎస్సీలను ఓసీలుగా.. ఓసీలను ఎస్సీలుగా నమోదు చేసిన ఉదంతాలు అనేకం ఉన్నాయని వీఆర్‌వోలు ఆరోపిస్తున్నారు. వైసీపీ కార్యకర్తలైన వలంటీర్లు ఇచ్చిన డేటాను పట్టుకుని ప్రస్తుతం రెవెన్యూ ఉన్నతాధికారులు.. రోజుకు 100 నుంచి 200 వరకు కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని ఒత్తిడి తెస్తున్నారని వాపోతున్నారు. వీఆర్‌వోల ఆందోళనల నేపథ్యంలో.. విజయవాడలోని ఏపీవీఆర్‌వో సంఘ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం అగ్రనాయకులు కొన ఆంజనేయకుమార్, జి.అనుపమ వీర్‌వోల సంఘ ముఖ్య నాయకులతో భేటీ అయ్యారు. ఈ అంశాన్ని రెవెన్యూ మంత్రి, సీసీఎల్ఏ దృష్టికి కూడా తీసుకువెళ్లాలని నిర్ణయించారు.

రిటైరైనా రెండు కీలక పోస్టుల్లో..!

- హౌసింగ్‌లో సీఈగా, ఈడీగా ద్విపాత్రాభినయం
- ప్రభుత్వం మారినా ఆయనకే పెత్తనమా?

అమరావతి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహనిర్మాణ సంస్థలో ఏడాదిన్నర క్రితం రిటైరైన చీఫ్ ఇంజనీరు జి.వి.ప్రసాద్ ఇప్పటికీ అదే పోస్టులో కొనసాగుతుండటంపై ఒకవైపు విమర్శలు వెల్లువెత్తుతుండగా.. తాజాగా మరో కీలకమైన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బాధ్యతలను కూడా ఆయనకే అప్పగించడం వివాదాస్పదంగా మారింది. గత ఏడాది డిసెంబరు నుంచి హౌసింగ్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా జైళ్ల శాఖ అడిషనల్ సూపరింటెండెంట్ బి.చంద్రశేఖర్‌ను జగన్ ప్రభుత్వం డిప్యుటేషన్‌పై నియమించింది. కూటమి సర్కారు రాకతో ఆయన్ను తన మాతృశాఖ జైళ్ల శాఖకు బదిలీ చేశారు. హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలోనే సూపరింటెండింగ్ ఇంజనీర్ (ప్రాజెక్టులు)గా పని చేస్తున్న సీనియర్ అధికారి సి.జయరామాచారికి ఈడీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మార్పు జరిగి వారం రోజులైనా గడవకుండానే .. పరిపాలనా సౌలభ్యం కోసమంటూ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బాధ్యతల నుంచి జయరామాచారిని తప్పించి.. ఆ స్థానంలో చీఫ్ ఇంజనీర్ (రిటైర్డ్) జి.వి.ప్రసాద్‌ను నియమిస్తూ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గిరీషా తాజాగా గురువారం ప్రొసీడింగ్స్ ఇచ్చారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినా కూడా హౌసింగ్ కార్పొరేషన్‌లో రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ జి.వి.ప్రసాద్ హవానే కొనసాగుతుందని, ఆయన గొప్పేంటో? అంటూ హౌసింగ్ వర్గాలే చర్చించుకుంటున్నాయి.

అందరికీ ఒక న్యాయం..ఆయనకు మరొక న్యాయమా?

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62ఏళ్లకు పెంచుతూ గత జగన్ ప్రభుత్వం 2022 జనవరి 31న ఉత్తర్వులు జారీ చేసింది. అయితే కార్పొరేషన్లలో పని చేస్తున్న ఉద్యోగులకు మాత్రం ఆ ఉత్తర్వులను వర్తింపజేయలేదు. దాంతో తమ పదవీ విరమణ వయసును కూడా 62 ఏళ్లకు పొడిగించాలని కోరుతూ హౌసింగ్ కార్పొరేషన్‌లో 60 ఏళ్లకు రిటైరైన వంద మందికి పైగా ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులపై సుదీర్ఘ కాలం వాదనలు విన్న తర్వాత న్యాయస్థానం గత ఏడాది ఆగస్టు 31వ తేదీన రిటైర్డ్ ఉద్యోగులకు వ్యతిరేకంగా తుది తీర్పును వెలువరించింది. కార్పొరేషన్లలో 60 ఏళ్లకు పదవీ విరమణ చేసిన ఉద్యోగులు 62 ఏళ్ల వరకు సర్వీసులో కొనసాగడానికి అర్హులు కాదని, వారిని సేవలనుంచి తొలగించాలంటూ తుది తీర్పు వెలువరించింది. దాంతో హౌసింగ్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు ఇప్పటికే దఫదఫాలుగా దాదాపు వంద మంది రిటైర్డ్ ఉద్యోగులను విధుల నుంచి తొలగించారు. కానీ ఏడాదిన్నర క్రితమే రిటైరైన జి.వి.ప్రసాద్ మాత్రం ఇంకా అదే పోస్టులో కొనసాగుతున్నారు. ఇదెలా సాధ్యం? అదే కార్పొరేషన్‌లో రిటైరైన 100 మంది అధికారులు, ఉద్యోగులకు ఒక న్యాయం.. రిటైర్డ్ చీఫ్ ఇంజనీరు ప్రసాద్ ఒక్కడికి మరో న్యాయం ఉంటుందా? అని హౌసింగ్ వర్గాలే ప్రశ్నిస్తున్నాయి.

కార్యకర్తల కోసమే నా పదవి

- యువ నాయకత్వాన్ని పెంచడానికే ప్రాధాన్యం
- రాజకీయ ప్రేరేపిత కేసులను మూడు నెలల్లో, కోర్టుకు వెళ్లిన వాటిని ఏడాదిలో తీయించడానికి కృషి
- కబ్జాదారులను, దోపిడీదారులను వదిలేదే లేదు: పల్లా
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావు యాదవ్


పల్లా శ్రీనివాసరావుకు శాలువా కప్పి అభినందిస్తున్న మంత్రి లోకేశ్

అమరావతి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): 'నేను కార్యకర్తల కోసమే ఈ పదవి తీసుకొన్నాను. వారికి న్యాయం చేయలేకపోతే నేను నా పాత్ర సక్రమంగా చేయలేకపోయాననే భావిస్తా. పార్టీలో ప్రతి నాయకుడికి, కార్యకర్తకు అండగా ఉంటా. ఏ పని ఉన్నా పార్టీ కార్యాలయానికి వస్తే మీ సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేస్తా' అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన ఇక్కడ తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో అధ్యక్షునిగా అధికారికంగా బాధ్యతలు తీసుకొన్నారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడారు. 'టీడీపీ మళ్లీ అధికారంలోకి రావాలని, రాష్ట్రం అభివృద్ధి చెందాలని ఎంతో మంది పార్టీ కార్యకర్తలు తమ సమయాన్ని, వనరులను వెచ్చించి పనిచేశారు. వారికి అండగా ఉండటం నా బాధ్యతగా గుర్తించి పనిచేస్తా. అధికారంలోకి వచ్చిన తర్వాత పాలనాపరమైన పనుల్లో పడిపోయి మంత్రులు, ఎమ్మెల్యేలు కింది స్థాయి కార్యకర్తలను పట్టించుకోవడం లేదన్న విమర్శలు అక్కడక్కడా వినిపిస్తున్నాయి. అటువంటి ఫిర్యాదులకు తావు లేకుండా పార్టీని, ప్రభుత్వాన్ని సమన్వయం చేసుకొంటాం. 2024లో వచ్చిన ఎన్నికల ఫలితాలే 2029లో కూడా వచ్చేలా శక్తివంచన లేకుండా పనిచేస్తా. గత వైసీపీ ప్రభుత్వం టీడీపీ నేతలు, కార్యకర్తలపై వేల సంఖ్యలో అక్రమ కేసులు మోపింది. రాజకీయ ప్రేరేపిత కేసులను మూడు నెలల్లో తీయించడానికి కృషి చేస్తా. ఎఫ్ఐఆర్ నమోదై కోర్టుకు వెళ్లిన రాజకీయ ప్రేరేపిత కేసులను ఏడాదిలో తొలగించడానికి ప్రయత్నిస్తాం. ప్రతి నాయకుడు తన పరిధిలో ఎవరి మీద ఏ కేసులు ఉన్నాయన్న ఆ వివరాలను పార్టీ దృష్టికి తేవాలి' అని ఆయన సూచించారు. అధికార దుర్వినియోగంతో అక్రమాలకు పాల్పడినవారిని, ప్రజా ధనాన్ని దోచుకొన్న వారిని, ప్రైవేటు ఆస్తులను కబ్జా చేసిన వారిని వదిలిపెట్టేది లేదు. పార్టీ నాయకులు నిరంతరం ప్రజల్లో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. ప్రజలకు ఉపశమనం కలిగించడానికి అధికారాన్ని వినియోగించాలి. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ నుంచి బలహీన వర్గాలు, బీసీ వర్గాలకు పెద్ద పీట వేస్తూ వచ్చారు. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ఇప్పుడు నాకు ఈ బాధ్యత అప్పగించారు. పార్టీ అధినేత చంద్రబాబు, యువనేత లోకేశ్‌కు నా ధన్యవాదాలు. పార్టీలో అన్ని స్థాయిలో యువ నాయకత్వాన్ని పెంచడం నా ప్రాధాన్యాల్లో ఒకటిగా పెట్టుకొని పనిచేస్తా. పనిచేసేవారికి కీలక బాధ్యతలు అప్పగిస్తా' అని పల్లా స్పష్టం చేశారు.

పల్లా నాయకత్వంలో పార్టీ మరిన్ని విజయాలు సాధించాలి: చంద్రబాబు

అమరావతి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు యాదవ్‌కు పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు తెలిపారు. 'మీ సమర్థ నాయకత్వంలో ఏపీలో పార్టీ మరెన్నో విజయాలను సాధిస్తుందని, మరింత బలోపేతం అవుతుందని ఆశిస్తున్నా' అని ఆయన శుక్రవారం ఎక్స్‌లో ఆశాభావం వ్యక్తం చేశారు.

కిటకిటలాడిన పార్టీ కార్యాలయం

పల్లా బాధ్యతల స్వీకరణ సందర్భంగా టీడీపీ కేంద్ర కార్యాలయం కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో పార్టీ నేతలు, కార్యకర్తలు, మహిళలు తరలివచ్చారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచీ భారీగా వచ్చారు. మంత్రులు లోకేశ్, కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యేలు కూన రవి కుమార్, తెనాలి శ్రావణ్ కుమార్, పార్టీ నేతలు టీడీ జనార్దన్‌రావు, కేఎస్ జవహర్, పిఠాపురం వర్మ, ఉండి మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజు, అశోక్ బాబు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎయిమ్స్‌ను సమస్యల్లోకి నెట్టారు

- ఆవేదన వ్యక్తం చేసిన చంద్రబాబు
- ముఖ్యమంత్రికి సమస్యలు వివరించిన డైరెక్టర్

అమరావతి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక ఎయిమ్స్ సమస్యల వలయంలో చిక్కుకుపోవడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళగిరి ఎయిమ్స్‌ను దేశంలో టాప్ - 3 స్థానంలో ఉంచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని, రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. శుక్రవారం సచివాలయంలో ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ మధబానందకర్, ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఎయిమ్స్ ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. నీటి కొరతతో సేవలను విస్తరించలేకపోతున్నామని వివరించారు.


సీఎం చంద్రబాబును కలిసిన ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ మధబానందకర్

సమస్య పరిష్కారం కోసం తలపెట్టిన పైప్‌లైన్ పనులు ఆగిపోయాయని తెలిపారు. రోజుకు 7 ఎంఎల్‌డీ నీరు అవసరం ఉండగా, ట్యాంకర్ల ద్వారా 2 ఎంఎల్‌డీ నీరు మాత్రమే అందుబాటులో ఉంటోందని చెప్పారు. విద్యుత్ సరఫరా విషయంలో కూడా సమస్యలు ఉన్నట్లు సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. 192 ఎకరాలకు గాను 182 ఎకరాలు ఇచ్చారని, మరో 10 ఎకరాలు ఇస్తే ఎయిమ్స్ విస్తరణ పనులు పూర్తి చేస్తామని వివరించారు. ఎయిమ్స్‌లో అందుతున్న సదుపాయాలపై ఒకసారి వచ్చి పరిశీలించాలని సీఎంను ఆహ్వానించారు. త్వరలో పూర్తి స్థాయి సమీక్ష చేసి సమస్యలను పరిష్కరిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఎయిమ్స్‌కు తాగునీటి సరఫరా చేసే పనులు నిలిచిపోవడం సరికాదని, సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని సీఎం హామీ ఇచ్చారు.

'వీఆర్ఎస్' కూడా వివాదమే!

- ధోరణి మారని ప్రవీణ్ ప్రకాశ్
- తెల్లకాగితంపై రాసి తపాలాలో వేసి ఇదే దరఖాస్తంటూ.. సీఎస్‌కు సందేశం



అమరావతి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రవీణ్ ప్రకాశ్.. ఈ పేరు వివాదాలకు కేంద్రం. ఐఏఎస్ అయిన నాటి నుంచి ఇప్పటి వరకు ఆయన వివాదం లేకుండా పూర్తిచేసిన పోస్టింగ్ ఒక్కటీ లేదు. ఆ వ్యవహార శైలే ఇప్పుడు ఆయన సర్వీసును ముంచింది. ఏడేళ్ల సర్వీసు ఉండగానే ఐఏఎస్ ఉద్యోగానికి వలంటరీ రిటైర్మెంట్(వీఆర్ఎస్) కోరుతూ ఆయన దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఈ విషయంలోనూ వివాదానికే తెరదీశారు. సీనియర్ అధికారి అయి ఉండి 'పద్ధతి' లేకుండా వ్యవహరించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిపట్ల అగౌరవంగా వ్యవహరించారు. నిజానికి ఎవరైనా వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోవాలని అనుకుంటే.. ఆయా విభాగాల ఉన్నతాధికారులను కలిసి దరఖాస్తు సమర్పిస్తారు. అలా చూస్తే.. ప్రవీణ్ ప్రకాశ్.. తనకు బాస్ అయిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్‌ను కలిసి వీఆర్ఎస్ దరఖాస్తును ఆయనకు అందించాలి. ఎందుకు వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేస్తున్నదీ వివరించాలి. కానీ, ఈ పద్ధతిని ప్రవీణ్ ప్రకాశ్ తుంగలో తొక్కారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫోన్‌లో మెసేజ్ పెట్టి, వీఆర్ఎస్ దరఖాస్తును తపాలా పెట్టెలో వేసి వెళ్లిపోయారు. అది కూడా కేవలం తెల్లకాగితంపై రాసి ఇవ్వడం గమనార్హం. దీనినే దరఖాస్తుగా భావించాలని కోరారు. అది చూసి అవాక్కయిన జీఏడీ అధికారులు నిబంధనల ప్రకారం సరైన ఫార్మాట్‌లో పంపాలని సదరు కాగితాన్ని తిప్పికొట్టారు. దీంతో దిగివచ్చిన ప్రవీణ్ ప్రకాశ్ తగిన ఫార్మాట్‌లో వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. కానీ, సంతకం చేయాల్సిన చోట డిజిటల్ సిగ్నేచర్‌ను కాపీ పేస్ట్ చేసి సరిపుచ్చారు. అది చెల్లుబాటు అవుతుందా? అనేది ప్రశ్నార్థకమైంది.

అది నుంచి అంతే!

ఉద్యోగంలో చేరినప్పటి నుంచీ ప్రవీణ్ ప్రకాశ్ వివాదాలతో ప్రయాణించిన అధికారిగా గుర్తింపు పొందారు. విజయవాడ, గుంటూరు మున్సిపల్ కమిషనర్‌గా చేసినప్పుడు, అంతకముందు కూడా ఏదో ఒక విషయంలో రాద్ధాంతం సృష్టించేవారు. ఆ తర్వాత విశాఖపట్నం కలెక్టర్‌గా ఏకంగా ఈసీ ఆదేశాలను బేఖాతరు చేసి ఎన్నికల సంఘం ఆగ్రహానికి గురయ్యారు. జగన్ అధికారంలోకి వచ్చాక ప్రవీణ్‌ను ఏరికోరి తెచ్చుకుని సీఎం పేషీలో పెట్టుకున్నారు. ఆ సమయంలో ఏకంగా సీఎస్‌పైనే పెత్తనం చేసే స్థాయిలో దురహంకారం ప్రదర్శించి నిత్యం వార్తల్లో వ్యక్తిగా నిలిచారు. ఒకానొక దశలో జగన్ కంటే ప్రవీణ్ ప్రకాశే ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారేమో నన్న స్థాయిలో అధికారం చెలాయించారు. తానొక సుప్రీం అన్నట్టుగా, మిగిలిన ఉద్యోగులు బానిసలు అన్నట్టుగా వ్యవహరించారు. ఈ వ్యవహారశైలితో జగన్ ప్రభుత్వం కూడా భయపడి ఆయన్ను సీఎం పేషీ నుంచి తప్పించి మళ్లీ ఏపీ భవన్‌కు పంపింది. దీన్ని ముందుగానే పసిగట్టిన ప్రవీణ్ తాను ఉద్యోగం మానేసి వారణాసి నుంచి ఎంపీగా పోటీ చేయబోతున్నట్లు మీడియాకు లీకులు ఇచ్చారు. కొంతకాలం తర్వాత మళ్లీ జగన్‌ను కాకాపట్టి రాష్ట్రానికి తిరిగొచ్చారు.

ఉపాధ్యాయులకు వేధింపులకు

జగన్ హయాంలో పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా నియమితులైన ప్రవీణ్ ప్రకాశ్.. టీచర్లకు చుక్కలు చూపించారు. దీంతో ఆయన ఏ రోజు ఏ జిల్లాకు వస్తారోనని టీచర్లు బెంబేలెత్తిపోయేవారు. "అసలు టీచర్లకు జీతాలు ఇవ్వడమే దండగ" అని పలు సందర్భాల్లో వ్యాఖ్యానించడం పెద్ద వివాదాన్ని రేపింది. అతంటితో కూడా ఆగకుండా రాత్రి వేళల్లో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి నోట్ పుస్తకాలు పరిశీలించడం, ఎవరైనా విద్యార్థి సరిగా రాయకపోతే సంబంధిత టీచర్‌ను చెడామడా తిట్టడం లాంటివి కూడా ఆయనను విమర్శలపాల్జేశాయి. దీంతో ఆయన బాధ భరించలేకపోయిన ఉపాధ్యాయులు "తక్షణం ప్రవీణ్‌ను బదిలీ చేయండి" అంటూ ప్రభుత్వాన్ని వేడుకునే పరిస్థితి వచ్చింది.

నిజమా.. నాటకమా?

గత ప్రభుత్వంతో పూర్తిగా అంటకాగిన అధికారి కావడం, ఆది నుంచీ వివాదాల అధికారిగా ముద్ర ఉండటంతో కూటమి ప్రభుత్వం జాగ్రత్తపడింది. మొదట్లోనే ఆయనను బదిలీ చేసినా పోస్టింగ్ ఇవ్వలేదు. దీంతో.. ఈ ప్రభుత్వంలో తనకు సరైన గుర్తింపు లభించదని అర్థంచేసుకున్న ప్రవీణ్ ఉద్యోగం వదిలేసి వెళ్లిపోవాలని భావిస్తున్నారు. అయితే, ఈ విషయంలోనైనా నిజాయితీ ఉందా? లేక తనకు పోస్టింగ్ ఇవ్వకపోతే వీఆర్ఎస్ తీసుకుని వెళ్లిపోతానని బెదిరించి నాటకాలాడుతున్నారా? అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.




పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షిస్తున్న పవన్

పవన్‌కు వినతుల వెల్లువ

» ఓపికగా విన్న జనసేన అధినేత.. మరోవైపు అధికారులతో సమీక్ష

అమరావతి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్న బాధితులు జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ను ఆశ్రయిస్తున్నారు. ఓ వైపు ఉపముఖ్యమంత్రి తన శాఖలకు సంబంధించిన అధికారులతో మంగళగిరి జనసేన కార్యాలయంలో తెరిపి లేకుండా నిర్వహిస్తున్న సమీక్షలతో బిజీగా ఉంటున్నారు. మరో వైపు ప్రజల వినతి పత్రాలను శుక్రవారం స్వీకరించారు. ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీ నుంచి 1,143 ఉపాధ్యాయ పోస్టులను మినహాయించాలని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది కోరారు. గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఔట్‌సోర్సింగ్ విధానంలో తాము బోధనలో ఉన్నామని తెలిపారు. 2022 పీఆర్సీ ప్రకారం వేతనాలు వచ్చేలా చూడాలని, ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయ వ్యవస్థకు కాంట్రాక్ట్, రెసిడెన్షియల్ టీచర్స్ అని పేరు మార్చాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీలోనే డ్రాయింగ్, క్రాఫ్ట్, మ్యూజిక్ ఉపాధ్యాయుల నియామకం కూడా చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ నిరుద్యోగ ఉపాధ్యాయుల సంఘం కోరింది. పలువురు దివ్యాంగులు తమ సమస్యలను చెప్పుకునేందుకు పార్టీ కార్యాలయానికి తరలివచ్చారు. వారందరి నుంచి పవన్ కల్యాణ్ వినతిపత్రాలు స్వీకరించారు.

నేడు కొండగట్టుకు పవన్

మల్యాల, జూన్ 4: ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ శనివారం జగిత్యాల జిల్లాలోని కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకోనున్నారు. ఏపీ శాసన సభ ఎన్నికల ఫలితాల అనంతరం ఆంజనేయస్వామి ఆశీస్సులు తీసుకుని మొక్కులు తీర్చుకునేందుకు ఆయన కొండగట్టుకు వస్తున్నట్లు తెలుస్తోంది. పవన్‌కల్యాణ్ రాక మేరకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉన్నత విద్య సమూల ప్రక్షాళన

» విద్యా, వసతి దీవెన బకాయిలు 3,480 కోట్లు: మంత్రి లోకేశ్



అమరావతి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఏడాదిలోగా ఉన్నత విద్యా వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేస్తామని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఉన్నత విద్యాశాఖ అధికారులతో శుక్రవారం సచివాలయం లో సమీక్షించారు. యూనివర్సిటీల ర్యాంకులు మెరుగుపర్చాలనేది సీఎం చంద్రబాబు లక్ష్యమని తెలిపారు. పరిశ్రమల అవసరాలకు ఉపయోగపడేలా కరికులమ్‌ను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. ఇంజనీరింగ్ నాలుగేళ్లు చదివినా రాని ఉద్యోగం, అమీర్‌పేట్‌లో నాలుగు నెలల శిక్షణతో ఎలా వస్తుందనే ప్రశ్నను లేవనెత్తారు. ఇకపై ఇతరత్రా శిక్షణలు అవసరం లేకుండా కేవలం చదువుతోనే ఉద్యోగాలు వచ్చేలా కాలేజీల్లో తగిన శిక్షణ ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. క్రమశిక్షణ, నిజాయితీతో పనిచేసి ప్రమాణాల పెంపునకు కృషి చేద్దామని అధికారులను కోరారు. గత ప్రభుత్వం అమలుచేసిన విద్యా దీవెన, వస తి దీవెనలో ఫీజుల చెల్లింపు విధానం విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందన్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 6 లక్షల మంది విద్యార్థుల సర్టిఫికెట్లు కాలేజీల్లో ఉండిపోయాయన్నారు. విద్యా దీవెన, వసతి దీవెన కింద వైసీపీ ప్రభుత్వం రూ.3,480 కోట్ల బకాయిలు పెట్టిందని తెలిపారు. విద్యా సంస్థలతో మాట్లాడి విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించడానికి చేపట్టాల్సిన చర్యల గురించి అధికారులతో చర్చించారు.

అన్నింటా వైసీపీ సర్కారు నిర్లక్ష్యం

» రాష్ట్ర వాటా ఇవ్వక ఆగిన ఏఐఐబీ నిధులు: మంత్రి నారాయణ




అమరావతి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో తాగునీటి, సీవరేజ్ ప్రాజెక్టులన్నీ ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉన్నాయని మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. శుక్రవారం సచివాలయంలో ఆయన మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ అధికారులు, 17 మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ సర్కార్ రాక మునుపు పట్టణ ప్రాంతాల్లో తాగునీటి వనరులు అభివృద్ధి, మురుగునీటి వ్యవస్థ పటిష్టం, ప్రతి ఇంటికీ కుళాయి నీరు అందించే ఏర్పాట్లు చేసేందుకు ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు(ఏఐఐబీ) నుంచి రూ.5300 కోట్ల రుణం 2019 ఫిబ్రవరిలో తీసుకున్నామన్నారు. వైసీపీ సర్కార్ వచ్చిన తర్వాత ప్రాజెక్టుకు అవసరమైన రాష్ట్ర వాటా చెల్లించకపోవడం, టెండర్లు పిలిచి పనులు అప్పగించడంలో జాప్యం చేయడం, చేసిన పనులకు బిల్లులివ్వకుండా ఆలస్యం చేయడంతో ఐదేళ్లలో రూ.429 కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు. దీంతో రాష్ట్రానికి రావాల్సిన నిధులు నిలిచిపోయాయన్నారు. మున్సిపల్‌శాఖలో ఆగిపోయిన పనులను తిరిగి గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారన్నారు. లక్ష లోపు జనాభా కలిగి ఉన్న మున్సిపాలిటీల్లో అమృత్ ప్రాజెక్టుల పనితీరుపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. అమృత్ 1 ప్రాజెక్టులు కోసం కేంద్ర ప్రభుత్వం రూ.3362 కోట్లు విడుదల చేస్తే రూ.2213 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని తెలిపారు. అమృత్-2 కింద రూ.8800 కోట్లు మంజూరైతే కేవలం రూ.3600 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని పేర్కొన్నారు. సీఎంతో చర్చించి ఈ ప్రాజెక్టుల కోసం రాష్ట్ర వాటా విడుదల చేసి ప్రాజెక్టులను తిరిగి గాడిలో పెట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. జూలై చివరి నాటికి 123 పట్టణ స్థానికసంస్థల్లో కాలువల్లో పూడిక తీసేందుకు రూ.50 కోట్లు ఖర్చు చేయనున్నట్లు నారాయణ వివరించారు. ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ద్వారా మురుగునీటి ప్రాజెక్టు పూర్తి చేశారని, టిడ్కో ఇళ్లతోపాటు, ఒక నెలలో మున్సిపల్ శాఖకు సంబంధించి అన్ని ప్రాజెక్టులపై సమీక్షలు నిర్వహించి 2014-19లో ప్రారంభించిన పనులన్నీ తిరిగి ప్రారంభిస్తామని తెలిపారు.

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి: మంత్రి అనిత


ఏపీ ఎమర్జెన్సీ అలర్ట్ సెంటర్‌లో హోంమంత్రి అనిత


అమరావతి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. శుక్రవారం విజయవాడలోని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయం నుంచి వర్షప్రభావిత జిల్లాల కలెక్టర్లు, డీఆర్వోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలి. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. గోదావరి, కృష్ణానదీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించి, వరద ప్రవాహాన్ని గమనించి, తగిన చర్యలు తీసుకోవాలి' అని అధికారులకు మంత్రి నిర్దేశించారు.

ఇదేమి 'కాల మహిమ'!


in the area, in case on the date of inspection no mining was noticed.

In obedience to order of the National Green Tribunal, South Zone, Chennai, I have inspected Sand Reach in Munnangi of Kollipara Mandal on 14.02.2024 along with Sub-Collector, Tenali, Guntur, District Mines & Geology Officer, Guntur, Deputy Executive Engineer, R.C. Sub Division, W.R. Department, Vijayawada, Assistant Environmental Engineer, APPCB, Guntur, District Ground Water Officer, G.W. & W.A.D., Guntur, Royalty Inspector, O/o DM & GO Guntur and Tahsildar Kollipara and

ఫిబ్రవరి 14వ తేదీన మున్నంగి ఇసుక రీచ్‌ను తనిఖీ చేసినట్లు ఎన్జీటీకి ఇచ్చిన నివేదికలో ప్రస్తావించిన వేణుగోపాల్ రెడ్డి


BEFORE THE HON'BLE NATIONAL GREEN TRIBUNAL SOUTHERN ZONE BENCH AT CHENNAI

IN THE MATTER OF:

REPORT FILED BY THE COLLECTOR GUNTUR

రీచ్‌ల తనిఖీపై ఫిబ్రవరి 13వ తేదీనే ఎన్జీటీకి కలెక్టర్ సమర్పించిన నివేదిక

(మొదటి పేజీ తరువాయి)

తాజాగా బయటపడింది.

గోపాల... గోపాల...

ఇసుక తవ్వకాల్లో అక్రమాలే జరగడం లేదని చెప్పండి... అంటూ నాటి గనుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది అప్పట్లో కలెక్టర్లకు 'ప్రొఫార్మా' పంపిన సంగతి తెలిసిందే. ఇదే ఒక చిత్రమైతే.. నాడు గుంటూరు కలెక్టర్‌గా ఉన్న వేణుగోపాల్ రెడ్డి 'అతని కంటే ఘనుడు' అన్నట్లుగా వ్యవహరించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 14న తనిఖీలు చేసినట్లుగా చెబుతూ... 13వ తేదీనే జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ)కి నివేదిక సమర్పించారు. ఇది 'క్లరికల్ మిస్టేక్' కాదు! నిండా నిర్లక్ష్యం! ఉత్తుత్తి తనిఖీలు చేసి, ఉత్తుత్తి రిపోర్టులు ఇచ్చే క్రమంలో 'దొర్లిన' దారుణం! ఇసుక అక్రమాలు జరుగుతున్నట్లు ఎన్జీటీ బృందం అంతకు ముందు తనిఖీ చేసి నిర్ధారించగా... 'అబ్బే, అదేం లేదు!' అని వేణుగోపాల్ రెడ్డి నివేదిక ఇచ్చేశారు.

అడ్డంగా దొరికిపోయేలా...

రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలపై గుంటూరుకు చెందిన దండా నాగేంద్ర ఎన్జీటీలో కేసు వేశారు. కానీ... అసలు అక్రమాలే జరగడంలేదంటూ గనుల శాఖ అఫిడవిట్ వేసింది. నాగేంద్ర పలు ఆధారాలను సమర్పించడంతో... కలెక్టర్‌ల నేతృత్వంలో సంయుక్త విచారణ కమిటీలు ఏర్పాటుచేసి నివేదికలు ఇవ్వాలని ఎన్జీటీ ఈ ఏడాది ఫిబ్రవరి 5న ఆదేశించింది. 14న తదుపరి విచారణ ఉంటుందని, అప్పటిలోగా నివేదికలు ఇవ్వాలని ఆదేశించింది. ఈ క్రమంలోనే... నాటి గుంటూరు కలెక్టర్‌గా ఉన్న వేణుగోపాల్‌రెడ్డి ఓ సంయుక్త విచారణ కమిటీ (జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ)ని ఏర్పాటు చేశారు. ఎన్జీటీ ఆదేశాల మేరకు ఫిబ్రవరి 12వ తేదీన తాడేపల్లి మండలం గుండిమెడ, కొల్లిపర మండలం మున్నంగి రీచ్‌లను తనిఖీ చేసినట్లుగా సంయుక్త కమిటీ నివేదిక ఇచ్చింది. అధికారులు గుండిమెడ రీచ్‌కు వెళ్లినప్పుడు అక్కడభారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. లారీలూ అక్కడే ఉన్నాయి. జీసీకేసీ సంస్థ ఈ రీచ్ పరిధిలో 9 వేల టన్నుల ఇసుకను నిల్వచేసింది. ఈ రీచ్‌కు పర్యావరణ అనుమతులు ఉన్నా, కాలుష్య నియంత్రణ మండలి ఇచ్చే సీటీఈ (కన్సెంట్ ఆఫ్ ఎస్టాబ్లిష్‌మెంట్), సీటీఓ(కన్సెంట్ ఆఫ్ ఆపరేషన్స్) అనుమతులు లేవు. దీంతో అక్రమ తవ్వకాలు చేస్తున్న యంత్రాలను అక్కడికక్కడే సీజ్ చేశారు. మున్నంగి రీచ్‌దీ అదే పరిస్థితి. పర్యావరణ అనుమతులున్నా... సీటీఈ, సీటీవో అనుమతులు లేవు. అయినా... అక్రమంగా అప్రోచ్ రోడ్డు వేశారు. అధికారులు అక్కడికెళ్లే సమయానికి ఇసుక తవ్వకాలు జరగడంలేదు. తనిఖీల సంగతి తెలిసింది కాబోలు... నిర్వాహకులు జాగ్రత్త పడ్డారు. సంయుక్త కమిటీలోని అధికారులు ఇవే విషయాలను కలెక్టర్‌కు నివేదించారు.

కలెక్టర్ కిరికిరి..

సంయుక్త కమిటీ నివేదికకు వేణుగోపాల్ రెడ్డి మసి పూసి మారేడుకాయ చేశారు. గుండిమెడ రీచ్ గురించి కాకుండా... మున్నంగి గురించే తన నివేదికలో ప్రస్తావించారు. "నేను మున్నంగి రీచ్‌ను సందర్శించాను. ఆ సమయంలో ఇసుక తవ్వకాలు జరగడం లేదు. గతంలో ఇసుక తవ్వకాలు జరిగిన ఆనవాళ్లే లేవు" అని సర్టిఫికెట్ ఇచ్చారు. అప్రోచ్ రోడ్డు గురించి, పీసీబీ అనుమతులు లేని విషయాన్ని ప్రస్తావించలేదు. గుండిమెడ రీచ్ గురించి ఎన్జీటీకి అస్సలు చెప్పలేదు. తనిఖీ తేదీలతోనూ చిత్రాలు చేశారు. ఫిబ్రవరి 12న రెండు ఇసుక రీచ్‌లను తనిఖీ చేశామని సంయుక్త కమిటీ రిపోర్టులో ఉంది. కానీ... తాము ఫిబ్రవరి 14న రీచ్‌ను తనిఖీ చేసినట్లు ఎన్జీటీకి ఇచ్చిన నివేదికలో కలెక్టర్ పేర్కొన్నారు. చిత్రమేమిటంటే... ఆ నివేదికను ఫిబ్రవరి 13నే ఇచ్చేశారు. అంటే... చేయబోయే తనిఖీలో 'గుర్తించబోయే విషయాలను' ముందే నివేదికలో రాసేశారా?

కోర్టును మోసం చేయడం కాదా?

ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని సంయుక్త విచారణ కమిటీ నివేదిక ఇచ్చింది. దానిపై సభ్యులందరి సంతకాలున్నాయి. అదే నివేదికను కలెక్టర్‌కు, గనుల శాఖ డైరెక్టర్‌కు, గనుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాల కృష్ణ ద్వివేదికి కూడా పంపించారు. కానీ... వేణుగోపాల్ రెడ్డి మాత్రం ఎన్జీటీకి తప్పుడు నివేదిక ఇచ్చారు. 'అంతా బాగుంది' అని క్లీన్ చిట్ ఇచ్చేశారు. ఇది ఎన్జీటీని మోసం చేయడం కాదా? కలెక్టర్ స్థాయి అధికారికి ఇది తగునా.?

వాసుదేవరెడ్డికి బిగుస్తున్న ఉచ్చు!

» మద్యం అక్రమాలు తవ్వుతున్న సీఐడీ

అమరావతి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): అత్యంత నాసిరకం మద్యాన్ని కనీవినీ ఎరుగని బ్రాండ్ల పేరిట ఏ రాష్ట్రంలోనూ లేని ధరలకు విక్రయించిన ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డికి ఉచ్చు బిగుస్తోంది. తాడేపల్లి ప్యాలెస్‌కు ఎంత డబ్బు తరలించారో సీఐడీ తవ్వి తీస్తోంది. ప్రభుత్వం మారగానే తెలంగాణకు పారిపోయిన ఆయనపై కేసు నమోదు చేసిన సీఐడీ అధికారులు మొత్తం కుంభకోణాన్ని వెలికి తీస్తున్నారు. విజయవాడలోని ఏపీ బేవరేజెస్ కార్యాలయాన్ని ఇప్పటికే ఆధీనంలోకి తీసుకున్నారు. శుక్రవారం కొందరు సిబ్బందిని పిలిచి కంప్యూటర్లు ఓపెన్ చేయించారు. అందులోని సమాచారంతోపాటు డిలీట్ చేసిన వివరాలనూ నిపుణుల ద్వారా రికవరీ చేయిస్తున్నారు. ఇప్పటి వరకూ సోదాల్లో లభించిన ఆధారాలపై కసరత్తు చేసిన సీఐడీ అధికారులు శుక్రవారం మరిన్ని కీలక ఆధారాలు సేకరించారు. మద్యం కుంభకోణం ఎలా జరిగింది..? ఐదేళ్లలో తాడేపల్లి ప్యాలెస్‌కు చేరిన డబ్బు సంచుల్లో ఎన్ని వందల కోట్లు ఉన్నాయి..? ఎక్కువ ఆర్డర్ పొందిన మద్యం కంపెనీ ఏది.. అనధికారికంగా ఎవరెవరు ఎంతిచ్చారనే అంశాలపై కూపీ లాగుతున్నారు. అసలు సూత్రధారిపై ఎలాంటి చర్యలు తీసుకోవచ్చనే అంశంపై న్యాయ నిపుణుల సలహా కోరుతున్నారు.

చట్టానికి అనుగుణంగానే

పెద్దిరెడ్డికి భద్రత

» హైకోర్టుకు ఏజీ దమ్మాలపాటి నివేదన

» గత భద్రత కొనసాగించాలని పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి పిటిషన్లు

» కౌంటర్లు వేయాలని ప్రభుత్వానికి కోర్టు ఆదేశం

» విచారణ 8వ తేదీకి వాయిదా



అమరావతి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, పుంగనూరు వైసీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి చట్ట నిబంధనలకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం భద్రత కల్పిస్తుందని అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టుకు నివేదించారు. మంత్రి హోదాలో ఆయనకు 5+5 సెక్యూరిటీ ఇచ్చారని, ప్రస్తుతం ఆయన సాధారణ ఎమ్మెల్యే మాత్రమేనని, అందుచేత 1+1 భద్రత కల్పిస్తున్నట్లు తెలిపారు. మంత్రిగా ఉండగా తనకు ఇచ్చిన 5+5 సెక్యూరిటీని కొనసాగించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ పెద్దిరెడ్డి, అలాగే తనకున్న 4+4 భద్రతను కొనసాగించేలా ఆదేశించాలంటూ ఆయన కుమారుడు, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కూడా మరో పిటిషన్ దాఖలు చేశారు. ఈ రెండు పిటిషన్లపై శుక్రవారం న్యాయస్థానం విచారణ జరిపింది. పిటిషనర్ల తరపున న్యాయవాది గుడిసేవ నరసింహారావు వాదనలు వినిపించారు. పెద్దిరెడ్డి మంత్రిగా ఉండగా 5+5 సెక్యూరిటీ ఉండేదని.. ఎలాంటి నోటీసులు, సమాచారం ఇవ్వకుండా భద్రతను తగ్గించారని తెలిపారు. దమ్మాలపాటి వాదనలు వినిపిస్తూ.. రాజ్యాంగ బద్ధ పదవులు అలంకరించినవారికి.. ప్రజాప్రతినిధులు, ఇతరులకు భద్రత కల్పించే విషయంలో తగు ఉత్తర్వులు ఉన్నాయని.. వాటికి అనుగుణంగానే అధికారులు నడుచుకుంటున్నారని పేర్కొన్నారు. అదనపు భద్రత కల్పించాలని కోరుతూ జిల్లా ఎస్పీకి పెద్దిరెడ్డి దరఖాస్తు చేసుకున్నారని.. అదనపు భద్రత అవసరంలేదని ఎస్పీ అభిప్రాయపడ్డారని, ప్రస్తుత దరఖాస్తు భద్రత రివ్యూ కమిటీ వద్ద పెండింగ్‌లో ఉందని తెలిపారు. పిటిషనర్లకు ప్రాణహాని ఉందని నిరూపించేందుకు కోర్టు ముందు ఎలాంటి ఆధారాలు ఉంచలేదన్నారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని, అందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. తదుపరి విచారణను జూలై 8కి వాయిదా వేశారు.

వైసీపీ అరాచకాల చిట్టా!

» రాష్ట్రవ్యాప్తంగా సమాచార సేకరణ

» పోలీసుల వ్యవహారశైలిపైనా సమాచారం

» బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం యోచన

అమరావతి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జగన్ జమానాలో చోటు చేసుకొన్న అధికార అరాచకాలపై టీడీపీ కూటమి ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి పెట్టింది. గత ఐదేళ్లలో అధికార దుర్వినియోగానికి పాల్పడి తప్పుడు కేసులు పెట్టిన తీరు, ప్రతిపక్ష పార్టీల వారితో పాటు బడుగు బలహీన వర్గాలను అణచివేసిన వ్యవహారాలపై జిల్లాల వారీగా సమగ్ర సమాచారాన్ని సేకరిస్తోందని తెలుస్తోంది. అవినీతి వ్యవహారాలపై కూడా సమాచార సేకరణ జరుగుతోందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. నాటి ముఖ్యమంత్రి జగన్‌ను వ్యతిరేకించిన సొంత పార్టీ ఎంపీని కూడా పోలీస్ కస్టడీలో చితకబాదారని ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలను ఇదే మాదిరిగా పోలీస్ స్టేషన్లలో హింసించారని, వేల సంఖ్యలో తప్పుడు కేసులు పెట్టి వేధించారని టీడీపీ నేతలు పలు సందర్భాల్లో ఆరోపించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు నివాసంపై కూడా దాడికి ప్రయత్నం జరిగింది. నర్సీపట్నంలో డాక్టర్ సుధాకర్, కాకినాడలో వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ సుబ్రమణ్యం, నంద్యాలలో అబ్దుల్ సలాం కుటుంబం, రేపల్లెలో పదో తరగతి చదువుతున్న బాలుడు అమర్‌నాథ్ గౌడ్, పలమనేరులో ముస్లిం మైనారిటీ బాలిక మిస్బా, కావలి కరుణాకర్ వంటి వారి మరణాలపై కూడా ప్రభుత్వం నివేదికలు తెప్పించుకొంటోంది. అధికార పార్టీ నేతలతో అంటకాగి సామాన్యులను వేధించిన పోలీసు అధికారుల తీరుపైనా సమాచారం సేకరిస్తున్నారు. మాచర్ల వంటి చోట్ల పోలీస్ అధికారులు ఇచ్చిన సమాచారం ఆధారంగానే వైసీపీ నేతలు టీడీపీ కార్యకర్తలను హత్య చేశారన్న ఆరోపణలు కూడా ప్రభుత్వం వద్దకు చేరాయి. గత ఐదేళ్లలో హత్యకు గురైన టీడీపీ కార్యకర్తల వివరాలతోపాటు ఆయా సంఘటనల్లో పోలీసు విచారణ ఏ పద్ధతుల్లో జరిగిందనే దానిపై కూడా సమాచారం పంపాలని ఆదేశాలు ఇచ్చారు. నేరపూరిత చర్యలతో ప్రత్యక్ష ప్రమేయం ఉన్న పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని, ప్రతి సంఘటనపైనా విచారణ జరపాలని నిర్ణయించారు. అధికారం అండతో ప్రైవేటు ఆస్తులు, గనులు, వ్యాపారాలను వైసీపీ నేతలు స్వాధీనం చేసుకొన్న సంఘటనల జాబితా కూడా సిద్ధమవుతోందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఉన్నత స్థాయిలో జరిగిన దోపిడీతో పాటు జిల్లాలు, నియోజకవర్గాల్లో వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, కింది స్థాయి నేతలు చేసిన అక్రమాలు, సాగించిన దోపిడీ వ్యవహారాలపై కూడా నివేదికల తయారీకి ఆదేశాలు ఇచ్చారు. ఒక్కొక్కటిగా అన్ని అక్రమాలు ప్రజలు ముందు పెట్టి చట్టబద్ధంగానే చర్యలు తీసుకోవాలన్న యోచనలో ప్రభుత్వం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.


టీడీపీ కార్యాలయంపై వైసీపీ శ్రేణుల దాడి (ఫైల్)

వీసీల రాజీనామాలు

» నేడు మరికొంతమంది చేసే అవకాశం

అమరావతి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారిన నేపథ్యంలో వైసీపీతో అంటకాగిన యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్లు రాజీనామాలు చేస్తున్నారు. గురువారం మూడు యూనివర్సిటీల వీసీలు రాజీనామా చేయగా, శుక్రవారం మరికొంత మంది రాజీనామా చేశారు. ఇప్పటివరకూ ఆంధ్రా యూనివర్సిటీ వీసీ పీవీజీడీ ప్రసాదరెడ్డి, ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి, జేఎన్‌టీయూ-అనంతపురం వీసీ శ్రీనివాసరావు, ఎస్‌కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డి, విక్రమ సింహపురి వీసీ జీఎం సుందరవల్లి, ద్రావిడ యూనివర్సిటీ వీసీ కొలకలూరి మధుజ్యోతి, కృష్ణా వీసీ జ్ఞానమణి, వేద విశ్వవిద్యాలయం వీసీ రాణి సదాశివ మూర్తి రాజీనామాలు చేశారు. అలాగే యూనివర్సిటీల రిజిస్ట్రార్‌లు, రెక్టార్‌లు కూడా రాజీనామాలు చేస్తున్నారు. పార్టీకి అనుకూల వ్యక్తులుగా గుర్తింపు పొందడంతో వీరిని వైసీపీ ప్రభుత్వం వీసీలుగా నియమించింది. వీరిలో ఏయూ వీసీ అత్యంత వివాదాస్పద వీసీగా ఉన్నారు. అనేక సందర్భాల్లో ఆయన వైసీపీ కార్యకర్త తరహాలో పనిచేశారు. యూనివర్సిటీని వైసీపీ అడ్డాగా మార్చారు. విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఆయన వైసీపీ తరఫున పనిచేశారు. సీఎం జగన్ పుట్టినరోజు వేడుకలు చేయడం యూనివర్సిటీలో అలవాటుగా మార్చారు. ఈ స్థాయిలో విధేయుడిగా ఉన్న ఆయనకు రెండోసారి వీసీగా అవకాశం లభించింది. ఇక కొద్దినెలల కిందట శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ వీసీగా నియమితులైన శ్రీకాంత్‌రెడ్డి నియామకమే వివాదం అయ్యింది. ఆయనపై వ్యక్తిగతంగా కూడా అనేక ఆరోపణలు ఉన్నా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సిఫారసుతో ఆయన్ను వీసీగా నియమించారు. సజ్జల రామకృష్ణారెడ్డి మనిషిగా గుర్తింపు పొందిన నాగార్జున యూనివర్సిటీ వీసీ పి.రాజశేఖర్ మాత్రం రాజీనామా చేయలేదు. పైగా ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజే తెలుగుదేశం నాయకులకు శుభాకాంక్షలు చెబుతూ యూనివర్సిటీలో ఫ్లెక్సీ పెట్టించారు. ఈ ప్రభుత్వంలోనూ వీసీగా కొనసాగాలని ప్రయత్నాలు చేస్తున్నారు.

'నన్నయ్య'లో 20 కోట్ల బిల్లుల చెల్లింపు యత్నాలు

ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ పద్మరాజు శనివారం రాజీనామా చేసే యోచనలో ఉన్నారు. ఈలోగా దాదాపు రూ.20 కోట్ల పాత బిల్లులు చెల్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. వర్సిటీలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ సహకారంతో గతంలో ఆమోదం పొందిన బిల్లులు ఇప్పుడు విడుదల చేస్తున్నారు. పాత తేదీలు వేసే ప్రక్రియ శుక్రవారం రాత్రి మొదలుపెట్టారు. మొత్తం బిల్లులన్నీ క్లియర్ చేసి నేడు రాజీనామా చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. మిగిలిన వర్సిటీల్లోనూ వరుసగా రాజీనామాలు చేసేందుకు వీసీలే సన్నద్ధమవుతున్నారు. కొందరు తాము వైసీపీకి అనుకూలం కాదంటూ రాజీనామాలు చేయట్లేదు.

ఏయూలో విద్యార్థి సంఘాల సంబరాలు

అత్యంత వివాదాస్పదుడైన ఏయూ వీసీ ప్రసాదరెడ్డి సహా, రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్ రాజీనామాలతో విద్యార్థి, అధ్యాపక సంఘాలు ఆనందాన్ని వ్యక్తంచేశాయి. ఏయూ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. ఐదేళ్ల నుంచి వీసీ ప్రసాదరెడ్డి కబంధ హస్తాల్లో చిక్కుకున్న ఏయూలో ఎట్టకేలకు స్వేచ్ఛా వాతావరణం ఏర్పడిందన్నారు. కాగా, అకడమిక్ డీన్‌గా ఉన్న ప్రొఫెసర్ కిశోర్ బాబుకు అడిషనల్ చార్జ్‌ను వీసీ ప్రసాదరెడ్డి అప్పగించారు. ఇక, విక్రమ సింహపురి (వీఎస్‌యూ) రిజిస్ట్రర్‌గా రెండేళ్లుగా పనిచేస్తున్న పాములూరు రామచంద్రారెడ్డిపై కూడా పలు ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో ఆయన స్థానంలో సోషల్ వర్క్ విభాగం అధ్యాపకురాలు సునీతను ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా నియమిస్తూ ఉత్తర్వులిచ్చినట్లు సమాచారం.

రైతులు, యువత కోసం అదానీ కాళ్లైనా పట్టుకుంటా

» కృష్ణపట్నం కంటైనర్ టెర్మినల్.. పునరుద్ధరణే లక్ష్యం: సోమిరెడ్డి

ముత్తుకూరు, జూన్ 28: కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్‌ను పునరుద్ధరించాలనే లక్ష్యంతోనే ఉన్నామని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. నెల్లూరు జిల్లాలోని అదానీ కృష్ణపట్నం పోర్టులో శుక్రవారం ఎన్డీయే కూటమి, వామపక్ష నేతలతో కలసి వెళ్లి పోర్టు సీఈవో జీజే రావును కలిశారు. అనంతరం సోమిరెడ్డి మాట్లాడారు. 'మూసివేసిన కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్‌ను కొనసాగించాలి. టెర్మినల్ మూసివేతతో నెల్లూరు, రాయలసీమ, ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి బియ్యం, చేపలు, రొయ్యలు, మొక్కజొన్న, పొగాకు, మిర్చి, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు ఆగిపోయాయి. సీపీ రావు హయాంలోనే 10 లక్షల కంటైనర్ ట్రాన్స్‌పోర్టు జరిగితే, ఇక అదానీ చేతికి వస్తే 20 లక్షల కంటైనర్ పోతుందని భావించాం. పోర్టు ఇలా మునిగిపోతుందని కలలో కూడా ఊహించలేదు. అదానీని ఒప్పించి కంటైనర్ టెర్మినల్‌ను పునరుద్ధరించే సామర్థ్యం సీఈవోకి ఉంది. పోర్టును నమ్ముకున్న మా ప్రాంత ప్రజలు, యువత కోసం అవసరమైతే అదానీ కాళ్లు పట్టుకునేందుకు సిద్ధంగా ఉన్నాం' అని సోమిరెడ్డి అన్నారు.

వీసీ ద్వారానే సాక్షుల విచారణ

» రాష్ట్రంలో ఎల్లుండి నుంచి కొత్త న్యాయ చట్టాల అమలు

అమరావతి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం గత ఏడాది తీసుకువచ్చిన కొత్త నేర న్యాయ చట్టాలు సోమవారం(జూలై 1) నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ నేపథ్యంలో ఈ చట్టాలను రాష్ట్రంలోనూ అమలు చేయనున్నారు. వీటి అమలుకు సంబంధించి రాష్ట్ర న్యాయశాఖ శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. చట్టాల అమలుకు నియమించిన ఎస్పీ స్థాయితో సమానమైన పోలీసు అధికారికి స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ అధికారాలు కల్పించింది. రికార్డుల నిర్వహణ, ఫిర్యాదులు తీసుకోవడం, నేరం తీరు, అరెస్టుల వివరాలు వంటివన్నీ డిజిటల్ మోడ్‌లో నిర్వహిస్తారు. మండల స్థాయిలో తహసీల్దార్ సమక్షంలో వీడియో కాన్ఫరెన్స్(వీసీ) ద్వారా సాక్షులను విచారిస్తారు.

పెద్దిరెడ్డికి ఒకే రోజు 74 దర్శన, సేవా టికెట్లు

» టీటీడీలో అవినీతికి ఇదో నిదర్శనం: జనసేన

తిరుమల, జూన్ 28(ఆంధ్రజ్యోతి): 'గత వైసీపీ ప్రభుత్వంలో ఓ మంత్రికి ఒకే రోజు 74 శ్రీవారి దర్శన, సేవా టికెట్లను కేటాయించారు. గత ఐదేళ్లలో టీటీడీ పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందనేందుకు ఇదో నిదర్శనం' అని తిరుపతి జనసేన నాయకుడు కిరణ్ రాయల్ ఆరోపించారు. తిరుమలలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'మంత్రి పెద్దిరెడ్డి సిఫార్సుపై ఈ ఏడాది ఫిబ్రవరి 12న 4 తోమాల, 10 వీఐపీ ప్రోటోకాల్ దర్శనాలు, 48 సాధారణ వీఐపీ బ్రేక్, ఆరు కల్యాణోత్సవాలు ఇలా మొత్తం 74 ఆర్జితసేవా, దర్శన టికెట్లను కేటాయించారు. ఒక్క పెద్దిరెడ్డికే ఒక రోజులో ఇన్ని దర్శనాలు కేటాయిస్తే ఇక వారంలో 3 రోజులు తిరుమలకు వచ్చిన అప్పటి మంత్రులు రోజా, నారాయణస్వామి వంటి వారికి ఎన్ని దర్శనాలు కేటాయించి ఉండాలి?' అని ప్రశ్నించారు.

విశాఖ ఉక్కు ఆస్తుల అమ్మకాన్ని అడ్డుకోవాలి: సీపీఐ

అమరావతి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి సంబంధించిన ఆస్తులను విడతలవారీగా తెగనమ్మేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ పరిస్థితుల్లో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కాపాడుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రజలపై ఉందన్నారు. సీఎం చంద్రబాబు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల సహకారంతో ప్రధాని ని కలిసి ఉక్కు ప్రైవేటీకరణను ఆపేందుకు కృషి చేయాలని కోరారు.

టీడీఆర్ బాండ్లలో కోట్లు కొట్టేశారు!

» ఇవిగో ఆధారాలు.. సీబీఐతో దర్యాప్తు జరపండి: హైకోర్టు న్యాయవాది

అమరావతి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో రూ.వేల కోట్ల టీడీఆర్ బాండ్ల కుంభకోణం జరిగిందని దీనిపై సీబీఐ, ఈడీతో విచారణ జరిపి దోషులను శిక్షించాలని సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు హైకోర్టు న్యాయవాది, సమతా సైనిక్ దళ్ చీఫ్ పాలేటి ఉమా మహేశ్వరరావు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలోని పెద్దలు తక్కువ రేటుకు మాస్టర్ ప్లాన్లలోని భూములను కొనుగోలు చేసి వాటిని వెంటనే మున్సిపాలిటీకి గిఫ్ట్‌గా ఇచ్చి రూ.వేల కోట్లు దోపిడీ చేసిన విషయాన్ని ఆధారాలతో సహా సీఎస్‌కు ఇచ్చామన్నారు. తణుకులో రూ.4కోట్ల విలువ చేసే భూమిని ఒక్కరోజులోనే రూ.350 కోట్లకు చేశారని ఈ కుంభకోణంలో పులుపు అనిల్ కీలకంగా వ్యవహరించారన్నారు. సీఎస్ స్పందిస్తూ సీఎం దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి
నవ్య స్మార్ట్
శనివారం • 29 జూన్ 2024

స్నాప్‌చాట్ పటిష్టంగా బ్లాక్ ఫీచర్



స్నాప్‌చాట్ తాజాగా కొన్ని ఫీచర్లను జోడించింది. టీనేజర్లను ఉద్దేశించి పంపే అభ్యర్థనలకు సంబంధించి సేఫ్టీ సెట్టింగ్స్, ఫ్రెండ్స్‌కు లొకేషన్ షేరింగ్, స్నాప్‌చాటింగ్‌లో ఫంక్షనాలిటీని బ్లాక్ చేయడం వంటివి ఈ ఫీచర్లు, ఇంప్రూవ్‌మెంట్స్‌లో ఉన్నాయి. ఇకపై బ్లాక్ ఫీచర్‌ను మరింత ప్రభావపూరితంగా ఉపయోగించవచ్చు. పదే పదే వేధింపుల నుంచి యూజర్లను ప్రొటెక్ట్ చేసేందుకు వీలుగా బ్లాక్ ఫీచర్‌ను మెరుగుపర్చినట్టు స్నాప్ చాట్ షేర్ చేసిన వివరాల్లో ఉంది. ఉదాహరణకు యూజర్ ఒక అకౌంట్‌ను బ్లాక్ చేశారని అనుకుందాం. బ్లాక్ చేసిన అకౌంట్ నుంచి ముఖ్యంగా యూజర్ ఉపయోగిస్తున్న డివైజ్‌కు మాత్రం వేరే నంబర్ లేదా అకౌంట్‌తో అదే వ్యక్తి అభ్యర్థన పంపినా అంగీకరించదు. 13-17 మధ్య వయస్కులకు స్నేహ అభ్యర్థనలు పంపే సదుపాయం ఇక ఉండబోవడం లేదు. పరస్పరం స్నేహితులైతే ఇబ్బంది ఉండదు. లొకేషన్ విషయంలోనూ ఇండియాకు ఉపయోగపడేలా లోకలైజ్డ్ వెర్షన్‌ను కూడా త్వరలో తీసుకువస్తోంది. లొకేషన్ షేరింగ్‌ను కూడా సరళీకరించింది. ముఖ్యంగా పిన్న వయస్కులు తమకు సంబంధించిన షేర్ లొకేషన్‌పై కంట్రోల్‌ను వారికే ఇచ్చింది. అలాగే రెవ్యూ కోసం రెగ్యులర్‌గా లొకేషన్ వివరాలను పంపే స్నేహితుల వివరాలనూ పంపుతుంది. ఇన్-యాప్ వార్నింగ్ సిస్టమ్‌ను తీసుకువచ్చింది. మరో ప్రాంతం నుంచి వచ్చే మెసేజ్‌ల విషయంలో అది యూజర్ని తగువిధంగా హెచ్చరిస్తూ ఉంటుంది.



మార్కెటింగ్ మెసేజెస్ బ్లాకింగ్ ఇలా



వాట్సాప్ ద్వారా బిజినెస్ ప్రమోషన్ ఈ మధ్య కాలంలో ఎక్కువైంది. భారత దేశానికి చెందిన పలు వ్యాపార సంస్థలు ప్రస్తుతం ఈ పద్ధతిని అనుసరిస్తున్నాయి. ఫలితంగా వాట్సాప్ యూజర్లు తమ యాప్ తెరిస్తే చాలు, సదరు మెసేజ్‌లతో బాక్స్‌లు నిండుతున్నాయి. వాటిని తొలగించుకోవడం నిజానికి పెద్ద పని. సమయం కూడా వృథా అవుతుంది. ప్రభుత్వం సైతం వీటిని అరికట్టే యత్నాల్లోనే ఉంది. వాట్సాప్ ఈ రోజుల్లో ఒక మంచి కమ్యూనికేషన్ సాధనం అంటే అతిశయోక్తి ఎంతమాత్రం కాదు. ప్రయాణాలకు సంబంధించి టికెట్స్ నుంచి ఎంతో విలువైన సమాచారాన్ని స్టోర్ చేసుకునేందుకు వాట్సాప్ ఉపయోగపడుతోంది. అయితే మధ్యలో ఈ బిజినెస్ మెసేజ్‌లు యూజర్లకు చాలా చిరాకు కలిగిస్తున్నాయి. వాటిని నిరోధించేందుకు ముఖ్యంగా....

- కాంటాక్ట్ లిస్టు నుంచి బ్లాక్ చేయడం ఒక పద్ధతి. ఒకసారి బ్లాక్ చేస్తే వ్యాపార సముదాయాలు తమ ప్రచారాన్ని పంపలేవు. అయితే వాటి బిజినెస్ ప్రొఫైల్, కేటలాగ్స్‌లో ఆ సంస్థలకు సదరు నంబర్ల యాక్సెస్ మాత్రం ఉంటుంది.
- యూజర్లకు రిపోర్ట్ చేసే అవకాశం ఉంది. నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్టు అనుకుంటే యూజర్లు ఆ పని చేయవచ్చు.
- అదే మాదిరిగా యూజర్లకు కంటిన్యూ ఆప్షన్ కూడా ఉంటుంది. సదరు వ్యాపార సంస్థతో సంబంధాలను మెయింటైన్ చేయవచ్చు. బిజినెస్ సంస్థలతో మెసేజింగ్‌కు చొరవ కూడా చూపించవచ్చు.
- కొన్ని సంస్థలు మాత్రం తమ ప్రచారం వద్దనుకుంటే డిక్లెయిన్‌ని ఎంచుకునే అవకాశాన్ని యూజర్లకు ఇస్తాయి. యూజర్ దాన్ని యాక్టివేట్ చేసుకుంటే చాలు, తమ జాబితా నుంచి సదరు వ్యక్తిని ఆ వ్యాపార సంస్థ తొలగిస్తాయి. ఈ ఫీచర్ లేకుంటే బ్లాక్ చేయడం తప్ప మరో ఆప్షన్ ఉండదు.

మెటా ఏఐ చాట్‌బోట్‌తో ఇంటరాక్షన్



మెటా ఏఐ చాట్ బోట్ ఇండియాలోకి వచ్చేసింది. మెటాకు చెందిన ఫేస్‌బుక్, మెసంజర్ యాప్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లో అందుబాటులోకి వచ్చింది. మెటా ఏఐ ప్రస్తుతం లేటెస్ట్ ఎల్‌లమా3(లార్జ్ లాంగ్వేజ్ మోడల్ మెటా ఏఐ 3)ని రన్ చేస్తోంది. యూజర్లు అడిగే క్లిష్టమైన విషయాలను, సందేహాలను అర్థం చేసుకుని రెస్పాండ్ అవుతుంది. రియల్ టైమ్ సమాచారాన్ని సులువుగా అర్థం చేసుకునే సామర్థ్యం దీనికి ఉంది. ఎము ఇమేజ్ సింథసిస్ మోడల్‌ని ఇంటిగ్రేట్ చేసుకుంది. చాలా కొద్ది పదాలతో ఇమేజెస్‌ను సృష్టించగలదు. ఇది ప్రస్తుతానికి ఇంగ్లీష్ భాషకు మాత్రమే సపోర్ట్ ఇస్తోంది. ఐఫోన్ లేదంటే ఆండ్రాయిడ్ డివైజ్‌లోని ఇన్‌స్టాగ్రామ్ మెసెంజర్ యాప్‌లో మెటా ఏఐతో ఇంటరాక్షన్ కోసం...

- ఎగ్జిస్టింగ్ చాట్‌ను ఓపెన్ చేయాలి.
- టెక్స్ట్ బాక్స్‌లో ఎట్‌ని ఎంటర్. ఆపై మెటా ఏఐని టాప్ చేయాలి. తదుపరి ప్రశ్నించవచ్చు లేదా జోక్ చెప్పమని అడగొచ్చు. చిన్న పిల్లలకు హోంవర్క్‌లో సహాయపడుతుంది. సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్ కోసం కోడ్స్‌ని రాస్తుంది. ముందే పేర్కొన్నట్టు కొన్ని పదాలతో ఏఐ ఫొటోలను క్రియేట్ చేస్తుంది. షార్ట్ యానిమేటెడ్ జీఐఎఫ్‌లను కూడా సృష్టిస్తుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో వీటిని చాలా సులువుగా షేర్ చేసుకోవచ్చు. ఫన్ యానిమేటెడ్ ఎమోజీలను జనరేట్ చేసుకోవచ్చు. ఏఐ స్పందనలను చాట్‌లో భాగంగా పంపుకోవచ్చు. అయితే మెటా ఏఐ, యూజర్ మధ్య మెసేజ్‌లు ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్ట్ అయి ఉండవు. ప్రైవేటు వ్యక్తులు, గ్రూపులో జరిగే సంభాషణలకు మాత్రమే ఆ సౌలభ్యం ఉంటుంది. వాట్సాప్, ఎఫ్‌బీ మెసంజర్ యాప్‌లకూ ఇదే నిబంధన వర్తిస్తుంది.

స్విచ్‌బాట్ యూనివర్సల్ రిమోట్ కంట్రోల్



స్విచ్‌బాట్‌కు చెందిన లేటెస్ట్ యూనివర్సల్ రిమోట్‌తో స్మార్ట్ హోమ్‌ను కూడా అదుపులోకి తీసుకోవచ్చు. ఎనభై వేలకు పైగా డివైజులతో కంపాటబుల్ చేయగలిగే దీని ధర సుమారు అరవై(59.99) డాలర్లు. బ్లూటూత్, మేటర్ సపోర్ట్‌తో స్మార్ట్ హోమ్ డివైజ్‌లను ఆపరేట్ చేయవచ్చు. అక్కడికి స్మార్ట్‌ఫోన్ రీచ్ కాకున్నా ఇబ్బంది ఉండదు. స్విచ్‌బోట్‌కు చెందిన ఇతర స్మార్ట్ హోమ్ డివైజ్‌లను కూడా ఈ రిమోట్ సపోర్ట్ చేస్తుంది. ఆరంభంలో యాపిల్ టీవీ, ఫైర్ టీవీని సపోర్ట్ చేస్తుంది రోకు, ఆండ్రాయిడ్ టీవీ యూజర్లు మాత్రం కొంతకాలం అందుకు ఆగాల్సి ఉంటుంది. భవిష్యత్తు అప్డేట్‌తో అంటే వాటి హార్డ్‌వేర్‌కు అనుగుణంగా అది ఉంటుంది. అయితే ఈ రిమోట్ తొలి అని చెప్పలేం. ఎందుకంటే ఇంతకుమునుపే ఇలాంటి లక్షణాలతో హాప్టిక్ నుంచి ఒకటి వచ్చింది. అది కూడా స్విచ్‌బోట్ రిమోట్ మాదిరిగానే పనిచేస్తుంది. స్విచ్‌బోట్ యూనివర్సల్ రిమోట్ 2.4 ఇంచీల ఎల్‌సీడీ స్క్రీన్‌ను కలిగి ఉంది. అక్కడ నేవిగేషన్ జరుగుతుంది. యూజర్ ఫ్రెండ్లీ అయినప్పటికీ దాని టచ్ చేయడం కుదరదు. ఫిజికల్ బటన్స్‌తో మాత్రమే అన్ని కంట్రోల్స్‌ను హ్యాండిల్ చేయాల్సి ఉంటుంది. దీన్లో 2000ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది. దాని జీవితకాలం 150 రోజులు. అలాగే రోజుకు సగటు వినియోగం పది నిమిషాలకు మించి ఉండదు కూడా. యూజర్లు తమకు తాము దీనికి చార్జింగ్ చేసుకోవచ్చు.

ఇక అన్ని గాడ్జెట్స్‌కూ టైప్-సి చార్జరే!



గాడ్జెట్స్ లేకుంటే క్షణం గడవదు. వాటి బ్యాటరీ డౌన్ అయినప్పుడు ఒక్కో గాడ్జెట్‌కు ఒక్కో చార్జర్ అని పలు చార్జర్లు వెంట పెట్టుకుని తిరగలేము. దీనికి పరిష్కారం అన్ని గాడ్జెట్స్‌కు ఒకే చార్జర్. యురోపియన్ యూనియన్ 'యూఎస్‌బీ టైప్-సి' చార్జర్‌ని తప్పనిసరి చేసిన నేపథ్యంలో ఇండియాలోనూ ఆ నిబంధనను అమలు చేయనున్నట్టు సమాచారం. స్మార్ట్‌ఫోన్ల నుంచి టాబ్లెట్స్, ల్యాప్‌టాప్‌ల వరకు ఇది వర్తిస్తుంది. వచ్చే ఏడాది జూన్ నాటికి ఫాలో కావాలి. 2026 నాటికి మేండేటరీ కానుంది. ప్రస్తుతం చర్చల దశలో ఉన్న ఈ ప్రతిపాదనపై ప్రకటనకు వేచి చూస్తున్నట్టు సమాచారం. ఎలక్ట్రానిక్ వృథాను దీంతో అరికట్టవచ్చు. స్టాండర్డ్ చార్జర్‌తో కలిగే మొదటి ప్రయోజనం అది. 'లైవ్‌మింట్' రిపోర్ట్ ప్రకారం స్టాండర్డ్ చార్జర్‌పై కేంద్ర ఐటీ మంత్రిత్వ విభాగం ఒక ప్రకటన చేయనుంది. మొత్తమ్మీద దీన్ని ఆచరణలోకి తీసుకుని వచ్చేందుకు వీలుగా సదరు కంపెనీలకు సరిపోను సమయాన్ని ప్రభుత్వం ఇవ్వనుంది. ఇదే అమలులోకి వస్తే మన దేశంలోనూ వేర్వేరు డివైజ్‌లకు సింగిల్ కేబుల్ సొల్యూషన్ లభిస్తుందని చెప్పవచ్చు.



ట్రిపుల్ ఐపీ రేటింగ్స్‌తో ఒప్పో స్మార్ట్ ఫోన్

ఒప్పో నుంచి ట్రిపుల్ ఐపీ రేటింగ్స్‌తో స్మార్ట్ ఫోన్ ఒకటి వస్తోంది. 'ఒప్పో ఎఫ్27 ప్రొ ప్లస్ 5జి' పేరిట ఇది విడుదల అవుతోంది. ట్రిపుల్ అంటే ఐపీ69, ఐపీ 68 ఐపీ 66 ఎలా, ఏ స్థాయిలో మెరుగైనవి అన్నది మొదటి చూడాలి. హై ఎండ్ అలాగే మిడ్ రేంజ్ ఫోన్లు ఈ మధ్య ఐపీ రేటింగ్స్‌తో వస్తున్న విషయం తెలిసిందే. అయితే ఒప్పో తాజా ఫోన్ ఆ మూడు రేటింగ్స్‌తో రిలీజ్ అవుతోంది. అసలీ నంబర్ల వ్యవహారం ఏమిటంటే...

- ఐపీ 69 డివైజ్ అంటే డస్ట్ - సీల్డ్. హై ప్రెజర్, హై టెంపరేచర్ వాటర్ జెట్స్‌ను తట్టుకోగలదు. ప్రొటక్షన్‌కు సంబంధించి ఇదే అత్యున్నతం. తీవ్ర పరిస్థితుల నుంచి కూడా బైటపడగలదు. ఇండస్ట్రియల్ క్లీనింగ్ ప్రాసెసస్, కఠినమైన బైటి వాతావరణ పరిస్థితులను భరించగలదు.
- ఐపీ68... ఇది కూడా డస్ట్-సీల్డ్. అయితే నీటి విషయంలో ఒక మీటరు లోతుకు మించకూడదు. పూల్స్ నదులు దగ్గర్లో పడినా ఇబ్బంది ఉండదు.
- ఐపీ66 కూడా డస్ట్ విషయంలో ఒకే విధంగా ఉంటుంది. శక్తిమంతమైన వాటర్ జెట్స్ స్ప్రేలను తట్టుకోగలదు.
- దరిమిలా ఒప్పో కొత్త స్మార్ట్ ఫోన్ విషయానికి వస్తే ట్రిపుల్ రేటింగ్ ఉన్నందున దాదాపుగా అన్ని విధాలుగా యోగ్యమైనదిగా చెప్పవచ్చు. హై ఇంటెన్సిటీతో పైనుంచి కిందకు నీరు పడుతున్నా ఇబ్బంది ఉండదు. మందు పేర్కొన్నట్టు ఒక్కో రేటింగ్‌తో కొన్ని ప్రయోజనాలు ఉన్నాయి. అలా చూసుకున్నప్పుడు ఈ మూడు రేటింగ్‌లు ఉన్న కొత్త ఫోన్ ఎలాంటి ప్రతికూల పరిస్థితులనైనా అధిగమించగలదని చెప్పవచ్చు.

ఐఫోన్ 16 రీడిజైన్‌తో ఫీచర్ల మెరుగు



ఐఫోన్ 16 విడుదల తేదీని ఇంకా ప్రకటించినప్పటికీ సంబంధిత ఫీచర్ల విషయమై లీక్‌లు మాత్రం ఆగటం లేదు. మేజర్ రీడిజైన్ ప్రస్తావన ఇప్పుడు యవనికపైకి వచ్చింది. కెమెరా ఫీచర్ల నుంచి పర్ఫార్మెన్స్‌లో మెరుగుదల వరకు అన్నీ బైటకు వస్తూనే ఉన్నాయి. రీడిజైన్‌కు సంబంధించిన వాటిని తాము సంపాదించినట్టు తాజాగా 'టెక్‌నెట్‌బుక్' తెలిపింది. ఆ రిపోర్ట్ ప్రకారం ప్రొ, నాన్ ప్రొ మోడల్స్‌లో ఇకపై వెర్టికల్ కెమెరా కాన్ఫిగరేషన్ ఉండనుంది. తద్వారా 3డి వీడియో రికార్డింగ్ ఫీచర్ మెరుగుపడుతుంది. స్పేషియల్ వీడియోస్‌గా బ్రాండ్ అవుతాయి. అడ్వాన్స్‌డ్ ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ సామర్థ్యాల పెంపు అలాగే మిక్స్‌డ్-రియాల్టీ ప్రాజెక్ట్స్‌తో ఇంటిగ్రేషన్‌కు అవకాశం ఉంటుంది. స్టాండర్డ్ ఐఫోన్ మోడల్స్‌కు యాక్షన్ బటన్‌ను పరిచయం చేస్తోంది. దీనికి తోడు ప్రొ సిరీస్‌కు డెడికేటెడ్ షట్టర్ బటన్‌ను ఉంచనున్నట్టు సమాచారం. హాప్టిక్ ఇంజన్ పవర్ కలిగి ఉంటుంది. దీంతో వేర్వేరు లెవెల్స్‌తో ఫొటోలను తీసుకోవచ్చు. ఫిజికల్ బటన్స్ అన్నింటినీ తొలగిస్తారన్న పుకారు కూడా వినవచ్చింది. సరికొత్తగా టాక్టికల్ కంట్రోల్స్‌ను ఇంటిగ్రేట్ చేయవచ్చు. ప్రొ మోడల్స్‌లో ఈ పని చేయవచ్చని అంటున్నారు. కెమెరా మాడ్యూల్‌కు ఔట్‌సైడ్‌లో ఫ్లాష్ యూనిట్ ఉండనుంది. 6.1 ఇంచీలు, 6.7 ఇంచీల ఓలెడ్ డిస్‌ప్లేకి తోడు 60 హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేటు ఉండనుంది. ఎ17 ప్రొ చిప్ కారణంగా లేటెస్ట్ యాపిల్ ఇంటెలిజెన్స్ ఫీచర్లను సపోర్ట్ చేస్తుందని అంటున్నారు.

మైక్రోసాఫ్ట్ ఎడ్జ్‌లో మాల్వేర్



మైక్రోసాఫ్ట్ ఎడ్జ్‌లో భద్రతపరంగా ఇబ్బందులకు ఆస్కారం ఏర్పడింది. మాల్వేర్‌తో కూడిన వెబ్ పేజీలకు మైక్రోసాఫ్ట్ ఎడ్జ్ బ్రౌజర్‌కు చెందిన సెక్యూరిటీని ఛేదించుకుని లక్షిత కంప్యూటర్లను టార్గెట్ చేసే సామర్థ్యం ఉంది. ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్(సీఈఆర్‌టి-ఇన్) ఈ విషయాలను మైక్రోసాఫ్ట్ ఎడ్జ్‌కు తెలియజేసింది. వీ8లో టైప్ కన్ఫ్యూజన్, వెబ్ అసెంబ్లీని సక్రమంగా అమలు చేయకపోవడం, డాన్‌లో ఔట్ ఆఫ్ బౌండ్స్ మెమరీ యాక్సెస్, డాన్ కాంపోనెంట్స్‌లో అనుచిత వినియోగం ఇందుకు కారణమని కూడా తెలిపింది. సదరు లూప్ హోల్స్ ప్రస్తుత థ్రెట్‌కు కారణమని తేల్చింది. అయితే మైక్రోసాఫ్ట్ తన ఎడ్జ్ బ్రౌజర్‌కు తగు సెక్యూరిటీ పాచెస్‌ను విడుదల చేసింది. ఈ ప్రమాదంలో భాగంగా డివైజుల్లోని సెన్సిటివ్ సమాచారాన్ని తస్కరించేందుకు ఆస్కారం కలుగుతుంది. డినయల్ ఆఫ్ సర్వీస్(డీఓఎస్) అటాక్‌కు కూడా ఆస్కారం ఏర్పడింది. పిక్సెల్ 5ఎ 5జీ, పిక్సల్ 6ఎ, ఎ, 6ప్రొ, పిక్సల్ 7, 7ప్రొ, 7ఎ, పిక్సల్ 8, 8ప్రొ, 8ఎ, పిక్సల్ ఫోల్డ్ డివైజ్‌లు దీనికి ఎఫెక్ట్ కానున్నాయి. గూగుల్ ఇదే సందర్భంలో అన్ని డివైజ్‌లకు, మేక్స్-లినక్స్‌కు చెందిన క్రోమ్ బ్రైజర్లకు, విండోస్ పీసీలకు కూడా సెక్యూరిటీ పేచెస్‌ను విడుదల చేసింది.

గూగుల్ క్రోమ్‌కు కొత్త ఫీచర్లు



గూగుల్ - క్రోమ్ కోసం కొన్ని ఫీచర్లను ఆండ్రాయిడ్, ఐఫోన్లను ఉద్దేశించి తీసుకువచ్చింది. తాజాగా మరో 110 భాషలకు గూగుల్ ట్రాన్స్‌లేషన్ ఫీచర్ సపోర్టు అందించింది. దీంతో సపోర్టు పొందిన భాషల మొత్తం సంఖ్య 243 అయింది. ఇటీవలే క్రోమ్‌కు జెమినీ ఏఐ ఫీచర్లను కలిపింది. పారిస్ ఒలింపిక్స్‌కు చాలా ముందుగానే స్పోర్ట్స్ కార్డును తీసుకువస్తోంది. ఐసీసీ టి20 క్రికెట్ వంటివి కూడా ఈ జాబితాలో ఉన్నాయి. దీంతో ఇక లేటెస్ట్ అప్డేట్స్ కోసం సెర్చ్ చేయాల్సిన పని యూజర్లకు ఉండదు. క్రోమ్‌కు చెందిన డిస్కవర్ ఫీడ్‌లో స్పోర్ట్స్ కార్డ్స్ - ఐఓఎస్, ఆండ్రాయిడ్‌లో కొత్త టాబ్ పేజీలో లభ్యమవుతాయి. తమకు నచ్చిన టీమ్‌కు సంబంధించిన అప్డేట్స్‌ను వీక్షించే సౌలభ్యం యూజర్లకు ఉంటుంది. ఐప్యాడ్స్, ఆండ్రాయిడ్ టాబ్లెట్స్ కోసం క్రోమ్ అడ్రస్ బార్‌ను గూగుల్ రీడిజైన్ చేసింది. క్రోమ్ యాక్షన్స్ మరొకటి. లోకల్ ఉండే రెస్టారెంట్ పేరు టైప్ చేస్తే ఫోన్ నంబర్లు సహా బిజినెస్ వివరాలు, మ్యాప్, రెవ్యూలు అందుబాటులోకి వస్తాయి.

ఇండియాలోకి ఎంట్రీ లెవెల్ ఫోన్

ప్రొడక్ట్



రియల్‌మి తాజాగా ఎంట్రీ లెవెల్ ఫోన్ ఒకటి ఇండియన్ మార్కెట్‌లోకి విడుదల చేసింది. దీని ఆరంభ ధర రూ.7,699 మాత్రమే. సీ61 పేరిట ఈ స్మార్ట్ ఫోన్‌ని రిలీజ్ చేసింది. సీ61 యూనిసోక్ 612 ఆక్టా-కోర్ ప్రాసెసర్ కలిగి ఉంది. 5000 ఎంఏహెచ్ బ్యాటరీ, డ్యూయల్ కెమెరా ఉన్నాయి. డ్యూయల్ కెమెరా సెటప్, 32 ఎంపీ ప్రైమరీ సెన్సర్ ఉన్నాయి. వెయ్యి చార్జింగ్ సైకిల్స్ తరవాత కూడా 80 శాతం కెపాసిటీకి తోడు 1.8 రోజుల మేర బ్యాటరీ లైఫ్ ఉంటుంది. ఇంటర్నల్ స్టోరేజీ 128 జీబీ వరకు కాగా వాటర్, డస్ట్ రెసిస్టెన్స్‌పరంగా ఐపీ 54 రేటింగ్ దీనికి ఉంది. ఈ ఫోన్ మూడు వేరియంట్లు ఉన్నాయి. 4జీబీ ర్యామ్ + 64 జీబీ ఇంటర్నల్ స్టోరేజీ మోడల్ ధర రూ.7,699. 4జీబీ ర్యామ్ + 128 జీబీ మోడల్ రేటు రూ.8,499 కాగా 6జీబీ + 128జీబీ మోడల్ రేటు రూ.8,999. మార్బుల్ బ్లాక్, సఫారీ గ్రీన్ రంగుల్లో ఇవి లభ్యమవుతాయి. రియల్‌మి వెబ్‌సైట్‌కుతోడు ఫ్లిప్‌కార్ట్, ఆఫ్‌లైన్ స్టోర్స్‌లో లభ్యమవుతుంది. నిబంధనల మేరకు డిస్కౌంట్ కూడా ఇస్తున్నారు.

రెజ్యూమే తయారీలో ఏఐ

ఇన్‌ఫో



ఉద్యోగాన్ని పొందడంలో సీవీ(కరికులమ్ వీటే) ప్రాధాన్యం తెలిసిందే. మన పరోక్షంలో మనల్ని పరిచయం చేసేది సీవీ. అందుకోసం సీవీని పటిష్టంగా రూపొందించుకోవాలి. ఆ క్రమంలో ఇప్పుడు వేగంగా చొచ్చుకు వస్తున్న ఏఐని సైతం ఉపయోగించుకోవచ్చు. వచ్చిన దరఖాస్తుల్లో మనది విలక్షణంగా కనిపించాలంటే, రిక్రూటర్‌ను ఆకట్టుకోవాలంటే ఏఐని సమర్థంగా ఉపయోగించుకోవాలి అని చెబుతున్నారు రిక్రూటర్లు.

- కవర్ లెటర్ కోసం చాట్ జీపీటీని ఉపయోగించుకోవాలి. అభ్యర్థి తన గురించి తాను వివరించుకుంటే చాలు అర్థవంతంగా లెటర్‌ను రూపొందిస్తుంది. వ్యాకరణ దోషాలు, స్పెల్‌చెక్ సహా అన్ని పనులు చేసిపెడుతుంది. ప్రత్యేకించి ఒక కంపెనీలో సాఫ్ట్‌వేర్ డెవలపర్ పోస్టు కోసం దరఖాస్తు చేసుకోవాలి అనుకుంటే చాలు, అక్కడి అవసరాలకు అనుగుణంగా సంబంధిత కేపబిలిటీస్‌ని జతచేస్తూ, ముఖ్యమైన పాయింట్లను హైలైట్ చేస్తూ కవర్ లెటర్‌ను రూపొందిస్తుంది. అయితే ఒకసారి పూర్తయిన తరవాత మాన్యువల్‌గానూ చెక్ చేసుకుంటే మంచిది. సంప్రదాయాలకు విరుద్ధంగా ఏదైనా జోడించి ఉంటే కట్ చేసుకోవచ్చు.
- చాట్ జీపీటీ వాయిస్‌తో ఇంటర్వ్యూలకు ప్రిపేర్ కావడం మరో అంశం. జీపీటీ 4ని ఇంటిగ్రేట్ చేయడంతో వాయిస్ టూల్ నుంచి సహజమైన ధ్వని వస్తోంది. చాట్‌జీపీటీని డౌన్‌లోడ్ చేసుకుని వాయిస్ విభాగంలోకి వెళితే ఇంటర్వ్యూ సీన్‌ను క్రియేట్ చేసుకోవచ్చు. పెట్టుకున్న జాబ్‌ను అనుసరించి అది ప్రశ్నిస్తుంది. నిజానికి ఇదో ఎఫెక్టివ్ ప్రాక్టీస్ మెథడ్. రియల్ లైఫ్ సిట్యుయేషన్‌లో ఉద్యోగార్థి శిక్షణ పొందే వీలు దీంతో ఉంటుంది.
- మెటా ఏఐ ఇప్పుడు ఇండియాలో అధికారికంగానే లభ్యమవుతోంది. అందులో క్విజ్జింగ్ ముఖ్యమైన టాపిక్. అడిగిన సబ్జెక్టునుబట్టి మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఉంటాయి. అలాగే మరింతగా ప్రిపేరయ్యేందుకు ట్రెడిషనల్ రీసెర్చ్ కోసం మెటా ఏఐని ఉపయోగించుకోవచ్చు.
- ఈమెయిల్స్‌ను సమ్మరైజ్ చేసుకునేందుకు గూగుల్‌కు చెందిన ఏఐ ప్రోయస్‌ను ఉపయోగించుకోవాలి. ఒకసారి జాబ్‌కు అప్లయ్ చేశారంటే చాలు, మెయిల్ బాక్స్ అంతా అకనాలెడ్జ్‌మెంట్స్, సమాధానాలతో నిండుతుంది. వాటన్నింటి సార్టింగ్ కోసం చాలా టైమ్ పడుతుంది. అందుకు దీని ఉపయోగిస్తే అవసరమైనవి ముందుకు వస్తాయి. దీనికోసం జీమెయిల్‌లో బిల్ట్ ఇన్ ఫీచర్ కూడా వచ్చింది. ముఖ్యంగా దీంతో సమయం ఆదా అవుతుంది.
- మైక్రోసాఫ్ట్ కోపైలెట్ యాప్‌తో సెల్ఫ్ బ్రాండింగ్‌కు వీలు ఉంటుంది. టెక్స్ట్ ప్రాంప్ట్‌తో ఇది ఇమేజెస్‌ను జనరేట్ చేస్తుంది. రెజ్యూమే నుంచి సోషల్ మీడియా వరకు ఇవి ఉపయోగపడతాయి. అయితే అవసరానికి తగ్గట్టు వీటిని వాడుకోవడంలో మాత్రం అభ్యర్థులకు తగు నైపుణ్యం ఉండాల్సిందే.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● శనివారం 29 జూన్ 2024
diksuchi@andhrajyothy.com



పద్మావతి మహిళ విశ్వవిద్యాలయంలో ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్

తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం(ఎస్‌పీఎంవీవీ), స్వీడన్‌లోని బ్లీకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బీటీహెచ్) ఉమ్మడిగా నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్(బీటెక్ & బీఎస్+ఎంఎస్)లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. ప్రోగ్రామ్ వ్యవధి ఆరేళ్లు. మొదటి మూడేళ్లు ఎస్‌పీఎంవీవీకి చెందిన స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో, చివరి మూడేళ్లు బీటీహెచ్‌లో చదవాల్సి ఉంటుంది. నాలుగో ఏడాది అంటే బీటీహెచ్‌లో ఒక సంవత్సరం చదివిన తరవాత ప్రోగ్రామ్‌నుంచి వైదొలగే వీలుంది. వీరికి ఎస్‌పీఎంవీవీ నుంచి బీటెక్ డిగ్రీ, బీటీహెచ్ నుంచి బీఎస్ డిగ్రీ లభిస్తాయి. మిగిలిన రెండేళ్ల ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి బీటీహెచ్ నుంచి ఎంఎస్ డిగ్రీ లభిస్తుంది. సీఎస్ఈ విభాగంలో మొత్తం 10 సీట్లు ఉన్నాయి. జేఈఈ మెయిన్ 2024 ర్యాంక్ ద్వారా 50 శాతం సీట్లను; ఏపీ ఈఏపీసెట్ 2024/టీజీ ఈఏపీసెట్ 2024/ఇతర రాష్ట్రాల కామన్ ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ 2024 స్కోర్ ద్వారా మిగిలిన 50 శాతం సీట్లను భర్తీ చేస్తారు. ఈ ప్రోగ్రామ్‌నకు సంబంధించిన అవేర్‌నెస్ సెషన్‌ను జూలై 20న సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహిస్తారు. స్వీడన్‌లో ఎంఎస్ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు అక్కడే మరో ఏడాది రెసిడెన్స్ పర్మిట్ పొందవచ్చు. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఉన్నాయి.

ప్రోగ్రామ్ స్పెషలైజేషన్‌లు: ఎస్‌పీఎంవీవీలో మొదటి మూడేళ్లు బీటెక్(కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్), బీటీహెచ్‌లో నాలుగో ఏడాది బీఎస్(కంప్యూటర్ సైన్స్) చదవాల్సి ఉంటుంది.

- బీటీహెచ్‌లో చివరి రెండేళ్ల ఎంఎస్ ప్రోగ్రామ్‌లో కంప్యూటర్ సైన్స్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ స్పెషలైజేషన్‌లు ఎంచుకోవచ్చు.

అర్హత: బీఐఈ(ఏపీ)/సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 70 శాతం మార్కులు తప్పనిసరి. జేఈఈ మెయిన్ 2024/ఏపీ ఈఏపీసెట్ 2024/టీజీ ఈఏపీసెట్ 2024/ఇతర రాష్ట్రాల కామన్ ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ స్కోర్ ఉండాలి. ఆంగ్ల మాధ్యమంలో చదవని అభ్యర్థులకు ఐఈఎల్‌టీఎస్/టోఫెల్ స్కోర్ ఉండాలి. ఐఈఎల్‌టీఎస్‌లో ప్రతి సెక్షన్‌లో కనీసం 5.5, మొత్తమ్మీద కనీసం 6.5 స్కోర్; టోఫెల్‌లో అయితే 575/90 స్కోర్ ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 22
- పూర్తిచేసి దరఖాస్తును కింది ఈ-మెయిల్‌కు అప్‌లోడ్ చేయాలి.
- **అడ్మిషన్ కౌన్సెలింగ్:** జూలై 25న
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** డీన్, ఇంటర్నేషనల్ రిలేషన్స్ ఆఫీస్, ఎస్‌పీఎంవీవీ, తిరుపతి-517502, ఆంధ్రప్రదేశ్
- **ఈ-మెయిల్:** indiarelations@bth.se, cir@spmvv.ac.in
- **వెబ్‌సైట్:** www.spmvv.ac.in

ఐఐటీ హైదరాబాద్‌లో పీహెచ్‌డీ

సంగారెడ్డి-కందిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ హైదరాబాద్)- డైరెక్ట్ పీహెచ్‌డీ 2024 ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి స్పెషల్ రౌండ్ అడ్మిషన్స్ నిర్వహిస్తోంది. సంస్థ నిబంధనల ప్రకారం అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి అడ్మిషన్స్ ఇస్తారు.

విభాగాలు: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బయోమెడికల్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ ఇంజనీరింగ్, క్లయిమేట్ ఛేంజ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, డిజైన్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్, మెటీరియల్స్ సైన్స్ అండ్ మెటలర్జికల్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, మెకానికల్ అండ్ ఏరోస్పేస్ ఇంజనీరింగ్, ఫిజిక్స్

అర్హత: ఐఐటీలు/నిట్ సంస్థలు/ఐసర్ సంస్థలు/ఐఐఎస్సీ నుంచి కనీసం 9 సీజీపీఏతో బీఈ/బీటెక్/బీడిజైన్/ఎమ్మెస్సీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు. గేట్ అర్హత తప్పనిసరి కాదు.

ఫెలోషిప్: అయిదేళ్ల వరకు ఫెలోషిప్ ఇస్తారు. మొదటి రెండేళ్లు జేఆర్ఎఫ్ కింద నెలకు రూ.50,000; చివరి మూడేళ్లు ఎస్ఆర్ఎఫ్ కింద నెలకు రూ.55,000 ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 7
- **వేదిక:** అకడమిక్ సెక్షన్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) హైదరాబాద్, కంది-502284, సంగారెడ్డి, తెలంగాణ
- **వెబ్‌సైట్:** iith.ac.in/phdadmissions/

ఎన్ఐపీహెచ్ఎంలో డిప్లొమా, పీజీ డిప్లొమా



హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్(ఎన్ఐపీహెచ్ఎం)- 'పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్(పీజీడీపీహెచ్ఎం)', 'డిప్లొమా ఇన్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్(డీపీహెచ్ఎం)' ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. సంస్థ నిర్వహించే రిటెన్ ఎగ్జామినేషన్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్‌లలో భాగంగా క్లాస్‌రూమ్ తరగతులు, ల్యాబొరేటరీ తరగతులు, ఫీల్డ్ విజిట్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు, స్టయిపెండ్‌తో కూడిన ఇండస్ట్రీ ఇంటర్న్‌షిప్‌లు ఉంటాయి. నిబంధనల ప్రకారం మెరిటోరియస్ స్కాలర్‌షిప్‌లు అందిస్తారు. ప్రోగ్రామ్‌లు పూర్తిచేసినవారికి ఇండస్ట్రీ స్టాండర్డ్ ప్యాకేజీతో ప్లేస్‌మెంట్స్ కల్పిస్తారు.

పీజీడీపీహెచ్ఎం: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్, ప్లాంట్ బయోసెక్యూరిటీ, పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్, ప్లాంట్ హెల్త్ ఇంజనీరింగ్ స్పెషలైజేషన్‌లలో ఒకదాన్ని ఎంచుకోవచ్చు. ప్రోగ్రామ్ మొత్తానికి 40 క్రెడిట్లు నిర్దేశించారు. ఇందులో 30 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు ప్లాంట్ హెల్త్ ఎక్స్‌పర్ట్‌లుగా, పెస్టిసైడ్ క్వాలిటీ అనలిస్ట్‌లుగా రాణించవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి బీఎస్సీ(అగ్రికల్చర్/హార్టికల్చర్/అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్)/బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్)/ఎమ్మెస్సీ(లైఫ్ సైన్సెస్) ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌కు బీఎస్సీ(కెమిస్ట్రీ) అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు. వీరికోసం అయిదు సీట్లు ప్రత్యేకించారు.

ప్రోగ్రామ్ ఫీజు: నిరుద్యోగులకు రూ.80,000; ప్రైవేట్ ఉద్యోగులకు రూ.2,00,000

డీపీహెచ్ఎం: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. దీనికి 20 క్రెడిట్లు నిర్దేశించారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి డిగ్రీ(అగ్రికల్చర్/హార్టికల్చర్/లైఫ్ సైన్సెస్/అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్)/బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్ ఫీజు: రూ.40,000

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.200
- **దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ:** జూలై 30
- **రిటెన్ ఎగ్జామ్‌నకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఆగస్టు 5
- **రిటెన్ ఎగ్జామినేషన్ తేదీ:** ఆగస్టు 12
- **సెలెక్టయిన అభ్యర్థుల జాబితా విడుదల:** ఆగస్టు 19
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** ఆగస్టు 25 నుంచి
- **వెబ్‌సైట్:** https://niphm.gov.in

జయశంకర్ వ్యవసాయ వర్సిటీలో డిప్లొమాలు

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ)- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. అగ్రికల్చర్, ఆర్గానిక్ అగ్రికల్చర్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ విభాగాలు ఉన్నాయి. అగ్రికల్చరల్ స్ట్రీమ్‌లో తెలంగాణ పాలిసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలల్లో 260 సీట్లు, అనుబంధ ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో 540 సీట్లు ఉన్నాయి. మొత్తం సీట్లలో 85 శాతం సీట్లను స్థానికులకు నిర్దేశించారు. గ్రామీణ పాఠశాలల్లో కనీసం నాలుగేళ్లు చదివిన విద్యార్థులకు ప్రతి విభాగంలో 60 శాతం సీట్లు కేటాయించారు. ఈ ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.



డిప్లొమా ఇన్ అగ్రికల్చర్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీ అగ్రికల్చరల్ పాలిటెక్నిక్ కళాశాలల్లో మొత్తం 240 సీట్లు ఉన్నాయి. జోగిపేటలో బాలికల పాలిటెక్నిక్; బసంత్‌పూర్, జమ్మికుంట, మల్తుమ్మెదలలో బాలుర పాలిటెక్నిక్ కాలేజీలు ఉన్నాయి. వీటితోపాటు పాలెం, పొలాస, కంపసాగర్, మధిర, సిరిసిల్ల, రుద్రూర్ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఒక్కోదానిలో 20 సీట్లు; నారాయణపేట పాలిటెక్నిక్ కళాశాలలో 40 సీట్లు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా యూనివర్సిటీ అనుబంధ కళాశాలల్లో మొత్తం 390 సీట్లు ఉన్నాయి.

డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. సంగారెడ్డి-కందిలోని అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ పాలిటెక్నిక్‌లో 20 సీట్లు ఉన్నాయి. మెదక్-తునికి, ఖమ్మం-సత్తుపల్లి, సంగారెడ్డి-తుర్కాల ఖానాపూర్‌లలో ఉన్న అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఒక్కోదానిలో 30 చొప్పున మొత్తం 90 సీట్లు ఉన్నాయి.

డిప్లొమా ఇన్ ఆర్గానిక్ అగ్రికల్చర్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. వికారాబాద్-గింగుర్తిలోని ఏకలవ్య ఆర్గానిక్ అగ్రికల్చర్ పాలిటెక్నిక్‌లో 60 సీట్లు ఉన్నాయి.

అర్హత: ఆంధ్రప్రదేశ్/తెలంగాణ స్టేట్ బోర్డ్ నిర్వహించే పదోతరగతి పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఎన్ఐఓఎస్, తెలంగాణ/ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీల అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం 35 శాతం మార్కులు తప్పనిసరి. అగ్రికల్చరల్ విభాగంలో తెలంగాణ పాలిసెట్ 2024 ర్యాంక్ పొంది ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 15 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయో పరిమితి 22 ఏళ్లు.

- **రిజిస్ట్రేషన్ ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600
- **రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 4
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 5
- **ఆన్‌లైన్ దరఖాస్తులో కరెక్షన్స్:** జూలై 6
- **వెబ్‌సైట్:** diploma.pjtsau.ac.in

జాబ్ కార్నర్

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో అప్రెంటిస్‌లు

ఖాళీలు 40

1. గ్రాడ్యుయేట్ అప్రెంటిస్
2. టెక్నీషియన్ అప్రెంటిస్
3. జనరల్ స్ట్రీమ్ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్

విభాగాలు: కెమికల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీహెచ్ఎం

అర్హతలు: సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

శిక్షణ వ్యవధి: ఒక సంవత్సరం

స్టయిపెండ్: నెలకు గ్రాడ్యుయేట్/జనరల్ స్ట్రీమ్ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లకు రూ.9000. టెక్నీషియన్ అప్రెంటిస్‌కు రూ.8000.

వయోపరిమితి: 14-18 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక విధానం: అకడమిక్ మెరిట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా

దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను చీఫ్ జనరల్ మేనేజర్,ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ భండారా, భండారా, మహారాష్ట్ర చిరునామాకు పంపించాలి.

ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: జూలై 13

వెబ్‌సైట్: https://munitionsindia.in/

కాటన్ కార్పొరేషన్‌లో వివిధ ఖాళీలు

ఖాళీలు 214

నవీ ముంబయిలోని ప్రభుత్వరంగ సంస్థకు చెందిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్.. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. అసిస్టెంట్ మేనేజర్(లీగల్): 1 పోస్టు
2. అసిస్టెంట్ మేనేజర్(అఫీషియల్ లాంగ్వేజ్): 1
3. మేనేజ్‌మెంట్ ట్రెయినీ (మార్కెటింగ్): 11
4. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(అకౌంట్స్): 20
5. జూనియర్ కమర్షియల్ ఎగ్జిక్యూటివ్: 120
6. జూనియర్ అసిస్టెంట్(జనరల్): 20
7. జూనియర్ అసిస్టెంట్(అకౌంట్స్): 40
8. జూనియర్ అసిస్టెంట్(హిందీ ట్రాన్స్‌లేటర్): 1

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, సీఏ/సీఎంఏ, బీఎస్సీ, బీకాం, లా డిగ్రీ, ఎంబీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు 32 ఏళ్లు, ఇతర పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు

ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

పరీక్ష కేంద్రాలు: ముంబయి/నవీ ముంబయి, హైదరాబాద్, న్యూఢిల్లీ, చెన్నై, లఖ్‌నవూ, చండీగఢ్, కోల్‌కతా, బెంగళూరు, అహ్మదాబాద్, పట్నా, జయపుర.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 2

వెబ్‌సైట్: cotcorp.org.in/

యంగ్ ప్రొఫెషనల్స్

ఐఐఓఆర్

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఐసీఏఆర్- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ రీసెర్చ్... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

1. యంగ్ ప్రొఫెషనల్-1(క్రాప్ ప్రొడక్షన్)
2. యంగ్ ప్రొఫెషనల్-1(క్రాప్ ఇంప్రూవ్‌మెంట్)

అర్హతలు: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఎస్సీ(అగ్రికల్చరల్/కెమిస్ట్రీ)తో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు రూ.30,000

ఇంటర్వ్యూ తేదీలు: జూలై 11, 27

వేదిక: ఐసీఏఆర్- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సీడ్స్ రీసెర్చ్, రాజేంద్రనగర్, హైదరాబాద్.

వెబ్‌సైట్: https://www.icariior.org.in/

సీఐఆర్‌బీ

హిసార్‌లోని ఐసీఏఆర్‌కు చెందిన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రీసెర్చ్ ఆన్ బఫెల్లోస్... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.

పోస్టు: యంగ్ ప్రొఫెషనల్

ఖాళీలు: 2

అర్హత: డిప్లొమా/డిగ్రీ(అగ్రికల్చరల్ సైన్స్) ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 21 నుంచి 45 ఏళ్లు ఉండాలి

ఇంటర్వ్యూ తేదీ: జూలై 17

వెబ్‌సైట్: cirb.icar.gov.in/



ఐఐటీ మద్రాస్

ఎంబీఏ(డీఎంఎస్‌సీ)

ఐఐటీ మద్రాస్‌లో ప్రపంచంలోనే తొలిసారిగా ఎంబీఏ డిజిటల్ మారిటైమ్ అండ్ సప్లయ్ చైన్(డీఎంఎస్‌సీ)ని ఆరంభించారు. ఇది రెండేళ్ళ కాలవ్యవధి కలిగిన ప్రోగ్రామ్. కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ అంటే ఐఓటీ, ఏఐ, ఎంఎల్, బ్లాక్‌చైన్‌ని కోర్సులో చేర్చారు. ఆధునిక మారిటైమ్ సవాళ్ళను సమర్థంగా ఎదుర్కొనేందుకు అవసరమైన నైపుణ్యాలను కూడా నేర్పుతారు. మద్రాస్ ఐఐటీకి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, ఓషన్ ఇంజనీరింగ్ విభాగం, ఇండస్ట్రీ పార్టనర్ ఐ-మారిటైమ్ కన్సల్టెన్సీ ఉమ్మడిగా ఈ ప్రోగ్రామ్‌ను తీర్చిదిద్దాయి. కనీసం 60 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ, రెండేళ్ళపాటు ఫుల్‌టైమ్ వర్క్ ఎక్స్‌పీరియెన్స్ ఉన్న అభ్యర్థులు ఈ కోర్సు చేసేందుకు అర్హులు. ఐఐటీ మద్రాస్ నిర్వహించే ఆన్‌లైన్ అడ్మిషన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో మొదటి బ్యాచ్ ఆరంభమవుతుంది. ఫీజు రూ.తొమ్మిది లక్షలు కాగా వాయిదా పద్ధతిలో చెల్లించే వెసులుబాటు ఉంది.

సస్టయినబిలిటీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

యూకేకి చెందిన యూనివర్సిటీ ఆఫ్ లీడ్స్‌తో కలిసి సస్టయినబిలిటీలో జాయింట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఐఐటీ మద్రాస్ ఆరంభించింది. నాలెడ్జ్ అడ్వాన్స్‌మెంట్‌కు తోడు వేర్వేరు క్లిష్ట రంగాల్లో ఇన్నోవేషన్ కోసం ఈ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. సంబంధిత మెమరాండంపై రెండు వర్సిటీలు సంతకాలు చేశాయి. ఆ ప్రకారం 'వర్చ్యువల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ సస్టయినబుల్ డెవలప్‌మెంట్'ను ఆరంభించారు. కొలాబిరేటివ్ రీసెర్చ్ ప్రాజెక్టులు, జాయింట్ అకడమిక్ కార్యకలాపాలు, కోర్సులు, సదస్సులు, సెమినార్లు, సింపోజియాలు, లెక్చర్లు దీనిలో భాగంగా ఉంటాయి. రీసెర్చ్, టీచింగ్, స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌లు కూడా ఉంటాయి.

లిటిల్స్




మిణుగురు పురుగు ఉపాయం

ఒక చిట్టడవిలో తేజ అనే మిణుగురు పురుగు ఉండేది. అది ఎంచక్కా అడవంతా తిరుగుతూ, అందరినీ చలాకీగా పలకరిస్తూ, ఆనందంగా గడిపేది. ఒక రోజు దాని దగ్గరికి పెద్దకాకి ఒకటి వచ్చి నోరు తెరిచి, మిణుగురును మింగబోయింది.



మిణుగురు పురుగు వెంటనే కాకిని ఆపి, 'ఆగు, నా మాట విన్నావంటే, నీకే లాభం. నేను చాలా చిన్న ప్రాణాన్ని, నాతో వస్తే, నాలాంటిమిణుగురు పురుగులు చాలా దొరికే చోటు చూపిస్తాను' అన్నది. ఆశ కొద్దీమిణుగురు పురుగు మాటలు నమ్మిన కాకి దాని వెనక వెళ్లింది. మిణుగురు పురుగు కాకిని దగ్గర్లో మనుషులు చలి కాచుకుంటున్న నెగడు దగ్గరికి తీసుకెళ్లి, అక్కడ కనిపించే నిప్పు రవ్వలను చూపించి, "అదిగో బోలెడు మిణుగురు పురుగులు చూడు అన్నది. కొంచెందూరం నుండి చూసిన కాకి నిజమే అనుకుని, నిప్పు రవ్వల దగ్గరికి వెళ్లి, నోరు తెరిచి వాటిని మింగబోయి, నోరు కాల్చుకుని, అక్కడినుండి వెళ్లిపోయింది. అలా మిణుగురు పురుగు ఉపాయంతో కాకిని దెబ్బ కొట్టి, తన ప్రాణాలను కాపాడుకుంది.

దారి కనుక్కోండి





6 తేడాలు గుర్తించండి!



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 345

3		5		2	1			
9			8					
	1		7			8		
				7	5		8	6
7	5		9	4				
		4			6		7	
					7			5
			5	3		2		1

సుడోకు - 344 సమాధానం

3	8	5	4	2	1	6	9	7
9	4	7	8	6	3	5	1	2
6	1	2	7	5	9	8	3	4
2	9	1	3	7	5	4	8	6
4	3	8	6	1	2	7	5	9
7	5	6	9	4	8	1	2	3
5	2	4	1	9	6	3	7	8
1	6	3	2	8	7	9	4	5
8	7	9	5	3	4	2	6	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
శనివారం • 29 జూన్ 2024
cinema@andhrajyothy.com

కలలో కూడా హాని తలపెట్టడు

• అభిమాని హత్యకేసులో అరెస్టయిన హీరో దర్శన్‌కు నాగశౌర్య మద్దతు



'దర్శన్ గురించి నాకు బాగా తెలుసు, ఆయన ఎంతో మందిని ఆదుకున్నాడు. వీలైతే సాయం చేస్తాడే తప్ప కలలో కూడా ఇతరులకు హాని తలపెట్టడు. త్వరలోనే ఆయన నిర్దోషిగా బయటకొస్తాడు' అని టాలీవుడ్ హీరో నాగశౌర్య అన్నారు. రేణుకాస్వామి అనే అభిమానిని క్రూరంగా హత్య చేసిన కేసులో అరెస్టయిన కన్నడ హీరో దర్శనకు నాగశౌర్య మద్దతుగా నిలిచాడు.

'ఎన్నో కుటుంబాలు దర్శన్ మీద ఆధారపడి బతుకుతున్నాయి. నిజాలు నిగ్గుతేలేవరకూ ఆయన కుటుంబానికి కాస్త గౌరవం ఇవ్వండి. ముందే విమర్శలకు దిగడం సరికాదు' అని శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా నెటిజన్లకు హితవు పలికారు. 'న్యాయవ్యవస్థ పైన నాకు నమ్మకం ఉంది. త్వరలోనే వాస్తవాలు బయటకు వస్తాయి. నిజమైన దోషులకు శిక్ష పడుతుంది. దర్శన్ అన్న నిర్దోషిగా బయటకు వస్తాడు. ఈ గడ్డు పరిస్థితుల్లో వారి కుటుంబాన్ని కించపరచడం, బాధపెట్టడం చేయవద్దు' అని తన పోస్ట్‌లో నాగశౌర్య పేర్కొన్నారు. దర్శన్‌తో దిగిన ఫొటోను ఆయన షేర్ చేశారు.

దర్శన్ తన భార్య, పిల్లలను వదిలి హీరోయిన్ పవిత్రగౌడతో కొన్నాళ్లుగా సహజీవనం చేస్తూ, కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారనే కారణంతో రేణుకాస్వామి అనే అభిమాని పవిత్రగౌడకు సోషల్ మీడియాలో అసభ్యకరమైన మెసేజ్‌లు పంపాడు. ఆ కోపంతో రేణుకా స్వామిని దర్శన్ తన అభిమానులతో కిడ్నాప్ చేయించి, హత్య చేశారని పోలీసులు చెబుతున్నారు. దర్శన్, పవిత్రగౌడను కఠినంగా శిక్షించి, రేణుకాస్వామికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కర్ణాటక వ్యాప్తంగా ప్రజలు స్వచ్ఛందంగా ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. మరోవైపు సోషల్ మీడియాలో నెటిజన్లు దర్శన్‌ను బండబూతులు తిడుతూ ట్రోల్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నాగశౌర్య దర్శన్‌కు మద్దతు తెలుపుతూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టడం చర్చనీయాంశం అయింది.

'కల్కి'లో కృష్ణుడు ఇతనే!



అమితాబ్, కమల్‌హాసన్, ప్రభాస్, దీపికా పదుకొనే వంటి అగ్ర నటీనటులు నటించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రం గురువారం విడుదలై సూపర్ హిట్ టాక్ సొంతం చేసుకుంది. కురుక్షేత్ర యుద్ధం నేపథ్యంలో సాగే సన్నివేశాల్లో శ్రీకృష్ణుని పాత్ర పోషించిన నటుడి ముఖాన్ని చూపించకపోవడంతో అతనెవరా.. అనే చర్చ మొదలైంది. ఆ పాత్ర పోషించిన నటుడి నడక తీరు చూసి హీరో నాని అన్నారు కొందరు. కాదు కాదు అర్జున్ దాస్ అన్నారు మరికొందరు. ఈ చర్చకు తెర దించుతూ ఆ సినిమాలో కృష్ణ పాత్ర పోషించింది నేనే అంటూ సోషల్ మీడియా వేదికగా స్వయంగా వెల్లడించారు తమిళ నటుడు కృష్ణకుమార్ బాలసుబ్రహ్మణ్యన్. 'ఒక అద్భుత చిత్రంలో అటువంటి ప్రత్యేక పాత్ర పోషించే అవకాశం రావడం నిజంగా అదృష్టం' అని ఆయన పేర్కొన్నారు. కృష్ణకుమార్ కొత్త నటుడేమీ కాదు, 2010లోనే ఆయన చిత్ర రంగ ప్రవేశం చేశారు. 'కదలగై' తమిళ చిత్రంలో నటించిన ఆయన ఆ తర్వాత రంగస్థల ప్రవేశం చేసి పలు నాటకాల్లో నటించారు. పదేళ్ల తర్వాత మళ్లీ తమిళ చిత్రరంగ ప్రవేశం చేశారు. సూర్య నటించిన అనువాద చిత్రం 'ఆకాశం నీ హద్దు'లో కీలక పాత్ర పోషించారు. ధనుష్ 'మారన్' సినిమాలో అతనికి ఫ్రెండ్‌గా నటించారు. 'కల్కి' కృష్ణకుమార్‌కు ఐదో చిత్రం కావడం గమనార్హం.

రికార్డులు కోసం సినిమాలు తీయం

\- నిర్మాత స్వప్న దత్




ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రం బాక్సాఫీసు దగ్గర భారీ వసూళ్లను రాబడుతోంది. తొలి రోజే ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ. 200 కోట్ల వసూళ్లకు చేరువైంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా సృష్టించబోయే రికార్డులపై అందరి దృష్టి పడింది. ఏఏ రికార్డులు బద్దలవుతాయనే చర్చ అటు పరిశ్రమలో, ఇటు ప్రేక్షకుల్లో జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో 'కల్కి' నిర్మాతల్లో ఒకరైన స్వప్నదత్ సోషల్ మీడియాలో స్పందించారు. 'మా సినిమా అధిగమించిన రికార్డుల గురించి చాలా మంది అడుగుతున్నారు. ఇది హాస్యాస్పదం. రికార్డులు సృష్టించేవారు ఎప్పుడూ రికార్డుల కోసమే సినిమాలు తీయరు. సినిమా, ప్రేక్షకుల పైన ప్రేమతోనే మేం సినిమాలు తీస్తాం. 'కల్కి' చిత్రాన్ని కూడా ఇదే విధంగా రూపొందించాం' అన్నారు.

రేఖ ఆస్తుల వివరాలు తెలుసా?



బాలీవుడ్‌కి వెళ్లి సత్తా చాటిన తొలి తెలుగు హీరోయిన్ రేఖ. ఇప్పటి వరకూ దాదాపు రెండు వందల చిత్రాల్లో నటించి ప్రేక్షకుల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారామె. రేఖ కెమెరా ముందుకు వచ్చి పదేళ్లు అవుతోంది. ముందే జాగ్రత్త పడి, ఆస్తులు సంపాదించుకోకపోతే ఆర్టిస్టుల చివరి రోజులు ఎంత దుర్భరంగా గడుస్తాయో చెప్పనక్కర్లేదు. తన పిన్ని, మహానటి సావిత్రిలా తన జీవితం కష్టాలమయం కాకూడదని రేఖ అనుకున్నారో ఏమో కానీ దీపం ఉండగానే అన్నీ చక్కదిద్దుకున్నారు. ప్రస్తుతం ఆమెకు సినిమా నుంచి సంపాదన ఏమీ లేకపోయినా ఆస్తులకు కొదవలేదు. ప్రస్తుతం ముంబై రేఖ ఉంటున్న ఇంటి ఖరీదు ఎంతో తెలుసా.. అక్షరాలా రూ. వంద కోట్లు. ఇక నెల నెలా అద్దెల రూపంలో లక్షలాది రూపాయలు వచ్చి ఆమె అకౌంట్‌లో పడుతుంటాయి. బ్యాంక్‌లో ఉన్న ఫిక్స్‌డ్ డిపాజిట్ల సంగతి చెప్పనక్కర్లేదు. కెరీర్ పీక్‌లో ఉన్నప్పుడు అనవసరపు ఖర్చుల జోలికి పోకుండా తన సంపాదనలో అధిక శాతం ఫిక్స్‌డ్ డిపాజిట్లలో దాచుకున్నారు రేఖ. ఆమె ఇంట్లో మందీ మార్బలం కూడా పెద్దగా లేరు. ఒక సెక్రటరీ, డ్రైవర్ తప్ప. వీళ్లిద్దరూ చాలా ఏళ్లుగా ఆమె దగ్గర పని చేస్తున్నారు.

ఇస్మార్ట్... స్టెప్స్‌తో



రామ్ పోతినేని హీరోగా దర్శకుడు పూరి జగన్నాథ్ తెరకెక్కిస్తున్న చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. ఆగస్టు 15న విడుదలవుతోంది. చిత్రబృందం సంగీత ప్రచార కార్యక్రమాలను ప్రారంభించింది. ఈ చిత్రం నుంచి తొలి గీతం విడుదలకు తేదీ ఖరారైంది. 'స్టెప్పా మార్' అంటూ సాగే ఈ మాస్ గీతాన్ని జూలై 1న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ శుక్రవారం ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో శివుని విగ్రహం ముందు రామ్ పోతినేని డాన్స్ చేస్తూ కనిపించారు. ఈ చిత్రంలో సంజయ్‌దత్ విలన్‌గా నటిస్తున్నారు. కావ్య థాపర్ కథానాయిక. అలీ, గెటప్ శ్రీను కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఛార్మీకౌర్‌తో కలసి పూరి జగన్నాథ్ నిర్మిస్తున్నారు. సంగీతం: మణిశర్మ, సినిమాటోగ్రఫీ: సామ్ కే నాయుడు



భయపెట్టే రారాజా

సుగి విజయ్, మౌనిక మగులూరి హీరో హీరోయిన్లుగా నటించిన హారర్ థ్రిల్లర్ 'రారాజా'. శ్రీ పద్మిని సినిమాస్ బేనర్‌పై బి. శివప్రసాద్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఇటీవలే చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ప్రధాన పాత్రధారి మొహం కనిపించకుండా డిజైన్ చేసిన కాన్సెప్ట్ ఆసక్తికరంగా ఉంది. హారర్ ఎలిమెంట్స్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇవ్వబోతున్నాయని ట్రైలర్‌ను చూస్తే తెలుస్తోంది. త్వరలోనే 'రారాజా' విడుదల తేదీని ప్రకటిస్తామని శివప్రసాద్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: శేఖర్ చంద్ర, సినిమాటోగ్రఫీ: రాహుల్ శ్రీ వాత్సవ్.

కొంచెం కొంచెం...




చిమటా రమేశ్‌బాబు హీరోగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'నేను-కీర్తన'. ఈ చిత్రం నుంచి 'కొంచెం కొంచెం గుడుగుడు గుంజం' అంటూ సాగే ప్రత్యేక గీతాన్ని నటుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు మురళీమోహన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "నేను-కీర్తన' ట్రైలర్, సాంగ్స్ బావున్నాయి. నేను విడుదల చేసిన ఐటమ్ సాంగ్ థియేటర్స్‌లో విజిల్ వేయిస్తుంది. ఈ చిత్రం ఘన విజయం సాధించాలి' అని ఆకాంక్షించారు. ఈ చిత్రంలో రిషిత, మేఘన ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. చిమటా లక్ష్మీకుమారి నిర్మాత. త్వరలో 'నేను-కీర్తన' విడుదల తేదీని ప్రకటిస్తామని రమేశ్‌బాబు చెప్పారు. కులుమనాలిలో చిత్రీకరించిన పాటలతో పాటు ఆరు రోప్ ఫైట్స్ ఈ సినిమాకు ప్రత్యేకాకర్షణ అని నిర్మాత చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎల్ రాజా, ఛాయాగ్రహణం: కె. రమణ, ఎడిటింగ్, వినయ్‌రెడ్డి.

నటి హీనాఖాన్‌కు కేన్సర్



ప్రముఖ బాలీవుడ్ బుల్లితెర నటి హీనాఖాన్ రొమ్ము కేన్సర్‌తో బాధపడుతున్నారు. శుక్రవారం ఈ విషయాన్ని ఆమె సోషల్ మీడియా ద్వారా తెలిపారు. 'ప్రస్తుతం స్టేజ్ 3 కేన్సర్‌తో పోరాడుతున్నాను. చికిత్స తీసుకుంటున్నాను. కేన్సర్‌ను జయించి మళ్లీ మామూలు మనిషిగా మీ ముందుకు వస్తాననే నమ్మకం ఉంది. ఈ ఆపత్కాలంలో నాకు అండగా నిలుస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అని తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో పేర్కొన్నారు. బుల్లి తెర సీరియల్ 'ఏ రిస్తా క్యా కెహ్‌లాతా హై'లో అక్షర పాత్రతో ఆమె ప్రేక్షకులకు చేరువయ్యారు. 'బిగ్‌బాస్, ఖత్రోన్ కే ఖిలాడి' వంటి రియాలిటీ షోల్లో హీనాఖాన్ పాల్గొన్నారు.

అమితాబ్, కమల్, రజనీ.. ఒకే చిత్రంలో



ఇటీవల విడుదలైన 'కల్కి 2898 ఏడీ' చిత్రంలో అమితాబ్, కమల్ హాసన్ నటించారు. దాదాపు 40 ఏళ్ల తర్వాత వీరిద్దరూ కలసి నటించిన చిత్రం ఇదే కావడం గమనార్హం. కమల్ నటించిన హిందీ చిత్రాల సంఖ్య తక్కువే. అలాగే అమితాబ్ ఏనాడూ తమిళ సినిమాలో నటించింది లేదు. చివరికి తెలుగు చిత్రం 'కల్కి' వల్ల వీరిద్దరి కలయిక మరోసారి సాధ్యమైంది. అలాగే అమితాబ్ తొలిసారిగా ఓ తమిళ చిత్రంలో నటిస్తున్నారు. ఆ చిత్రం 'వేట్టయాన్'. అందులో హీరో రజనీకాంత్. 1991లో వచ్చిన 'హమ్' చిత్రం తర్వాత వీరిద్దరూ కలసి నటిస్తున్న చిత్రం ఇదే కావడం విశేషం. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే అమితాబ్, కమల్, రజనీకాంత్ కలసి ఓ హిందీ చిత్రంలో నటించారు. 1985లో వచ్చిన ఆ చిత్రం పేరు 'గిరఫ్తార్'. ఇందులో కమల్ హీరో. ఈ సినిమాలో అమితాబ్‌ది మొదట అతిథి పాత్రే. అప్పట్లో లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో అమితాబ్ ఎన్నిక కావడంతో సినిమాలు తగ్గించుకుని రాజకీయాలకు పరిమితం కావాలనుకున్నారు అమితాబ్. కానీ దర్శకుడు ప్రయాగ్ రాజ్ కథ చెప్పి అమితాబ్‌ను ఒప్పించారు. మొదట అతిథి పాత్రే అనుకున్నా క్రమంగా ఆ పాత్ర పరిధి పెరిగి మెయిన్ రోల్ అయింది. రజనీకాంత్ ఈ సినిమాలో అతిథి పాత్ర పోషించారు.

రేవ్ పార్టీ కేసు.. మీడియాకే తెలియాలి



నటి హేమ శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. బెంగళూరు రేవ్‌పార్టీ వ్యవహారంలో అరెస్టయిన ఆమె బెయిల్‌పై బయటకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం సాయంత్రం కాలినడకన తిరుమలకు చేరుకున్న హేమ శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. నేను చిన్నప్పటి నుంచి శ్రీవారి దర్శనానికి వస్తున్నాను, తిరుమల నాకు పుట్టినిల్లు అన్నారు. రేవ్ పార్టీ కేసు గురించి మీడియా ప్రశ్నించగా 'మీకే తెలియాలి. మీరే వేస్తున్నారు కదా న్యూస్. మీ ద్వారానే నేనూ తెలుసుకుంటున్నా' అని బదులిచ్చారు.

తిరుమల, (ఆంధ్రజ్యోతి)



తమన్నా యాక్షన్

తమన్నా భాటియా, హెబ్బా పటేల్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న చిత్రం 'ఓదెల 2'. అశోక్ తేజ దర్శకత్వంలో డి. మధు నిర్మిస్తున్నారు. దర్శకుడు సంపత్‌నంది క్రియేట్ చేసిన 'ఓదెల రైల్వే స్టేషన్' చిత్రానికి ఇది సీక్వెల్. భారీ బడ్జెట్‌తో, బహు భాషా చిత్రంగా మేకర్స్ రూపొందిస్తున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో తాజా షెడ్యూల్‌ను చిత్రబృందం ప్రారంభించింది. కీలకమైన యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. టాప్ క్లాస్ యాక్షన్ డైరెక్టర్స్ పోరాట ఘట్టాలను అద్భుతంగా రూపొందిస్తున్నారనీ, తమన్నా యాక్షన్ పార్ట్ కోసం ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నారని మేకర్స్ తెలిపారు. వశిష్ట ఎన్ సింహా, నాగమహేశ్, గగన్ విహారి కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి అజనీష్ లోకనాథ్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: సౌందర్ రాజన్ ఎస్.


గ్యాంగ్ వార్ సరికొత్తగా



చంద్రశేఖర్ రాథోడ్ హీరోగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'గ్యాంగ్‌స్టర్'. కాశ్వీ కాంచన్ హీరోయిన్. ఆగస్టులో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాలను ప్రారంభించింది. శుక్రవారం 'గ్యాంగ్‌స్టర్' టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రాథోడ్ మాట్లాడుతూ 'నిర్మాత దిల్ రాజు, రచయిత విజయేంద్రప్రసాద్ మా చిత్రం టీజర్‌ను చూసి మెచ్చుకున్నారు. గ్యాంగ్ వార్‌ను మా సినిమాలో సరికొత్త రూపంలో చూపించబోతున్నాం' అన్నారు.



మూడేళ్లు.. ఏడు ఫ్లాపులు.. రూ.800 కోట్ల నష్టం!



చిత్రపరిశ్రమలో ఎప్పుడూ సక్సెస్‌దే పై చేయి. వ్యాపారంతో కూడుకున్న కళారంగం కనుక డిమాండ్ లేని నటుల జోలికి ఎవరూ వెళ్లరు. ఫ్లాపుల్లో ఉన్నవారిని పట్టించుకోరు. కానీ ఈ విషయంలో బాలీవుడ్ నటుడు అక్షయ్‌కు మాత్రం మినహాయింపు ఇవ్వాలి. నలభై ఏళ్ల సుదీర్ఘమైన నట జీవితం ఆయనది. పదేళ్లుగా అత్యధిక పారితోషికం అందుకొంటున్న హీరోల జాబితాలో ఆయన పేరు ఉంటోంది. అయితే మూడేళ్ల నుంచి అక్షయ్‌ను వరుస అపజయాలు వెంటాడుతున్నాయి. ఏడు సినిమాలు.. 'బచ్చన్ పాండే', 'సమ్రాట్ పృథ్వీరాజ్', 'రక్షాబంధన్', 'రామ్‌సేతు', 'సెల్ఫీ', 'మిషన్ రాణీగంజ్', 'బడేమియా ఛోటే మియా'.. బాక్సాఫీసు దగ్గర బోల్తా పడ్డాయి. వీటిల్లో 'సమ్రాట్ పృథ్వీరాజ్', 'బడేమియా ఛోటేమియా' చిత్రాలైతే ఇండియన్ సినిమా హిస్టరీలోనే బిగ్గెస్ట్ ఫ్లాప్స్. ఈ ఏడు చిత్రాల వల్ల దాదాపు రూ.800 కోట్లు చిత్ర పరిశ్రమ నష్టపోయిందని ట్రేడ్ పండితులు చెబుతున్నారు. ఇంత ఫ్లాపుల చరిత్ర ఉన్న నటుడిని పరిశ్రమ పట్టించుకోకూడదు. కానీ అక్షయ్ ప్రత్యేకతే వేరు. ఆయనకు డిమాండ్ తగ్గలేదు. నిర్మాతలు వెంటబడుతూనే ఉన్నారు. రాబోయే రెండేళ్ల కాలంలో అక్షయ్ నటించిన పది చిత్రాలు విడుదల కానున్నాయి. వీటిల్లో తెలుగు సినిమా 'కన్నప్ప' కూడా ఉంది. అందుకే అక్షయ్ అదృష్టవంతుడు అంటున్నారంతా.

'దీక్ష' షూటింగ్ పూర్తి

కిరణ్‌కుమార్, అలేఖ్యా రెడ్డి జంటగా నటించిన 'దీక్ష' చిత్రం షూటింగ్ పూర్తయింది. ప్రతాని రామకృష్ణ గౌడ్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి పినిశెట్టి అశోక్‌కుమార్, మదాడి కృష్ణారెడ్డి నిర్మిస్తున్నారు. సినిమా ప్రోగ్రెస్ గురించి దర్శకుడు మాట్లాడుతూ 'పట్టుదల, దీక్ష ఉంటే ఏదైనా సాధించగలం.. అనే పాయింట్‌తో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. ఇందులో హీరో కిరణ్ చేసిన ఫైట్స్, ఆయన వేసిన భీముడు, ఆంజనేయుడి గెటప్స్ ప్రేక్షకుల్ని అలరిస్తాయి. నలుగురు హీరోయిన్లను ఈ సినిమాతో పరిచయం చేస్తున్నాం. త్వరలో చిత్రాన్ని విడుదల చేస్తాం' అని చెప్పారు. 'ఇంతకుముందు నేను తెలుగులో పది, తమిళంలో రెండు చిత్రాల్లో హీరోగా నటించాను. ఈ సినిమా నాకు మంచి పేరు తెస్తుందని ఆశిస్తున్నా' అన్నారు కిరణ్. నటి తులసి మాట్లాడుతూ 'ఇందులో లీడ్ రోల్ పోషించాను. నా పాత్రకు మంచి డైలాగులు కుదిరాయి. సినిమా హిట్ అవుతుందనే నమ్మకం ఉంది' అన్నారు.

